# మరువబడిన ఆజ్ఞ
# పరిశుద్ధులై యుండుడి

విలియమ్ మెక్‌డొనాల్డ్

అనువాదము: పి. జయరావు

MORIAH
MINISTRIES

THE FORGOTTEN COMMAND:

**BE HOLY**

William MacDonald

First Telugu Edition 2013

**మరువబడిన ఆజ్ఞ పరిశుద్ధులై యుండుడి**

**విలియమ్ మెక్‌డొనాల్డ్**

అనువాదము **పి.జయరావు** M.A.

Copyright: © William MacDonald

Publication No. 51

ISBN :978-9381016-31-3

Price: ₹ 90

Published by

**Moriah Ministries**

Post Box No. 2540, No.57/51, East Park Road,
Shenoy Nagar, Chennai - 600 030, India
Email: <moriahministries@gmail.com>
Phone: 91-044-2664 5010/9444961106

**Moriah Ministries**

C/o Bethany Gospel Hall
16, North St., Mannarpuram,
Tiruchirapalli - 620 020, India.

Cover Design: Moriah Ministries

Printed in India

# ప్రచురణ కర్త - పలుకులు

తమ ప్రభువు ఆజ్ఞను గైకొని పరిశుద్ధ జీవితము జీవించుటకు క్రైస్తవులందరికి ఈ పుస్తకము బూర పిలుపు లాంటిది. పరిశుద్ధతను ప్రక్కన పెట్టి, అది పాతదని (out dated) అనుకొను ఈనాటి ప్రపంచమునకు పరిశుద్ధ జీవితము మరి ఎక్కువ ఆవశ్యకమైన సత్యము. క్రీస్తువలె ఉండుట పరిశుద్ధతను కలిగించును. ప్రతివిధమైన క్రైస్తవ జీవితములో విలియం మాక్‌డొనాల్డ్ తనదైన శైలిలో, సామాన్యమైన, ఆచరణీయమైన పరిశుద్ధ జీవితము యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పెను.

ఎంతో అవసరమైన ఈ పుస్తకమును తెలుగులో అనువాదము చేయుటకు అనుమతించిన హక్కు గలిగిన (copyright owners) వారికి మా కృతజ్ఞతలు.

మా కొరకు అనువాదము చేసిన సహో. పి.జయరావు (హైదరాబాద్) గారికి, టైప్ చేయుటలో సహాయపడిన సహో. డి.దేవదానము (కర్నూలు) గారికి, తప్పులను దిద్దిన (proof reading) పి.విజయానందం (హైదరాబాద్) గారికిని మా కృతజ్ఞతలు.

# ఉపోద్ఘాతము

క్రీస్తునందు విశ్వాసముంచినామని చెప్పుకొనువారిలో పడిపోయినవారి శాతము భయము కలిగించుచున్నది. అనేకులు పరుగెత్తుటకే పుట్టినట్లుగా నుందురు. వారు బాగుగానే ప్రారంభించుదురు. మార్గములో పాపములోపడి, మరుగునపడ పోవుదురు. అయితే క్రైస్తవులమని చెప్పుకొనువారందరు నిజముగా రక్షింపబడలేదు. రక్షింపబడినవారిలోకూడ ప్రమాదములోపడువారిసంఖ్య కలత చెందించుచున్నది.

తరుచుగా జరుగునదేమనగా ఒక్కసారి పడిపోయినవాడు తన మిగిలిన జీవితమంతయు అరమరలో నుంచబడినట్లుగా నిష్ప్రయోజకునిగా నిలిచిపోవుచున్నాడు. అతడు పశ్చాత్తాపపడి పాపములు ఒప్పుకొన్నను అప్పటినుండి అతడు మరుగున పడ పోవుచున్నాడు. సేవకు తాను తగిన వాడనుకానని తలంచుచున్నాడు. సాక్ష్యమిచ్చుటకు పెదవులు మూసుకొనిపోయినవి. తన్నుతానే తృణీకరించుకొని జీవితములో కొనసాగుచున్నాడు ఇట్టి ప్రజలతో మన సంఘములు నిండిపోయినవి.

అలాగుండ నవసరములేదు. దేవుని యొద్ద క్షమాపణ ఉన్నది. విరిగిన రెక్కగలపక్షి మరల అదే యెత్తుకు ఎగర గలదు. మిడుతలు తినివేసిన సంవత్సరముల పంట మరల ఇవ్వబడును. క్షమాపణ వినియోగమును గూర్చి అనేకులు నేర్చుకొనకపోవుట యే సమస్యగావున్నది. వారి పాపమును వారు ఒప్పుకొనెదరు కాని క్షమింపబడినట్లు చెప్పుచున్న దేవుని మాటను వారు నమ్మరు. వారు క్షమింపబడినామని అనుకొనరు, ఎరుగరు. ఒకవేళ క్షమింపబడినట్లు తెలిసికొనినను వారిని వారే క్షమించుకోలేరు. ఆవిధముగా ఓడిపోయిన క్రైస్తవులవలెవారు కొనసాగుదురు.

అట్టివారికి సహాయపడునట్లుగా ఈ పుస్తకము వ్రాయబడినది అయితే మొదటిగా అట్టి స్థితిలో పడిపోకుండునట్లు జీవితము మలుచుకొనుటకు కూడ ఈ పుస్తకము వ్రాయబడినది. అనుభవము ఒక ఖరీదైన పాఠశాలవంటిది. దేవుని వాక్యము నుండి నేరుగా నేర్చుకొనుటకు మనము ఇష్టపడిన యెడల, కఠిన మార్గమునుండి నేర్చుకొనే అక్కరలేదు. బైబిల్‌నకు విధేయత చూపుటద్వారా పరిశుద్ధజీవిత దీవెనలన్నియు తెలిసికొనగలము. అదే సమయములో పాపము యొక్క హానికరఫలితములనుండి తొలిగిపోవచ్చును. బైబిల్ పఠన ద్వారా నేర్చుకోదగినవాటిని అవమానము, సిగ్గుతో ఎందుకు నేర్చుకొనవలెను?

# విషయ సూచిక


| | ఉపోద్ఘాతము | పుట |
|---|---|---|
| 1. | క్రీస్తు పోలిక / సారూప్యము | 7 |
| 2. | క్రీస్తు రూపమును సరిగా చూపని సంగతులు | 10 |
| 3. | యేసుని గూర్చి ఆలోచించునట్లు చేయు ప్రజలు | 16 |
| 4. | ఎందుకు పరిశుద్ధులుగా నుండవలెను? | 21 |
| 5. | పరిశుద్ధ పరచబడుట – నాలుగు రకములు | 26 |
| 6. | దేవుని సర్వాంగకవచము | 32 |
| 7. | దేవుని భాగము – మన భాగము | 44 |
| 8. | మనుష్యులను పరిశుద్ధులుగా ఎట్లు చేయవలెను? | 46 |
| 9. | క్రైస్తవ ప్రవర్తనకు సూత్రములు | 50 |
| 10. | నిజమైన సంగతులను నేరుగా పొందుదము | 60 |
| 11. | విజయమార్గము – ఆత్మ చేత నింపబడుడి. | 71 |
| 12. | రెండు రాజ్యములు | 89 |
| 13. | పాప విభజన – ఛేదన మరియు పశ్చాత్తాపము | 99 |
| 14. | నైతిక పవిత్రత – దాని విస్తీర్ణము | 108 |
| 15. | స్వలింగ సంపర్కము పాపమని దేవుడు చెప్పుచున్నాడు | 117 |
| 16. | మనస్సాక్షి – అంతరంగ తీర్పరి | 121 |
| 17. | మానవుడు ఆలోచించిన రీతిగానే | 124 |
| 18. | ధ్యానము – సరియైన పద్ధతి | 135 |
| 19. | నాలుకను సాధుపరచుట | 142 |
| 20. | మా ముచ్చట్లను క్షమింపుము | 149 |
| 21. | ఉద్రేక స్వభావము – పరీక్ష | 153 |
| 22. | నేనేమి ధరింపవలెను? | 156 |
| 23. | సత్యము చెప్పుట | 160 |
| 24. | నైతిక సందిగ్ధములు | 163 |
| 25. | ప్రభువా నన్ను నలుగగొట్టుము | 167 |
| 26. | మత్తుపదార్థములకు కాదు అని చెప్పుము | 173 |
| 27. | జూదము, గొప్ప దొంగతనము (మోసము) | 181 |
| 28. | కుటుంబ నియంత్రణ | 186 |
| 29. | రాజకీయములు | 190 |
| 30. | అంతా తానే, అంతరంగ ద్రోహి | 195 |
| 31. | పరిశుద్ధముగా నుండుటకు సమయమును వెచ్చించుము | 202 |
| 32. | చివరి మాట | 207 |

# అధ్యాయము - 1

# క్రీస్తుపోలిక / సారూప్యము

గుణమును వర్ణించుటకు వాడునటువంటి గొప్ప పదము క్రీస్తు పోలిక. విశ్వాసికి అన్వయించినప్పుడు ఇది ఆదర్శవంతమైన ప్రశంస, అత్యున్నత గౌరవం. ప్రభువైన యేసును పోలియుండవలెనను ఆశకు మించినది మరొకటి లేదు.

హెన్రీ డ్రుమ్మండ్ ఈలాగు చెప్పెను "ప్రపంచములో శ్రద్ధచూపుటకు తగిన ఒకే ఒక సంగతి యేమనగా క్రీస్తురూపములోనికి వచ్చుట, దాని ముందు మానవుని ప్రతి ఆశయు అవివేకమేయగును, దానికంటె దిగువస్థాయి విజయములన్నియు వ్యర్థమే"

యేసుని పోలియుండాలని, యేసుని పోలియుండాలని!
నేనడుగునదంతయు ఆయనను పోలియుండాలనే!
నా జీవితప్రయాణమంతటిలో భువినుండి దివికి చేరువరకు
నేనడుగునదంతయు ఆయనను పోలియుండాలనే (రచయిత పేరు తెలియదు)

సువార్త ప్రకటించి వాక్యము బోధించి హృదయములను లోబడునట్లును వాక్య ప్రభావముచేత ప్రేరేపించునట్లును చేయుట గొప్ప వరమేయని ఖచ్చితముగా ఒప్పుకొనుచున్నాను. అయితే క్రీస్తును పోలియుండుట అంతకంటె గొప్ప వరము. అది లేకపోయినచో మ్రోగెడుకంచును, గణగణలాడు తాళమునైయుందును. వేదికమీద వరముకలిగియుండి ఇంటిలో సణుగువానిగా ఉండవచ్చును. ఒక వ్యక్తి జీవితములో దేవుని సర్వాధికారమును బట్టి పొందిన అనుగ్రహము వరమనబడును. అయితే వ్యక్తిగతమైన కృప అనేది పరిశుద్ధాత్మ శక్తిచేత అభివృద్ధిపరచుకొనవలసిన బాధ్యతయై యున్నది.

అనేకులు వ్యక్తిగతముగా ఆత్మలను సంపాదిచుటలో గొప్పవారిగా ఉండవలెనని కోరుకొందురు. ఇది మన సృష్టి సంకల్పముగా యెంచి, ఆచరణలో ఒక అలవాటుగా యెదురుచూచుచున్నారు. ఈ పద్ధతి నేడు బహు ప్రచారములో నున్నది. దీని ఫలితముగా వ్యక్తిగత సువార్తీకరణలో ఊపిరి సలుపని రీతిగా ప్రజల చుట్టూ చేరుచున్నారు. అయితే వారి జీవితముల ద్వారా క్రైస్తవ విశ్వాసము ఆకర్షణలేనిదిగాను, ఒప్పింపలేనిదిగాను ఉన్నది. యేసు ఇట్లు చెప్పెను "నా వెంబడి రండి, మిమ్ములను మనుష్యులను పట్టుజాలరులనుగా చేయుదును" ఆయన సరియైన క్రమమును సరియైన ప్రాధాన్యతను సూచించెను. మన బాధ్యత ఆయనను వెంబడించుట అనగా ఆయన జీవించినట్లు జీవించుట, మనుష్యులను పట్టుజాలరులుగా చేయుట ఆయన బాధ్యత. ఆత్మలసంపాదన అనునది క్రీస్తును పోలియుండుటవలన కలుగు సహజ పరిణామమే.

**దైవిక ప్రాధాన్యత:**

తన ప్రజలవిషయములో దేవుని గొప్ప సంకల్పము ఏమనగా అందరు తన కుమారుని సారూప్యములోనికి రావలెను. ఆయనను పోలినవారితో పరలోకమును నింపవలెనని దేవుని ప్రణాళిక. మనమాయనను చూచినప్పుడు అప్రయత్నముగానే ఆయనను పోలియుండుటకు మార్చబడుదుము. అయితే ఆ ప్రక్రియ ఇప్పుడే ఇక్కడే జరిగితే దేవునికి మరియెక్కువ మహిమకలుగును.

ఈ విధానమునుగూర్చి తెలియజేయుటకు కరోల్ మేహోల్ మరచిపోవుటకు వీలుకాని రెండు ఉదాహరణలను చెప్పెను. మొదటి ఉదాహరణ ఏమనగా ఒక లావైన స్త్రీ తన బరువుతగ్గించుకొనుటకు చేసిన ప్రయత్నము. పర్యవేక్షకుడు ఆమె యేరూపమును కోరుకొనెనో ఆ రూపమును ఒక అద్దముపై చిత్రీకరించెను, ఆమె అద్దము ముందు నిలువబడగా, ఆ చిత్రపటముకంటె యెక్కువగా లావైనది 'నిన్ను ఈ ఆకారమునకు తగినట్టు చేయుటయే మా గురి" యని పర్యవేక్షకుడు చెప్పెను. ఆమె అనేక వారములు పత్యము చేసినది. వ్యాయామము చేసినది. ఆమె ప్రతివారచిము అద్దము ముందు నిలిచి యుండగా ఆమె పరిమాణము తగ్గినట్లున్నను, ఇంక అధికమగుచుండెను. ఆమె మరియెక్కువగా పత్యమును పాటించి, కఠినమైన వ్యాయామము చేసెను. చివరకు ఒకరోజున అందరు ఆశ్చర్యపడు రీతిగా అద్దము యెదుట నిలువబడగా

చిత్రపటములోనున్నరీతిగా ఆమె ఆకారము మారిపోయెను.

రెండవ ఉదాహరణ: ఒక శిల్పి ఒక రాతి బండను సింహ రూపమునకు మలిచెను. అట్టి అద్భుతమైన శిల్పము యేలాగు చేసితివని ప్రశ్నించగా అతడు యిలాగు జవాబిచ్చెను "అది సులభమే, సింహమును పోలి ఉండని ప్రతిదానిని తొలిచివేసితిని."

తదుపరి పేజీలలో మన జీవితములలో క్రీస్తు రూపము కనబడునంతవరకు చెక్కివేయుటయే దేవుని లక్ష్యము. మన పఠనము కొనసాగుచుండగా, మన ప్రార్థన ఈలాగుండును గాక.

నీతోవున్నానని ఇతరులునన్ను చూతురు గాక
యేసూ, నా ప్రభువా, నా రక్షకుడా
నేను నీవాడనని నేను నీ సొత్తునని,
నా సమస్త సంభాషణ ద్వారా, ప్రవర్తన ద్వారా తెలియబడును గాక. ●

## అధ్యాయము - 2

# క్రీస్తురూపమును సరిగా చూపని ఆదర్శములు

ప్రతి క్రైస్తవుడు యేసు ప్రభువునకు భూమిపై ప్రతినిధిగా వుండుట దేవుని ఉద్దేశము. అతడు రక్షకుని మాదిరిగ ఉండవలెను. క్రీస్తు యెట్లుండెనో లోకమునకు అతడు చూపవలెను. అది భయమును పుట్టించే బాధ్యత.

మనము క్రీస్తు శరీరములో అవయవయములుగా నున్నాము. ఒక వ్యక్తి తన్ను తాను వ్యక్తీకరించుకొనుటకు శరీరమే సాధనము. క్రీస్తు శరీరమైన సంఘముద్వారా ఆయన లోకమునకు తన్నుతాను బయలుపరచుకొనును.

మనలో ప్రతివానికివచ్చు ప్రశ్న "క్రీస్తును గూర్చి యేరకపు పటమును నేను చూపుచున్నాను? అని మనలను మనమే ప్రశ్నవేసికొనుటకు కారణమగుచున్నది.

యేసు క్రీస్తేవారి గురియైనచో
నీలో ఆయనను ఏమి చూచెదరు
నా ప్రాణమా, వారేమిచూచెదరు?

మరొకరు దీనిని మరొకరీతిగా చెప్పిరి. దేవునికి ఇంటిపేరున్నది. ఆయన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడని పిలువబడినాడు. ఆయన వారి దేవుడననిపించుకొనుటకు సిగ్గుపడలేదు. హెబ్రీ 11:16 ఆయనపేరు చివరిలో నాపేరు వాడితే ఆయన యేలాగు తలంచును?

**చార్లెస్ స్విండోల్ ఈలాగు చెప్పెను:**

ఇష్టమున్నా, లేకున్నా, లోకము మనలను నిశితముగా గమనించుచున్నది. లోతులేని నీళ్లలో నున్న రొయ్యను సముద్రపు కాకి పరిశీలించినట్లుగా లోకము సూక్ష్మదృష్టితో మనలను కనిపెట్టుచున్నది. విశ్వాసి నిత్యము నిఘా క్రింద నున్నాడు. మన వృత్తి సంబంధముగా ఇది మొదటి ప్రమాదము. మన రక్షకునిగూర్చి మనము

మాట్లాడినప్పుడు మన జీవితమును వారు పరిశీలించుచుండగా మనము చెప్పుచున్న ప్రతిసంగతిని ఇతరులు వడపోయుచున్నారు.

**తన స్నేహితుల ఇంటిలో గాయపరచబడెను.**

విచారకరమైన సంగతియేమనగా క్రీస్తు శిష్యులమని చెప్పుకొనువారి జీవితములద్వారా ఆయన యెక్కువగా శ్రమ ననుభవించెను. ఆయన తన స్నేహితుల గృహములో గాయపరచబడెను.

**జేమ్స్ స్పింక్ ఈలాగు చెప్పెను:**

క్రైస్తవ్యమునకు యెక్కువ కీడు శత్రువులవల్లకాదు గాని వెంబడించుచున్నామను వారిద్వారా కలుగుచున్నది. ఏలయనగా లోకము క్రైస్తవ ఒప్పుకోలును దాని ఆచరణలో వ్యత్యాసమును చూతురు. క్రైస్తవ్యము మనము చెప్పిన రీతిగా నిజముగా ఉన్నయెడల అది తప్పనిసరిగా మనజీవితములను మార్చివేయాలి అని వాదింతురు.

**హడ్సన్‌టేలర్ ఏకీభవించి చెప్పెను:**

క్రైస్తవ ప్రజలు బైబిల్‌ను నమ్ముచున్నామని చెప్పుకొనుచు బైబిల్ లేని ప్రజలవలె జీవించిన యెడల, ఇట్టి పొసగనిస్థితి విమర్శకులకు, సందేహించువారికి గొప్ప అవకాశము కలిగించును.

యేసు ప్రభువును తప్పుగా చూపించే ఉదాహరణలు చూపించుట కష్టమేమికాదు. సరుకులు మోసికొనుపోవు ఒక వాహనము వెనుక భాగమునకు రెండు బోర్డులు అతికించబడినవి. ఒకదానిపై “నేను యేసుని ప్రేమిస్తాను” అని వ్రాయబడియున్నది. దాని కుడిప్రక్కన “నా కారును ముట్టినచో నీ ముఖము పగులును” అని మరొక బోర్డుపై వ్రాయబడెను. దానియజమాని ఆ రెంటి మధ్య వైరుధ్య భావములను గ్రహించలేదు.

వ్యాపార ప్రపంచమువైపు కూడ చూడవచ్చును. జార్జి డంకన్ ఈ క్రింది కథను చెప్పెను. ఒక వ్యాపారి ఒక రాత్రికి ముందు క్రైస్తవప్రచారములో మాట్లాడెను. అతను ఉద్యోగములో పెట్టుకొనిన ఒక బాలిక దానిని వినెను. ఆ ఉదయం అతని మానసికస్థితి సరిగాలేదు. పరిస్థితులుసరిగాలేవు. అతని కోపమును బట్టి ఆ అమ్మాయి కఠినంగా మాట్లాడుటకు హేతువేర్పడెను. ఆమె ఆఫీసునుండి బయటకు వెళ్ళుచుండగా మరొక బాలిక లోపలికి వచ్చుచుండెను. అప్పుడు ఆమె ఆ బాలికతో ఈలాగు చెప్పెను “అదిసరే, ఆదివారము రాత్రికి యేసు దగ్గరకు రండి, సోమవారం ఉదయాన పాతాళమునకుపొండి”

ఒక క్రైస్తవవ్యాపారి ఒప్పుకొనినట్లు జరిగించక వెనుక తీసినప్పుడు, అతని పోటి దారుడు ఈ ప్రశ్నవేసాడు. “నీవు యేతరహా సంఘమునకు చెందినవాడవు?” అతడిచ్చిన జవాబు ఈలాగున్నది “నా సంఘముతో నీకేమిపని? ఇది సంఘమునకు సంభంధించినదికాదు. ఇది వ్యాపారము”. సాక్ష్యమును కట్టుకొనుటకు ఇరువది సంవత్సరములు పట్టవచ్చును. అయితే ఇది ఇరువది సెకండ్లలో చెడిపోవచ్చును.

ప్రఖ్యాతిగాంచిన నటుడుగాని, నటిగాని తిరిగి జన్మించుటకు సమ్మతించినప్పుడు వెంటనే దేశమంతటావార్త ప్రసారమగును. అతని పాతజీవితము విడిచివేయనప్పుడుగూడా ఆలాగే వార్తలు వెలువడును. అతడు తక్కువస్థాయి సినిమాలలో నటించినప్పుడు క్రీస్తు అతనిజీవితములో మార్పుచేయలేదని రుజువయి నప్పుడు కూడా అదిపెద్దవార్త.

క్రైస్తవ సంగీతగాయకులు వారి రంగస్థలనటనలను ఆలాగే – దేహభాష, ప్రశ్నార్థకమైన సాహిత్యము, ప్రపంచమును కోతులుగా చేయు సంగీతము మొదలగునవన్నియు మంచివికావు. ఇది క్రైస్తవ్యమా? ఇది ద్వందార్ధములతో వెక్కిరింతలుపాలు చేయుచు అపహాస్యముచేయు అనుకరణకాదా?

ఒక గొప్ప సువార్త సభలో ఒక దొంగల ముఠానాయకుడు మారుమనస్సు పొందినట్లు ఒప్పుకొనెను. ఈ వార్త దావానాలవలె వ్యాపించెను. అయితే అతనిపాతజీవిత విధానమును, చీకటి కార్యములను కొనసాగించుచుండెను. అతని పరిహాసకరమైన క్రైస్తవ్యమును గూర్చి ఒకడు ప్రశ్నించగా, అతడీలాగు జవాబు ఇచ్చెను. “యేసును అంగీకరించుటయనగా పాతబ్రతుకునుండి వెనుకకు మళ్ళుటయని నాతో ఎవరు చెప్పలేదు. క్రైస్తవ ఫుట్‌బాల్ క్రీడాకారులు వున్నారు. క్రైస్తవ కౌబోయిలుకూడ క్రైస్తవులుగా నున్నారు. రాజకీయనాయకులుగూడా ఉన్నారు. క్రైస్తవ దొంగలముఠానాయకుడుగ యెందుకు ఉండకూడదు?” అప్పటినుండి అతడు క్రైస్తవ్యమును వదలివేసెను. టివీలలో కనబడువ్యక్తులుకూడ ఖరీదైన దుస్తులు, ఆభరణములతో అలంకరించుకొని యెజెబెలువలె కనబడుచున్నారు. యేసుమార్గము ఈరీతిగా ప్రదర్శింపబడుచున్నది. ఆయన ఏమాత్రము ధనములేని నజరేయునిగా చూపబడుటలేదు.

**దోపిడిని దాటిపోవలెను.**

రేడియోలలోను, టీవీలలో ప్రసంగీకులు ధన సంపాదన సందటిలో డబ్బు అడుక్కొనుచున్నారు. వారు మాత్రము విలాసవంతమైన గృహములలో నివసించుచు ఖరీదైన కారులలోను, విమానములలో ప్రయాణము చేయుచుందురు. వెంటనే తెలివిగల విలేకరి వారి ఆటను గూర్చి వెల్లడిచేయును. ఇది క్రైస్తవ విశ్వాముకు ఒక మచ్చ.

అమెరికా అభిమాన టివి బోధకులలో ఒకడు పన్నెండు గదుల రాజభవనములో నివసించుచున్నాడని, ఆ నివాసము వెర్సైల్స్ రాజభవనమును పోలియున్నదని, విశాలమైన ఉద్యానవనములు, గుఱ్ఱపుశాలలు నీటికొలనులు కలిగియున్నదని ప్రచురమాయెను. మరొకడు ఐదులక్షల డాలర్లు ఖర్చుచేసి లాస్ ఏంజల్స్‌లో ఒకరాజభవనమును కొనెను. అతని భార్య అదొక చిన్న స్థలమని చెప్పినది. అతని వ్యాపార కేంద్రమునకు మరొక రోల్సురాయిస్‌ను కలుపుకొనెను.

అనేకమంది క్రైస్తవ నాయకులు మతశాఖలలో అగ్రస్థానములు అలంకరించినవారు వ్యభిచారనేరములలోనున్నట్లు వార్తలలో కూడ అగ్రభాగములో నుండుట గుండె పగిలేస్థితిగానున్నది. కొందరు వారి కార్యదర్శులతో వెళ్లిపోయి భార్యకు విడాకులిచ్చిరి. ఎందరో స్త్రీలు గృహములను వదిలి, భర్తలను వదిలి, మరొక పురుషునితో జీవించుచున్నారు. సువార్త ప్రకటించువారు నిజముగా తమ ఇళ్ళు పరిశుభ్రముచేసుకొనుట అవసరమైయున్నది.

కొన్నిసార్లు క్రైస్తవ రాజకీయనాయకులను బట్టి క్రీస్తు నామము దూషణ పాలగుచున్నది. వారి బూతుపదములు, ప్రశ్నార్ధకమైన రాజీలు, వారి చీకటి సంబంధములవలన యేసునామమునకు లెక్కింపజాలని నష్టము, అపకీర్తి కలుగుచున్నది.

ఈ క్రిందచూపబడినట్లు రక్షించబడితిమని చెప్పుకొనే ప్రసిద్ధి చెందిన ఖైదీలను గూర్చి ప్రస్తావించుటకూడ అవసరమే. విశ్వాసుల బలమైన ప్రాతినిధ్యమువలన అనుమానముతో అయిష్టముతోనున్న న్యాయమూర్తిని ఒప్పించి వారు విడుదల పొందుచున్నారు. కొన్ని క్రైస్తవ సంస్థలవారు అట్టివారిని ప్రసంగీకుల జాబితాలో చేర్చి ధనాన్ని సంపాదించుచుందురు. కొద్దికాలములోనే వారు మరలపడిపోయి వెనుకకు జైలుకు వెళ్ళి పోవుచున్నారు.

క్రైస్తవ విద్యార్థులు పరీక్షలలో మోసము చేయుచున్నారు. ఇరుగుపొరుగువారితో తగాదాలు పెట్టుకునే గృహిణులు, కరుకుగాను, త్వరగా కోపపడి సామాన్య ప్రజలకు అపకీర్తితెచ్చుచున్నారు. బైబిలు దూషణపాలగుచున్నది. క్రీస్తు పోలికలేని ప్రతి సన్నివేశము ఆయన శత్రువులు దూషించుటకు కారణమగుచున్నది. ఆదర్శములేని ప్రతివానికి మారుమనస్సుపొందనివారు ఈలాగు చెప్పుచున్నారు. “నీవు చెప్పేది వినను, నీవు ఏమైయున్నావో అది యెక్కువగా వినబడుచున్నది” ఇట్టి ప్రవర్తనను బట్టియే జాన్‌మెకార్థర్ ఈలాగు చెప్పెను “ఆయన ఏజంట్లుగా నున్నవారికి యేసు యెక్కువగా నేర్పవలెనని నేను తలంచుచున్నాను.”

ఆజ్ఞలు అతిక్రమించినందువలన ఒకసైనికుడు అలెగ్జాండర్ ద గ్రేట్ యొద్దకు తేబడెను.

“నీపేరేమి?” అలెగ్జాండర్ ప్రశ్నించెను.

“ఆలెగ్జాండర్” అని సైనికుడు తత్తరపాటుతో జవాబిచ్చెను.

“ఆలెగ్జాండరా?, అలాగైతే నీపేరైనను మార్చుకొనుము లేదా నీమార్గములనైనా మార్చుకొనుము” అని ఆ గొప్పసేనాధిపతియైన అలెగ్జాండర్ ఆజ్ఞాపించెను.

క్రైస్తవుడు అను నామము ధరించిన మనము దానికి తగినట్లుగా ప్రవర్తింపవలెను. “నీవు నమ్మితివని చెప్పుకొనుచు, నీ ప్రవర్తన దానికి విరుద్ధముగా జీవించుట పొసగని స్థితియే” (హెచ్.జి.బోష్)

స్టాన్లీ జోన్స్ ఒక దినమున మహాత్మాగాంధితో ఈలాగు సంభాషించెను. “భారతదేశములో క్రైస్తవమతము దేశమతముగానుండవలెనని నేనెంతో ఆశతో చూచుచున్నాను. విదేశి వస్తువుగా, విదేశ ప్రజలుగాను, విదేశ ప్రభుత్వముగాను ఉండక, భారతజాతి జీవనములో ఒక భాగముగానుండి భారతదేశాభివృద్ధికిని, విడుదలకు చేయూతనిచ్చు ఒక శక్తిగా నుండవలెనని కోరుచున్నాను. అది సాధ్యమవ్వాలంటే మేమేమి చేయాలి అని అడిగాడు గాంధిని. తదుపరి శ్రద్ధతోను ఆలోచనాపూర్వకముగాను గాంధీ ఈలాగు జవాబిచ్చెను “క్రైస్తవులైన మీరందరు క్రీస్తునుపోలిజీవించుటకు ప్రారంభించవలెనని నా సలహా. రెండవదిగా మీ మతమును కల్తీలేకుండ స్థాయితగ్గించక

ఆచరించండి. మూడవదిగా నా సలహా యేమనగా ప్రేమను ఆచరించండి అని నొక్కి చెప్పెను. ఏలయనగా క్రైస్తవ్యమునకు ప్రేమయే కేంద్రము, ప్రాణము.

ఒకసారి గాంధీ ఈలాగు చెప్పినట్లు వినబడినది "క్రైస్తవులనుబట్టియే వారిలో ఒకడినికాలేకపోయాను" అనగా క్రైస్తవుడగుటకు ఆయన ఇష్టపడినను, క్రైస్తవులజీవిత విధానము తనకు అడ్డుగా వచ్చెను.

బ్రియాన్ గుడ్విన్ ఒక చైనా వ్యక్తిని గూర్చి ఈలాగు చెప్పెను. ఒక చిన్న చైనీయుడు క్రైస్తవ మిషనరీ పాఠశాలలో చదువుకొనెను. ఆయన గురువును ఆ యౌవనస్థుడు యెంతగానో మెచ్చుకునేవాడు. ఆ ఉపాధ్యాయుడు మరల ఆ పట్టణమునకు వచ్చి ఒక హోటలునందు ఉన్నాడని విని ఆయనను కలిసికొనుటకు ప్రయత్నించెను. అయితే ఆ చైనీయుడు తనను కలిసికొనకుండ ఆ ఉపాధ్యాయుడు అతనిని తృణీకరించెను. తుదకు ఆ చైనీయుడు హోటలునుండి బయటికి వెళ్ళగొట్టబడెను. ఆ మిషనరీ ఉపాధ్యాయుడు అనేక సంవత్సరములు చూపిన శ్రద్ధా, ప్రేమ యావత్తు అతనికి కలిగిన అవమానమును బట్టి విలువ లేకపోయినది. ఆ చైనా యౌవనస్థునిపేరు మావోసే టుంగ్.

అదెంత చెడ్డ సమాచారమో ఆలోచించవలెను. అయితే దేవునికి స్తోత్రము, కథ అంతటితో ఆగిపోలేదు. ●

## అధ్యాయము - 3

# యేసును గూర్చి ఆలోచించునట్లు చేయు ప్రజలు

నిజక్రైస్తవులు నామకార్థక్రైస్తవులు రక్షకుని యెంత తప్పుగా లోకమునకు చూపించుచున్నారో ముందు అధ్యాయములో వివరించితిమి. అదెంతో విచారకరము. అయితే దేవునికి స్తోత్రము. చిత్ర పటమునకు మరొక ప్రక్కకూడ ఉన్నది. దేవుని కుమారుని నమ్మకమైన చిత్రపటమును తమచుట్టు నున్న వారికి చూపించు పురుషులు, స్త్రీలు ఉన్నారు.

నా విద్యార్థులలో ఒకడు గుర్తువచ్చుచున్నాడు. అతడు నా సన్నిహిత స్నేహితుడుకూడా. అతడు 'మెలానోమా' (చర్మ కాన్సర్) యనువ్యాధి చేత చావుకు సిద్ధమైనప్పటికి అతని పడకగది పరలోకమునకు ముందు గదివలె ఉండెను. జిల్లానుండి అప్పుడప్పుడు ఒక నర్సు వచ్చి దర్శించి వెళ్ళుచుండెను. ఆమె ఈలాగు అన్నది. "రాబ్ యేసును నాకు గుర్తుచేయుచున్నాడు"

రాబర్ట్ సి.చాప్మన్ తనజీవితాశయమును ఈలాగు చెప్పుచున్నాడు. "అనేకులు క్రీస్తును ప్రకటించుట చూచినప్పుడు కొద్దిమందే క్రీస్తు వలె జీవించుచున్నారు. క్రీస్తువలె జీవించుట నా ఆశయము" తరువాత కాలములో జాన్ నెల్సన్ డార్బి ఆయనను గూర్చిఈలాగు చెప్పెను"నేను బోధించిన రీతిగా అతడు జీవించుచున్నాడు."

విలియమ్ ఆర్నాట్నుగూర్చి ఒక స్నేహితుడిలాగు చెప్పెను "అతని ప్రసంగము బాగుగానున్నది. ఆతని రచన ఇంకా బాగుంది అయితే అతని జీవితము అన్నింటికంటె బాగున్నది"

సాధు సుందరసింగ్ సిక్కు మతమునుండి మారుమనస్సు పొందినవాడు. అతడు ఒక క్రైస్తవ గృహమునకు వచ్చి పిలుచుటకు గంట మ్రోగించెను. ఆ ఇంటిలో పనిచేయుబాలిక తలుపుతెరచి పరుగెత్తి తన యజమానురాలితో యేసువచ్చాడని

ఉద్రేకముతో చెప్పెను. మరోక గృహములో అతడు పిల్లలతో నేలమీద ఆడుకొనెను. ఆ పిల్లల హృదయములలో ఆయనగొప్ప ముద్రవేసెను. ఆ రాత్రి వారు తమ తల్లులతో అన్నారు "యేసు మమ్ములను నిద్రపుచ్చుతాడా" ఆయన జీవిత చరిత్ర వ్రాసినవాడు ఈలాగు చెప్పెను "ఆయనను కలసికొనినవారి అభిప్రాయములను మాత్రమే వ్యక్తముచేయుచున్నారు. ఆయన క్రీస్తును పోలిన రూపము, మర్యాద, మంచితనము, అతని జీవనశైలిలోను, ఆత్మలోను నిండుకొనియున్నవి."

**యేసును పోలిన ఒక మనుష్యుడు:**

రాబర్ట్ ముర్రె మెక్ చెనె యొక్క జీవిత చరిత్రలో జేమ్స్ ఎ. స్టెవర్ట్ ఈలాగు వ్రాసెను. మెక్‌చెనె తన పరిశుద్ధతను గురించి అతను ఒక మాటైనా మాట్లాడకముందే గుర్తింపవచ్చును ఆయన రూపమే అతని పక్షముగా మాట్లాడును. ఉత్తర స్కాట్లాండ్‌లో ఒక సేవకునితో అతడొక రాత్రిగడిపెను. అతని చేత ఆశ్చర్యకరముగా ఆసేవకుడు ప్రభావితుడయ్యెను మెక్‌చెనె ఆ గదిని వదిలి వెళ్ళునప్పుడు అతడు బోరున విలపించి, ఈలాగు చెప్పెను. "ఆహా నేను చూచినవారిలో ఆయన యేసుని పోలినవాడు"

**మరొకచోట స్టెవర్ట్ ఈలాగున వ్రాసెను.**

మెక్‌చెనె తెరలోపల గంటలకొలది పరిశుద్ధ సహవాసములో గడిపి కల్వరిప్రేమలో స్నానముచేసి, స్తుతి ప్రశంసలతో వెలుపలికివచ్చును. దేవుని సన్నిధిలో నుండి బయటకు వచ్చి గృహాలను దర్శిస్తూ క్రీస్తు సువాసనను ఇంటింట వదలేవాడు. అతను తన పారిష్ వీధులలో నడుచునప్పుడు బ్రిటనులో ప్రతి స్థలములో అతని ముఖములో క్రీస్తు రూపము చూచి ప్రజలు ఆశ్చర్యపడిరి.

ఎరిక్ లిడ్డెల్ గొప్పగా పరుగెత్తువాడు. అతడు స్కాట్లాండుకు చెందిన వాడు. గొప్ప మిషనరీగా పనిచేయుచుండెను. అతనిగూర్చి శాలి మెగ్నుస్సన్ ఈలాగువ్రాసెను. "జపానులో రాజకీయ నిర్బంధ శిబిరములో అతనిని ఉంచినప్పుడు తన ప్రభువును పోలియుండెను."

ఆయన యొద్దకు వారు వచ్చినప్పుడు ఆయన తన క్రైస్తవ్యమును జీవితములో రుజువు చేసెను. ఎరిక్ క్రీస్తు రూపమును చూపించువానిగా నుండెను. ఆయన చైనాలో సియాచాంగ్‌లోనున్నట్లే ఇక్కడ ఉండెను. అతడు వేశ్యలతోను, తృణీకరింపబడిన వ్యాపారస్తులతోను స్నేహముచేసి మంచిమార్గములోనికి తెచ్చెను. బలహీనులకొరకు

బొగ్గుమోసేవాడు, యౌవనస్థులకు బోధించేవాడు. అతడు తన బంగారు గడియారమును అమ్మి, దుప్పటి, చింపి హాకీ కర్రలకు వినియోగించేవాడు. అతడెప్పటికి ఎరిక్‌గానే యుండెను. అతిసామాన్యముగా జీవించువాడు కాని వింతయైనరీతిగా ఉండేవాడుకాడు"

"చివరిశత్రువు" అనుపుస్తకమును రిచార్డ్ హిల్లరీ వ్రాశాడు. అందులో అతడు ఒప్పుకొనిన సంగతియేమనగా పీటర్ పీస్ అను తన తోటి పైలట్ క్రైస్తవుడనని చెప్పుకొనేవాడని, అతని జీవితము ఇతనికి విసుగు కలిగించినదని, మరియు సవాలు చేసిందని అయితే తాను కలిసిన వారిలో అతడు శ్రేష్ఠమైనవాడని వ్రాశాడు. ఇతని ఒకే ఒక కోరిక యేమనగా అతనిని ఒంటరిగా నున్నప్పుడు అనేక రీతులుగా దాడిచేసి అతని విశ్వాసమును ముక్కలు చేయుట. అట్టి అవకాశము ఒకసారి అతనికి దొరికినది. వారిరువురు మంట్రోస్ నుండి ఎడిన్‌బర్గ్‌కు రైలు ప్రయాణము చేయుచుండిరి. అప్పుడు ఇతడు అతని వైపుచూచి "నీ మతము మోసకరమైనది, పారంపర్యముగావచ్చే గుడిబండ వంటిది, సమాజమునకు కొంత ప్రయోజనము అంతకు మినహా యేమియులేదు." అని చెప్పెను.

అప్పుడు పీటర్ నోరుతెరచి అభ్యంతరము చెప్పినప్పటికి వరదవంటి అతని వాదనలచేత కొట్టబడి మౌనము వహించాడు. తనవాదనకు లోబడిపోయానని హిల్లరీకి తెలుసు ఎందుకంటే పీటర్ గుణమును కాదనలేకపోయాడు. అతడు తనవిశ్వాస జీవితములో విడదీయరాని బంధముకలవాడు. అందువలన అతని తర్కము చెల్లలేదు.

**అందుకే జె.హెచ్. జూవేట్ ఈలాగు వ్రాసెను:**

నీకంటె కుయుక్తిగా వాదించుమనుష్యులకు సరితూగలేకపోవచ్చును. మేధస్సు తెలివితేటలతో నిన్ను సులభముగా ఓడించవచ్చును. విమోచింపబడిన జీవితముగల వాని వాదనకు ఎదురులేదు "స్వస్థతపొందినవాడు వారి యెదుట నిలువబడగా, చూచి యేమియు ఎదురు చెప్పలేక పోయారు".

**ఆర్.డబ్ల్యు. డిహాన్ ఈలాగు వ్రాసెను:**

పొలములోనికి వచ్చిన కొద్ది సమయములోనే, ఒక మిషనరీ, మొదటిసారిగా ఆ గ్రామములో నున్న కొద్ది మందికి సువార్త చెప్పుటకు ప్రయత్నముచేసెను. యేసుక్రీస్తును వర్ణించుచూ ఆయన జాలిగలవాడని, దయగలవాడని, మనలను గూర్చి చింతించి, శ్రద్ధవహించువాడనియు, మేలుచేయుచువెళ్లెనని తెలియజేసెను. ఆయన

వారితో మాట్లాడుచుండగా వినువారిముఖములలో సంతోషముగలవారై ఆయనతో ఏకీభవించినట్లు తలలు ఊపిరి. తన సందేశమును ఆపి ఈలాగు వారిని అడిగెను. నేను ఎవనిగూర్చి మాట్లాడుచున్నానో మీకు తెలియునా? ఆ గ్రామస్థులలో ఒకడు వెంటనే జవాబిచ్చెను. “అవును మాకు తెలియును. మా యొద్దకు వచ్చుచుండు ఒక మనుష్యునిగూర్చి నీవు మాట్లాడుచున్నావు” ఆతృతగా వారియొద్దకు వచ్చుచుండు ఒక మిషనరీ వైద్యునిగూర్చి ఆయన దూరముగా వున్న వారి గ్రామమునకు వచ్చి వారిభౌతిక అక్కరలుతీర్చువాడని చెప్పిరి. ప్రజలవిషయమై శ్రద్ధకలిగిన ఆయన జీవితం ఎంతగా క్రీస్తును పోలియుందంటే ఆయనలో వారు ప్రభువైన యేసుని చూచారు. అతడు నిజముగా క్రీస్తు స్వారూప్యమునకు ఒక ఉదాహరణగానున్నాడు”

**సర్ హెన్రీ యమ్. స్టాన్లీ ఈలాగు చెప్పెను:**

నేను లండన్‌లో ఉన్నప్పుడు నాస్తికునిగాను, మతమునకు వ్యతిరేకముగా ఉండేవాడను, అట్టి మనస్సుతోనే ఆఫ్రికా వెళ్ళితిని. నేను ఒక రిపోర్టర్‌ను కాబట్టి యుద్ధములు, ప్రజావేదికలు, రాజకీయ సమావేశములను గూర్చి వ్రాసేవాడను. ఉద్రేకముకు తావిచ్చువాడనుకాను. అయితే చాలాకాలము తరువాత మరొక ఆలోచన పుట్టినది. లోకసంబంధమైన సంగతులకు దూరమయ్యాను. ఒక ఒంటరి వృద్ధుని చూశాను. ఆయనపేరు డేవిడ్ లివింగ్‌స్టన్. నాలో నేనిలా ప్రశ్నించుకొన్నాను. “ఆయన ఈ స్థలములో ఇక్కడ ఎందుకు ఉన్నాడు? ఆయనను ప్రేరేపించినదేమి?”

మేము కలసికున్న తర్వాత కొన్ని నెలలకు ఆయన మాటలు విన్నాను. ఆ వృద్ధుడు చెప్పేమాటలకు నాకు ఆశ్చర్యం కలిగినది “సమస్తమును వదిలివేసి నన్ను వెంబడ ించుము” అయితే కొద్ది కొద్దిగా ఆయన భక్తిని, మర్యాదను, ఆయన ఆసక్తిని, ఆయన ఆకాంక్షను గమనించితిని, ఆయన తన పనిని నిశ్శబ్దముగా కొనసాగించెను. ఆయన నన్ను మార్చుటకు ఏ ప్రయత్నం చేయనప్పటికి ఆయన ద్వారా నేను మార్చబడితిని.

బిల్లిగ్రహం ‘గోల్ఫ్’ అనే ఆట ప్రసిడెంట్ గెరాల్డ్ ఫోర్డ్‌తో ఆడినప్పుడు జాక్ నిక్లాస్ మరొక ఆటగానితో ఆడేవాడు అని ఆర్.సి. స్ప్రౌల్ చెప్పెను. ఆ ఆటగాడు తన మిత్రునితో బిల్లీగ్రహం తన గొంతులో మతమును కుక్కనక్కరలేదు అంటూ అతడు కోపమును ఒక బక్కెట్టు గోల్ఫ్‌బంతుల మీద చూపెను. అప్పుడు అతనిస్నేహితుడు ఈలాగు ప్రశ్నించెను “బిల్లీ నీతో కఠినముగా ప్రవర్తించెనా?” ఆటగాడు నిట్టూర్పువిడిచి కలవరపాటుతో

జవాబిచ్చెను. లేదు, ఆయన తన మతమునుగూర్చి ప్రస్తావించనేలేదు "స్ప్రౌల్ ఈలాగువివరించెను. ఆశ్చర్యమేమనగా బిల్లీగ్రహం దేవునిగూర్చిగాని యేసునుగూర్చిగాని మతవిశ్వాసమును గూర్చిగాని యేమియు చెప్పలేదు. గాని అతడు ఆట ఆడలేకపోయెను. బిల్లీ తన మతమంత్రమును నాపై కుక్కినట్లుగా ఉంది అని ఫిర్యాదు చేసాడు. ఏమైంది? జరిగినదేమనగా ఆ సువార్తికుడు (బిల్లీగ్రహం) ఎంతగా క్రీస్తు తనద్వారా ప్రతిఫలించునట్లు చేసాడంటే ఆయన ఉండటమే ఆటగాణ్ణి ఇబ్బందికి గురిచేసింది.

ఒకదినము కొంతమంది మిషనరీలు ఇండియా వెళ్ళుచుండగా తోటి మిషనరీ సైలస్ ఫాక్స్‌కు ఆతిధ్యమిచ్చిరి. అప్పుడొక హిందూ స్త్రీ వచ్చి ఫాక్స్‌గారిని కలిసెను. కొద్దిసమయము తర్వాత అతడు వెళ్లిపోయెను. అప్పుడు ఆమెవచ్చి ఉత్సాహముతో ఈలాగు చెప్పినది "ఆయన ముఖములో దేవుని చూచాను". ఆమె అనేక దేవుళ్లయందు నమ్మకముకలిగియుండెను. అయితే సైలస్ ఫాక్స్‌గారి ముఖములో నిజమైన ఏకైక దేవుని చూచినది.

అయితే పరిశుద్ధతను ప్రజలు అప్రయత్నముగా పొందలేరు. అందులో మానవచిత్తము ఇమిడియున్నది. విశ్వాసులు పరిశుద్ధముగా ఉండవలెనని తప్పకుండా కోరుకోవాలి, ఆ గురితో వారిని వారు క్రమపరచుకొనవలసియున్నది. ఆ గురితో వారు ప్రోత్సహించబడవలసియున్నది. ఇప్పుడొక ప్రశ్న లేచుచున్నది. "పరిశుద్ధతను వెంటాడుటకు మనుష్యులను కదిలించేది ఏది"? ●

## అధ్యాయము - 4

# ఎందుకు పరిశుద్ధులుగా నుండవలెను?

విశ్వాసి యెక్కువ పరిశుద్ధునిగా నుండుటకు ఎందుకు కోరుకొంటాడు? అతని పాటకు అదే అంశము ఎందుకు?– “నా యజమానుని ఎక్కువగా పోలియుండవలెనని” ఎందుకు కోరుకుంటాడు?. క్రీస్తు సారూప్యముకొరకు ఎందుకతడు వేదన చెందుతాడు?

మొదటిగా అతను మారుమనస్సుపొందిన సమయములో అది అతనిలో సహజమైన ప్రేరణగా నిర్మించబడింది. పాపము పట్ల క్రొత్త ద్వేషమును, పరిశుద్ధత విషయములో క్రొత్త ప్రేమను పొందుచున్నాడు. తనలో నివసించు పరిశుద్ధాత్మ పవిత్రీకరించబడిన గుణమును అంతరంగములో తిరిగి ఉత్పత్తి చేయుటకు ఆశకలిగియున్నాడు. వ్యక్తిగత జీవితములో విజయము పొందుటకు ఉండే కోరిక ద్వారా నూతనస్వభావము బయలుపరచబడును. దానికి తోడుగా క్రైస్తవుడు పరిశుద్ధతను ఎందుకు వెంటాడాలి? ఎందుకు లోక సంబంధమైన, శరీర సంబంధమైన, అపవాది సంబంధమైన శోధనలను ఎదిరించాలి? వీటికి చాలా బలమైన కారణాలు ఉన్నాయి.

ప్రభువైన యేసు నామమునకు పాపము అవమానము తెచ్చును. ఇదొక ఘోరమైన దుష్ఫలితము. గురువుతో శిష్యుడు కలిసి యుండుటవలన నీతిమంతుడుగా యెంచబడుచున్నాడు. శిష్యుడు పాపము చేసినప్పుడు ప్రజలు గురువును నిందించి ఆయన నామమును బురదలోనికి లాగుతారు. అవమానకరమైన ప్రవర్తనను ఆయనతో కలిపెదరు. 1987లో ఒక టివి ప్రచారకుడు వ్యభిచారములో చిక్కుబడినప్పుడు దేశమంతయు ఎరిగిన నాస్తికుడు ఈలాగుచెప్పెను. మతము చెడ్డదని, అసహ్యమైనదని నీచపు ఆటయని చెప్పుటకు ఇదొక ఉదాహరణ “దావీదు వ్యభిచారము, హత్యయను పాపమువలన యెహోవా నామమునకు తీరని అవమానము, దూషణ తెచ్చిపెట్టెను (2 సమూ 12:14)

దావీదు పాపము చేసినప్పుడు నాలుగు సంగతులు చనిపోయాయని విక్టర్ జాక్ వ్రాసెను. 1. దేవుని ముఖములో చిరునవ్వు చనిపోయినది (2 సమూ 12:27). 2. దావీదు హృదయములో నెమ్మది చనిపోయెను. నేను పాపముచేసితిని. (2 సమూ 12.13). 3. దావీదు సింహాసనము యొక్క స్థిరత చనిపొయెను. నీయింటివారికి సదాకాలము యుద్ధము కలుగును (2 సమూ 12:10). 4. లోకములో అతని సాక్ష్యము చనిపొయెను. "ఈ కార్యము వలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్పహేతువు కలుగజేసితివి (2 సమూ12:14)

పరిశుద్ధతకు మరొక కారణమేమనగా పాపము రక్షకుని బలిగొన్నదని (1 పేతు 2:24) జ్ఞాపకముచేసికొనుట. ఆలోచించే ఏ విశ్వాసియైనను దేవుని కుమారుని సిలువలో మేకులను దిగగొట్టుటకు కారణమైన పాపము జోలికి పొవుటకు ఇష్టపడడు. పాపశిక్షకు ఆయన రక్తమును చిందించుట అవసరమైనప్పుడు ఆయనను వెంబడించువారు పరవాలేదని పాపమును ఎలాగు సహింతురు?

మనపట్ల క్రీస్తు ప్రేమ మనలను పరిశుద్ధులుగా జీవించుటకు బలవంతము చేయాలి. భక్తిహీనులుగాను, శత్రువులుగాను మనమున్నప్పుడు ఆయన మనలను ప్రేమించెను. మనలను విమోచించుటకు గొప్ప క్రయమును చెల్లించి దేవుని ప్రేమను బయలుపరచెను. మనము పరిశుద్ధముగా జీవించుటకు అవసరమైనవన్నియు ఆయన సమకూర్చెను. ఆయన మనకు చేసినదానికంటె యెక్కువైన ప్రేమలేదు. అట్టి ప్రేమను విడిచి పాత జీవితములో ప్రవేశించుట ఆ ప్రేమకు నీచమైన స్పందనయే అగును.

"నేను పరిశుద్ధుడను మీరును పరిశుద్ధులుగా వుండుడి" అను ఆజ్ఞను మనము సులభముగా మరచిపోవుదుము (లేవి 11:44, 1 పేతు 1:16) పేతురు సందేహములేకుండ చెప్పుచున్నాడు. ఈ ఆజ్ఞ పాతనిబంధనలోని ఆజ్ఞయేయైనను మనకును ఈ నాడు సంబంధించిన ఆజ్ఞయే. దేవుని పరిశుద్ధతకు ఆయనే ప్రమాణము. ఆయన కుమారుని జాగ్రత్తగా పరిశీలించిన యెడల ఆయనే పరిశుద్ధతకు ప్రమాణమని ఒప్పుకొనును.

**పాపము దేవుని హృదయమును పగులగొట్టును :**

క్రీస్తుకొరకు మనప్రేమ మనము పవిత్రమైన పాత్రలుగా వుండి ఆయన వాడుకొనుటకు తగిన రీతిగాయుండవలెనని మనలో ఆశపుట్టించాలి. మనమాయనను

నిజముగా ప్రేమించినయెడల ఆయనను సంతోషపరచుదుము. పాపము ఆయన చట్టమును మాత్రమే కాక ఆయన హృదయమును బ్రద్దలు చేయును. ఆయన పరిశుద్ధతయందు ఆనందించువాడు "మీరునన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలనుగైకొందురు అని యేసు చెప్పెను (యోహా 14:15) పరిశుద్ధతకలిగియుండవలెనని ఆజ్ఞాపింపబడెను (1పేతు 1:15,16, హెబ్రీ 12:14).

అవిశ్వాసులను, విశ్వాసులను అందరిని పాపము తొట్రుపడునట్లు చేయును. క్రైస్తవుడు పడిపోవుటను రక్షింపబడనివారు చూచినప్పుడు, సువార్త వారి జీవితములో యేలాంటి మార్పుతేలేదని తీర్మానముచేసి, వారు వెళ్లిపోయెదరు. ప్రభువును వెంబడించుటకు వ్యతిరేకముగా తీర్మానము చేయుట మాత్రమేకాక, క్రైస్తవ విశ్వాసమును అపహసించెదరు. మార్కు ట్వెయిన్ క్రైస్తవ విశ్వాసమునుండి వేరైపోవుటకు కారణమేమనగా క్రైస్తవులు బానిసత్వమునకు అనుకూలముగా నున్నారనియు, దుర్భాషలాడుదురనియు, మోసకరమైన కార్యములు చేయుచున్నారనియు అతడు తెలిసికొనుటను బట్టియే. మహమ్మదు యూదులనుండియు క్రైస్తవులనుండి ఒకే ఒక నిజమైన దేవుడున్నాడని గ్రహించినను, వారిజీవితములను బట్టి అతడు వెనుతిరిగెను. బ్రియన్ గుడ్విన్ ఇలాగు చెప్పెను. క్రీస్తు యెడలను, ఇతరులయెడలను, ఇంకను కొంచెము యెక్కువ ప్రేమకలిగి యుండినయెడల ఇప్పుడు ముస్లిమ్ ప్రపంచ చరిత్రయే మారిపోయి యుండెడిది.

మనము పాపముచేసినప్పుడు ఇతర విశ్వాసులను తొట్రిల్లజేయుదుము. వారు నిరుత్సాహపడి వదలివేయుదురు. మనలను నమ్మినవారిని గాయపరిచిన వారమగుదుము. అది కుటుంబమే కావచ్చును, సంఘమే కావచ్చును. మన కుటుంబము ఆ అవమానము నిందను భరించును. మనస్థానిక సంఘ సాక్ష్యమునకు భంగము కలుగును. పాపము బహిరంగమైతే సంఘము హేళనకు గురియగును. రహస్యపాపములు ఆత్మీయతను, శక్తిని తగ్గిపోవునట్లు చేయును. ఒక యౌవనస్థుని ప్రభువులోనికి నడిపించినవాడు తనకు ద్రోహముచేసినట్లుగా అతడు యెంచును. తనను నడిపించినవాడు ప్రభువునకు అవమానము తెచ్చినప్పుడు వాని విశ్వాసము బ్రద్దలగును. విశ్వాసుల సహకారమును పొంది క్రైస్తవులు తొట్రుపడకుండ కాపాడబడగలరు.

పరిశుద్ధమైన జీవితమే శ్రేష్ఠమైన జీవితము – అది ఆత్మకు, ప్రాణమునకు, శరీరమునకు శ్రేష్ఠమైనది. దేహములో ఆరోగ్యముకలిగియుండుటకు, అంతరంగములో ఆరోగ్యము కలిగియుండుటకు నడిపించును. విచారము నుండి, నిందనుండి,

అవమానమునుండి నానావిధ రోగములనుండి అది కాపాడును. అది సంపూర్ణమైన సంతోషమునకు, శాశ్వత సుఖములకు దారితీయును (1యోహా 1:4, కీర్త 16:11) ఒక కూడిక నుండి దుఃఖముఖముతో ఒక బాలుడు బయటకువచ్చినప్పుడు, ఆలాగుండుటకు కారణమేమని ఒకడు అడిగెను. ఆ బాలుడు ఈలాగు జవాబిచ్చెను. "ఒకే సమయములో సంతోషముగాను, పరిశుద్ధముగాను ఉండుట బహుకష్టము" అయితే సత్యమేమనగా పరిశుద్ధతలేకుండ, నిజమైన ఆనందమును పొందుట అసాధ్యము.

మన దేహము పరిశుద్ధాత్మకు ఆలయమను అవగాహన కలిగియున్నప్పుడు "దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొనగలము" (2 కొరింథి 7:1) త్రిత్వములో ఒకరు మనలో ఎల్లప్పుడు నివాసముచేయుచున్నాడని, ఆయన సహచరుడుగా నున్నాడను సత్యము మనమెన్నడును మరచిపోరాదు.

దైవభక్తి యిప్పటిజీవము విషయములోను రాబోవుజీవము విషయములోను వాగ్దానముతో కూడినది (1తిమోతి 4:8) నిత్యత్వమునకు ఇది మంచి సిద్ధపాటు. త్వరలో మనము ప్రభువైన యేసును చూడబోవుచున్నాము. ఆయన న్యాయపీఠము యెదుట నిలువబడబోవుచున్నాము. భయము పుట్టించే ఆ సన్నివేశమును మనస్సునందుంచుకొని ఇప్పుడు మనము జీవింపవలెను. అట్టి జీవితము పరిశుద్ధతకు నడిపించును.

**పాపము పెదవులకు మూతవేయును (నోరుమూపించును) :**

ప్రభువును సేవించుటకు పరిశుద్ధత స్వేచ్ఛనిచ్చును. అయితే పాపము నోరుమూపించును. నేరము, అనర్హతభావము, ఒప్పుకొనని పాపము వ్యక్తిని శక్తిహీనునిగా (పక్షవాతముగలవానివలె) చేయును. ఆత్మ స్వేచ్ఛయందు అతడు ఆనందించలేడు. అతని సాక్ష్యము తాత్కాలికముగా పతనమగును మరియు అతని నమ్మకత్వము ప్రశ్నార్థకమగును.

పరిశుద్ధత ప్రార్థనలో ధైర్యమునిచ్చును. "మనహృదయము మనయందు దోషారోపణ చేయనియెడల దేవునియెదుట ధైర్యము గలవారమగుదుము. మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (1యోహాను 3:21,

22) దీనికి వ్యతిరేకమేమనగా మనహృదయములో పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు మన ప్రార్థన వినడు (కీర్త 66:18) పాపము ప్రార్థన జీవితమును ఆపివేయును.

అది దేవునితో సహవాసమును తెంచివేయును. ఇది పెద్ద ప్రమాదమేమికాదని తలంచుదురు. అయితే అది ప్రమాదమే. దూరముగానుండి వెంబడించువాడు ప్రమాదములో ఉన్నాడు. అతడు తీర్మానము చేయవచ్చును. సంబంధము కలిగియుండవచ్చును. శోధనకు లొంగిపోయినప్పుడు, ప్రయోజనకారిగా నుండలేడు. తదుపరిజీవితమంతయు చీకటిలో నుండును.

దేవుని భయము పరిశుద్ధతగా నుండుటకు ప్రేరణ కలిగించును. అది శక్తివంతముగా నుండవలెను. "దేవుని భయము" అను పదములకు మర్యాద, గౌరవముంచితే చాలునని చులకన భావము నిచ్చుచున్నారు. దాని అసలు భావమేమనగా, భయము ఆరోగ్యకరమైన దేవుని భయము, ఆయనను దుఃఖపరచెదమేమోయని భయము, ఆయన క్రమశిక్షణ చర్యతీసికొనునను భయము. మరొక సంగతి గుర్తుంచుకొనుట మంచిది. తండ్రులదోషము మూడునాలుగు తరములమీదికి వచ్చును (రప్పించును). భార్యకు అపనమ్మకముగా జీవించిన వాని కుమారునిలో అదే పాపము కనబడును.

పరిశుద్ధతను వెంటాడుటకును, మన విమోచకుని పోలికలోనికి ఎదుగుటకును ప్రేరణ కలిగియుండుటకు ఇవి కొన్ని కారణములు.

ఇప్పుడు మనము శుద్ధీకరణయను అంశమును మరెక్కువగా వివరించుకొందము. పరిశుద్ధతకు మరొక పదము శుద్ధీకరణ. ●

## అధ్యాయము - 5

# పరిశుద్ధపరచబడుట-నాలుగు రకములు

జో అనువానికి ఆ సంగతి తెలియదు. అయితే అతడు రక్షింపబడకముందే అతడు పరిశుద్ధాత్మచేత గురుతు పెట్టబడెను. నిజముగా అతడు పుట్టకముందే అతడు ప్రత్యేకింపబడెను. అతడు ఎదుగుచుండగా కొన్ని సంగతులు సంభవించినవి. అయితే అవి ప్రాముఖ్యముగా కనబడలేదు. అతడు నిజమైన విశ్వాసులతో కలిసికొనుట సంభవించినది. ఒక దినమున ఒక క్రొత్త వ్యక్తి సువార్త కరపత్రిక ఇవ్వటం జరిగినది. అనుకోకుండగనే అతడు క్రైస్తవ రేడియో ప్రసారమును త్రిప్పెను. తన పనివద్ద తోటివాడు సాక్ష్యమిచ్చెను. సువార్త సందేశము ఒక టివిలో చూచెను. అప్పుడు అతని భార్య మారుమనస్సు పొందెను. అతని ఇల్లంతయు సమూలంగా మారిపోయెను. తరువాత అతడు గ్రహించినదేమనగా తన రక్షణ విషయములో పరిశుద్ధాత్మయే ఈ అనుకోని సంగతులు ఒక దానివెంట ఒకటి జరిగించెను.

తుదకు జో యేసు క్రీస్తును ప్రభువుగాను, రక్షకునిగాను విశ్వసించెను. దేవునియెదుట శుద్ధీకరణ స్థితిని పొందినట్లు అతడు తెలిసికొనెను. ఇప్పుడు దేవుడు అతనిని "క్రీస్తునందు"చూచెను. దాని భావమేమనగా క్రీస్తే అతని పరిశుద్ధతయని, అందువలననే పరలోకమునకు అర్హత పొందెనని యెరిగెను. అతడెంతమాత్రమును సాతానుచే నడిపించబడే లోక విధానములో సభ్యుడుగాడు. ఇప్పుడు అతడు క్రీస్తు యొక్క సభ్యుడు. లోకమునుండి వేరుచేయబడినవాడు.

జో తన జీవితములో మార్పులను గమనించుటకు మొదలుపెట్టెను. అతడు పాపమును క్రొత్తగా ద్వేషించెను. పరిశుద్ధత కొరకు క్రొత్త ఆశ కలిగియుండెను. అతడు ఇంకను పాపము చేసెను. అయితే మునుపటివలెకాదు పాపము అతనిని పరిపాలించలేదు. తాను ఇష్టపూర్వకముగా పాపముచేయుట మానివేసెను. అతడు

పాపము చేసినప్పుడు తన కాళ్ళవేళ్లపై నున్నట్లు సిగ్గుపడేవాడు. అతని పాత అలవాట్లు ఆగిపోయినవి. అతని భాషలో గొప్పమార్పువచ్చినది. పరిశుద్ధతలో అతడు ఎదుగుచూ ఉండెను. అందులో సందేహములేదు!

గతమంగళవారము అతడు చనిపోయెను. అతడు ప్రభువును ముఖాముఖిగా చూచినప్పుడు ఆశ్చర్యకరమైన రూపాంతరము పొందెను. జో నైతికముగాను, ఆత్మీయముగాను యేసుని పోలియుండెను. అపవిత్రతనుండి, పాపమునుండి శాశ్వతముగా స్వేచ్ఛనుపొందెను.

**దాని అర్థము నేరుగా తెలిసికొందము :**

జో యొక్క జీవితములోని నాలుగు అధ్యాయములు క్రొత్తనిబంధనలో నున్న ప్రతిష్ఠ (పరిశుద్ధపరచబడుట) నాలుగు భావములను విశదపరచుచున్నవి. దానినిగూర్చి తెలిసికొనకముందు ప్రతిష్ఠయను పదముయొక్క సాధారణ భావమును గూర్చి ఆలోచిద్దాము.

పరిశుద్ధతకు మరొక పదము పవిత్రత, ఈ రెండు పదములకు మూలభాషలో ఒకే పదము, కాబట్టి ఒకే అర్థము.

పరిశుద్ధముగా నుండుట, ప్రతిష్ఠించబడుట అనగా వేరుచేయబడు, ప్రత్యేకించబడు. బైబిల్‌లో వాడబడిన ప్రతిసన్నివేశమునకు ఈ నిర్వచనము తగియున్నది.

ప్రతిష్ఠించబడుటయనగా ఎక్కువ పరిపూర్ణతకలిగియుండుటయని సామాన్యముగా తలంచుదురు. అయితే అది తప్పు భావమే, నిజముకాదు ఏలయనగా యేసు తన్నుతాను ప్రతిష్ఠించుకొనెను (యోహా 17:19) మనహృదయములందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుకొనవలెను (1పేతు 3:15-16) ఆయన పరిపూర్ణుడుగనుక తన్నుతాను ఎక్కువ పరిపూర్ణుడుగా చేసికొనుటకు వీలుకాదు. ఆయన పరిపూర్ణతకు మనమేమియు కలుపలేము. అయితే తన తండ్రి పిలిచిన పనికొరకు తన్నుతాను ప్రత్యేకించుకొనెను. మన జీవితములో ఆయనను సర్వాధికారముగల ప్రభువుగాను, దేవునిగాను ప్రతిష్ఠించుకొనవలెను.

బైబిల్‌లో పరిశుద్ధత లేక ప్రతిష్ఠ అనునది వ్యక్తులకు వస్తువులకు వాడబడినది. దైవత్వమందలి ముగ్గురువ్యక్తులు పరిశుద్ధులే. అనగా వారి ప్రవర్తనలోను గుణాతిశయములలోను, సృష్టింపబడిన జీవరాసికి ప్రత్యేకముగా, వేరుగా నుండువారు (లేవీ

11:44-45, యోహా 10:36, 1కొరింథి 6:19) సీనాయి పర్వతము పరిశుద్ధపరచబడినది అనగా దేవుని ధర్మశాస్త్రము ఇచ్చుటకు ఆ స్థలము ప్రత్యేకింపబడినది (నిర్గ 19:23). పాతనిబంధనలో దేవుడు ఏడవ దినమును పరిశుద్ధ పరచెను (ఆది 2:3) అనగా పనినుండి ఆ దినము ప్రత్యేకింపబడినది. మనుష్యులలోగాని, పశువులలోగాని ప్రథమ సంతతి దేవునికి, ప్రతిష్ఠించబడెను. వారు దేవునికి చెందినవారని, అందుకొరకు ప్రత్యేకింపబడినవారని దాని భావము (నిర్గ 13:2) ప్రత్యక్షపుగుడారము, అందులోని ప్రతి ఉపకరణము ప్రతిష్ఠించబడినది. దేవుని సేవకొరకు ప్రత్యేకింపబడినది (నిర్గ 40:9) పాపము చేయుటకు ఇశ్రాయేలీయులు తమ్మును తాము ప్రతిష్ఠించుకొనిరి (యెష 66:17) సాధారణ భావములో వారు తమ్మును అంతకంటె యెక్కువ పరిశుద్ధులుగా చేసికొనలేరు.

అవిశ్వాసులు కూడ ప్రతిష్ఠింపబడుదురు అను భావము కూడ వున్నది. ఉదాహరణ గా "అవిశ్వాసియైన భర్త భార్యనుబట్టి పరిశుద్ధ పరచబడును" (1 కొరింధీ 7:14) అతడు నిశ్చయముగా రక్షించబడెనని దాని అర్థము కాదు. అయితే అతడు క్రైస్తవభార్యను కలిగియుండుట వలన అతడు ప్రత్యేకమైన బాహ్య ఆధిక్యతకలిగియున్నాడు. విశ్వసించుచున్న, ప్రార్థించుచున్న జీవిత భాగస్వామియొక్క ప్రభావము గొప్ప ప్రయోజనము.

వీటన్నిటి ద్వారా ప్రత్యేకించబడు, వేరుచేయబడు అను పదములు పరిశుద్ధతకు అన్ని సందర్భములలో సరిపోవుచున్నవని స్పష్టమగుచున్నది.

క్రొత్త నిబంధనలో కనబడే ప్రతిష్ఠిత నాలుగు కోణములలో తెలిసికొనవచ్చును. అవేవనగా

1. మారుమనస్సు పొందకముందు ప్రతిష్ఠిత (పరిశుద్ధత)
2. స్థాన సంబంధమైన ప్రతిష్ఠిత
3. ఆచరణాత్మక ప్రతిష్ఠిత
4. పరిపూర్ణ ప్రతిష్ఠిత.

**1. మారుమనస్సు పొందకముందు ప్రతిష్ఠించబడుట:**

విశ్వాసులందరు పరిశుద్ధాత్మచేత వారు రక్షింపబడకముందే పరిశుద్ధపరచబడిరి. (ప్రతిష్ఠించెను)ప్రత్యేకించెను. రక్షణలో మూడు మెట్లనుగూర్చి థెస్సలొనీకయులకు వ్రాసెను. (2థెస్స 2:13)

1. దేవుడు వారిని ఏర్పరచుకొనెను.
2. వారు ఆత్మచేత పరిశుద్ధపరచబడిరి.
3. వారు సత్యమును నమ్మిరి.

పేతురు ఈలాంటి జాబితానే వ్రాసెను. 1 పేతురు 1:2

తండ్రియైన దేవుని భవిష్యద్ జ్ఞానమునుబట్టి
ఆత్మవలన పరిశుద్ధత పొందినవారు
యేసు క్రీస్తునకు విధేయులగుట.
ఆయన రక్తమువలన ప్రోక్షింపబడినవారు.

ఈ రెండు సందర్భములలో మారుమనస్సు పొందకముందే పరిశుద్ధతను పొందుచున్నారు. ఒకడు క్రీస్తునకు చెందిన వానిగా పరిశుద్ధాత్మ ప్రత్యేకించుచున్నాడు. అప్పుడు అతడు సత్యమునకు విధేయుడగుచున్నాడు.

క్రీస్తు రక్తప్రోక్షణ ఫలితము అతనికి జమచేయబడుచున్నది.

**2. స్థాన సంబంధమైన పరిశుద్ధత:**

ఒకవ్యక్తి రక్షించబడిన క్షణములోనే పరిశుద్ధపరచబడిన స్థానమును పొందుచున్నాడు. దీని భావమేమనగా తన కొరకు లోకమునుండి ప్రత్యేకింపబడినట్లు అతనిని దేవుడు క్రీస్తునందు పరిగణించును. (1కొరింథి 1:2) నిజమైన అర్ధమేమనగా క్రీస్తే అతని పరిశుద్ధత (1 కొరింథి1:30)

ప్రతినిజమైన విశ్వాసి ఒక పరిశుద్ధుడుగానున్నాడు. దేవుని కొరకు అతడు ప్రత్యేకింపబడినాడు, విడదీయబడినాడు. పరిశుద్ధుడు అనగా చనిపోయిన క్రైస్తవుడని ఒకచిన్న బిడ్డ నిర్వచించెను. దీనికి భిన్నముగా సజీవుడైనను మృతుడైనను ప్రతి నిజవిశ్వాసి పరిశుద్ధుడే. అదే సమయములో అతడు శరీరసంబంధిగా ఉండవచ్చును. (1కొరి 1:1,2, 3:1,3) స్థానమును బట్టి అతడు పరిశుద్ధపరచబడినను అతని ప్రవర్తనలో, పరిశుద్ధుడుగా ప్రవర్తింపలేకపోవచ్చును. పరిశుద్ధపరచబడిన ప్రజలు పరిశుద్ధులుగా ఉండవలెనని తర్వాత హెచ్చరింపబడిరి (1పేతు 1:2, 15,16)

అపొ 20:32 లో పరిశుద్ధపరచబడినవారందరు "అనగా విశ్వాసులందరు అపొ. 26:18లో ప్రభువు తన ప్రజలను ఈలాగు వర్ణించెను "నాయందలి విశ్వాసముచేత పరిశుద్ధపరచబడినవారు" కొరింథీయులు కడుగబడి – పరిశుద్ధపరచబడినవారై

నీతిమంతులుగా తీర్చబడిరి. (1కొరి 6:11) ఈ లేఖన భాగములన్నియు స్థాన సంబంధమైన పరిశుద్ధతను సూచించును.

**3. ఆచరణాత్మకమైన (స్థితి సంబంధమైన) పరిశుద్ధత:**

ఆచరించవలసిన పరిశుద్ధత కూడా ఉన్నది. మన అనుదినజీవితములలో మనము ఎట్టివారమైయుండవలెనో దానిని సూచించుచున్నది. పాపము, దుష్టత్వమునుండి దేవుని కొరకు ప్రత్యేకింపబడినవారముగా మనము జీవించవలెను. పరిశుద్ధులుగా నుండవలెనని హెచ్చరింపబడినప్పుడు, అది ఆచరణలో చూపించవలసినదని గుర్తుంచుకొనవలెను. సాధారణంగా మనం మాట్లాడుకొనేది ఇదే.

యోహాను 17:17లో ఈ పరిశుద్ధతను గూర్చియే యేసు తన వారికొరకు ప్రార్థిస్తూ ఈ విషయమునుగూర్చి "సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము. నీ వాక్యమే సత్యము అని ప్రార్థించెను. పౌలు కొరింథీయులను ఈలాగే హెచ్చరించెను. "దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (2కొరింథి 7:1) పేతురు కూడ అదే రీతిగా వ్రాసెను " మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్నప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి" (1పేతు 1:16)

మనలను మనము ప్రత్యేకించుకొనిన యెడల, మనచుట్టునున్న రక్షింపబడని జనమునుండి మనము తప్పనిసరిగా ప్రత్యేక నడవడికలిగియుందుము. మనము వేరుగా నుండుటకు కోరుకొనుటలేదు గాని మందవలెనుండుటకు మనము కోరుకొనుచున్నాము. ఇది అంగీకరించుటకు కొన్నిసార్లు కఠినముగా కనబడును. మన చుట్టువున్న (పరిసర) వాతావరణములో కలిసిపోవుట కిష్టపడుచున్నాము. అయితే దేవుడు మనలను ప్రత్యేకముగా నుండవలెనని కోరుచున్నాడు.

దేవుడు ఇశ్రాయేలును పిలిచినప్పుడు. ఆ జనము ఒంటిగా నివసించవలెనని జనములతో లెక్కింప బడరాదని దేవుడు కోరుకొనెను. ఈ సంగతి బిలాము సంఖ్యా 23:9లో చెప్పెను. అనేకరీతులుగా ప్రత్యేకతయను సత్యము వారికి ఆయన బోధించెను. వారిపొలములో వేరు వేరు జాతుల విత్తనములు (కలిపి) చల్లకూడదు వారు బొచ్చును

నారయు కలిసిన బట్టవేసికొనకూడదు (లేవి 19:19) ఎద్దును గాడిదెను జతచేసి పొలమును దున్నకూడదు (ద్వితీ 22:10)

అయితే ఇశ్రాయేలీయులు ప్రత్యేకముగా నుండుటకు ఇష్టపడలేదు. త్వరలోనే ఇతర జనాంగములవలె తమకు రాజు కావలెనని ప్రజలుకోరుకొనిరి. **సంఘము కూడా నేడు అదేరీతిగా ఉన్నది అనుటకు వివరణ అవసరము లేదు.**

**4. సంపూర్ణ పరిశుద్ధత:**

పరిశుద్ధతలో నాలుగవస్థితి సంపూర్ణ పరిశుద్ధత. ఇది విశ్వాసికి భవిష్యత్ కాలములో జరుగును. అతడు రక్షకుని ముఖాముఖిగా చూచినప్పుడు పాపమునకు అపవిత్రతకు శాశ్వతముగా వేరైపోవును (1యోహా 3:2). నైతికముగా అతడు ప్రభువైన యేసును పోలి సంపూర్ణ పరిశుద్ధతపొందును.

కొలొస్స 1:22 లో ఇదే సంగతి చెప్పబడినది "తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణమువలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను" యూదా పత్రికలో ఈ సంగతి గుర్తుచేయబడుచున్నది "తన మహిమయెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకు" (వ 24)

పరిశుద్ధతను గురించి మారుమనస్సు పొందకముందు, మారుమనస్సు పొందినసమయమున, మారుమనస్సు పొందిన తర్వాత అనుదినము జరుగునది, ప్రభువును మనము చూచినప్పుడు జరుగునది అను నాలుగు సంగతులు పరిశుద్ధతలో ఇవి ఇమిడియున్నవి ఈ పుస్తకములో ముఖ్యముగా మూడవసంగతిని గూర్చి వివరణ ఇవ్వబడినది. నైతిక యుద్ధోపకరణములతో పోల్చి క్రైస్తవ గుణమును అభివృద్ధి పరచుటను గూర్చి తరువాత అధ్యాయములో వివరించబడినది. ●

## అధ్యాయము - 6

# దేవుని సర్వాంగకవచము

పరిశుద్ధతను సూచించు అనేక సాదృశ్యములు క్రొత్త నిబంధనలో నున్నవి.

పరిశుద్ధత అనగా పాత బట్టలు, మురికి బట్టలు విడిచివేసి, నూతన వస్త్రములు ధరించు రీతిని పోలియున్నది. (కొలొ 3:9,10) క్రీస్తు జీవితమే నిజమైన క్రొత్తబట్టలు. “ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనిన వారై.... శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీరము విషయమై ఆలోచనచేసికొనక యుందము” (రోమా 13:14)

పరిశుద్ధతకు మరొక సాదృశ్యము ద్రాక్షవల్లి నుండి వచ్చు ఫలము. క్రీస్తు ద్రాక్షవల్లి. విశ్వాసి ఆయనయందు నిలిచియుండుట వలన క్రీస్తును పోలిన గుణము కలిగి యుండును. (యోహాను 15:1-17) అదే పరిశుద్ధత. దీనిని ఆత్మఫలమని పౌలు వ్రాసెను (గలతీ 5:22, 23)

ఈ పరిశుద్ధతయే క్రీస్తులో అవతరించిన ప్రేమగా 1 కొరింథి 13వ. అధ్యాయములో పౌలు తెలియజేశాడు. ఇట్టి పరిశుద్ధత విశ్వాసిలో కూడా ఉండవలెను.

**కవచము అవసరత యెందుకు?**

క్రైస్తవ జీవితము ఒక యుద్ధభూమి. ప్రతి విశ్వాసి ఒక సైనికుడు. యుద్ధము ఎల్లప్పుడు తీవ్రక్రోధముతో కూడినది. అయితే కొన్ని పర్యాయములు దాని తీవ్రత మరికొన్ని పర్యాయములకంటే ఘోరముగా నుండును. ఏ సైనికులు వారి సేనాధిపతికి పూర్తిగా అప్పగించుకొని ఆయనకు దగ్గరగానుందురో, వారిపై సాతాను ప్రత్యేకంగా గురి పెట్టును. శత్రువు తన ఆయుధములను నామకార్థపు విశ్వాసులపై ప్రయోగించి వృధాచేయడు.

అంతిమ ఫలితము ఖాయమైనది. “మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము” (రోమా 8:37) ప్రభువు

మనపక్షమందున్నాడు. కాబట్టి ఎవడును మనకు విరోధముగా నుండి జయముపొందలేడు (రోమా 8:31). తుదకు ప్రతి శత్రువు మన యేసు యెదుట మోకాళ్లువంచి తండ్రియైన దేవుని మహిమ నిమిత్తము ఆయనను ప్రభువని ఒప్పుకొనవలయును (ఫిలిప్పీ 2:11)

అలాగైతే మనతోటి మిత్రులు యుద్ధరంగములో యెందుకు శవములగుచున్నారు? ప్రసిద్ధిచెందిన ప్రసంగీకులు, బోధకులు ఎందుకు యుద్ధములో ఓడిపోయారు? ప్రమాదశాతము యెందుకు అధికముగా నున్నది? దానికి జవాబు యేమనగా వారి కవచములో పగుళ్ళున్నవి. శత్రువు వాటిపైనే గురిపెట్టియున్నాడు.

ఇతరులవలె మనము కూడ ఓడిపోయే ప్రమాదములో నున్నాము. మనలను మనము కాపాడుకొనుటకు అపొస్తులుడైన పౌలు సైనికుని వస్తువుల జాబితాను ఎఫెసీ 6:10-18లో వివరించెను. మనము క్షేమంగా నుండుటకు, విజయవంతమైన పోరాటము జరిగించుటకు అవసరమైనవన్నియు అందులో నున్నవి.

**బలము ఆయనదే, మనదికాదు:**

ప్రభువు యొక్క మహాశక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండుడి(వ10) మనసొంతబలముపై మనమాధారపడిన యెడల మరణముతో ఆడినట్లే యగును. శత్రువునకు అతీతమైన శక్తియున్నది. మనకై మనము వానిని జయించలేము. మనకున్నగొప్ప బలమేమనగా మన బలహీనతను అంగీకరించి, ఆయన శక్తిని మనలో ప్రవహింపజేయుటయే! పౌలు చెప్పిన దాని అర్ధమిదేకదా? "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" (2 కొరింథీ12:10) దేవుని శక్తి మనబలహీనతయందు పరిపూర్ణమగుచున్నది (12:9) బలహీనులు విజయము పొందినప్పుడు వారిని బలపరచిన వానికి మహిమ కలుగును.

**సర్వాంగకవచము:**

అయితే మనము దేవుని సర్వాంగకవచమును కూడ ధరించవలెను. సర్వాంగకవచమనగా దట్టి, మైమరువు, జోడు, చెప్పులు, (బూట్లు) డాలు, శిరస్త్రాణము, ఖడ్గము, ఎడతెగని ప్రార్థన. పౌలు ఈ సంగతి వ్రాయునప్పుడు రోమా సైనికుడు తన్ను తాను కాపాడుకొనుటకు ఉపయోగించు ఆయుధములను మనస్సు నందుంచుకొని దానినుండి సమాంతర ఆత్మీయ సూత్రములను సూచించుచున్నాడు. కాబట్టి మనము

వేసికొనవలసిన ప్రశ్న యేమనగా, రోమా సైనికుని యుద్ధోపకరణములకు ఆత్మీయ పోలిక ఏమి? అవి అక్షరానుసారమైన ఆయుధములుకావని ఖచ్చితముగా చెప్పవచ్చును. ఏలయనగా "మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవికావుగాని దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముగలవైయున్నవి" (2కొరింథీ 10:4) ఇది క్రీస్తునందు మనస్థితికి సూచన యని కొందరు తలంచుచున్నారు. ఉదాహరణకు మనము తిరిగి జన్మించినప్పుడు, దేవుడు మనకు నీతియను వస్త్రమును తొడుగుచున్నాడు. అదేనీతియను మైమరువు. కవచములో చెప్పబడిన నీతిని, సత్యమును, విశ్వాసమును రక్షణను క్రీస్తునకు మనకున్న సంబంధమునుబట్టి పొందినవైతే అప్పుడు విశ్వాసులందరు అబేధ్యులుగానుందురు. అప్పుడు నైతిక కారణమును బట్టిగాని, దుర్భోధవలనకాని క్రైస్తవులు పడిపోయినట్లు మనము ఎన్నడు వినలేము. క్రైస్తవసైన్యము మరి దేనిని ధరింపనక్కరయుండదు. ఏలయనగా అవి ఎల్లప్పుడు కవచమును అంటిపెట్టుకొని ఉండును. కాబట్టి ఇది క్రీస్తునందు విశ్వాసి స్థితికి సంబంధించిన సంగతికాదు. ఈ ఆయుధములు మన అనుదిన జీవితమునకు మరియు ఆచరణకు సంబంధించివే.

దేవుని సర్వాంగ కవచము బలమైన క్రైస్తవుని గుణలక్షణములు వర్ణించుచున్నదని మన నమ్మకము. క్రైస్తవ సైనికుడు, నిందారహితమైన జీవితమును సాధకముచేసినయెడల శత్రువునకు బాణమువేసే అవకాశమే యుండదు. కవచము ధరించవలెనని మనము ఆజ్ఞాపింపబడినాము. అనగా దేవునికి అనుకూలముగా మనము చేయవలసిన సంగతులున్నవి. మనమేతరహా సైనికులమో మనమేలాగు ప్రవర్తించుచున్నామోయను ప్రశ్న నిలిచియున్నది.

**అపవాది తంత్రములు:**

దేవుని సర్వాంగ కవచము అపవాది తంత్రములకు విరోధముగా మనలను నిలుచునట్లుగా చేయును (వ 11) సాతాను కుయుక్తిగల శత్రువు. వాడు ఊహించని పన్నాగములను దేవుని ప్రజలకు వ్యతిరేకముగా ప్రయోగించుచున్నాడు. మన శత్రువును మనమెరిగినవారమై, అపవాది కుయుక్తులను ఎదుర్కొనవలెను. అపవాది తంత్రములను తెలిసికొందము.

వాడు అబద్ధికుడు, అబద్ధములకు తండ్రి, ఆరంభమునుండియు అట్టివాడే (యోహాను 8:44) దేవుని విషయములో వాడు హవ్వకు అబద్ధము చెప్పెను. అప్పటినుండి దేవుని గూర్చి అబద్ధము చెప్పుచునేయున్నాడు.

వాడు మోసగాడు. వెలుగుదూత వేషము వేశాడు. వాని అనుచరులును వానివలె వెలుగు పరిచారకులుగా నటించుదురు. (2 కొరింథీ 11:15) కొన్నిసార్లు బైబిలును తప్పుగా చెప్పి మోసగిస్తాడు. మరికొన్ని సమయములలో నానావిధములైన సూచక క్రియలతో మహాత్కార్యములతోను మోసగించుచున్నాడు (2థెస్స 2:9). మోసగించు సర్పమువలె అనుమానమును విశ్వాసుల హృదయములలో నాటి, సరళత, పవిత్రతనుండి తొలిగిపోవునట్లు చేయును (2 కొరింథీ 11:3)

వాడు నెపములు వేయువాడు. సహోదరులమీద నేరములు మోపువాడు (ప్రక 12:10) ప్రభువు ప్రజలపై నేరములు మోపువారందరు అపవాది పని చేయుచున్నారు.

అతడు అనుకరించువాడు. దేవుని ప్రతిపనిని అనుకరించును. మోషే అద్భుతములు చేసినప్పుడు ఐగుప్తు మాంత్రికులకు కూడా వాడు శక్తినిచ్చెను. (2తిమో 3:8)

వాడు నిరుత్సాహముకలిగించును. వెనుకపడినవాడు మారుమనస్సు పొందినప్పుడు క్షమించవలెనని కొరింథీయులను హెచ్చరించెను. క్షమించకపోయినప్పుడు అతడు నిరుత్సాహపడి అపవాది మోసములో పడిపోవును (2కొరింథీ 2:7-11) నిరుత్సాహపడిన వ్యక్తిని దేవుడు అరుదుగా వాడుకొనునని అపవాదికి తెలియును.

వాని మరొక పన్నాగమేమనగా విడగొట్టి జయించుట. పరిశుద్ధులమధ్య అనైక్యతను కలిగించును. తనకు తానే విరోధముగా వేరుపడిన యిల్లునిలువదని వానికి తెలియును.

సాతాను కొన్నిసార్లు గర్జించు సింహమువలె భయపెట్టుటకును, మ్రింగివేయుటకు ప్రయత్నించును (1పేతు 5:8) వాని లక్ష్యము, అతని అనుచరులైన దురాత్మల లక్ష్యము నాశనముచేయుటయే. వాడు సంఘమును హింసించువాడు (ప్రక 2:10) మాదకద్రవ్యములు, ఆత్మలతో సంబంధము, ఆల్కహాలు, అపవిత్రత అవినీతి మొదలగు చెడ్డ అలవాట్ల ద్వారా వాడు మనుష్యులను నాశనముచేయుటకు ప్రయత్నించుచున్నాడు.

అపవాది పేతురు ద్వారా యేసును సిలువకుపోవద్దని త్రోవతప్పించే సలహాయిచ్చెను. (మార్కు 8:31-33) ఆలాగే సిలువను మోయుటకు సంబంధించి అవమానము, శ్రమ, మరణము పొందవద్దని వాడు క్రైస్తవులను ప్రోత్సాహించుచున్నాడు.

గొప్ప ఆత్మీయవిజయములు పర్వత శిఖరాల అనుభవము కలిగినప్పుడు వాడు మోసపూరిత పద్ధతిలో వారిని గర్వముతో నింపును. ప్రమాదకరమైన గొప్ప శత్రువు గర్వమే.

**సాతానుని సమూహములు:**

మనము తరచుగా అబద్ధబోధకులతో, వాక్యవిరుద్ధ ఆరాధనాపద్ధతులను పాటించేవారితో లేక దేవుని వ్యతిరేకించే ప్రభుత్వములతో, సత్యమునకు వ్యతిరేకముగా నుండువారితో పోరాడినప్పటికి, మనము పోరాడునది శరీరులతో కాదు. ఇది ఖచ్చితమే. అపవాది వాని అనుచరులతో మనము యుద్ధముచేయవలయును. వారిని అధికారులని, అంధకార సంబంధలోకనాధులని, చీకటిశక్తులని, దురాత్మల సమూహములని, పౌలు తెలియజేయుచున్నాడు. ఆకాశమండలమందున్న చీకటి శక్తులు (వ12), ఇక్కడ మరొక సంగతి గుర్తుచేసికొనవచ్చును. అదేమనగా ఈ విశ్వమంతయు అదృశ్యమైన దురాత్మలతో పడిపోయిన దూతలతో నిండియున్నది. వారి పని ఒక సైనిక వ్యవస్థను పోలియున్నది. వారి హోదా విధానము మనకు తెలియదు. అయితే అవన్నియు సాతానుని ఆజ్ఞకు లోబడియుండును. ఈ దురాత్మశక్తులు దుష్టులైన మనుషులను, తమ చేతిలో తోలుబొమ్మలవలె వాడుకొని దేవుని పనిని ఆటంకపరుచును. ఆయనసేవకులను హింసించును.

అంధకార సంబంధ శక్తులతో మనము పోరాడుచున్నామని పౌలు చెప్పినప్పుడు వారు మాత్రమే మన శత్రువులని ఆయన వుద్దేశముకాదు. లోకము, శరీరము, అపవాది అనుముగ్గురు శత్రువులు మనకున్నారు. అయితే అపొస్తలుడు ప్రాథమికముగా మన యుద్ధము అపవాది, వాని సమూహము తోనే యని చెప్పుచున్నాడు...

**నీ నేలపై నిలువబడుము:**

మనము నేలపై నిలువబడుటకు దేవుని సర్వాంగకవచమును మనము ధరించుకొనవలెను. శత్రువు సర్వజ్ఞాని కాకపోయినను గొప్ప తెలివి కలిగి ఎన్నో రీతులుగల యంత్రాంగము కలిగియున్నాడు. మనము ఎక్కడ బలహీనులమో అక్కడ దాడిచేయ గలవాడు. అందువలన మన ప్రవర్తనలో ఏ విషయమును నిర్లక్ష్యము చేయకూడదు.

2 సమూయేలు 23:9,10లో ఎలియాజరును గూర్చి వ్రాయబడినది. అతడు లేచి చేయి తిమ్మిరిగొని కత్తిదానికి అంటుకొని పోవువరకు ఫిలిష్తీయులను హతము చేయుచువచ్చెను. ఈనాడు మన జీవితములకు అదే తరహ పట్టుదల, తీర్మానము అవసరము.

ఇప్పుడు సర్వాంగ కవచమును విడివిడిగా వివరించుచున్నాడు. మొదటిమూడు ఆయుధములు ముఖ్యమైనవియు యూనిఫారమువలె ధరించవలసినవియు, చురుకైన పోరాటములో తరువాత మూడు అవసరమని కొందరు చెప్పుచున్నారు.

**సత్యమనుదట్టి:**

మొదటి ఆయుధము సత్యమనుదట్టి. దట్టియొక్క ఉద్దేశమేమనగా సైనికుడు తన పొడవైన గౌనువేసుకొని తనపనిలో అడ్డము లేకుండుటకు దట్టిని పైన ధరించును. ఈ ఆలోచన మనము ఒప్పుకొనినప్పుడు క్రైస్తవుని విశ్వాసపోరాటములో తనకు ఆటంకపరచుదానిని తొలగించుకొనుటకు వాక్యమనే సత్యము వినియోగింపవలెను.

తిండివలనను, మత్తువలనను, ఐహిక విచారములవలనను మత్తుగా నుండరాదని యేసు తన శిష్యులను హెచ్చరించెను. (లూకా 21:34) సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు ఈ జీవన వ్యాపారములలో చిక్కుకొనడని పౌలుకూడ చెప్పెను. (2తిమో 2:4) దురాశ, ఆస్తి, వస్తుసంపద, కీర్తి, అధికారకాంక్ష సుఖమును ప్రేమించుట, విలాసవంతమైనజీవితము మొదలగువాటినుండి మనలను మనము కాపాడుకొనుటకు సత్యమను దట్టి మనకవసరము.

దట్టి మనము సత్యమును పట్టుకొనవలెనని గుర్తుచేయుచున్నది. లేఖనములు సంపూర్ణముగా దైవప్రేరేపితములని అక్షరానుసారమైనవనియు మనము గట్టిగా పట్టుకొనవలెను. మూలములో ఇవ్వబడిన వీటిలో యేలోపములేనివని మనము దృఢముగా నమ్మవలెను. బైబిలు దైవుని సజీవ వాక్యమని రూఢిగా నమ్మవలయును. ఏరీతిగా సందేహము రానీయరాదు. లేఖనమును మనమెన్నడను విమర్శించరాదు. దానికి బదులుగా లేఖనములే మన మనస్సులకు తీర్పు విధించవలెను.

అయితే మనము సత్యమును పట్టుకొనుట మాత్రమే చాలదు. సత్యమేమనలను పట్టుకొనవలయును. అది మన జీవితములను స్వాధీన పరచుకొనవలెను. ఆచరణాత్మకముగా ప్రతిదినము బైబిలు చదువుటకు మన సమయమును కేటాయింపవలెను. దాని భావమేమనగా మనము వాక్యమునకు విధేయులము కావలయును. మనకు సరిపోవు భాగములకే మన విధేయత పరిమితము కారాదు. మనకు చెప్పబడిన ప్రతి ఆజ్ఞకు మనము లోబడవలెను. క్రైస్తవ యుద్దములో ఓటమికి కారణము బైబిలును నిర్లక్ష్యముచేయుటయే. ఇది నిజము. అదేమనగా "ఈ బైబిల్ నిన్ను పాపమునకు దూరపరచును. లేక పాపము ఈ బైబిలుకు నిన్ను దూరపరచును."

దేవుని వాక్య సత్యమును విశ్వాసిహత్తుకొన్నప్పుడు, అతనికి గొప్ప భద్రతగలదు. సత్యమునకు విధేయుడైనప్పుడు, సత్యముజీవితములో కనబడినప్పుడు, పొసగిన జీవితము, యధార్థత, నమ్మకత్వము ఉన్నప్పుడు అతనికి భద్రత కలదు.

**నీతి యను మైమరువు :**

యుద్ధకవచములో రెండవది నీతి యను మైమరువు. దీని భావమేమనగా దేవుని దృష్టియందును మనుష్యులదృష్టియందును సరియైనది చేయుట. అనగా తప్పుగాను, చీకటిగాను, ప్రశ్నార్ధకముగాను ఉన్నవాటిని చేయని చురుకుగానున్న మనస్సాక్షిని కలిగియుండుట. నీతియను మైమరువును కలిగియున్నప్పుడు గొప్పతప్పులకు దారితీయుచున్న చిన్నవాటితో రాజీపడలేము. వాటిని తృణీకరింతుము.

లంచములు, బహుమతులు, రహస్య ఒప్పందాలద్వారా సంపాదనలకు మనము దూరముగా నుండవలెను. ఆదాయ పన్నులెక్కలలో మనము నిజాయితీగా నుండవలెను. పరీక్షలలో మోసముచేయుటకంటె తప్పిపోవుటకు సిద్ధపడియుండవలెను. చట్టమునకు మనము లోబడవలెను. ఖర్చులు పెంచి లెక్కలు చూపరాదు. ఆ శోధనకు లొంగకూడదు.

అన్ని సమయములలో ప్రభువైన యేసు నీతి అను మైమరుపును ధరించుకొనెను (యెష 59:17) ఆయన మనకు మాదిరి.

**సువార్తయను జోడు:**

ఇక పాదములకు "సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సు, అను జోడు. (వ 15) దీని అర్థమేమి? సువార్తను అందించుటలో, పంచుటలో సిద్ధమైన మనస్సు ఆసక్తి కలిగి యుండుట. మనము ప్రతి ఉదయము "ప్రభువైన యేసూ, ఈ దినము ఒక వ్యక్తి యొద్దకు నడిపింపుము ఒకరితో నిన్ను గూర్చి చెప్పుటకు ద్వారము తెరువుము" అని ప్రార్థించుట ద్వారా ఈజోడును ధరిస్తాము. అప్పుడు ఒక వ్యక్తి ఆత్మీయ తృష్ణ, కలిగియుంటే, అతనిని క్రీస్తు యొద్దకు క్రమేపి నడుపుటకు మనము సిద్ధపడి యుందుము. మానవుని పాపమునుగూర్చి, ఆలాగే క్రీస్తు పనిని గూర్చియు పాపి బాధ్యతనుగూర్చియు, వివరించు లేఖనములు మనము కంఠస్తము చేయాలి. ఇప్పుడు పరిశుద్ధాత్మ సరియైన వచనములు ఎన్నుకొనునట్లు మనలను నడిపించును.

ఒక వృద్ధుడైన పరిశుద్ధుడు తనకు జబ్బుచేయగా వైద్యశాలలో చేరెను. అతని కుటుంబము మరుసటి దినమున ఆయనను దర్శించినప్పుడు "ఎలాగున్నావు"? అని

అడిగిరి, అతని జవాబు ఈలాగున్నది “బాగానేయున్నాను. ఈ వార్డులో ప్రతిరోగితో ప్రభువునుగూర్చి వివరించాను” ఆయన పాదములు సమాధాన సువార్తవలనైన సిద్ధపాటు కలిగియున్నవి.

**విశ్వాసమను డాలు :**

నాల్గవ సాధనము విశ్వాసమను డాలు. దీని ఉపయోగమేమనగా అపవాది అగ్ని బాణములను చల్లార్చుట (వ16). అపవాది లేఖనములనుగూర్చి, దేవుని మంచితనమును గూర్చి మన సొంత రక్షణను గూర్చిన సందేహములతో మరియు నిరుత్సాహములు పాపముచేయుటకు ప్రేరేపణను, తప్పుడు నేరారోపణలు, చెడ్డతలంపులు అనువాటితో మనయొద్దకు వచ్చును. దేవుని వాక్యములో మనము స్థిరముగా నిలిచి వాక్యసూత్రమునకు విధేయులమై వాగ్దానములను పట్టుకొన్నప్పుడు మనము విశ్వాసమను డాలును వినియోగించగలము. అప్పుడు సాతానుని బాణములు మనకేమియు హానిచేయకుండ నేలపై పడిపోవును.

పౌలు కైసరుయెదుట నిలువబడునని దేవుడు వాగ్దానము చేసెను. అయితే రోమునకు వెళ్లు ఓడ మునిగిపోయేప్రమాదములో పడిపోయెను. విశ్వాసమనుడాలు పట్టుకొని పౌలు ఈలాగు చెప్పెను. “నాతో దూత చెప్పిన ప్రకారము జరుగునని నేను దేవుని నమ్ముచున్నాను” (అపొ 27:25)

**రక్షణయను శిరస్త్రాణము:**

“రక్షణయను శిరస్త్రాణమును ధరించుకొనుము” (వ 17) శిరస్త్రాణము తలను కాపాడును. దేవుని వాక్యముపై జరుగుచున్న లోకసంబంధమైన జ్ఞానుల దాడినుండి మన మనస్సులను కాపాడుకొనవలెను. గొప్ప విమర్శ గొప్పగా కనిపించు పదములతో కూడినది. వారి దాడి మనపై ఎల్లప్పుడు జరుగుచున్నది. దానినే ఉదారవేదాంతము అందురు. వారు ఆడంబర ప్రకటనలు చేయుదురు. బైబిలునందు తప్పులున్నవను ఊహతో రుజువు చూపింతురు. వీటినుండి మన మనస్సులను ఎల్లప్పుడు కాపాడుకొనవలెను. సర్పము హవ్వ మనస్సులో నాటిన సలహా ఫలితముగా భూమి మీదకు ఆది (మొదటి) పాపము వచ్చినది. కొరింథీయులకు ఆలాంటి సమస్య వచ్చునని పౌలు భయపడుచున్నాడు. “సర్పము తన కుయుక్తిచేత హవ్వను మోసపరిచినట్లు మీ మనస్సులును చెరుపబడి క్రీస్తు ఎడలనున్న సరళతనుండియు పవిత్రతనుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడు చున్నాను” (2 కొరింథీ 11:3)

అట్టి దాడులను ఎదుర్కొనుటకు పౌలు 1 కొరింథీ 10:5లో జవాబు చెప్పుచున్నాడు. "మేము వితర్కములను దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టుచున్నాము". దీని అర్ధమేమనగా ప్రతి మానవ హేతువాదమును, ఊహను తత్వశాస్త్రమును, ప్రభువు యొక్క బోధలకు సరిపోవునాయని పరీక్షింపవలసియున్నది. ఆయన వాక్యమునకు భిన్నముగా ఉన్నప్పుడు దానిని మనము తృణీకరించవలెను.

రక్షణయను శిరస్త్రాణమునకు మరొక అదనపు అర్ధమును గూడ చెప్పవచ్చును 1థెస్సలొనీ 5:8లో రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును ధరింపవలెనని హెచ్చరిక ఇవ్వబడినది. రక్షణకు నిరీక్షణ యున్నది. అదేమనగా ఒకనాటికి యుద్ధము ముగియును. మనము ఇమ్మానుయేలు దేశములో క్షేమముగా నుందుము. క్రైస్తవుడు ఈ శిరస్త్రాణమును యెట్లు ధరించును? కొన్ని పర్యాయములు యుద్ధము మనకు విరోధముగానున్నట్లు కనబడుచున్నది. శత్రువు హస్తము మనకంటె యెత్తుగానున్నట్లు కనిపించును. ముఖ్యనాయకులలో కొందరు పడిపోయిరి. అనేకసేనలు మంచిగనే ప్రారంభించి ఇప్పుడు వెనుతిరిగినవి. కొందరు వదలివెళ్ళిపోయిరి. పాతాళ సేనలు ముందుకు వచ్చుచుండగా దేవునిలో కొరత కనబడుచున్నది. కొందరు జీవన వ్యాపారములోమునిగిపోయి, పోరాటములో చురుకుగా లేరు. వార్తలన్నియు వ్యతిరేకముగానున్నను, ప్రోత్సాహకరముగా లేకపోయినను ఆ సమయములో రక్షణనిరీక్షణయను శిరస్త్రాణమును ధరింపవలెను. ఈ నిరీక్షణను బట్టి ఈలాగు చెప్పగలము "తరంగములు మనకు వ్యతిరేకముగా నున్నను ప్రవాహమే తప్పక విజయము పొందును (The waves may be against us, but the tide is sure to win). తుదకు విజయము మనదే. దేవుని సంకల్పమే జయించును"

**ఆత్మ ఖడ్గము:**

కవచములో చివరి ఆయుధము ఆత్మఖడ్గము అనగా దేవుని వాక్యము. (వ17 బి)

డబ్ల్యు.ఇ. వైన్‌గారు ఈలాగు వివరించెను "బైబిలంతటిని గూర్చి యిచ్చట ప్రస్తావించుటలేదు గాని, విడిలేఖనభాగమే చెప్పబడినది. పరిశుద్ధాత్మ తగిన సమయములో తగిన లేఖనమును మన జ్ఞాపకమునకు తెచ్చును. లేఖనమును మన మనస్సులో క్రమముగా నిలువచేసికొనుట అవసరమై యున్నది."

ఆత్మ ఖడ్గమును వినియోగించుటకు చక్కని మాదిరి చూపించినవాడు మన ప్రభువైన యేసుక్రీస్తు. అపవాది శోధనలను త్రిప్పికొట్టుటకు ప్రభువు వాక్యమును ప్రయోగించెను. ఆయన యేదో ఒక వచనము అనాలోచనగా యెత్తి చూపలేదు గాని ఆ క్షణమునకు అవసరమైన తగిన లేఖనమును ప్రభువు వినియోగించెను "వ్రాయబడి యున్నది" అని ఆయన మూడుసార్లు చెప్పెను. తరువాత ఆత్మసూచించిన భాగములను వివరించి సాతానుని దురాలోచనలను పడగొట్టెను.

సరియైన సమయములో సరియైన వచనమును పరిశుద్ధాత్మ మనకు సూచించుటకు ఆ లేఖనములను అంతకుముందే కంఠస్థముచేసినవై యుండవలెను లేదా కనీసము ఆ వచనము మనకు తెలిసినదై యుండవలెను. ఈ సందర్భము ద్వారా మనము లేఖనములను కంఠస్థము చేయవలెనని తెలిసికొనుచున్నాము. ఒక కళాశాల విద్యార్ధి తన స్నేహితుని అతని ఉపాధ్యాయులు అతని నమ్మకము తీసివేయుచున్నారని చెప్పెను. అతని స్నేహితుడు "నా కుమారుడా తెలివిపుట్టించు మాటలను నీవు మీరగోరితివా, ఉపదేశము వినుట ఇకమానుకొనుము" అని చెప్పెను. అతడు ఈ వాక్యమును (సామెతలు 19:27). కంఠస్థముచేసి యుండకపోతే ఆరీతిగా ఆత్మఖడ్గమును ప్రయోగించియుండెడివాడు కాదు.

**ప్రార్థన :**

యుద్ధములో ఆరు ఆయుధములను చెప్పిన వెంటనే ప్రార్థనకొరకు పిలుపునిచ్చినాడు. యుద్ధసామాగ్రిలో ప్రార్థన ఒక భాగమని మనము తలంచరాదు. అయితే సైనికునికి తన కేంద్రముతో ఖచ్చితమైన సంబంధముకలిగి యుండుట అవసరము. సైనికుడు ఆ వాతావరణములో జీవించి పోరాడును. ప్రార్థన ద్వారా ఆ దినమునకు దేవుని ప్రణాళికయేమో అతడు తెలిసికొనగలడు. ప్రార్థన ద్వారా ప్రభువు యొక్క అదృశ్యసేనలు తనను బలపరచునని తెలిసికొనగలడు (2రాజు 6:17) ప్రార్థన ద్వారా విజయమును పొందగలడు.

ప్రార్థన అప్పుడప్పుడుకాక, యెడతెగక చేయవలెను. మన ప్రార్థనలో అన్ని రకములు కలిసి యుండాలి. విజ్ఞాపన, యాచన, ఒప్పుకోలు, మనవులు అన్నిటిని కలిపి, కృతజ్ఞాతాస్తుతితో మిళితమై యుండవలెను.

ప్రార్థన ఆత్మయందు చేయవలెను. అనగా ఆయన చేత ప్రేరేపించబడి నడిపింపబడవలెను. ఆయన చిత్తప్రకారమైన ప్రార్థనయై యుండవలెను.

ప్రార్థనలో మెళుకువ కావలసియున్నది. తుదవరకు వేచియుండుట విసుకక, ఓర్పుకలిగి అడుగుచూ, వెదకుచూ, తట్టుచూ ఉండవలెను.

పరిశుద్ధులందరికొరకు ప్రార్థించవలెను, ఏలయనగా మనమందరము కలిసి యుద్ధముచేయుచున్నాము.

**ముగింపు:**

క్రైస్తవ సైనికుని వీపును కాపాడుకొనుటకు ఏలాంటి ఆయుధము దేవుడు ఇవ్వలేదని తరచుగా ఎత్తిచూపుచున్నారు. దీని అర్థమేమనగా యుద్ధములో వెనుతిరుగుటలేదు. దేవుని సైనికుడు వెనుతిరిగి శత్రువునకు వీపుచూపి పరుగెత్తరాదు. నెపోలియను సైనికులు, మనిషి మనిషి పోరాడునప్పుడు, నలుగ గొట్టబడినప్పుడు, డ్రమ్ము వాయించువానితో వెనుతిరిగి వచ్చునట్లు డ్రమ్ము కొట్టవలెనని చెప్పెను. అప్పుడు డ్రమ్మువాయించువాడు అయ్యా ఎట్లు వెనుతిరిగిపోవలెనో వాయించుటకు నీవు మాకు నేర్పలేదు. ఈ మాట లు నెపోలియనును మండించినవి. నూతన తీర్మానమునకు కారణమాయెను. తుదకు ముందుకు సాగి అద్భుత విజయము సాధించెను.

క్రైస్తవుడు వెనుతిరుగరాదు. అయితే కొన్నిసార్లు పారిపోవలసి యుండును. అనగా జారత్వమునకు దూరముగా పారిపోవలెను. (1కొరింధి 6:18) విగ్రహారాధనకు దూరముగా పారిపోవలెను. రూపించిన విగ్రహముల నుండి మాత్రమే కాక మన హృదయములో, జీవితములో ప్రభువు స్థానము నాక్రమించునదేనినుండియైనను పారిపోవలసియున్నది. (1కొరింథీ 10:14) ధనాపేక్షనుండి పారిపోవలెను. అది సమస్త కీడులకు మూలము. ధనము సంపాదించవలెనను ఆశనుండి పారిపోవలెను. యౌవనేచ్ఛలనుండి పారిపోవలెను (2తిమో 2:22)

ఈ విషయములో పారిపోవుట పిరికితనముకాదు. అవమానముకాదు. ఓట మికూడకాదు. యుద్ధములో ఇది ఉన్నతస్థితిలో ఉండుటకు ఒక మార్గము.

ఈ యుద్ధములో మనమందరము కలిసియున్నాము. ఐక్యతతో కలిసియుందము. ఒకరి కొరకు ఒకరు ప్రార్థన చేయుదము. చివరి వరకు నమ్మకముగా కొనసాగుదము. ప్రమాదములో చిక్కుకొనవద్దు. ఒక మిషనరి పాపములో పడి ఆ స్థలము వదలి వెళ్ళెను. ఒక మంచి స్నేహితుడు ఈలాగు చెప్పెను "అతని కొరకు నేనెన్నడు ప్రార్థించనందుకు సిగ్గుపడుచున్నాను. ఈ తరహాపాపము నుండి కాపాడబడవలెనని

నేనెన్నడు తలంచలేదు". మనకందరకు ప్రార్థన అవసరము. అది మనలో ఎవరికైనను జరుగవచ్చును. విశ్వాసమను ఓడ బ్రద్దలయ్యే ప్రమాదములో మనమందరము ఉన్నాము.

జాన్ డోర్సె అను భక్తుడు అపవాది కుయుక్తులనుండి విశ్వాసి తన్నుతాను కాపాడుకొను విధము ఈ రీతిగా వివరించెను.

ఈ దినము ప్రార్థించుచోటనే లోపల నాకు భయంకరమైన యుద్ధమున్నది
దేవునితో కలిసి మాట్లాడవలెనని వెళ్లగా, అక్కడ సాతానుని కనుగొంటిని.
వాడు గుసగుసలాడి, "నీవు నిజముగా ప్రార్థించలేవు. నీవు ఎప్పుడో ఓడిపోయావు. నీవు మోకరించి కొన్ని మాటలు చెప్పవచ్చును అయితే నీవు ప్రార్థించలేవని నీకు తెలియును."

అప్పుడు చెవులు కప్పునట్లు నా శిరస్త్రాణమును ధరించితిని.
అది నాకు సహాయపడి నాభయమును వెళ్లగొట్టెను.
మరొక ఆయుధమును సరిచేసికొంటిని. నా పాదములకు సమాధానమను జోడు తొడుగుకొంటిని.
నా నడుముకు సత్యమను దట్టిని ధరించి, దేవునివాక్యమను ఖడ్గమును ధరించితిని
నీతియను మైమరవు కలిగియుంటిని. హృదయములో ప్రేమను కాపాడుకొనుటకు.
విశ్వాసమనుడాలు సరిగనేయున్నది – వాని అగ్నిబాణములుపడిపోయినవి.
యేసు నామమున దేవుని ప్రార్థించాను, ఆయన అమూల్యరక్తమును ఆశ్రయించాను.
అప్పుడు సాతాను సిగ్గుతో జారుకొన్నాడు, నేను దేవుని కలిసికొని మాట్లాడితిని.

పరిశుద్ధతయను పాఠశాలలో దేవుడు ఉపాధ్యాయుడని, మన యింటి పనిని మనము చేయవలయునని ఇంతవరకు చెప్పిన దానిని బట్టి స్పష్టమగుచున్నది. నిజమైన ప్రార్థనకు ఏది అవసరమో, నిజమైన పరిశుద్ధతకు అదే అవసరము. దేవుడు లేకుండ, మనము చేయగలదేమియులేదు. మనము లేకుండ దేవుడు చేయడు. దీనిని గూర్చి తదుపరి అధ్యాయములో మరియెక్కువగా నేర్చుకొందము. ●

# అధ్యాయము - 7

# దేవుని భాగము - మన భాగము

పరిశుద్ధతయను అంశములో దేవుని యొక్కయు, మానవుని యొక్కయు మర్మమైన కలయికయున్నది. మనమందరము పరిశుద్ధులముగా నుండవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆయన మాత్రమే మనలను పరిశుద్ధులుగా చేయగలడు. అందుకు అవసరమైన శక్తినిచ్చును అయితే మనము పాలుపొందనిదే ఆయన ఆ పనిచేయడు.

ఆశీర్వాదమార్గములో మనలను మనము నిలుపుకొనవలెను.

దయగల మాజిక్‌వలె పరిశుద్ధత దర్శించునని యెంచుట పొరపాటేయగును. పరిస్థితులు అనుకూలమైనవిగాను, తెలిసినవిగాను ఉండకపోయినను ఒక తుపాను వలె దేవుని సహాయముకొరకు ఎదురుచూచుట కూడ పొరపాటేయగును. పచ్చిక బయలునకు నడిపించు మార్గములకు స్పష్టమైన సూచనలు చెప్పబడినవి, వాటిలో నడచుదము. పరిశుద్ధతను కోరుకొనుచు, అదే సమయములో ప్రార్ధనను, భక్తిని నిర్లక్ష్యము చేసినయెడల ఒక మార్గమును కోరి మరొకమార్గమున వెళ్ళినట్లుండును.

విశ్వాసము మాత్రమే పరిశుద్ధత కలుగించునని క్రైస్తవులకు చెప్పుట దారి తప్పించుటయేయగును. వారేమాత్రము ప్రయాసపడకుండనే క్రీస్తు పోలి ఉండవచ్చుననే అభిప్రాయాన్ని ఇది కలిగిస్తుంది. క్రొత్త నిబంధనలో వందలకొలది హెచ్చరికలున్నవి. వాక్యము సూచించిన దైవ చిత్తమునకు విధేయులు కావలెనని బోధించు లేఖనములను సంతోషముగా ప్రక్కనపెట్టుచున్నారు.

బోధకుని చివరి పిలుపునకు జవాబుగా ముందుకు వెళ్ళుటలో జీవితములో విజయముసాధించినట్లే యను భావన కూడ తప్పే. ఏ వ్యక్తియైనను దేవునికి మరల అప్పగించుకొను అనుభవములోనికి వెళ్ళుట ఎవరూ నిరాకరించరు. అయితే అదే సంపూర్ణత కాదు అంతముకాదు, నిజమునకు దాని విలువను, ప్రాముఖ్యతను, శ్రద్ధతోను ప్రయాసతోను వెంబడించకుంటే, త్వరలోనే కనుమరుగవును.

"పోదాము, దేవుడు చూచుకుంటాడు, వాగ్దానమునమ్మి, నింపుదలపొందండి, ప్రయత్నం ఆపండి, నమ్ముటకు మొదలుపెట్టండి" అను భ్రమపరచు నినాదములను గూర్చి మనము జాగ్రత్తగా ఉండవలెను. డోనాల్డు క్యాంప్‌బెల్ ఈలాగు చెప్పెను "విశ్వాసిజీవితములో ఆత్మ తనకైతాను కార్యముజరిగించడు. విశ్వాసి తనపై ఆదారపడునంతవరకు వేచియుండును"

**తక్షణ పరిశుద్ధత లేదు :**

అప్పటికప్పుడే పరిశుద్ధతరాదు. తక్షణమే పరిశుద్ధులుకాజాలరు.

పరిశుద్ధులగుటకై మాత్రలు యిచ్చి ఒకేసారి సమస్యపరిష్కరించుట తగదని దేవుడు తలంచెను. పరిశుద్ధతకు కురచ మార్గముగాని, త్వరగా పొందే పద్ధతినిగాని దేవుడు ఏర్పాటు చేయలేదు. దానికి బదులుగా జీవితకాలమంతయు జరుగవలసిన విధానమును యేర్పరచెను. అందులో ఆయన శక్తినిచ్చును. అనుదినము దానిని మన జీవితమునకు అన్వయించుకొనవలెను.

రక్షణ విశ్వాసముద్వారా కలుగును. అయితే పరిశుద్ధత విశ్వాసము మరియు క్రియలద్వారా కలుగును.

మనలో ప్రతి ఒక్కడు మార్చబడవలసిన అవసరత కలిగియున్నాడు.

మనముగోలచేసే వారమైనను, పిరికితనముతో విసుకుచెందిన వారమైనను, ముక్కోపులమైనను, ఓర్పు లేనివారమైనను, తెలివిలేనివారమైనను, ప్రేమలేనివారమైనను మొద్దుబారినవారమైనను, స్వార్ధపరులమైనను, మోసగాళ్లమైనను, అప్రమాణికులమైనను, జీవితములో అపవిత్రులమైనను, క్రీస్తునకు ఘనత కలిగించని అలవాట్లుగలవారమైనను, మనమందరము మార్పుపొంద నవసరత గలవారమైయున్నాము. ప్రభువు మార్పును ఉత్పత్తి చేయగలడు. వాస్తవముగా అది చేయుటకే ఆయన వేచియున్నాడు. ఆయన మన సహకారముకొరకు వేచియున్నాడు.

మన సహకారమును సాధించుటకు ఆయన మనలను ధర్మశాస్త్రముక్రింద నుంచలేదుకాని కృపక్రింద ఉంచియున్నాడు. రక్షకునిప్రేమించుట వలన విశ్వాసి పరిశుద్ధుడుగా నుండగోరుచున్నాడు కాని శిక్షవస్తుందను భయమువలనకాదు. ఈ అంశమును తరువాత అధ్యాయములో పరిశీలన చేయుదము. ●

# అధ్యాయము - 8

# మనుష్యులను పరిశుద్ధులుగా ఎట్లు చేయవలెను?

ఒకవ్యక్తి రక్షింపబడిన తర్వాత అతడు పరిశుద్ధముగా జీవించునని ఎట్లు చెప్పగలము? అతడు పాపమునుండి, లోకమునుండి ప్రత్యేకముగా నడుచుటకు సరియైన పద్ధతియేది?

ఈ విషయము మానవునికి వదలివేసినయెడల, అతడు ఖచ్చితమైన చట్టములు పద్దతులు యేర్పాటు చేయును. ధర్మశాస్త్రముక్రింద ఉండవలెనని అతడు నొక్కి చెప్పును ప్రవర్తనలో కొన్ని ప్రమాణములు సాధించిన పిదప విశ్వాసి పరిశుద్ధుడగును. ఇది చేయుము. నీవు బ్రతుకుదువు.

ఇట్టి పరిశుద్ధత ధర్మశాస్త్రమును అనుసరించుట ద్వారా కలుగును. ధర్మశాస్త్రములో పది ఆజ్ఞలు ఇమిడియున్నవి. విశ్రాంతి దినమును పాటించుట, ఆల్కహాలును నిషేధించుట, మత్తు మందులు, సినిమాలు, పొగాకు, నాట్యము అపవిత్రత మొదలగు వాటిని నిషేధించుటద్వారా ధర్మశాస్త్ర సంబంధమైన పరిశుద్ధత లభించును. చేయవలసినవి చేయకూడనివి అనే వాటి సంఖ్య లెక్కలేనన్ని ఉండును.

శిక్షలేని ధర్మశాస్త్రము కేవలము ఒక మంచి సలహాగా మాత్రమే ఉండును. అయితే ఆ చట్ట ప్రకారము జీవించలేని వారికి శిక్ష విధింపబడాలి. మరియు సాధారణ ంగా విధింపబడిన శిక్ష రక్షణ పోగొట్టుకొనుటయని మరొక రీతిగా దీనిని చెప్పవచ్చును. అదేమనగా మనము విశ్వాసముద్వారా రక్షింపబడి క్రైస్తవజీవితము జీవించనప్పుడు నిత్యజీవము పొగొట్టుకొందుము. ధర్మశాస్త్రమును ఆచరించుట ద్వారా రక్షణను కాపాడుకొందుమని చెప్పువారు నమ్మునదేమనగా శిక్షభయము చేత వారు సరిగా జీవింతురు.

ఈ రీతిగా పరిశుద్ధత పొందుదురని తలంచుట ప్రమాదకరమును, లోపముతోకూడినదియునై యున్నది. ఇది లేఖనానుసారమైనది కాదు. నిషిద్ధమైనవాటిని చేయకుండ, కొన్ని చట్టములకు విధేయులగుటవలన పరిశుద్ధలమయ్యెదమని బైబిలునందు చెప్పబడలేదు. అట్టి అభిప్రాయమునకులోనైన గలతీ విశ్వాసులను పౌలు గద్దించెను. "మీరింత అవివేకులైతిరా? మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, యిప్పుడు శరీరానుసారముగా పరిపూర్ణులగుదురా" అని పౌలు అడిగెను. దీని భావమేమనగా చట్టముననుసరించుటవలన నీవు రక్షింపబడలేవు, ఆ పద్ధతి ప్రకారము నీవు పరిశుద్ధుడవు ఎలా కాగలవు?

ఈ పద్ధతి ద్వారా పరిశుద్ధులగుట వాక్యవిరుద్ధము. తగిన ఫలితమివ్వజాలదు. జేమ్స్‌డెన్ని ఈలాగు చెప్పెను "సీనాయి కొండకాదు కల్వరికొండయే పరిశుద్ధులను ఉత్పత్తి చేయును." బలము లేనివానినుండి ధర్మశాస్త్రము బలమును కోరుచున్నది. అది శక్తినివ్వదు. చేయలేనప్పుడు శపించును. ధర్మశాస్త్రము క్రింద పాపము రేపబడుచున్నది. (రోమా 7:8–13) అతని పతనస్వభావమునుబట్టి వ్యక్తి నిషేధించిన దానినే కోరును. అది ధర్మశాస్త్ర పొరపాటుకాదు. దానికి కారణము మానవజాతిలోనున్న పాపమే.

**పరిశుద్ధతకు దేవుని మార్గము:**

పరిశుద్ధతకు దేవుని మార్గము వేరుగా నున్నది. అది కృపద్వారానే కాని ధర్మశాస్త్రమువలనకానేకాదు. ప్రభువు ఈలాగు చెప్పుచున్నాడు" నా కృపనుబట్టి నిన్ను రక్షించియున్నాను. ప్రేమనుబట్టి, భయమును బట్టికాదు. వెలుపటికి వెళ్ళి దానికి తగినట్లుగా జీవించుము. నీలో నివసించుటకు పరిశుద్ధాత్మను యిచ్చియున్నాను. నీ పిలుపునకు తగినట్లు నడుచుటకు ఆయన నీకు శక్తినిచ్చును. శోధనను ఎదిరించిన ప్రతిసారి నీకుప్రతిఫలమిత్తును. పాపమునకు "కాదు" అని చెప్పెను.

అయితే ఒకప్రశ్నలేచినది. క్రైస్తవుని పిలుపునకు సరిపోవునట్లుగా నుండుటకు ఏ రకపు ప్రవర్తన కావలెనో ఏలాగుతెలియును?" అప్పుడు దేవుడు మనతో చెప్పును." సరే, నీవు నీతిని పొందుటకు ఆచారణాత్మకమైన హెచ్చరికలు క్రొత్తనిబంధనలో నింపియున్నాను. ఆ హెచ్చరికలు ఆజ్ఞలుగా పిలువబడును. అయితే గుర్తుంచుకొనవలసిన సంగతి యేమనగా అవి శిక్షతోకూడిన చట్టములుకావు. నన్ను సంతోషపరచు జీవనశైలికి సంబంధించిన ఖచ్చితమైన ఉదాహరణలు.

మనము రక్షింపబడిన క్షణములో దేవుని యెదుట మనకు పరిశుద్ధస్థానము యివ్వబడినది. మనము క్రీస్తునందు యున్నాము కాబట్టి మనము పరిశుద్ధ స్థితిని పొందియున్నాము. మనబాధ్యతయేమనగా మన స్థానమునకు తగిన ఆచరణ, మన స్థితికి తగిన జీవితము కలిగియుండవలెను. మనమెక్కడ నిలిచితిమో, అందుకు తగినట్లుగా ప్రవర్తన ఉండవలెను.

**భయము కాదు – ప్రేమ:**

కృప క్రింద పరిశుద్ధ జీవితమునకు గురి ప్రేమయేగాని భయముకాదు. విశ్వాసులు పరిశుద్ధులుగా ఉండుటకు కోరిక కలిగి యుందురు. ఎప్పుడనగా వారి పాపములు తీసివేయుటకు ప్రభువైన యేసు చెల్లించిన క్రయధనమును వారు జ్ఞాపకము చేసికొన్నప్పుడు. కల్వరిజ్ఞాపకమే భక్తిగాను నీతిగాను, సత్యవర్తనమునకు బలమైన ప్రేరణ గానున్నది. విశ్వాసి అడిగిన వెంటనే జవాబు వచ్చును.

నీచేత చెరపట్టబడిన నేను
ధర్మశాస్త్రమునకు బంధింపబడుదునా?
నా హృదయమును నీవు చెరగొంటివి, ఆనందించుచున్నాను,
మరెన్నడు విడుదల కోరను.

ఒకడు అభ్యంతరము చెప్పవచ్చును. "కృపక్రింద క్రైస్తవులను ఉంచితే, అప్పుడు వారు బయటకువెళ్లి వారిష్టప్రకారముజీవింతురుగదా" కృపాసిద్ధాంతము పాపమును ప్రోత్సాహించునని వారి భావన. స్పర్జ్‌గారు ఈలాగు జవాబు చెప్పెను.

"ఇది సహజముకాదు. దేవుని మంచితనములో పాపమునకు అనుకూలవాదన తగదు. ఆయన నాకు దయచూపినందున దేవుని ద్వేషించవలెనా? ఆయన నన్ను దీవించుచుండగా నేనాయనను శపింపవలెనా? యేసునందు విశ్వాసి వేరు విధముగా తలంచును. దేవుడు అంతమంచివాడా? అప్పుడు నేనాయనను దుఃఖపరచకూడదు. నా అతిక్రమమును క్షమించుటకు ఆయన సిద్ధముగా ఉన్నాడా? అయితే నేను ఆయనను ప్రేమింతును. ఆయనను ఇకయెంత మాత్రమును అభ్యంతరపరచను. దేవుని సంకల్పమునకు ఒకని నడిపించుటకు అంతకంటె శ్రేష్ఠమైన శక్తివంతమైన వాదనమరొకటిలేదు. ప్రతివిధమైన పాపమును అసహ్యించుకొని దేవుని ఉచిత కృపనొద్దకుతెచ్చుటకు మరొకమార్గములేదు"

కృపను దూషణపాలు చేయుట సహజమే. నిస్సందేహముగా కొందరు వారిస్వేచ్ఛను పాపము చేయుటకు సాకుగా వాడుకొందురు. అయితే అవి మినహాయింపులు మాత్రమే.

ధర్మశాస్త్రమునుండి విడుదల పొందితిమి. అయితే చట్టములేనివారముకాదు. పౌలు 1 కొరింథీ 9:21లో మనము క్రీస్తు క్రింద చట్టములో నున్నాము అని చెప్పుచున్నాడు. విశ్వాసి జీవితమునకు ధర్మశాస్త్రముకాదు ప్రభువైన యేసు ఆధారమైయున్నాడు.

మన కిష్టమైన దేనినైనను చేయవచ్చుననుమాట నిజమే. అయితే మనము కోరుకొనునది ఇప్పుడు వేరేవిధముగా నున్నది. మనము పరిశుద్ధులుగా ఉండవలెనని కోరుచున్నాము. శోధనను ఎదిరించాలని కోరుచున్నాము.

దానినుండి పారిపోవలెనని కోరుచున్నాము. క్రీస్తు హృదయమును సంతోషపరచే పని చేయాలని ఆశించుచున్నాము. ఈ భావములో మేము సంతోషించే మార్గములో జీవించుచున్నామని చెప్పుచున్నాము.

నేడు సంఘముయొక్క ప్రతి భాగములోను పరిశుద్ధ జీవితము గలవారున్నారు. ఇది నిజమే. అయితే వారు దేవునికృపయందు బాగా వేరుపారినవారు గనుక ఆలాగుజీవించుచున్నారు. ఇతరులు కూడ చట్టమూలముగా ఆలాగు చేయుచున్నారు.

ఇప్పుడు మనము కొంత ఆగి ఒకప్రశ్నను ఆలోచించుదము. పరిపూర్ణ పరిశుద్ధతను విశ్వాసి సాధించుటకు సాధ్యపడునా? పాపము చేయుటకు వీలుకాని స్థితికి అతడు చేరుకొనగలడా? లేఖనములు ఏమి చెప్పుచున్నవి? ●

## అధ్యాయము - 9

# క్రైస్తవ ప్రవర్తనకు సూత్రములు

విశ్వాసికి సరిపోయిన ప్రవర్తన అనగాయేమి? ఇదొక ప్రశ్న “అతదేమి చేయవచ్చును? ఏమి చెయ్యకూడదు? ఈ కార్యము చెడ్డదా? మంచిదా?”

విశ్వాసి తన పరలోకపు పిలుపునకు తగినట్టు యెట్లునడుచుకొనవలెనో బైబిలు సాధారణ వివరణ మనకు ఇచ్చుచున్నది. అనేక ప్రశ్నలకు ఎదురుచూడకుండగనే నేరుగా జవాబులుగలవు. ఉదాహరణకు అవిశ్వాసులతో విజ్జోడుగానుండకూడదని వాక్యము బోధించును (2 కొరింథీ 6:14) విశ్వాసి అవిశ్వాసిని వివాహముచేసికొనకూడదు. అవిశ్వాసియైన పాలిభాగస్థునితో వ్యాపారములో ప్రవేశింపరాదు. క్రైస్తవ సేవలో అవిశ్వాసిని చేర్చరాదు. దీనిని గూర్చి ప్రార్థించనక్కరలేదు. సలహా కొరకు వెదకనక్కరలేదు. దేవుని వాక్యములో జవాబు ముందుగానే చెప్పబడినది

లేఖనములలో నేరుగా చెప్పబడనివి క్రైస్తవజీవితములో వందలకొలది పరిస్థితులు వుండవచ్చును. ప్రతి సమస్యను బైబిలు తీసికొనివుంటే అప్పుడు మనము మోయలేనంతబరువు పెరిగిపోవును.

అందుకే దేవుడు ఈ రీతిగా చేసెను. ఆయన మనకు కొన్ని సూత్రములు యిచ్చాడు. ప్రశ్నవచ్చినప్పుడు “నేను దీనిని చేయుట ఒప్పా? మనకు ఇవ్వబడిన సూత్రములను ఒకదాని వెంట మరొకటి అన్వయించునేమో చూడవలెను. ఈరీతిగా పరిష్కరించుకొన లేని సమస్య ఒకటైనను ఉండదని తలంచుచున్నాను. కంప్యూటరులో ఒక సమస్యనుపెట్టి దానికి సంబంధించిన నియంత్రణలను వినియోగించినప్పుడు ఆశ్చర్యరీతిగా జవాబువచ్చును. అలాగే మన సమస్యలు పరిష్కారమగును. ప్రశ్నల రూపములో కొన్ని సూత్రములు ఇవ్వబడినవి.

**1. అందులో దేవునికి మహిమ కలుగునా?**

మనము నిత్యము అడుగునదేమనగా "అందులో యేమైన హాని ఉన్నదా?" అయితే మనము ఈ ప్రశ్నవేయవలెను "అందులో దేవునికి మహిమ కలుగునా?" మనమేమి చేసినను దేవునికి మహిమ రావలెనను సూత్రమును పౌలు ప్రతిపాదించెను. సామాన్యమైన సంగతులైనను తినుటకు త్రాగుటకు కూడ ఇది వర్తించును (1 కొరింథీ 10:31). ఒక పేరు మోసిన సువార్తికుడు దేవుని మహిమకోసము సువార్త ప్రకటించును. ఆయన భార్య అదే ఉద్దేశముతో పాత్రలను కడుగును. వంటగదిలో పాత్ర కడుగుచోట ఈలాగు వ్రాయబడినది "ప్రతిదినము దేవుని సేవలు ఇచ్చుట మూడుసార్లు జరుగును."

గౌరవప్రదమైన యే పనియైనను దేవుని మహిమకొరకు చేయవచ్చు. క్రైస్తవ బానిసలు కూడ పొలములో పని చేయునప్పుడు క్రీస్తుకు చేసినట్లుగాను, క్రీస్తుదాసులుగాను, మనుష్యులకు కాక ప్రభువునకు చేసినట్లు చేయవలెను (ఎఫెసీ 6:5-7)

అయితే దేవునికి మహిమ తీసికొనిరాని సంగతులు అనేకములు గలవు. అవేవనగా అన్యాయము, అపవిత్రము, అవినీతి ప్రశ్నార్థకమైనవి. వీటిని చేయబోయేముందు, యేసుప్రభువా, నేను చేయబోవు కార్యముద్వారా నీవు మహిమను పొందుము "అని తలవంచి ప్రార్థించుట అపహాస్యముచేసినట్టేయగును.

**2. అది లోక సంబంధమైనదా?**

తిరిగి జన్మించని ప్రజలతోకూడిన లోకము తన సొంతజీవనశైలి, పద్ధతి, ఫ్యాషనులు, సంగీతము, కళ, మతము, తత్వశాస్త్రము కలిగియున్నది. అదే దేహమును ఆకర్షింపవచ్చును. ఆత్మకు మేలుజరుగదు. క్రీస్తు తనకు నిర్ణయించిన దానికంటె పతనమైన మానవస్వభావమును తృప్తిపరచును.

క్రీస్తులోకసంబంధి కానట్టుగానే విశ్వాసులును లోకసంబంధులు కారు (యోహాను 17:16) ఏలయనగా లోకము ఇంకను దేవునికి విరోధముగా నున్నది. లోకమును ప్రేమించువాడు ఆయనకు విరోధి (యాకోబు 4:4, 1 యోహాను 2:15)

ఒకడు రక్షింపబడినప్పుడు, ఆత్మద్వారా ఇవ్వబడిన ప్రేరణ, స్వభావము కలిగియుండును. అతడు కృపలో ఎదుగుచుండగా, ఆ ప్రేరణను గ్రహింపగలుగును. ఒకవిశ్వాసి కలరు టెలివిజను సెట్టు కావాలని కోరెను. అవి తీసికుని ఒక ట్రక్కు

ఇంటిముందు నిలిచెను. తన యింటి కిటికిలోగుండ దాని ప్రక్కన వ్రాసిన ఎడ్వర్‌టెయిజ్ మెంటు ఈలాగున్నది "నీవు నివాసముండు గదిలోనికి ఇది ప్రపంచమును తెచ్చును" అంతే ఆ డ్రైవరుతో ఆ టివి సెట్టును వెనుకతీసికొని పొమ్మని చెప్పెను.

**3. యేసు దానిని చేసి యుండునా?**

ఆయన అడుగుజాడలలో మనము నడుచుకొనునట్లు రక్షకుడు మనకు మాదిరి ఉంచెను (1పేతు 2:21) మన ప్రవర్తన అంతటికి ఇది వర్తించును. యేసు ఏమి చేసియుండెడివాడు?

కొన్ని సంవత్సరాల క్రితము చార్లీస్ షెలన్ అను ఆయన "ఆయన అడుగులలో" అను పుస్తకమును వ్రాశాడు. అందులో ఈ పరీక్ష చెప్పబడినది. ఒక క్రైస్తవసమాజము అనుదిన జీవితములో ఈ సూత్రము అనుసరించుటకు తీర్మానము చేసినది. దాని ఫలితముగ సమాజమంతయు విప్లవాత్మక మార్పుచెందెను.

పాపులతోను, సుంకరులతోను యేసుభోజనముచేశాడుగదాయని మరొకడు ప్రశ్నించవచ్చును. (మార్కు 2:15,16) అది నిజమే. అయితే ఆయన ఎల్లప్పుడు తండ్రియైన దేవునికి నమ్మకస్థునిగా ఉండెను. ఆయన ఎన్నడు వారిపాపములను సమర్థించలేదు. ఆయన తన సాక్ష్యము విషయములో రాజీపడలేదు. మనముకూడ భక్తిహీనులైన పాపులతో భోజనము చేయవచ్చును. అయితే వారిపాపములనుగూర్చి వారిని గద్దింపవలెను. (ఎఫెసి 5:11) సువార్త వారికి పంచవచ్చును. (రోమా 1:14) భూమిపై క్రీస్తు నడకను మనము ఎల్లప్పుడు మాదిరిగా నుంచుకొనవలెను. పరిశుద్ధతకు ఆయన మాత్రమే ప్రమాణము. (ఆర్.సి. చాప్‌మన్)

**4. యేసు తిరిగివచ్చినప్పుడు నీవు చేయుచున్నపనిలో ఆయన నిన్ను చూచుటకు ఇష్టపడుదువా?**

రక్షకుడు ఎప్పుడు వచ్చునో ఆ సమయము ఎవరికి తెలియదు. అది ఎప్పుడైనను జరగవచ్చును. అపొస్తులుడైన యోహాను ఆయన రాకలో సిగ్గుపడేసంగతి ఉండునని గుర్తు చేసెను (1యోహాను 2:28) చెడ్డస్థితిలోగాని, ప్రశ్నార్థకమైన కార్యకలాపములలోగాని, పాపమును ప్రేరేపించు సినిమాలను చూచుటగాని, చెడ్డసాహిత్యము చదువుటలోగాని, శరీరేచ్ఛలలో గాని ఉన్నప్పుడు ప్రభువు వచ్చి మనలను చూస్తే మనము సిగ్గుపడుదుముగదా! ఇక్కడేమి చేయుచున్నావని ఆయన అడిగితే మనము సిగ్గుపడుదుము లేక వెనుకపడిన పేతురును ప్రభువు ప్రశ్నించినట్లు "వీటికంటె నన్నెక్కువగా ప్రేమించుచున్నావా?"

ప్రభువు ఆకస్మిక రాకడపై నిరీక్షణ ఉంచినప్పుడు, ఆ నిరీక్షణ విశ్వాసి జీవితముపై పవిత్రపరచుకొను ప్రభావము కలుగజేయును (1యోహా 3:3). సత్యము మానసికముగా తెలిసికొనుట చాలదు. ఆ సత్యము మనలను ఆచరణలోనికి నడిపింపవలెను. ఆయన రాకను ప్రేమించువారు శుభప్రదమైన నిరీక్షణను బట్టి జీవితము మలుచుకొందురు (2తిమో 4:8)

**5. ఏ స్వభావమునకు అది ఆహారముపెట్టును?**

మరొక అధ్యాయములో రెండు స్వభావములను గూర్చి వివరణ లోతుగా ఇవ్వబడెను. ప్రస్తుతమునకు సారాంశము చెప్పుట చాలును. ప్రతివిశ్వాసికి రెండు స్వభావములున్నవి - పాతది మరియు క్రొత్తది. పాత స్వభావము బాగుచేయుటకు వీలుకానంత చెడ్డది. నూతన స్వభావము వర్ణించుటకు వీలుకానంత మంచిది. ఈ రెండు స్వభావములు నిత్యము ఒకదానికి విరోధముగా మరొకటి పోరాటముకలిగియున్నవి. మనము ఆహారము పెట్టిన స్వభావము గెలుచును.

మనము చూచుట, వినుట, చేయుట ద్వారా మన స్వభావములకు ఆహారము పెట్టుదుము. మన మెక్కడకు వెళ్లెదమో, మన స్నేహము యెవరితో చేయుచున్నామో, మనమేలాంటి ఆలోచన విధానమును ప్రోత్సాహపరచెదమో, అవి వాటికి ఆహారముగా నుండును. మనలోపల తోడేలుకు ఆహారముపెట్టి, గొర్రెపిల్లకు విజయము కలుగునని ఎదురుచూడలేము.

**6. నీ దేహము పరిశుద్ధాత్మకు ఆలయముగా నున్నదని నీవు జ్ఞాపకము చేసికొనినప్పుడు, నీవు ఆ పనిని చేయుటకు స్వేచ్ఛగా నుందువా?**

ఒకడు రక్షింపబడిన క్షణమున, పరిశుద్ధాత్మ అతని దేహములో శాశ్వత నివాసము యేర్పరచుకొనుచున్నాడు. (1కొరింథీ 6:19) త్రిత్వములో మూడవ వాడు దేహమును దేవాలయముగా యెంచుచున్నాడు. నివసించుటకు అది పరిశుద్ధస్థలము. మనదేహము పరిశుద్ధమైనదని గ్రహింపు కలిగి మనము జీవింపవలసియున్నది. అందులో నివసించువాడు పరిశుద్ధుడని ఎరుక కలిగియుండవలెను.

ఈ సత్యముచేత మనము పట్టుబడియుంటే, లైంగిక అపవిత్రత, తిండిబోతు తనము, త్రాగుబోతు తనమును మనము ఎదురించుదుము. క్యాన్సరుకు కారణములైన వాటికి అనగా పొగాకు, మనస్సు మార్చు మత్తు మందులు మనము వినియోగించము.

అప్పుడు మనము సహేతుకమైన ఆరోగ్యసూత్రములను పాటించుచు, ప్రభువుకొరకు మంచి ఆరోగ్యము కలిగి యుండుటకు శ్రద్ధచూపుదుము.

**7. అది దేవునిబిడ్డకు తగిన ప్రవర్తనగా నున్నదా?**

రాజు పిల్లలముగా, ఉన్నతమైనపిలుపునకు తగినట్లుగా నడువవలెను. (ఎఫెసీ 5:8, కొలొస్స 1:10)

ఫ్రాన్స్‌దేశమునకు రాజు లూయిస్ 16 కుమారునిగూర్చి ఒక కథ ఉన్నది. ఒకచెడ్డ స్త్రీ ఆ పిల్లవానిని చెడగొట్టుటకు చెడ్డమాటలు నేర్పుటకు ప్రయత్నించినది. ఆ చిన్న యువరాజు తనపిడికెళ్లు బిగించి, తనపాదములు నేలకు తన్ని ఈలాగు చెప్పెను "నేను దానిని చెప్పను. బూతుపదములు మాట్లాడను. నేను రాజుగా ఉండుటకు పుట్టితిని నేనలా మాట్లాడుటకు ఇష్టపడను."

మురుగుకాలువలో ఒకడుపడి దొర్లాడుట మనము చూచినప్పుడు దుఃఖపడుదుము అయితే ఆశ్చర్యపడము. రాజకుమారుడు పడిపోయేవరుసలో నివసించితే మనము భయభ్రాంతులమయ్యెదము. ప్రసిడెంటు కుమారుడు ఆలాగుండునని తలంచలేము.

ప్రపంచప్రజలు తమకంటె విశ్వాసులనుండి మంచిప్రవర్తన ఆశించుదురు. విశ్వాసి జారిపోతే, వారు అతనిపై ఎగబడి, "నీవు క్రైస్తవుడని అనుకొన్నామే." అని విచారమును వెలిబుచ్చుదురు. వారు అలవాటుగా ఆ పాపముచేయుదురని చెప్పలేము.

అది ఆలాగునే జరుగవలెను. మననుండి లోకము ఎక్కువగా ఆశించును. అది వారు పొందవలెను.

**8. అది డబ్బు ఖర్చుచేయుటకు సంబంధించినదైతే, ఆ డబ్బు అంతకంటె మంచిగా ఖర్చుచేయువచ్చునా?**

జీవితములో కొన్ని సంగతులు మంచివే. అందులో కొన్ని అంతకంటె మంచివి. కొన్ని అయితే అన్నిటికంటె మంచివి. మన శక్తిని అధికము చేసికొనుటకు మనమెల్లప్పుడు విలువైన తీర్పులు చేసికొనవలసియున్నది.

మంచియనునది తరుచుగా అన్నిటికంటె మంచిదానికి శత్రువుగానుండును. పాపముగా ఉండనివాటికి మనము ఖర్చు పెట్టవచ్చును. అయినను అవి సారములేనివిగాను, క్షణికమైనవిగాను, అవసరములేనివిగాను ఉండవచ్చును. దానికి బదులుగా ఆ డబ్బును సువార్త వ్యాప్తికి వాడవచ్చును. దానిఫలితముగా మహిమాద్వారములు వద్ద మనలను

ఆహ్వానించు సభను చూడవచ్చును (లూకా 16:9)

ఈ సూత్రము ప్రజలు ఖర్చుపెట్టుట నేరము అనిచెప్పుటకు కాదు. అయితే గమనించ వలసినదేమనగా మన డబ్బు దేవుని పనికి వాడుచున్నమాయనియు, అట్లయితే దాని ఫలితము నిత్యత్వమునకు ఉపయోగపడునదిగా వుండునాయనియు.

**9. సమయమును అంతకంటె ప్రయోజనకరముగా వాడగలమా?**

మన సమయమును వినియోగించుట అనగా చట్టమునకు బానిసగా కాదు గాని మహిమతో కూడిన స్వేచ్ఛ మనకందరికి 24 గంటలసమయము ప్రతిదినము ఇవ్వబడినది. దానినేలాగు వినియోగించవలెనో మనము తీర్మానించుకొంటాము. మంచికి, చెడునకు, వృథా చేయుటకు అనేక అవకాశములున్నవి.

మంచిగృహనిర్వాహకులుగా సమయమును పాటించవలెను. అనగా సద్వినియోగపరచవలెను. (ఎఫెసి 5:15) దీనిభావమేమనగా ప్రతి అవకాశమును సరిగా వాడుకొనవలెను. దీనిని బట్టి అధిక ప్రాధాన్యత గలవాటికొరకు అనేక కార్యములు తప్పనిసరిగా వదులుకొనవలెను. ఆహ్వానములను నిరాకరించుట ఒకటి కావచ్చును. మన ఉద్యోగములో ప్రార్థన కొరకు, వాక్యపరిచర్య కొరకు, కొన్ని గంటలు సర్దుబాటుచేసికొనవలెను. దీనినిబట్టి సామాజిక కార్యక్రమములను, కుటుంబములను కలసికొనుట, సంఘకూడికలకంటె యెక్కువగా యెంచరాదు.

ఈ తీర్మానములను నమ్మకముగా చేసిన యెడల విస్తృతసేవలో పనిచేయుటకు అవకాశము కలుగును.

**10. నీ ప్రవర్తన ఇతరులపై ఎట్టి ప్రభావము చూపుచున్నది?**

జీవితములో కొన్ని కార్యములు నైతికముగా తటస్థముగానుండును. వాటిని నైతిక ప్రభావము లేనివని పిలువవచ్చును. క్రైస్తవుడు వాటిని చేయుటకు స్వేచ్ఛకలిగియున్నాడు. వాటిలో తప్పు ఏమియు లేదు.

అయితే ఆ కార్యములు ఇతరుల తొట్రుపాటునకు దారితీసిన యెడల అది తప్పేయగును. రోమా 14లో పౌలు ఈ అంశమును గూర్చి ఎలా వివరించెనో చూడండి.

సహోదరునికి అడ్డమైనను ఆటంకమైనను కలుగజేయకుందుమని మీరు నిశ్చయముచేసికొనుడి" (13)

“నీ సహోదరుడు నీ భోజనమూలముగా దుఃఖించినయెడల నీవికను ప్రేమ కలిగి నడుచుకొనువాడవుకావు. ఎవనికొరకు క్రీస్తు చనిపోయెనో వానిని నీ భోజనము చేత పాడుచేయకుము” (15)

“భోజనము నిమిత్తము దేవుని పనిని పాడుచేయకుడి” (రోమా 14:20 వ) పౌలు 1 కొరింథీ 8:9-13లో మరల చెప్పుచున్నాడు.

“అయినను మీకు కలిగియున్న యీ స్వాతంత్ర్యము వలన బలహీనులకు అభ్యంతరము కలుగకుండ చూచుకొనుడి. ఏలయనగా జ్ఞానముగలనీవు విగ్రహాలయందు భోజనపంక్తిని కూర్చుండగా ఒకడు చూచినయెడల బలహీనమైన మనస్సాక్షిగల అతడు విగ్రహములకు బలియియ్యబడిన పదార్థములను తినుటకు ధైర్యముతెచ్చుకొనును గదా! అందువలన ఎవనికొరకు క్రీస్తు చనిపోయెనో బలహీనుడైన ఆ నీ సహోదరుడు నీజ్ఞానమును బట్టి నశించును. ఈలాగు సహోదరులకు విరోధముగా పాపముచేయుటవలనను, వారి బలహీనమైన మనస్సాక్షిని నొప్పించుటవలనను మీరు క్రీస్తునకు విరోధముగా పాపము చేయువారగుచున్నారు. కాబట్టి భోజన పదార్థమువలన నా సహోదరునికి అభ్యంతరము కలిగిన యెడల, నా సహోదరునికి అభ్యంతరము కలుగజేయకుండుటకై నేనెన్నటికి మాంసము తినను.”

“అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదుగాని అన్నియు క్షేమాభివృద్ధి కలుగజేయవు అని పౌలు వ్రాయుచున్నాడు (1కొరింథీ 10:23) ఇక్కడ ప్రాముఖ్య మైన ఆలోచనయేమనగా తనకైతాను క్షేమాభివృద్ధి పొందుటకాదుగాని ఇతరులు క్షేమాభివృద్ధి పొందుట ముఖ్యము.

“మనలను నడిపించు సూత్రమేమనగా మనము ఇతరులకు క్షేమము కలిగించువారముగాను, ఆత్మీయముగావారిని కట్టువారముగాను ఉండవలెను. ఇతరులకు నష్టము కలిగించు స్వేచ్ఛ ఎవనికిని, ప్రయోజనకరముకాదు” డబ్లు.ఇ. వైన్. క్రైస్తవుడు పందిమాంసము, ఆల్‌చిప్ప (Shell Fish) తినుటకు, ద్రాక్షారసము తగుమోతాదులో త్రాగుటకును హక్కు కలిగియున్నను ఆ స్వేచ్ఛను వదిలివేయుటకు అంతకంటె గొప్ప హక్కుకలిగియున్నాడు. తన సోదరునికి దుఃఖము కలిగించు వాటిని వదిలివేయవలెను.

చార్లెస్ హడ్సన్ స్పర్జన్ పొగత్రాగువాడని అందరికి తెలియును. సంఘమునకు

యిచ్చిన దేవుని ఈవులలో ఒక గొప్ప ఈవియైనవాడు తన అలవాటును సమర్థించుకొనెను. ఒకదినమున బిల్‌బోర్డుపై ఈలాగున వ్రాయబడియుండెను. "స్పర్జన్ త్రాగే పొగాకును త్రాగండి"అని. అతడు తన అలవాటును మానివేయుటకు అవసరమయ్యెను.

### 11. అది సందేహము కలిగించునా?

"విశ్వాసమూలము కానిదేదో అది పాపమగును" (రోమా14:23)

నైతికముగా నిర్లక్ష్యవైఖరిని గూర్చిన విషయమును ఇంకను మాట్లాడుచుండెను. అవి సహజముగా తప్పుకాదు. ఒక సంగతి నేను తప్పుయని యెరిగినను నేనుముందుకే వెళ్లి, ఏలాగైనను చేసినప్పుడు, నేను పాపము చేసినవాడను. మరొక క్రైస్తవునికి అది తప్పుకాకపోవును. అది చేయుటకు అతనికి సంపూర్ణ స్వేచ్ఛ ఉండి వుండవచ్చును. అయితే నా మనస్సాక్షికి స్పష్టముగా లేనప్పుడు, విశ్వాసముతో నేను చేయలేను, ధైర్యముకూడ వుండదు. అది చేసినప్పుడు అది నాకు పాపమగును.

కొన్నిసార్లు చాకలి అంగడి శుభ్రముగా నున్నదా లేదా మురికిగా వున్నదా చెప్పుటకు కష్టమైనప్పుడు అప్పుడు అనుసరించవలసిన సూత్రమేమనగా "అది అనుమానాస్పదమైతే మురికిగానున్నదని నిర్ణయించుకొనవలెను. అదే సూత్రమును నైతికము కానివాటికి ఇదే ప్రశ్న "అది అనుమానాస్పదమైతే, అది చేయుట తప్పు.

### 12. అది కీడుగా కనబడుచున్నదా?

"కీడుగా కనబడు ప్రతిదానికి దూరముగా నుండుడి" 1 థెస్స 5:22. అవసరమైన హెచ్చరిక యిక్కడవున్నది. వివాహము కాని జంట కారునడుపుకుంటూ కలిసి తిరిగినను అపవిత్రత లేకుండ ఉండినను, అది అనుమానమునకు దారితీయును. ఆదివారపు బడి ఉపాధ్యాయుడు పెప్సికావాలని బారుషాపుకు వెళ్ళితే, తన విద్యార్థులునడుచుచు అతని చూచిన యెడల వారతని అనుమానింతురు.

### 13. అది భారమైనదా?

పాపమునకు, బరువుకు వ్యత్యాసమున్నది, పాపము ఎల్లప్పుడు తప్పుగానే యుండును. అయితే బరువు తప్పుకాదుకాని ఆటంకముగానుండును. "మనము కూడ ప్రతి భారమును విడిచిపెట్టి మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో

పరుగెత్తుదము" హెబ్రీ 12:1. ఒలింపిక్ ఆటలలో కొన్ని చట్టములు ఆచరించవలెను. వారు వాటిని అనుసరించనియెడల పరుగెత్తువాడు అనర్హుడగును. పరుగెత్తువాడు రెండు పౌనుల బరువైన కడియాలు కాలికివేసికొని పరుగెత్తకూడదని చట్టమేమియులేదు. అతడు వాటి ధరింపవచ్చును అయితే అతడు పందెములో విజయము పొందలేడు...

పౌలు బరువును గూర్చి వ్రాసినప్పుడు "అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు గాని అన్నియు చేయదగినవికావు (1కొరింథీ 6:12, 10:33) క్రీస్తునందు అభివృద్ధిచెందుటకు అవి ఉపయోగపడవు. అవి తప్పైయుండనక్కరలేదు. అయితే అవి ప్రయోజనకరముకాదు.

క్రైస్తవ పరుగులో బరువనగాయేమిటి? ఆత్మీయులుకాని వారితోస్నేహము, సమయమంత ఉద్యోగమునకే వాడుట, ముంచివేయు వినోదము, ఆటలకు వశమై పోవుట, విచక్షణలేని రీతిగాను అదుపులేని రీతిగాను టివిని చూచుట. ఇవన్నియు విశ్వాసి బహుమానము పొందకుండ చేయును. అంతప్రాముఖ్యత లేని కార్యమునకు సమయమును అధికముగా వృథాచేయుట విశ్వాసికి బరువుగా మారును.

**14. అది బానిసత్వమునకు దారితీయునా?**

కొన్ని పనులు చట్టపరముగా మంచివే. అయినను అవి మనలను బానిసలుగా చేసినట్లైన వాటినుండి తొలిగిపోవలెను. అపొస్తలుడు ఈలాగుచెప్పెను. "అన్నిటియందు నాకు స్వాతంత్ర్యముకలదుగాని దేని చేతను లోపరచబడనొల్లను" (1 కొరింథీ 6:12 బి) ప్రత్యేకముగా కొన్ని కార్యములు తప్పుగా ఉండవు. అయితే అవి మనలను వశపరచుకుంటె లేక అదిమనపై అధికారము కలిగియుంటే అవి తప్పే అగును. పౌలు ఆహారపానీయ విషయములలో నిగ్రహము కలిగియుండెను. అతడు దేనికి బానిసకాలేదు. మత్తుమందులు, ఆటలు, టి.వి. ఈ కోవకు చెందినవే.

**15. అది క్రీస్తు దృష్టికి యెట్లు కనిపించుచున్నది?**

క్రైస్తవునికి అన్నిటికంటెగొప్ప పరీక్షయేదనగా క్రీస్తు దృష్టికి అది యెట్లు కనబడును? అనునదేయని ఒకాయన చెప్పెను. ఆయన ఆమోదించునా? ఆయన మనతో కూర్చుండుటకు మనము సిగ్గుపడుదుమా?

ఆయన మనతో అన్ని సమయములలో ఉన్నాడు. అది సత్యమే. ప్రాచీనకాలపు

ఆత్మీయుడు ఈలాగుచెప్పెను. “ఆహా! మనము చేయునదంతయు ఆయన చూచును. మనము చెప్పునదంతయు వినును. నా ప్రభువు అన్నికాలములలో నన్నుగూర్చి వ్రాయుచున్నాడు”

పరిశుద్ధుడైన రక్షకుడు మనకు ఎల్లప్పుడుస్నేహితుడు, మనతో నుండువాడని జ్ఞాపకము చేసికొనుట వలన మనము శుద్ధీకరింపబడుదుము.

మనము నైతిక తీర్మానముచేయుటకు ఈ సూత్రములు దేవుడు మన నడిపింపుకొరకు యిచ్చియున్నాడు. వాటిని తెలిసికొని, గుర్తుపెట్టుకొని, అన్వయించుకొన్నప్పుడు ఆయనను సంతోషపరచు తీర్మానములు చేసికొని పరిశుద్ధతయను రాజమార్గములో నుందుము

దురదృష్టవశాత్తుగా మనజీవితములలో అనేక తీవ్రమైన మలుపులు ఎదుర్కొనుచున్నాము, జయము, ఓటమిలమధ్య మనమున్నాము. మనము కోరుకొనునదేమనగా మనలో నున్న పాపపు శక్తి నుండి విడుదల పొందవలెను. ఆగిపోని ఉజ్జీవము మనము కోరుచున్నాము. అది పొందుటకు మార్గమున్నది. ●

# అధ్యాయము - 10

# నిజమైన సంగతులను నేరుగా పొందుదము

మనలో నివసించు పాపస్వభావముయొక్క శక్తినుండి విడుదల పొందుటకు సహాయపడు అనేక సత్యములున్నవి. వాటిని పరిశీలించుదము.

**రెండు స్వభావములు :**

ప్రతిక్రైస్తవునికి రెండు స్వభావములున్నవని మనం తెలిసికోవాలి (రోమా 7:14-25) ఒకటి పుట్టుకతో వచ్చినది. అది పాతది, చెడ్డది. క్షయమగునది. మరొకటి మారుమనస్సుపొందినప్పుడు పొందినది. అది క్రొత్తది, పవిత్రమైనది, పరిశుద్ధమైనది. వాటిని ఆదాము స్వభావము అనియు, క్రీస్తు స్వభావము అని మనము పేర్కొందుము. ఒక క్రైస్తవుడు ఈ రీతిగా దానిని గూర్చి చెప్పెను. "పాపము మన హృదయములో నుండి తీసివేయబడినది. అయితే నా తాత నా ఎముకలలో ఇంకను నివసించుచున్నాడు".

పాతస్వభావము పూర్తిగా చెడ్డది. పౌలు అనుభవముకూడ మనలాంటిదే.

"నాయందు అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును." (రోమా 7:18 ఎ) అందువల్లనే మన ప్రాచీన స్వభావమునుండి మంచిదానికొరకు మనము ఎదురుచూడకూడదు. అది దొరకనప్పుడు మనము ఆశ్చర్యపడ నక్కరలేదు, నిరుత్సాహపడ నక్కరలేదు. అది పరిపూర్ణముగా చెడ్డది మాత్రమే కాదు. అది బాగుపడవీలుకానంత చెడ్డది. దీర్ఘకాలము పరిశుద్ధముగా జీవించినను అది జీవిత ప్రారంభముకంటె మెరుగుపడదు. నిజమునకు దేవుడు ప్రాచీన స్వభావమును మెరుగుపరచే పనిలో లేడు. ఆయన దానికి కల్వరి సిలువలో శిక్ష విధించెను. మరియు మన జీవితములను కొనసాగించుటకు మనం మృతులముగా నుండుటకు కోరుచున్నాడు.

ప్రాచీన స్వభావమును పౌలు శవమునకు పోల్చుచున్నాడు. అది అతని వీపునకు కట్టబడి యున్నది. (శవము కుళ్ళిదుర్వాసనకొట్టును) అతను ఎక్కడకు వెళ్లితే అక్కడకు

పోవుచున్నది. అందుకే అతడు కేకవేశాడు "అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను. ఇట్టి మరణమునకు లోనగు శరీరమునుండి నన్నెవడు విడిపించును?" (రోమా 7:24)

క్రీస్తుజీవితమే నూతన స్వభావము. అది సంపూర్ణముగా మంచిది, మంచినిమాత్రమే చేయగలదు. అది స్వచ్ఛమైనది, నీతిగలది ప్రేమగలది, సత్యమైనది. దాని ఆలోచనలు కోర్కెలు ఉద్దేశములు, కార్యములు క్రీస్తును పోలియుండును.

ఆ రెండు స్వభావములు ఒకదానికొకటి వ్యతిరేకముగానుండి ఎల్లప్పుడు పోరాటముకలిగి యుండుట ఆశ్చర్యము కాదు. (అవి సమాధానముగా కలిసి జీవించగలవా?) ఈ పోరాటము మారుమనస్సుతో ప్రారంభమగుచున్నది. క్రొత్తవిశ్వాసి అంతకుముందు లేని పోరాటము అంతరంగములో కలిగియుండును. ప్రాచీన స్వభావము అతనిని క్రిందికి లాగుచుండును. ఇది భూమ్యాకర్షణ శక్తిని పోలియుండును. అదే సమయములో నూతనస్వభావము పరిశుద్ధతో ఉన్నత శిఖరములకు ఎక్కిపోవాలను ఆశ కలిగి యుండును. ఈ పోరాటము బహు తీవ్రముగా నుండును. కొన్నిసార్లు రక్షణ పొందితినా యను సంశయముకూడ రావచ్చును. అయితే అతడు సందేహించకూడదు. ఈలాంటి పోరాటము కలిగియుండుట అతడు రక్షింపబడియున్నాడనుటకు ఒక గురుతు. రెండు స్వభావములు అతడు కలిగియుండకపోతే ఆ పోరాటమే ఉండేదికాదు.

రెండుస్వభావముల పోరాటమును రిబ్కా అనుభవమునకు పోల్చవచ్చును. ఆమె గర్భములో కవలలు పెనుగులాడుకొనుచున్నారు. "ఈలాగైతే నేను బ్రదుకుట యెందుకు" అని కేకవేసినది. రిబ్కా గర్భములో యేమి జరిగెనో దేవుని నిజమైన బిడ్డ హృదయములో ఈలాంటిపోరాటము కలిగియున్నాడు. ఆయనతో ముందుకుసాగిపోవాలని విశ్వాసి ప్రారంభించినప్పుడు ఈవిధమైన పోరాటము కలిగి యుండును.

బార్న్హౌస్ అను పండితుడు ఈలాగు వ్రాసెను. "ఆత్మ సన్నిధిని గూర్చి తలంచినప్పుడు, లోపలవున్న "ద్రోహిని" గూర్చి కూడ ఎరుక కలిగియుందుము. క్రొత్త క్రైస్తవుడు "ఈలాగైతే నేను బ్రతుకుట ఎందుకు" అని చెప్పనుద్దేశించుచున్నాడు. పాత సొదరుడు అనగా శరీరము తన మార్గము తాను కోరుకొనును. చిన్న సోదరుడు అనగా ఆత్మ నెమ్మదిగా, నిశ్చింతగాను ఉండి జయించుటసాధ్యపడదేమో అన్నట్లుగా ఉండును. రిబ్కా పిల్లల విషయమువలెనే మన విషయములోను, పెద్దవాడు చిన్నవానికి దాసుడగును.

ఆత్మమూలముగా కలుగువాటన్నిటిపై ఆశీర్వాదముండునని దేవుడు వాగ్దానముచేసెను. శరీరమూలమైనవాటికి ఆశీర్వాదముండదు."

మారుమనస్సు సమయమున ప్రారంభమైన పోరాటము జీవితాంతము కొనసాగును. ఈ పోరాటమునుండి విడుదల పొందే ప్రసక్తేలేదు. అయితే మరణించినప్పుడు లేక సంఘముకొనిపోబడునప్పుడు మాత్రమే విడుదల. మన రక్షకుని చూచిన క్షణములోనే ప్రాచీన స్వభావమునుండి స్వేచ్ఛను పొందుదుము. ఇదొక శుభవార్త. ఆయనను చూచినప్పుడు ఆయనను పోలియుందుము.

ప్రతి దేవుని బిడ్డకు ఈ పోరాటమున్నదని తెలిసికొనుట ముఖ్యము. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు" అని పౌలు గుర్తుచేయుచున్నాడు. (1కొరింథీ 10:13)

యౌవనస్థులు యౌవనేచ్ఛలతో పోరాటముచేయుచూ, వృద్ధులకు, బోధకులకు, మిషనరీలకు చీకటి సంబంధవాంఛలు, శోధనలు వుండవని యౌవనస్థులుతలంచవచ్చును. అట్టి తలంపు తప్పే. రిబ్కాకు ఇద్దరు పిల్లల పోరాటము తనలో నున్నట్టుగానే (అది 25:22,23) ప్రతి విశ్వాసి పోరాటముగల రెండు స్వభావములు కలిగి ఉన్నాడు.

ఏదైతే అపవిత్రమో దానిని తినుటకు పాత స్వభావము ఇష్టపడును. అదే సమయములో స్వచ్ఛమైన పరిశుద్ధమైన దానికొరకు నూతన స్వభావము ఆకలిగొనియుండును. నోవహు తన ఓడలోనుండి విడిచిపెట్టిన కాకి, పావురము స్వభావములను అవి పోలియుండును. అపవిత్రమైన కాకి నీళ్ల మీద తేలియాడుచున్న శవములను, మురికిని తినెను. అయితే పావురము నిలుచుటకు తగిన స్థలము ఆహారము దొరకనందువలన అది తిరిగి ఓడలోనికివచ్చెను. (ఆది 8:6-12) అలాగే ప్రాచీన స్వభావము సినిమా ఇచ్ఛలు మరియు టి.వి మురికిని కోరును. అయితే నూతన స్వభావము నిర్మలమైన దేవునివాక్యమను పాలను ఆపేక్షించును. ఇందులో ముఖ్యమైన సంగతియేమనగా మనము పోషించుచున్నస్వభావమే గెలుచును. అతని రెండు కుక్కలు ఎల్లప్పుడు పొట్లాడుకొనుచున్నవని ఒకాయన ఫిర్యాదు చేసెను. అతని స్నేహితుడు ప్రశ్నించాడు, "ఏ కుక్క గెలుస్తుంది?" లోపలికి రమ్మని పిలువబడినది అని జవాబువచ్చెను. రెండు స్వభావములస్థితి ఇట్టిదే. లోనికి రమ్మని మనము దేనిని పిలిచెదమో అదే జయించును. కకూ (కోవెల) పక్షిద్వారా మరొక సంగతి

గ్రహించవచ్చును. అది వేరొక పక్షిగూటిలో గుడ్లు పెట్టును. ఆ పక్షి తన గుడ్లతో పాటు ఈ గుడ్లనుకూడ పొదుగును. తల్లిపక్షి వాటికి ఆహారము తెచ్చును. ఆ పిల్లలు నోళ్ళు తెరచికొని తల్లి కోసము ఎదురుచూచును. పిల్ల తల్లిపెట్టు ఆహారము నందుకొనేదానిపై నాధారపడియుండును. చిన్నకకూ పిల్ల ఆహారముతింటే అది ఇతర పిల్లలను గూటినుండి బయటకు నెట్టివేయును. మన జీవితమను గూడులో అదే జరుగును.

**దానిని చేసినది నా పాత స్వభావము :**

పాపస్వభావము వలన జరిగినదియని మనము చేసిన పాపమును సమర్ధించుటకు సాకుగా వాడకూడదు. నేరము తనదికానట్లు ఇతరులపై వేయుటవలన ప్రయోజన మేమియు లేదు. దేవుడు వ్యక్తిని బాధ్యునిగా చేయుచున్నాడు కాని స్వభావమును కాదు. వేగముగా పోవు వానిని గూర్చిన ఒక కల్పిత కథ మీరు విని యుండవచ్చును. అతడు చేసిన తప్పును గూర్చి న్యాయమూర్తితో చెప్పిన మాటలు ఈలాగున్నవి "గౌరవనీయులైన న్యాయమూర్తిగారూ, వేగముగాపోవునది నా ప్రాచీనస్వభావము. అందుకు న్యాయమూర్తి ఈలాగు జవాబిచ్చెను. "అధికవేగము పోయినందుకు నీ ప్రాచీన స్వభావమునకు 50 రూ ॥ జరిమానవేయుచున్నాను. ఆ సంగతికి అనుబంధముగానున్న నీ క్రొత్త స్వభావమునకు 50/- రూ॥ జరిమాన విధించుచున్నాను." కాబట్టి పాత స్వభావమును నిందించుట సరియైన మార్గముకాదు.

**పాపకార్యములు - పాపమును అభ్యాసము చేయుట.**

పాపకార్యములు చేయుటకు మరియు పాపముచేత పరిపాలింపబడుటకు భేదమును తెలిసికొనువలెను. పాప యజమాన్యముక్రింద లేకపోయినను ప్రతి క్రైస్తవుడు పాపకార్యములు చేయుచున్నాడు. అతడు పాపరహితుడుకాడు అయితే అతడు పాపము తక్కువగా చేయును.

యోహాను తన మొదటి పత్రికలో విశ్వాసులు పాపము చేయుదురని స్పష్టముచేసెను. ఆ సంగతిని నిరాకరించినయెడల మనలను మనమే మోసపుచ్చుకొని దేవుని అబద్ధికునిగా చేయుచున్నాము (1యోహా 1:8-10) అయితే చెప్పిన మరొక సంగతి యేమనగా "ఆయన యందు నిలిచి యుండువాడు పాపమును అభ్యాసముచేయడు. పాపమును అభ్యాసముచేయువాడు ఆయనను చూడలేదు. ఆయనను ఎరుగలేదు. పాపముచేయుచూ ఉండువాడు అపవాది సంబంధి. ఏలయనగా అపవాది

ఆదినుండియు పాపము చేయుచున్నాడు. దేవుని మూలముగా పుట్టినవాడు పాపమును ఆచరించడు (అలవాటుగా పాపముచేయడు). ఏలయనగా ఆయన బీజము అతనిలో నున్నది. అతడు పాపము చేయుచూ ఉండడు. అందులో కొనసాగడు. ఏలయనగా అతడు దేవుని మూలముగా పుట్టినవాడు" (3-6, 8, 9) పాపపు అలవాట్లు ఆచరణను గూర్చి యోహాను మాట్లాడుచున్నాడు. అపవాది ఆదినుండి పాపము చేయుచున్నాడను సంగతి ఈ అభిప్రాయమును బలపరచుచున్నది (3:8) అది వాని ప్రవర్తన రీతి, లక్షణము అయితే విశ్వాసులు అపవాది సంబంధులుకారు. వారిజీవితములో పాపము అలవాటుగా చేసే గుణము, లక్షణము ఉండదు.

ఇది మరొక ప్రశ్నకు దారితీయుచున్నది "పాపము చేయుట అనునది అలవాటుగా, ఆచరణగా ఎప్పుడు అవుతుంది?" బైబిలు ఈ ప్రశ్నకు జవాబిచ్చుటలేదు. జవాబు ఇచ్చివుంటే అది పాపము చేయుటకు అనుమతి ఇచ్చినట్లగును. వాక్యము మౌనముగా ఉండుటవలన ఎన్నడూ పాపము చేయకూడదని, పాపానికి వ్యతిరేకమైన, ఆరోగ్యకరమైన హెచ్చరిక ఇచ్చినట్లగుచున్నది.

**పాపరహితమైన పరిపూర్ణత సాధ్యమా?**

క్రైస్తవుడు పాపము ఇకచేయలేనిస్థితికి చేరుకుంటాడని, అప్పటికి అతడు పూర్తిగా పవిత్రీకరణ చెందివుంటాడని నిజముగా నమ్మువారుకొందరు ఉన్నారు. పరిశుద్ధాత్మయొక్క సంకట అనుభవముద్వారా మారుమనస్సు పొందిన పిదప పాపస్వభావము తీసివేయబడునని వారు వాదింతురు. ఆ సమయమునుండి వారు ఇకను పాపము చేయరు.

ఈ రీతిగా చెప్పుకొనువారు పాపమనగానేమో గ్రహించనివారైయున్నారు. పాపమనగా ఏకార్యమైనను, ఆలోచనయైనను మాటయైనను దేవుని పరిపూర్ణతకు సరిపోనిది, తక్కువ పడుట (రోమా 3:23). అది చట్టరాహిత్యము అనగా తన సొంతమార్గమున పోవుటకు తీర్మానము చేసికొనుట (1 యోహాను 3:4) తప్పుచేయక పోవుట మాత్రమేకాదు. సరియైనది చేయలేక ఓడిపోవుట కూడ పాపమే. తన మనస్సాక్షి ఖండించుచున్న దేనినైనా చేయటం (రోమా 14:23) "విశ్వాసి చేయు శ్రేష్టమైన దానిని పాపము అపవిత్రము చేయును. అది అతని మారుమస్సును చెడగొట్టును. కన్నీటిలో మురికివున్నది. అతని విశ్వాసములో అపనమ్మకముంది."

ఒక ఆత్మీయ పరిశుద్ధుడు తన పశ్చాత్తాపము కూడ క్రీస్తు రక్తముచేత కడుగబడుట అవసరమని చెప్పాడు. మరొకడు తాను చేసిన ప్రతిది పాపముచేత మలినమగుచున్నదని గ్రహించి అతడీలాగు వ్రాశాడు.

మనము మోకాళ్లపై ప్రార్థనలో
మనము గడుపు పరిశుద్ధగంటలు
మన స్తుతిపాటలు సంతోషపరచునని

మనము తలంచిన సమయములు
హృదయములను పరీక్షించువాడా
క్షమాపణ వీటిపై నుంచుము.

"నిజమైన క్రైస్తవుడు పాపముచేయుటకు సామర్థ్యమును కోల్పోయినవాడు కాదు. అయితే తన కోరికను, ఇష్టమును కోల్పోయాడు" అతడిప్పుడు పాపమును ద్వేషించును. పాపము చేసినప్పుడు అతడు సిగ్గుపడును, అపవిత్రతాభావముచేత మొత్తబడినాడు.

అయితే కొందరీలాగు అడుగవచ్చును. "క్రైస్తవుడు పాపరహితుడుగా ఉండలేకపోతే, 1యోహాను 2:1 ఎందుకీలాగు చెప్పబడినది? "నా చిన్న పిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. "దేవుని ప్రమాణము ఎల్లప్పుడు పరిపూర్ణమైనది యనుసంగతే జవాబు. పరిశుద్ధుడైన దేవుడు పాపమును పట్టించుకొనకపోడు. (వదలివేయడు) "సాధ్యమైనంత తక్కువ పాపముచేయండి అని దేవుడు చెప్పజాలడు. ఆలాగైతే పాపమును సమ్మతించినట్లగును. దేవుడు ఆలాగు చేయజాలడు. తన ప్రజలకు తన ప్రమాణము సంపూర్ణమైనదిగా వున్నది. అయితే ఓటమికి తరుణోపాయమును వెంటనే చూపుచున్నాడు. అదే వచనములో ఆయన చెప్పుచున్నాడు. "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసు క్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు." ముందు అధ్యాయములో క్రైస్తవులు పాపము చేయుదురని ఆయన నొక్కి చెప్పెను.

**గమనిక:**

మనము పాపములేనివారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము మరియు మనలో సత్యముండదు (1:8)

మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము. మరియు ఆయన వాక్యము మనలో ఉండదు (1:10)

విశ్వాసి పాపరహితుడుగా ఉండగలడని చెప్పుటకు వీలుకలిగించు వచనములు ఉన్నమాటనిజమే. మొదటిగా రోమా 6:2లో విశ్వాసిపాపమునకు చనిపోయాడని ఉన్నది. అది అతని స్థానమునకు సంబంధించినది. అతడు క్రీస్తుతో చనిపోయినట్లు దేవుడు యెంచుచున్నాడు. ప్రాచీన పురుషుడు ఆయనతో సిలువ వేయబడెను. అయితే 11వ. వచనములో మీరును పాపము విషయమై మృతులుగా మిమ్మును మీరే యెంచుకొనుడి అని ఉన్నది. ఇది మన అనుదిన అలవాటు లేక ఆచరణ. రెండవ వచన ప్రకారము మనము పాపరహితులమైన యెడల 11 వచనములో హెచ్చరిక అవసరములేదు.

పాపమునుండి విశ్వాసి విడుదలపొందినట్లు చెప్పు లేఖనములు మూడు ఉన్నవి. (రోమా 6:7,18,22) ఈవచనములన్నిటిలో దాసులు యజమానులు అను దృష్టాంతములున్నవి. రక్షింపబడకముందు మనము పాపమునకు దాసులముగా నుంటిమి. క్రీస్తుమరణమందు యజమానుడుగా నున్న పాపమునకు చనిపోతిమి. పాపము యొక్క అధికారము (ప్రభుత్వము) నుండి స్వతంత్రులమై నీతికి, దేవునికి దాసులమైతిమి.

క్రొత్త నిబంధనలో పరిపూర్ణమగు, పరిపూర్ణమైన, పరిపూర్ణత అనుపదములు ఉన్నవి. మామూలుగా చదివే వానికి పాపములేని స్థితి ఉన్నదని తలంచుటకు వీలుకలుగుచున్నది. (మత్త 5:48 ఫిలిప్పీ 3:12, 3:15 2 తిమో 3:16, 17 హెబ్రీ 6:1, 9:9, 10:14, 13:20,21 యాకోబు 3:2 ప్రక 3:1,2)

పరిపూర్ణమగు అను పదమునకు పూర్తిచేయు, పూర్తిగా పెరిగిన, పరిపక్వతయను భావములు చెప్పవచ్చును. భూమిపై నివసించు క్రైస్తవులకు ఈ పదమును వాడినప్పుడు పాపరాహిత్యమని ఎన్నడు తలంచరాదు. సంపూర్ణమగు మనసాక్షి అని హెబ్రీ 9:9లో వచ్చినది. దేవునియెదుట పరిపూర్ణస్థాయి, స్థానంను గూర్చి 10:14లో చెప్పబడినది.

పాపములేని స్థితిని గూర్చి చెప్పు మరొక లేఖనము 1 థెస్స 5:23 లో వచ్చినది. అయితే ఇది పౌలు ప్రార్థన. విశ్వాసి యొక్క ప్రతిభాగము, ఆత్మ, ప్రాణము దేహము పరిశుద్ధపరచబడి, సంపూర్ణముగా నుండవలెనని పౌలు ప్రార్థన. ప్రభువు రాకడకు నిందారహితముగా ఉండాలని కోరుచున్నాడు.

యోహాను మొదటి పత్రికలో 3:6,9, 5:18 వచనములు చూడవలెను. ఇంతకుముందు వివరించినట్లు ఇవి విశ్వాసి అలవాటుకు సంబంధినవి. ఈ వచనములు క్రియాపదములు, వర్తమాన కాలమునకు చెందినవి. జరుగుచూవున్న భావముగలవి. దేవుని మూలముగా పుట్టినవాడు పాపములో కొనసాగడు, అలవాటుగా చేయడు. పాపములో జీవించడు. పాపము అతని జీవితలక్షణమై యుండదు.

పాపరాహిత్య పరిపూర్ణత తీవ్రమైన బోధా? దేవుని వాక్యమునకు విరోధముగానున్న యేసిద్ధాంతమైనను తీవ్రమైనదిగా పరిగణింపవలెను. పాప రాహిత్య పరిపూర్ణత కొరకు ప్రాకులాడి ఆశగల, యధార్థతగల విశ్వాసులలో యెక్కువ మంది భ్రమలోపడి వంచనకుగురియైరి. కొంతమంది మతిస్థిమితమును కోల్పోయి, దెబ్బతినిరి. "పరిశుద్ధత – నిజమైనది, అబద్ధమైనది" అను తన పుస్తకములో హెచ్.ఎ. ఐరన్ సైడుగారు సంపూర్ణ పరిశుద్ధత కోసము తన ప్రయత్నము వ్యర్థమైనది అని వివరించెను. ఉద్రేకములు దెబ్బతిన్నవి. క్రైస్తవపరిశుద్ధతను గూర్చిన నిజమైన సిద్ధాంతము తాను కనుగొన్నప్పుడే శాంతి తన జీవితములో ప్రవేశించెను.

**నేను నిస్సహాయుడను – నేను చేయక తప్పదు.**

మనము పాపము చేయక తప్పదని మనము చెప్పకూడదు. అది బైబిలులో ఎక్కడ చెప్పలేదు. అది నిజముకాదు. మనము పాపము చేయక తప్పదు అని మనము చెప్పినయెడల, శోధనను ఎదురించుటకుకావలసిన సామర్థ్యము పరిశుద్ధాత్మ ఇవ్వలేదని, ఆత్మ శక్తిహీనుడని చెప్పినట్లేయగును. అయితే ఆయన శక్తిమంతుడు. సమస్య ఆయనలో కాదు మనలోనే వున్నది. ఆయన శక్తిని మనము సొంతము చేసికోనందువలన మనము పాపము చేయుదుము. మనము కోరినప్పుడు పాపము చేయుచున్నాము.

నేను తప్పక పాపము చేసెదనని చెప్పుట క్రైస్తవ పునాదులనే నిరాకరించి నట్లుగును. – విశ్వాసిమీద పాపమునకు ప్రభుత్వము లేదు (రోమా 6:14) నేను పాపము చేయలేను అని చెప్పుట కూడ నన్ను మోసముచేసికొనుటయే. (1యోహాను 1:8) నేను పాపము చేయనక్కరలేదని చెప్పుట దైవసూత్రమును ప్రకటించుటయగును. ఏలయనగా క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమమునుండి నన్ను విడిపించెను. (రోమా 8:2) మనకు విజయము నిచ్చు దేవునికి కృతజ్ఞతాస్తుతులు.

**సంబంధము మరియు సహవాసము:**

క్రైస్తవుడు పాపముచేసినప్పుడు అతని రక్షణ కోల్పోడుగాని రక్షణానందమును పోగొట్టుకొనును. దేవుని కుటుంబములో సహవాసము పోవును అయితే దేవునితో యేర్పడిన సంబంధము నిలిచియున్నది. నూతన జన్మద్వారా అతడు దేవుని బిడ్డ ఆయెను. దానిని ఏదియు మార్చజాలదు. అయితే అతడు పాపముచేసినప్పుడు దేవునితో సహవాసము తెగిపోవును ఏలయనగా దేవుడు వెలుగైయున్నాడు. ఆయనలో చీకటి యెంతమాత్రముండదు. (1యోహా1:5) పాపమును ఒప్పుకొని విడిచిపెట్టునంతవరకు కుటుంబములో సంతోష వాతావరణము చెడిపోవును (1యోహా 1:9, సామె 28:13).

**జయించుటకు వీలుకాని పాపమేదైనను ఉన్నదా?**

తాను చేసిన యేపాపము నుండియైనను విడుదల ఉన్నదని విశ్వాసి తెలిసికొనవలెను (1కొరింథీ 10:13). మన కందరికి చిక్కులుపెట్టుపాపములున్నవి. అనుకోని రీతిగా నెట్టుకొని దొంగవలె ప్రవేశించు పాపము మనపై పట్టుసాధించును. కొన్ని అలవాట్లు మనలను పడగొట్టును. తరచుగా పూర్తిగా, చివరిగా స్వాతంత్ర్యము పొందవలెనని ఆశించి నిరుత్సాహపడిన సన్నివేశములు అనేకము. వాక్యముగాని మానవ అనుభవముకాని చెప్పునదేమనగా దేవునికి ఏదియు అసాధ్యము కాదు. ఆయన శక్తికి మించిన పాపమేదియు లేదు.

**ఒక కార్యము కాదు అయితే ఒక విధానము (ప్రగతి)**

మరొకముఖ్యమైన సంగతియేమనగా యే ఒక్క అనుభవముకూడ మనలోనున్న పాపస్వభావపు శక్తినుండి పూర్తిగా విడుదల కలుగచేయునని తలంచరాదు. ఈ సత్యమును నేటి సంఘము ఉపేక్షించుచున్నది. పరిశుద్ధతకు దగ్గర దారి యున్నదని బోధకులు ప్రజలకు చెప్పుచున్నారు. కూడికల చివరిలో బలిపీఠపు పిలుపు (altar call) అని పిలిచి, వారు నింపుదల పొందుదురని చెప్పుచున్నారు. బాప్తీస్మము జయజీవితముకొరకు పిలుచుచున్నారు. అట్టి అనుభవము ఉన్నతమైన పరిశుద్ధతలోనికి శాశ్వతముగా దొర్లింపబడుదురని చెప్పి ప్రజలను భ్రమపెట్టుచున్నారు.

విడుదల క్షణక్షణము జరుగుచుండు విధానము. అది (ద్వితీ 33:25) ఒక్కసారిపొందే విజయము కాదు. “నీవు బ్రతుకు దినములలో నీకు విశ్రాంతి (బలము) కలుగును.” అనువాగ్దానము గలదు అనగా నీవు వయస్సులో ఎదుగుచుండగా నీవు బలము కలిగియుందువు. మనము “ఆత్మచేత నింపబడవలెనని” ఆజ్ఞాపింపబడితిమి (ఎఫెసీ

5:18) దాని అసలు బావ మేమనగా “ఆత్మ చేత ఎల్లప్పుడు నింపబడుచుండవలెను” అది వర్తమానకాలపదము. “ప్రస్తుతము కొనసాగుచుండు అనే అర్థమిచ్చు పదము. ఒకప్పటి బలిపీఠపుపిలుపు నేడు మనము ఎదుర్కొనే శోధననుండి తప్పించునని భావించరాదు.

**బుద్ధిపూర్వక పాపము:**

కొంతమంది విశ్వాసులు తాము బుద్ధిపూర్వక పాపము చేసితిమని అనవసరమైన ఆత్రుత కలిగియుందురు (హెబ్రీ 10:26,27) వారు పాపము చేసినప్పుడు వారి ఇష్టము, బుద్ధి సమ్మతించిన తర్వాత గదా పాపము జరిగినదనివారు వాదింతురు. కాబట్టి బుద్ధి పూర్వకమైన పాపనేరము నుండి, శత్రువులను దహించు తీవ్రమైన శిక్షను పొందెదమని చెప్పుదురు. అయితే అది నిజముకాదు. పాపకార్యములకు, హెబ్రీ 10లో చెప్పబడిన బుద్ధి పూర్వకపాపమునకు భేదమున్నదని గ్రహించవలెను. బుద్ధిపూర్వకపాపము అనగా విశ్వాసములో జారిపోవుట, స్వమత పరిత్యాగము. అది 29 వచనములో వివరింపబడినది. దేవుని కుమారుని పాదములతో త్రొక్కుట. పవిత్రపరచే నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా యెంచుట, కృపకు మూలమగు ఆత్మను అవమానపరచుట. నిజవిశ్వాసి ఈనేరము క్రిందకు రాజాలడు. ఈ పాపము చేశానని దిగులు చెందు వ్యక్తి పాపముచేయలేదని సూచన. క్రైస్తవ విశ్వాసము విడిచివెళ్ళినవారు కఠిన పరచబడినవారై, గర్వముతో నుండి, రెండవసారి దానిగూర్చి ఆలోచించరు. వారికి దేవుని భయముకాని, ఆయన శిక్షను గూర్చిన భయముకాని ఉండదు.

**సహాయకరములు కాని వాటి నుండి విజయానికి :**

మనము తెలిసుకొనవలసిన సంగతుల జాబితాకు ముందు పరిశుద్ధతను సాధించుటకు మన వైఖరి, కార్యములు కొన్ని సహాయపడవని గ్రహింపవలెను.

1. సన్యాసత్వము (తపస్సు) సహాయపడదు: కొలస్సై 2:23లో తన్నుతాను హింసించుకొనుట, తన్నుతాను తృణీకరించుకొనుట పరిశుద్ధతగా కనబడవచ్చుననియు అయితే అవి శరీరేచ్ఛానిగ్రహ విషయములో ఏమాత్రమును ఎన్నికచేయదగినవికావని పౌలు చెప్పుచున్నాడు.

2. మఠజీవితము సహయపడదు: ఒకడు మఠములో చేరి లోకమునకు వేరుగా జీవించవచ్చును అయితే తన సొంతస్వభావమును తన్నుతాను వేరుపరచుకొనలేడు.

3. లోచూపు : దీనివలన సహాయముదొరకదు. స్వార్థముపై విజయము పొందలేడు.

తన్ను గూర్చిన ఆలోచనతో నింపుకొనుట పడవలో లంగరువేసినట్లుండును.

4. స్తబ్దత కూడసహయపడదు: సోమరులుగా నుండి ఎదురుచూచువారి పైకి పరిశుద్ధత దిగిరాదు. ఊరకుండుట, పట్టించుకోని స్థితిని స్తబ్దత అందురు.

5. శోధన తీవ్రముగా పరిశోధించుట, పఠించుటవలన పరిశుద్ధత కలుగదు. శోధనను గూర్చి పరిశీలించుకొలది శోధనకు గురియగుదుము.

6. నిరుత్సాహముతో వదిలివేయుటవలన పరిశుద్ధత కలుగదు. ఇది ఓటమి. ఓడిపోయిన క్రైస్తవులను దేవుడు వాడుకొనడు.

తెలిసికొనవలసిన విషయాలు ఇంతవరకు చాలు, ఇప్పుడు చేపట్టవలసిన క్రియలోనికి సాగిపోదాం. ●

## అధ్యాయము - 11

# విజయమార్గము - ఆత్మచేత నింపబడుడి

దేవుడుమాత్రమే మనలను పరిశుద్ధులుగా చేయగలడు. అయితే మన సహకారములేకుండ ఆయన చేయడు. క్రైస్తవజీవితములో అనేక భాగములున్నవి. ఆసక్తికరమైన దైవమైన మానవ కలయికలు ఉన్నవి. దేవుడు శక్తిని ఇవ్వగలడు అయితే మనము దానిని వినియోగించుకొనవలెను. మన బాధ్యతయేమనగా ఆత్మచేత నింపబడుట యే. మనము ఆత్మానుసారముగా నడిచిన యెడల శరీర ఆశలను నెరవేర్చలేము.

అయితే ఆత్మచేత నింపబడుట అనగాయేమి? - ఇది పరలోకమునకు సంబంధించినదిగాను, మర్మమైనదిగాను ఉన్నది. బోధకులకు, మిషనరీలకు మాత్రమే సంబంధించినదిగా కనబడుచున్నది. ఆలాగు కాదు. దేవుని ప్రజలందరు ఈ అనుభవములోనికి రావాలని ఆజ్ఞయున్నది. ఏ విశ్వాసికి ఇది అసాధ్యమైన సంగతికాదు. దీనిని సులభముగా అర్ధముచేసికొనుటకు, ఆచరణసాధ్యపరచుటకు, ఆత్మతో నింపబడుటకు కొన్నిముఖ్య సూత్రములు వివరించుచున్నాము.

**పాపములను నిలువచేసికొనద్దు:**

మన జీవితములో పాపమున్నదని గ్రహించిన వెంటనే మనము పాపమును ఒప్పుకొని విడిచిపెట్టవలెను. అప్పుడు మనము పవిత్రులముగా ఉందుము. (సామె 28:13, 1 యోహాను 1:9) పాపమంతయు దేవునికి వ్యతిరేకము. కాబట్టి పాపమంతటిని దేవుని యెదుట ఒప్పుకొనవలెను. ప్రజలకు కీడుచేసినయెడల వారి యెదుట కూడ దానిని ఒప్పుకొనవలెను. నిజమైన ఒప్పుకోలు వెంటనే జరుగవలెను. ఆ రోజు ముగిసే వరకు గాని వారము ముగిసే వరకుగాని వేచియుండరాదు. ఒప్పుకోలు షరతులు లేనిదిగా యుండవలెను. ఏదైనను పొరపాటుచేసిన యెడల, లేక నీవు నన్ను క్షమించితే నేను నిన్ను క్షమించెదను అని చెప్పకూడదు. ఒక స్త్రీ ఈలాగు చెప్పినది

"నీకు ఏదైనను తప్పిదము చేసిన యెడల క్షమింపబడుటకు ఇష్టపడుచున్నాను" ఆలాగు చెప్పకూడదు. పూర్తిగా ఒప్పుకొనవలెను. ఒకడు పొడవైన త్రాడును దొంగిలించితినని ఒప్పుకున్నాడు అయితే ఆ త్రాడు చివరన గుఱ్ఱమున్నదని ఒప్పుకొనలేదు.

స్పష్టముగా ఉండవలెను, ఏమిజరిగెనో చెప్పవలెను. ఆ పాపమును సరియైనపేరుతో పిలువుము. త్రాగుబోతు తనమును అవివేకము అని చెప్పరాదు. దొంగతనమును అరువుఅని చెప్పరాదు. పేతురు నేను సరిపోయినవాడనుకాను అనలేదు, నేను పాపాత్ముడను ప్రభువాయనెను.

ఒప్పుకోలులో పాపమును విడచిపెట్టాలనే ధృడ చిత్తము కలిగిఉండాలి. అయితే ఈక్రింది విధంగా చెప్పినచో ఇది ఒప్పుకోలు కాదు. "నేను ఒక బుట్ట జీడిమామిడి పండ్లు దొంగిలించాను. దానిని రెండు బుట్టలు అనుకో, ఎందుకంటే ఈ రాత్రి ఇంకొకటి దొంగిలించబోవుచున్నాను"

హృదయపూర్వకమైన ఒప్పుకోలు ఈలాగుండును. "నాది తప్పు. అందుకు దుఃఖపడుచున్నాను. దయచేసి నన్ను క్షమించండి"

మనము యథార్థముగా మన పాపములను మనము ఒప్పుకొనినప్పుడు, మనము క్షమింపబడితిమని దేవుని వాక్య అధికారమును బట్టి మనము తెలిసికొనగలము. మనము ఒప్పుకొంటే క్షమిస్తానని దేవుడు వాగ్దానము చేసెను. ఆయన తన వాగ్దానమును నెరవేర్చును. ఆయన సత్యవంతుడు విశ్వాసముద్వారా క్షమాపణను స్వీకరించుచున్నాము.

అయితే ఒకడీలాగు చెప్పవచ్చును. "నేను క్షమింపబడినట్లు నాకు తెలియుటలేదు." నీవీలాగు అనుకొనినను నీవు క్షమింపబడినావు. నీవు అనుకొనుటను బట్టి క్షమాపణ లో మార్పువుండదు. క్షమాపణ నిశ్చయత మార్పు చెందె ఆలోచనల ద్వారా కలుగదు. మార్పు లేని వాక్యమునుబట్టి క్షమాపణవచ్చును.

మరొకడు ఈలాగు చెప్పవచ్చును. దేవుడు క్షమించినట్లు నాకుతెలియును. అయితే నన్ను నేను క్షమించలేక పోవుచున్నాను. ఈ వైఖరి తనను తాను చిత్రహింస చేసికొనుట యే. అది అనవసరము. దేవుడు మనలను క్షమించినప్పుడు సంగతి పరిష్కారమైనది. నేరమనే మురికిలో పొర్లాడుటకు ఎందుకుపోవలెను?

దేవుడు క్షమించినప్పుడు ఆయన దానిని మరచిపోవును (హెబ్రీ 10:17) దేవునికి జ్ఞాపకశక్తిలేదని దీనిభావముకాదు. కాని ఈ పాపమును మనకు వ్యతిరేకముగా మరల

తీసికొనిరాడు. క్షమింపబడినవి అనగా ఆ కేసు సమస్య మూసివేయబడినది. విరిగిన మనస్సుగలగి పశ్చాత్తాపము చెందినవాడు తన చెడ్డ అలవాటునకు జారిపోయి “ఓ ప్రభువా మరల అదే చేశాను. నన్ను క్షమింపుము” అని కేకవేసాడు. ఒక కథవున్నది. అందులో ప్రభువు జవాబు ఇస్తాడు. “నీవు మరల ఏమి చేశావు?” అతడు ఒప్పుకొనిన ఆ క్షణములోనే ప్రభువు దానిని మరచిపోతాడు.

దేవుడు పాపములను మరచిపోవుటయేకాక, వాటిని “మరల పట్టుకొనరాదు” అనే బోర్డు పెట్టాడు” అని కొర్రీ టెన్ బూమ్ అనువాడు గుర్తుచేయుచున్నాడు. మన పాపములు కాని ఇతరుల పాపములు గాని ఒప్పుకొని క్షమాపణపొందిన తర్వాత మనం వెదకి మరల పైకి తీసికొనిరాకూడదు. వాటినిబయటకు తేవాలని ఆయన కోరుటలేదు. వాటిని మరల చేయకుండ ఉండవలెనని హెచ్చరికగా మాత్రము వాటిని జ్ఞాపకము చేసికొనవలెను.

మనపాపమెంత విశాలమైనదో మన ఒప్పుకోలుకూడ అంత విశాలముగా నుండవలెను. అది దేవుని విషయములో కావచ్చును, మనము తప్పుచేసిన ఒక వ్యక్తి విషయములో కావచ్చును, లేక స్థానిక సంఘమంతటి విషయములో కావచ్చును. లీత్ సామ్యేల్ సహాయకరమైన ఆలోచన చెప్పెను. అదేమనగా పాపము నీ ఆలోచనలో ఉన్నప్పుడు, నీ ఒప్పుకోలు నీ ఆలోచనకే పరిమితముకావలెను. ఒక స్త్రీ యొద్దకు వెళ్ళి నీ హృదయములో ఆమెను కోరినట్లు నీవు చెప్పకూడదు. అది ఇబ్బందికరమైన గందరగోళమునకు దారితీసి ఇంకను పాపము చేయుటకు దారి తీయవచ్చును. అది హృదయమందున్న రహస్యపాపమైతే హృదయములోనే రహస్యముగా ఒప్పుకొనుము. అది బహిరంగముగా ఒప్పుకొనకూడదు. అది ఇతరుల మనస్సును కలుషితము చేయును. సంఘసహవాసములో బహిరంగముగా జరిగినదైతే, సహవాసములో బహిరంగముగా ఒప్పుకొనవలెను. సహవాసము దానిని క్షమించును. వారిని పడిపోవునట్లుగా వదలివేశావా? నీ దుఃఖమును వారికి చెప్పుము. వారికి నీవు విరోధముగా నున్నవా? నీవు అనిన మాటలను బట్టియేయని వారికి తెలియును. నీవు మాట్లాడిన తీరును బట్టి నీవు దుఃఖపడినట్లు వారికి తెలియనిమ్ము.

హారి లాయిడ్‌ను తన స్నేహితులు గొప్ప పరిశుద్ధతను ఆపాదించి ఒక క్రైస్తవ వ్యాపారిగా మంచి ఆదర్శమును కనుపరచినట్లు యెక్కువగా ప్రశంసించెను. అయితే అతడు తగినవాడను కాదని అతనికి తెలియును. సమర్పించుకొన్న క్రైస్తవునిగా మంచి

మాదిరియైనవాడని పొగడిరి. ఈ విషయము అతనిని ఇబ్బంది పెట్టినది. అందుకు తగినవాడనుకానని అతడు బహిరంగముగా ఉత్తరము వ్రాసెను.

“నా వ్యాపారము పెంపొందించుకొనుటకు, నా వ్యక్తిగత సుఖముల కొరకు నా శక్తులన్నిటిని వినియోగించి అధిక ప్రాధాన్యతనిచ్చితిని. వాస్తవమునకు నేను బైబిలు ఎన్నడు చదవలేదు. నా పాపములు ఆలోచనలోను, క్రియలలోను నిజముగా తీవ్రమైనవి. దేవుని పనికొరకు దశమభాగము ఇచ్చుచున్నానని చెప్పుట పరిహాసమేయగును. త్యాగములేదు, అతి స్వల్పమే యిచ్చుచున్నాను. ఒక యజమానిగా కఠినముగా పని చేయించుకొంటిని.

తరచుగా ప్రేమలేని భర్తగాను, తండ్రిగాను ఉండి, కఠినముగా ప్రవర్తించితిని బాల్యములో క్రమముగా గుడికి వెళ్ళినట్లు ఇప్పుడు వెళ్ళుటలేదు. ప్రజలు నన్ను పొగిడినప్పుడు నేను మోసగానిగా తలంచుచున్నాను. అందుకే సిగ్గుతో నిజము చెప్పాలని తలంచితిని. నేనెంతో చెడ్డ క్రైస్తవుడనని ఒప్పుకొనుచున్నాను. దేవుని తప్ప ఎవనిని పొగడవద్దు.”

ఈలాంటి నమ్మకమైన యథార్థమైన ఒప్పుకోలును ఎక్కువసార్లు వినము. పైగా మనము ఇట్టి ఒప్పుకోలు చాలా అరుదుగా వింటాము.

**సాధ్యమైనప్పుడు తిరిగి యిచ్చివేయుము:**

గతములో చేసిన పొరబాట్లను మనము సరిచేసికొనవలెనని దేవుని కృప మనకు బోధించుచున్నది. దీని భావమేమనగా మనము తప్పుడు విధానములో ఇతరులకు నష్టముచేసిన యెడల దానిని తిరిగి హక్కుదారునికి చెల్లించవలెను. దొంగిలించిన డబ్బుకు వడ్డీతో సహా తిరిగి యిచ్చివేయవలయును.

జక్కయ్య దీనికి క్రొత్తనిబంధనలో ఒక మంచి ఉదాహరణ. అతడు మారుమనస్సు పొందిన తర్వాత ఈలాగు చెప్పెను “ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదలకిచ్చుచున్నాను. నేనెవనియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతును” (లూకా 19:8) రక్షింపబడుటకు అతడీలాగు చేయలేదు. అయితే రక్షింపబడినాడు కాబట్టి ఆలాగు చేసెను.

తిరిగి చెల్లించుట సంపూర్ణమైనదిగాను, యథార్థమైనదిగాను ఉండవలెను.

ఆదాయ పన్ను అధికారులకు ఒకడీలాగు వ్రాసెను. "గత సంవత్సరము ఆదాయపన్ను విషయములో లెక్కలు సరిగా చూపనందుకు నాకు నిద్రపట్టుటలేదు. బుద్ధిపూర్వకముగానే నా ఆదాయమును దాచితిని. అందువలన డా. 150/– చెక్కు జతచేసి పంపుచున్నాను. అప్పటికి నాకు నిద్రపట్టకపోతే మిగిలిన దానిని పంపెదను" ఇట్లు చెప్పిన వానివలె మన ముండకూడదు.

కాలము గడిచిపోవుటనుబట్టి మార్పు చెందిన పరిస్థితులను బట్టి, తిరిగి చెల్లించుటకు యేమాత్రము సాధ్యముకాకపోవచ్చును. దానిని గూర్చి ప్రభువునకు తెలియును. పాపమును ఒప్పుకొంటే వాస్తవపరిస్థితులను బట్టి యథార్థమైన కోర్కెను బట్టి దేవుడు అంగీకరించును.

కొన్నిసంవత్సరములకు పూర్వము డబ్ల్యు. పి. నికోల్సన్ బెల్‌ఫాస్ట్‌లో బోధించుచుండగా దేవుని ఆత్మ శక్తితో ప్రజలను కదిలించెను. స్థానిక ఫ్యాక్టరీలనుండి దొంగిలించిన వస్తువులను ప్రజలు తిరిగి యిచ్చివేయుటకు ప్రారంభించిరి. అనేక పరికరములు తిరిగి రావటము వలన వాటిని ఉంచుటకు షెడ్డులు నిర్మింపవలసి వచ్చినది. తుదకు వారు ఒక ప్రకటన చేయవలసివచ్చినది "స్థలము లేనందువలన వాటిని తిరిగి ఇవ్వనక్కరలేదు."

అదేరీతిగా ఒకసారి యఫ్.బి. మేయర్ కేష్విక్ సభలో బోధించెను. అప్పుడు క్రైస్తవులు తాము దొంగిలించిన వాటిని అప్పులను తిరిగి యిచ్చివేయుటవలన స్థానిక పోస్టాఫీసునకు పనియెక్కువయ్యెను.

**సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి.**

ఆచరణలో పరిశుద్ధతను తెలిసికొనుటకు మూడవ కార్యము మనము చేయవలెను. మన అవయవములు నీతికి సాధనములుగా ఉండునట్లు మనము ప్రభువునకు లోబడవలెను. (రోమా 12:1,2, 6:19) హఠాత్తుగా లోబడుట ప్రారంభమగును. అయితే అదొక పద్ధతిలో కొనసాగవలెను. మనలను మనము సజీవయాగముగా సమర్పించుకొనుట యను చర్య ఒకసారి ప్రారంభము కావాలి, అయితే అప్పటినుండి దినదినము, క్షణక్షణము ఆయన చిత్తమును మనదిగా అంగీకరింపవలెను. మనము ఆయన స్వాధీనములోనికి పోవలెను. మన సొంతమును నిరాకరించి సిలువనెత్తుకొని ఆయనను వెంబడింపవలెను. ఒప్పుకోలు మనలను పవిత్రపరచినట్లు, లోబడుట మనలను

అందుబాటులో వుంచును.

ఏని గ్రాన్నిస్ సమర్పించుకొనుట అను పదమునకు నిజమైన భావమును గ్రహించెను. ఈ భావము ఇలాగున్నది.

నా ప్రియప్రభువు నాలోకి రావాలంటే నా జీవితములో 'నాది, నేను' లేకుండ శుభ్రపరచాలని నా ఆశ.

ఆయన సొంత సామాగ్రితో అలంకరించి, నా హృదయమే ఆయన నివాసమవ్వాలి. అందుకు కావలసినదేమో నాకు తెలియును. ప్రతి ఉదయాన రహస్యగదిలోనికి పోయి, నా చిత్తమును ఆయనకు వదలివేయగా.

ఆయన దానిని కృపను బట్టి స్వీకరించి ఆయన చిత్తమును నా బహుమానముగా నిచ్చును.

నా దినచర్య ప్రారంభించుటకు నేను సిద్ధమైయున్నాను.

నా అభిరుచులను నా అయిష్టములను ఆయననే నియంత్రించును.

ఏలయనగా ఉదయముననే కలిసికొని మా చిత్తములను మార్చుకొనెదము.

బిషప్ టేలర్ స్మిత్ అనుభక్తుడు ఉదయాన పరుపుమీదనుండి లేవగానే అతడు ఆ పరుపుప్రక్కనే మోకరించి ప్రతిఉదయము ఈ సామాన్యమైన మాటలు పలికేవాడు "ప్రభువా నా పరుపు నీబలిపీఠము, నేనే సజీవయాగమును." ప్రతిదినము అతడు ప్రభువు స్వాధీనములో ఉండును.

"దేవుడు నీ ద్వారా చేసిన అద్భుతమైన సంగతులకు, గొప్పకార్యములకు రహస్యమేమి" యని ఆర్థర్ పియర్సన్ జార్జి ముల్లర్‌ను అడిగెను. ముల్లర్ ఒక్క క్షణముపైకి చూచి, తల వంచి ఇంకా వంచి మోకాళ్లపై తల వుంచెను. రెండు మూడు క్షణములు మౌనముగా ఉండి ఈలాగు చెప్పెను. "అనేక సంవత్సరముల క్రితము నా జీవితములో ఒక దినమున జార్జి ముల్లర్ చనిపోయాడు. యౌవనస్థునిగా నేను అనేకమైన ఆశలు కలిగి యుంటిని అయితే ఒకరోజు వీటన్నిటికి చనిపోయాను. అప్పుడు నేను చెప్పితిని అప్పటినుండి యేసు ప్రభువా నా చిత్తముకాదు నీ చిత్తమే" అంటిని. ఆ దినమునుండి దేవుడు నాలో పనిచేయుటకు, నా ద్వారా చేయుటకు ప్రారంభించెను.

దీనిని జనరల్ బూత్ మరొకవిధముగా చెప్పెను "నేను 17 సంవత్సరముల బాలునిగా నుండినప్పుడు విలియము బూత్‌కు సంబంధించినవన్నియు దేవుడే

చేయవలెనని తీర్మానముచేసికొంటిని.

**వాక్యముతో నీ జీవితము పూర్తిగా నింపుకొనుము:**

ముఖ్యమైన నాలుగవ సంగతియేమనగా వాక్యమునకు దగ్గరగా ఉండుము. మన జీవితము వాక్యముతో నిండిపోవునంత దగ్గరగా నుండవలెను. దీని అర్థమేమనగా చదువుట, కంఠస్థము చేయుట, పఠించుట, ధ్యానించుట మరియు దేవుని వాక్యమునకు విధేయత చూపుట. వాక్యము చదువుట వలన మనమెట్టి ప్రవర్తన కలిగియుండవలెనో మొదలగు సాధారణ సూత్రము దేవుడు మనకు నేర్పును. కంఠస్థము చేయుట వలన సాక్ష్యమిచ్చునప్పుడు, శోధనలో, నిర్లక్ష్యముగా నుండినప్పుడు పరిశుద్ధాత్మ తగిన వాక్యభాగములను జ్ఞాపకముచేయును. సందర్భానుసారముగా ప్రవర్తించుట నేర్చుకొందుము. పఠించుటవలన దుర్బోధలనుండి, తప్పుడు నిరీక్షణలనుండి తప్పించుకొనగలుగుతాము. ధ్యానించుటవలన వాక్యమెవరిని గూర్చి మాట్లాడుచున్నదో ఆయనను చూచి మార్పుచెందుతాము. లోబడుటద్వారా నీతిమార్గములోనికి నడిపింపబడుదుము.

కీర్తనకారుడు పరిశుద్ధపరచబడుటకు, వాక్యమునకు ఉన్న సంబంధముగుర్తించెను. ఆయన ఈలాగు వ్రాసెను. యౌవనస్థులు దేనిచేత తమనడతను శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనేగదా....? నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నాహృదయములో నీ వాక్యమును ఉంచుకొనియున్నాను (కీర్త 119:9,11)

యేసు ఈ సంబంధమును స్థిరపరచెను. ఆయన ఈలాగు ప్రార్ధన చేసెను. "సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17) ఈ సంబంధము రెండు ఆధునిక సూత్రముల ద్వారా వ్యక్తము చేయబడినది.

ఈ గ్రంథము నిన్ను పాపమునుండి కాపాడును.
పాపము ఈ గ్రంథము నుండి నిన్ను దూరపరచును.
దేవుడు వేరు చేయనివి రెండు గలవు
బైబిలు మీద దుమ్ము మరియు హృదయములోని మంచు.

ఆత్మ చేత నింపబడుటకు వాక్యముతో నింపబడుటకు సంబంధమున్నది. ఎఫెసీ 5 అధ్యాయములో ఆత్మతో నింపబడినప్పుడు ఒకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతో హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి

కీర్తించుచుండవలెనని పౌలు తెలిపెను (వ 19) కొలొస్స 3 లో క్రీస్తు వాక్యము సమృద్ధిగా మనలో ఉండినప్పుడు సంగీతములతో, కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గానము చేయుచు వుండవలెనని పౌలు బోధించెను. ఒకే సంగతికి సమానమైన సంగతులు ఒకదానికొకటి సమానముగానుండును. సారాంశము ఆత్మచేత నింపబడుట అనగా క్రీస్తు వాక్యము మనలో సమృద్ధిగా నివసించుటయే.

బైబిలునకు వేరుగా పరిశుద్ధత లేదు అని భక్తిగల మెక్చ్చినే ఈలాగు చెప్పెను.

దేవుడు వాక్యములేకుండనే పరిశుద్ధ పరచగలడని నమ్ముచున్నాను. అది లేకుండనే ఆయన దేవదూతలను పరిశుద్ధులుగా చేసెను. ఆదామును కూడ ఆలాగే చేసెను. అయితే ఆయన ఇప్పుడు ఆలాగు చేయడు. "నీ సత్యమందు వారిని ప్రతిష్ఠించుము, నీవాక్యమే సత్యము"

తల్లి బిడ్డను పోషించినట్లుగా యేసు రక్షింపబడిన ఆత్మను చేరదీసి వాక్యమను పాలతో పోషించును. ఒక అనుభవము నమ్మి ఆ తర్వాత బైబిలును ఒక వారము చివరి నుండి మరియొక వారము చివరి వరకు తెరవనివారు మోసపరచబడుదురు.

**మానక ప్రార్థన చేయుము:**

ప్రార్థన లేకుండ పరిశుద్ధత లేదు. ప్రార్థన తప్పనిసరి. ప్రభువైన యేసు చెప్పిన మాదిరి ప్రార్థనలో ఆయన ఒక మనవిని కలిపెను. "మమ్ము శోధనలోనికి తేక, దుష్టుని నుండి తప్పించుము" పాపము నుండి భద్రత కావాలని హృదయమునుండి కేకవేయకపోతే ఆ ప్రార్థన సంపూర్ణమైనది కాబోదు.

మన అనుదిన ప్రార్థన జాబితాకు ఈ కొద్దిమనవులు చేర్చుట మంచిది.

"ప్రభువా, పరిశుద్ధజీవితము జీవించుటకు శక్తి నిమ్ము"

"పరిశుద్ధాత్మ నాలో నివసించుచున్నాడని గుర్తు చేసికొనుటకు నాకు సహాయము చేయుము. కాబట్టి ఆయనను నేను దుఃఖపరచే ఏ పని చేయకూడదు".

పరలోక పక్షమున నున్నవ్యక్తికి తగినట్టుగా నన్ను సాధ్యమైనంత పరిశుద్ధుని చేయుము.

"నేను పాపము చేయవలెనని కోరుకొనినను దానిచేయకుండ నన్ను కాపాడుము."

"పాపము చేయునట్లు శోధన రానీయకుము, పాపము చేయుటకు అవకాశము రాకుండచేయుము" ఇవి రెండు ఒకేసారి ఎన్నటికి రానీయకుము.

"దుర్మార్గుడైన వృద్ధునివలె లేక (స్త్రీ) వలె చావకుండ కాపాడుము."

"నీ నామమునకు అవమానము తెచ్చునదేదైనను చేయకుండ కాపాడుము"

"నేను పాపములో పడుటకంటే నన్ను పరలోకమను ఇంటికి తీసుకొని పొమ్ము"

మోకాళ్ళ ప్రార్థనలో అరిగిపోకుండా పరిశుద్ధజీవితమును ఆశించలేవు. ఇందులో ఎంతో నిజం ఉంది.

**క్రైస్తవ సహవాసమునకు సమీపముగా ఉండవలెను:**

ఇతర సహోదరుల సహవాసము చేత మన పరిశుద్ధజీవితము ప్రభావితమగును. ఒకే జాతి పక్షులు కలిసి ఉన్న రీతిగా దేవుని ప్రజలు కలిసి ఉండవలెను. పేతురు, యోహాను సన్‌హెడ్రిన్ సభనుండి విడుదలపొందిన తర్వాత వారు వెంటనే క్రైస్తవ సహోదరులను కలుసుకొనిరి (అ.కా. 4:23). సమాజముగా కూడుట మానవద్దని మనము హెచ్చరించబడితిమి (హెబ్రీ 10:25) అపొస్తలుల కార్యముల గ్రంథములో పరిశుద్ధాత్మ వెంటనే దిగివచ్చెను. ఎప్పుడనగా, ఆ ప్రజలు కూడియుండినప్పుడు. దీనినే "ఆత్మయొక్క సామూహిక అనుభవము" అందురు.

ప్రభువు మరణము రొట్టె విరుచుట ద్వారా క్రమముగా గుర్తుచేసుకొనుచున్నాము. మన పాపములకు రక్షకుడు కట్టిన క్రయమెంతో ఈ సన్నివేశము జ్ఞాపకము చేయుచున్నది. ఇది పాపము చేయకుండుటకు శక్తివంతమైన సాధనము. ఈ ప్రభురాత్రి భోజనము ద్వారా పాపము యొక్క క్రయమెంతో దేవుడు తెలియజేయుచున్నాడు. తద్వారా దుష్టుని ఎదిరించుటకు మనము బలముగలవారమగుచున్నాము. స్థానిక సంఘ కూడికలన్నిటికి ఇదే సత్యము వర్తిస్తుంది.

**ప్రభువు కొరకు వ్రేక (విరామము) లేకుండ పనిచేయుట:**

ప్రభువు కొరకు వ్రేక లేకుండ పనిచేయుట వలన ప్రయోజనమున్నదని ఆనేకమంది విజయవంతమైన క్రైస్తవులు ఋజువుచేసిరి. (ప్రసంగి 9:10) ఐజక్ వాట్స్ ఇలాగు వ్రాసెను.

ప్రయాసపడుచున్న పనులలో, నేర్పరి తనములలో,
నే నెప్పుడు పని చేయగోరుచున్నాను
ఏలయనగా సాతాను సోమరి చేతుల ద్వారా
హాని చేయుటకు ప్రయత్నించును.

దీనిని మరొక రీతిగా చెప్పవచ్చును. మనము ఏదేని పనిచేయకుండ ఉండినపుడే గొప్ప శోధన, ప్రమాదములు ఎదుర్కొందుము. దావీదు అవమానముతో ఈ పాఠమును నేర్చుకొనెను. "వసంతకాలమున రాజులు యుద్ధమునకు బయలుదేరు సమయమున దావీదు యెరూషలేమునందు నిలిచెను." (2 సమూ 11:1) దావీదు ఒక స్త్రీని చూచి మోహించి వ్యభిచారముచేసెను. అతని పాపము నరహత్య ద్వారా దాచుటకు ప్రయత్నము చేసెను.

సొదొమను గూర్చి ఆలోచించినప్పుడు వారియొక్క పాపము అనగా స్వలింగ సంపర్కము గుర్తుకు వచ్చుచున్నది, ఆ పాపము చేయుటకు మరొక తీవ్రమైన పాపము నిర్విచారమైన సుఖస్థితియని యెహెజ్కేలు గుర్తుచేయుచున్నాడు (యెహె 16:49) అది పాపమును రేపుటకు కేంద్రమని చెప్పుటలో ఆశ్చర్యములేదు.

దేవుని కొరకు పనిచేయుటవలన ఉన్నతమైన స్థితిలోనికి పోగలము. మన శరీర శక్తిని అల్పమైన వాటికి వాడక నైతికముగా గొప్పగా జీవించడానికి వినియోగించగలము. ముఖ్యముగా బ్రహ్మచర్యము చేపట్టినవారు వారి శరీర బలమును అలుపెరుగని సేవకు వినియోగించాలి. వారు పనిచేత చంపుకొని, ప్రార్థన చేసి మరల జీవింతురు అని ఒక భక్తుడు చెప్పెను. అభివృద్ధికరమైన కార్యములు చేయు సమయమున అద్భుతమైన భద్రత కలిగియుందురు.

**శరీర క్రమశిక్షణ ఆచరించవలెను:**

పరిశుద్ధతకు, శరీర క్రమశిక్షణకు సంబంధమున్నది. అందుకే పౌలు ఇలాగు చెప్పెను. "గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుటలేదు. గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలుగగొట్టి, దానిని లోపరుచుకొనుచున్నాను." (1కొరింథీ 9:27) ఈ భాగమును నేటి ఆంగ్ల అనువాదము

(T.E.V) ఇలాగు వివరించెను.

అందువలనే నేను ముగింపు గీతకు నేరుగా పరుగెత్తుచున్నాను. అందువలననే ఒక బాక్సింగ్ యోధునివలె ఉన్నాను. అతడు దెబ్బలను వృధాచేయడు. దెబ్బలతో నా శరీరమును ధృఢపరచుకొని పూర్తిగా స్వాధీనము చేసికొనుచున్నాను. ఇతరులను పోరాటములోనికి రమ్మని పిలిచిన తర్వాత నేను తృణీకరించబడకుండునట్లు కాపాడుకొనుచున్నాను.

అతడు తన శరీరమును అక్షరానుసారముగా నలుగ గొట్టుకొనుచున్నాడని పౌలు ఉద్దేశ్యము కాదు. అతడు ఆశానిగ్రహము సాధనచేసి లైంగిక విషయములోను నిద్ర విషయములోను ఆహార విషయములోను, వ్యాయామ విషయములోను. తన్ను తాను స్వాధీన పరచుకొనుచున్నాను అని చెప్పుచున్నాడు. అతడు శరీర వాంఛలు తీర్చుకొనుటకు శ్రద్ధ చూపలేదు. మనలో అనేకులము వారమునకు వెయ్యిసార్లు శరీర ఇచ్ఛలను విసర్జించుటకు “కాదు” అని చెప్పలేము. ప్రస్తుత లోకపుజ్ఞానమును తృణీకరించుట కూడ ఇందులో ఇమిడి ఉన్నది. “అది మంచిదిగా అనిపించినయెడల చేయుము” అని లోకము చెప్పును.

మనము శోధనను ఎదిరించిన ప్రతిసారి దేవుడు బహుమతి ఇచ్చునని మరువరాదు. “శోధన సహించినవాడే ధన్యుడు” అని (యాకో 1:12)లో చెప్పుచున్నాడు. ఎల్లా వీలర్ విల్‌కాక్స్ అను అతను ఇలాగువ్రాసెను.

అమరుల వరుసలో పేర్లు వ్రాయబడినపుడు
మన పేరు లేక పోవుటను చూచి నాకు ఆశ్చర్యము కలిగినది.
అయితే చేసిన క్రియలను బట్టిగాక, మనము ఎదిరించిన వాటిని బట్టి మన స్థలములు నియమింపబడినవి.

నిద్రలో మనం గడుపు సమయము కూడా క్రమశిక్షణ కలిగిఉండాలి. నిద్రమేల్కొలుపు గడియారము కూడా ఆత్మీయసాధనములలో ఒకటి. ఆహారము భుజించుటలోను, పానీయము త్రాగుటలోను అదుపు ఉండవలెను. సొదొమ పాపములకు కారణము ఆహార సమృద్ధి అని జ్ఞాపకముంచుకొనవలెను. (యెహె 16:49). దీని భావమేమనగా భౌతిక వ్యాయామము చేయవలెను. అయితే అవి కొంతమట్టుకే ప్రయోజనమని అపొస్తలుడైన పౌలు 1తిమో 4:8 లో చెప్పెను. దీని భావము క్లుప్తముగా

ఇట్లు చెప్పవచ్చును. "శోధన తలుపు తట్టినప్పుడు యేసు ప్రభువును తలుపుయొద్దకు పంపుము."

**నీ ఆలోచనా జీవితమును కాపాడుకొనుము:**

దేహమును క్రమశిక్షణలో ఉంచుకొనుట ఎంతముఖ్యమో ఆలోచనా విధానమును అదుపుచేసికొనుట కూడా అంత ముఖ్యము. మంచిగానీ, చెడుగానీ మనమేమి ఆలోచించుచున్నామో దానిని అదుపు చేసికొనగలం అనేది వాస్తవం. మన మనస్సు ఊట లాంటిది. దానినుండి క్రియలు వచ్చును. (సామె 4:23) యాకోబు దీనిని స్పష్టపరచెను. 1:13-15 పాపము మనస్సులో ప్రారంభమగుచున్నది. దీర్ఘాలోచన పాపపు క్రియకు దారితీయును. అలాగే కొనసాగిన కార్యము మరణమునకు దారితీయును. ఇది జీవిత చక్రమును పోలియున్నది, గర్భధారణ, జన్మము, ఎదుగుట, మరణించుట.

మనము దేనిని ఆలోచింతుమో అలాగే మనమగుదుము. మానవుని హృదయము ఎలాగు ఆలోచనచేయునో అతను ఆలాగే తయారగును. (సామె 23:7) అందువలననే టి.వి., వీడియోక్యాసెట్లు, రేడియో, చలన చిత్రాలు మ్యాగ్జైన్స్ (మాసపత్రికలు) మనలోని పశుత్వాన్ని పురిగొల్పుదేనినైననూ అదుపులో ఉంచుకొనుట ప్రాముఖ్యము. కొన్నిసార్లు యువకులతో నేను టి.వి. ని బైబిలులో రెండు పర్యాయములు కనుగొంటినని తమషాగా చెప్పుదును "ఆ దినములలో యెహోవా వాక్కు ప్రత్యక్షమగుట అరుదు. 1 సమూ 3:1 బి.

There was no vision అని ఆంగ్లములో వున్నది. దానికి There was no (Tele) vision అని చెప్పుదును. "వ్యర్థమైన వాటిని చూడకుండ నా కన్నులను త్రిప్పివేయుము." (కీర్త 119:37) అని ఆంగ్లములో Turn away తో ప్రారంభమైనది. వ్యర్థమైన అనే మాటకు Vanity అని ఉన్నది. కావున T.V. అని చెప్పితిని.

క్రొత్త సంవత్సర సందర్భమున టి.వి ట్యూబు చెడిపోయినది. అప్పుడు క్రైస్తవ దంపతులు దానిని మార్చవలెనా లేక తీసివేయవలెనా అని ప్రభువు నడిగిరి, మరుసటి ఉదయాన బైబిలు పఠనలో వరుస క్రమాన కీర్తన 101 చదువవలసి వచ్చెను. వారు కోరుకొనిన జవాబు 2బి లో 3 ఎ వచనములలో కనుగొనిరి "నా యింట

యదార్థహృదయముతో నడుచుకొందును." "నా కన్నుల ఎదుట నేను ఏ దుష్కార్యమును ఉంచుకొనను."

ప్రతిజీవితములోను కొన్ని వస్తువులు చెడుతో సంబంధము కలిగినవిగా ఉండును. వాటిని ద్వేషించునట్లుగా మన మనస్సును స్వాధీన పరచుకొనవలెనని యూదా హెచ్చరించుచున్నాడు. (యూదా 23వ). ఆలోచన విధానమును స్వాధీన పరచుకొనుటలో అనుకూలమైన సంగతులు కూడా ఉన్నవి. చెడ్డ ఆలోచనలను నెట్టివేయుటమాత్రమే కాకుండ పవిత్రమైనవి, మాన్యమైనవి ఏవో వాటితో మన మనస్సులను నింపుకొనవలెను. ఇట్టి అనుకూలమైన ఆలోచన లేఖనానుసారముగా జీవించుటకు శక్తి నిచ్చును. ఈ ఆలోచనలో లేఖన శక్తి ఉన్నది. (ఫిలిప్పి 4:8)

అనుభవము మనకు బోధించునదేమనగా ఒకే సమయములో రెండు ఆలోచనలు చేయలేము. దీనిని ఆచరణలో పెట్టి కనుగొనవచ్చును. పాపమును గూర్చియు, క్రీస్తును గూర్చియు ఒకేసారి ఆలోచింపజాలము. కాబట్టి ప్రభువును గూర్చి ఎక్కువగా ఆలోచించుటవలన మన జీవితములు ఎక్కువ పవిత్రములగును. క్రీస్తును గూర్చి అధికముగా ఆలోచించుటవలన అధికముగా క్రీస్తుని పోలియుందుమని మనం చెప్పగలము. ఈ సత్యము పౌలు 2కొరింథీ 3:18 లో వివరించాడు. "మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము." క్రైస్తవ పరిశుద్ధతకు ఈ వచనము ప్రాముఖ్యము. అందువల్ల శ్రద్ధగా దీనిని పరిశీలించుట అవసరము. మనమందరము – అనగా నిజమైన విశ్వాసులు అందరూ, ముసుకులేని ముఖము – పాపము ప్రభువునకు, మన ముఖములకు అడ్డు తెరగానున్నది. మనము పాపమును ఒప్పుకొని విడిచిపెట్టినప్పుడు ముసుకు లేని ముఖముగల వారమగుదుము. రక్షకునికి మనకు మధ్య ఆటంకమేమియు ఉండదు.

అద్దమువలె ప్రతిఫలింపజేయును – అనగా దేవుని వాక్యమే అద్దము.

ప్రభువుయొక్క మహిమ – బైబిలునందు ప్రభువైన యేసుక్రీస్తుయొక్క నైతిక మహిమను తేరిచూచుచున్నాము. ఆయన గుణసంపూర్ణత, ఆయన కార్యములు, మార్గములసౌందర్యము చూచుచున్నాము. ఆ పోలికగానే మార్చబడుచున్నాము. ఆయనను

కొనియాడుచు ఆయనవైపు తేరి చూచుచుండగా మనం ఆయనవలె అగుచున్నాము. ఆయనను చూచుటవలన మనం మార్చబడుచున్నాము. ఒక భక్తుడు ఇలాగు చెప్పెను "చూపు రక్షించుచున్నది, తేరి చూచుట పరిశుద్ధ పరచుచున్నది."

మహిమనుండి అధిక మహిమనుపొందుచు – మహిమలో ఒక కోణమునుండి మరొక కోణమునకు ఎదుగుట ద్వారా ఇది సంభవించును. ఇది అంతయు ఒక్కసారిగా జరుగదు. ఆయనతో మనం నింపబడిన కాలమంతటిలో ఇది కొనసాగును.

ప్రభువగు ఆత్మచేత – మన గుణములో మార్పు పరిశుద్ధాత్ముని ప్రభావము వలన జరుగును. రక్షకునివైపు విశ్వాసముతో తేరిచూచు వారందరిలో ఆయన క్రీస్తుపోలికను బైబిలు నందు ఆయన ఏ విధముగా చూపబడెనో, ఆవిధముగా ఉత్పత్తి చేయును.

విలియమ్ డి. లాంగ్‌స్టాఫ్ ఇలాగు చక్కగా చెప్పెను.
'యేసును చూచుట ద్వారా నీవు ఆయనవలె ఉందువు.
నీ స్నేహితులు నీ ప్రవర్తనలో ఆయన పోలికను చూతురు"

**పడిపోవుటకంటె పారిపోవుటమేలు:**

భయపడుచున్న శోధనకు, నీకు మధ్య ఆరోగ్యకరమైన దూరముండవలెను. అందుకే కొన్నిసార్లు ధైర్యముతో కూడినమార్గము ఏదనగా పారిపోవలయును, యోసేపు అదే చేసెను. (ఆది 39:12). అతడు తన విచిత్రపుటంగీని పోగొట్టుకొనెను. అయితే కిరీటమును సంపాదించెను. పోరాడువాడు పారిపోయి మరొకదినపు పోరాటము కోసం జీవిస్తాడు అని అతడు ఋజువు చేసెను.

జారత్వమునకు (1కొరింథీ 6:18), విగ్రహారాధనకు (1కొరింథీ 10:14) ధనాపేక్షకు (1తిమో 6:11) మరియు యౌవనేచ్ఛలకు (2తిమో 2:22) దూరముగా పారిపోవలెనని స్పష్టమైన హెచ్చరికలు కలవు. మనము బలమైన తీర్మానముతో కూడిన కార్యము చేయవలెనని ప్రభువు బోధించెను. "కాగా నీ చెయ్యియైనను నీ పాదమైనను నిన్ను అభ్యంతరపరచిన యెడల, దానిని నరికి నీ యొద్దనుండి పారవేయుము. రెండు చేతులు, రెండు పాదములును కలిగి నిత్యాగ్నిలో పడవేయబడుటకంటె కుంటివాడవుగానో, అంగహీనుడవుగానో జీవములో ప్రవేశించుటమేలు. నీ కన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల దాని పెరికి నీ యొద్దనుండి పారవేయుము. రెండు కన్నులు కలిగి అగ్నిగల నరకములో పడవేయబడుటకంటె ఒక కన్ను కలిగిజీవములో ప్రవేశించుట

నీకు మేలు.” (మత్త 18:8,9) అక్షరానుసారముగా మన దేహాలను నరికివేసుకొనుమని ప్రభువు ఉద్దేశ్యముకాదు. మనదేహాలు దేవుని ఆత్మకు దేవాలయములుగా మారినవి. ప్రభువు ఉద్దేశ్యమేమనగా మనము పాపమును చులకనగా తీసుకొని ఆటలాడుకొనవద్దని దానిని కఠినముగా దండించవలెనని నొక్కిచెప్పుచున్నాడు. మనము శోధన నుండి పారిపోయినప్పుడు మన అడ్రసును అక్కడవదిలిపెట్టకూడదు అని మరియొక భక్తుడు సలహా ఇచ్చెను.

**శోధనకు మృతుని వలె ఉండవలెను:**

మనమింకా జాబితాను పూర్తిచేయలేదు. పాపమునకు మనలను మనము మృతులుగా ఎంచుకొనవలెనని పౌలు మనకు గుర్తుచేసెను (రోమా 6:11) ఈ పోలిక స్పష్టముగాను, మరిచిపోనిదిగాను ఉన్నది. సమాధిపెట్టెలో నున్న శవమునకు పోల్చబడినది. పెట్టె పైభాగాన తెల్లని గుడ్డ చుట్టబడెను. తన ముందు భార్య పెట్టెవద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలియజెప్పును. అయితే జవాబు లేదు. సాయంకాలం బయటికి వెళ్ళవలెనని ఆహ్వానించును. అయిన శవము కదలదు మాట్లాడదు. ఆమె పాపము చేయుటకు అతనిని అన్నివిధాల ప్రేరేపించును, అయిననూ అన్ని ప్రయత్నములు వ్యర్ధమగుచున్నవి. ఏలయనగా అతడు మృతుడు. అగస్టీన్ యొక్క అనుభవము దీనిని గుర్తుచేయుచున్నది. ఒకదినమున ఒక స్త్రీ అతనిని రమ్మని పిలిచెను. అతడు మారుమనస్సు పొందకముందు ఆమెతో అక్రమ సంబంధముగలవాడు. అతడు వెనుకకు తిరిగి త్వరత్వరగా నడిచిపోవుచుండెను. ఈమె అతనివెంటవెళ్ళి – “అగస్టీన్ నేనే, నేనే” అని పిలిచెను. అతడు తన భుజము వైపు ముఖము పెట్టి అవును నాకు తెలుసును. అయితే నేను మాత్రంవానిని కాదు” అని జవాబిచ్చెను. పాపము చేయుటకు చెడ్డ ప్రేరణలు వచ్చినప్పుడు మనలను మనమే పాపమునకు మృతులముగా ఎంచుకొని శవమార్గమును అనుసరించవలెను. అయితే అంతటితో ఆగిపోక యేసుక్రీస్తునందు దేవునికి మనలను మనమే సజీవులనుగా ఎంచుకొనవలెను. దీని భావమేమనగా ప్రభువునకు వెంటనే స్పందించి ఆయన హృదయానికి సంతోషము కలిగించు కార్యమును చేయుటకు ఎల్లప్పుడు సిద్ధపడియుండవలెను.

**స్పర్శా ప్రమాదము నుండి తొలగిపోవలెను:**

ఆచరణలో అవసరమైన మరొక సలహా ఏమనగా చిన్నపాటి పరిచయముల నుండి తొలగి పోవలెను. అవేవనగా స్పర్శలు, లాలనలు, ప్రియమైన మాటలు, దేహభాష,

చపలప్రవర్తన. జెర్రి జంకింగ్స్ అను వాడు "మూడీ మంత్లీ" (Moody monthly) లో సూత్రముల జాబితాను వివరించెను. అవి తనను, తన భార్యను, తనకుటుంబమును, ఉద్యోగమిచ్చినవానిని, అతని సంఘమును క్రీస్తు ప్రసిద్ధిని కాపాడుటకు కంచెవలెవున్నవి.

1. ఒక క్రొత్త స్త్రీతో ప్రయాణము చేయుటగాని, భోజనము చేయుటగాని తటస్థించినపుడు ముగ్గురముగా ఉండుటకు ప్రయత్నిస్తాను. నన్నునేను భద్రపరచుకొనుట అవసరము తొలగి పోవుటకు సాధ్యముకాని చివరి సమయములో నా భార్య మొదట నాద్వారా ఆ సంగతి వినును.
2. స్పర్శ విషయములో నేను జాగ్రత్త తీసుకొందును. చేతులు కలిపినపుడు అభినందనలు తెలుపుచూ భుజములుకానీ, చేతిని గానీ తాకినపుడు బంధువులు, ప్రియమిత్రులను మాత్రమే కౌగలించుకొందును. అదికూడా ఇతరుల ఎదుటనే
3. ఇతరులను మెచ్చుకొనవలసివచ్చినపుడు బట్టలు, కేశ అలంకణలనుబట్టి ఆ వ్యక్తిని మెచ్చుకొనను. ఆమె చక్కగా కనబడుచున్నది అని చెప్పుటకు ఆమె బట్టలు చక్కగా ఉన్నవి అనుటకు తేడావుంది.
4. సరసము, తమాషా, పాపాన్ని ప్రేరేపించు సంభాషణ నుండి నేను తొలగిపోదును.
5. వ్రాతలోను, మాటలలోను నా పెండ్లి ప్రమాణమును జ్ఞాపకముంచుకొంటినని నా భార్యకు జ్ఞాపకము చేతును అదేమనగా "మనమిరువురము జీవించినంతకాలం నీతోనే వుందును." దయానా అసూయపరురాలు కాదు, ఆమె ఎప్పుడూ నానుండి ప్రమాణములను కోరదు. నేను పాటించు సూత్రములను బట్టి ఆమె నన్ను అభినందించును.
6. పని అయిన తర్వాత ఇంటికి వెళ్ళిన సమయమునుండి పిల్లలు నిద్రపోవు సమయము వరకు ఆఫీసు పనిని చేయను. ఇది కుటుంబముతో ఎక్కువ సమయము గడుపుటకు వీలు చేయుచున్నది. నా భార్యతో సరసమాడుటకు సమయమును గడుపుదును.

**చిత్తమును బలహీనపరచుదాని నుండి తొలగిపోవలెను:**

పాపమును ఎదిరించు స్వభావము తగ్గిపోకుండ చూచుకొనవలెను. ఆల్కహాలు, మనస్సును త్రిప్పివేయు మందులు అను వాటిని వాడినపుడు పాపమును ఎదుర్కొనే సామర్థ్యమును కొల్పోదుము.

మందులు, ఆల్కహాలు సేవించువారు సామాన్యముగా వారు చేయని పనులను చేసి విపరీతప్రవర్తనను కనపరతురు.

ఎరిన్ లుట్జర్ ఇలాగు వ్యాఖ్యానించెను. త్రాగుబోతుతనము, అమర్యాద రెండు కలిసిపోవునని నోవహు అనుభవము తెలియజేయుచున్నది. బైబిలులో త్రాగుబోతు తనమును గూర్చి వ్రాసిన మొదటి సన్నివేశమిది. నోవహు తన గుడారములో దిగంబరిగా పడియుండెను. ఈ త్రాగుబోతుతనము వ్యక్తి యొక్క నైతిక ప్రమాణమును దిగజార్చును. త్రాగినవాడు నిరోధకశక్తిని కోల్పోవును. సామాన్య ప్రజలకు అట్టి పనులు చేయుటకు ఇబ్బందికరము. ఈ మధ్యనే ఒకడు తన అనైతిక కార్యమును గూర్చి చెప్పుట వింటిని. "మేము కొన్నిసార్లు త్రాగితిమి. ఆల్కహాలు మనుష్యులను పశువులనుగా మార్చివేయును. వారికేదియూ తప్పు అనిపించదు. వారు సమస్యలో మునిగితేలుతూ ఉందురు. త్రాగుడు వారికి నీటిపారుదలగా నున్నది."

**సహాయము కోసము పిలుపు:**

భయంకరమైన శోధనలో కొట్టుకొని పోయెదమన్న సమయములో నిస్సహాయ స్థితిలో నుండినప్పుడు మనమేమి చేయాలి? ప్రభువు నామమున ప్రార్థన చేయుము ఇదే జవాబు. యెహోవా నామము బలమైన దుర్గము నీతిమంతులు దానిలోనికి పరుగెత్తి క్షేమముగా నుందురు (సామె 18:10). పేతురు అలలలో మునిగిపోవుచున్నానని గ్రహించినపుడు "ప్రభువా నన్ను రక్షించుము" అని కేక వేసెను. వెంటనే ప్రభువు అతనిని రక్షించెను. ఆయన ఎల్లప్పుడూ అలాగే చేయును.

**దేవుడు నీలోను, నీద్వారాను పనిచేయుచున్నాడని విశ్వాసముంచుము:**

సామ్యేల్ రూథర్ఫోర్ట్ అనువాడు ఇలాంటి సలహా ఇచ్చెను "ఆయనకోరుకొనిన పరిస్థితులకు నిన్ను నీవు బయలుపరచుకొనుము, అప్పగించుకొనుము. దీని అర్థమేమి? "జాన్ ఎల్బైర్డ్ ఇలాగు వివరించెను. దీని అర్థమేమనగా నీవు, నేను ఉదయమున దేవునికి సమర్పించుకొనినప్పుడు, ఆ దినము దేవునికి సమర్పించినప్పుడు దేవుని అనుమతిలేకుండా ఆ దినములో ఏదియూ ప్రవేశింపజాలదు. ప్రతిదానికి దాని చోటున్నది, ప్రతిదానికి దాని ఉద్దేశమున్నది. అవి మన ఆలోచనలకు అడ్డముగా రావచ్చును. అవి మనల్ని, ఇబ్బంది పెట్టవచ్చును, లేక మార్చవచ్చును. అయితే మన దినమును దేవునికి అప్పగించినప్పుడు ఆ దినమున సంభవించిన ప్రతి సంగతి ఆయన అనుమతి చొప్పుననే జరిగెనని మనం విశ్వసించగలము. దానికి వ్యతిరేకముగా మనము తిరుగుబాటు చేయకూడదు. అది మనకు చేదు అనుభవమై దేవుడు మనకివ్వబోవు ఆశీర్వాదమును పోగొట్టుకొందుము.

అయితే మనం దానికి లోబడవలెను. పరిస్థితులను ఉన్నట్టుగానే ఒప్పుకొందుము.”

హెరాల్డ్ వైల్డ్ష్ ఇలాంటి హెచ్చరికనే ఇచ్చెను. “నీ పాప భారమంతయు క్రీస్తుయొక్క సంపూర్ణమైన కార్యముమీదనే వదిలివేసి విశ్రమించినరీతిగా నీ జీవితసేవావిషయములో వచ్చు భారమంతటిని మనలో వుండి పనిచేయు పరిశుద్ధాత్మకు అప్పగించి విశ్రాంతి తీసుకొనవలెను. ప్రతి ఉదయము పరిశుద్ధాత్మచేత నడిపింపబడుటకు నిన్ను నీవు అప్పగించుకొని నెమ్మది గలిగి ఆయనను స్తుతించుచూ ముందుకు సాగుము. నీ దినమును (సమయము) నిన్నును ఆయనకు అప్పగించుకొనుము. సంతోషముతో దినమంతయు ఆయనపై ఆధారపడుటకును, విధేయతచూపుటకును అలవాటు చేసికొనుము. ఆయన నడిపింపుకొరకు, ఆయన వెలుగునకు, గద్దింపునకు, బోధించుటకు నీ ద్వారా చేయుటకు ఆయన కోరిన దానిని చేయుటకు సిద్ధపడియుండుము. ఆయన పని చేయుటకు సిద్ధపడియుండుము. నీ వెలిచూపును, నీ ఆలోచనను బట్టి ఎన్నడూ పనిచేయకూడదు.”

ఆత్మచేత నింపబడుట ఉద్రేకముకాదు. అది పరిశుద్ధత. దినములు మామూలు కార్యక్రమములతో, కష్టతరమైన పనితో నిండియుండవచ్చును, అప్పుడప్పుడు మనలను ప్రోత్సహించుటకు పర్వత శిఖరముల అనుభవము ఉండవచ్చు. జీవితము వలవంటిది. మనసేవ దైవశక్తివలన వెలుగును, దేవుడు మనతోను మనద్వారాను పనిచేయుచున్నాడని మనమెరిగి యుండవలెను. అది గర్వమునకు దారితీయరాదు. మనము ఇతర వ్యక్తులను కలిసినప్పుడు దేవునికొరకు కార్యము జరుగును. అక్కడ శక్తియుండును (లూకా 24:49) (అ.పొ.కా. 1:8) సాక్ష్యమిచ్చుటకు ధైర్యముగా వుండుము (అ.కా. 4:13, 29, 31), సంతోషముండును (అ.కా 13:52) స్తుతియుండును (లూకా 1:67 - 75) (ఎఫె 5:19-20) మరియు విధేయత ఉండును (ఎఫె 5:21) ఇప్పుడు మనం పరిశుద్ధత అను అంశములో వేరు సంగతులను ఆలోచింతము. క్రైస్తవుడు రెండు రాజ్యములలో నున్నట్టు కనుగొనుచున్నాడు - ప్రభువు రాజ్యము, లోకరాజ్యము. వాటి వ్యత్యాసమును అతడు కనుగొని అతడు దేనికి లోబడుచున్నాడో తెలిసికొనుట అవసరము. ●

# అధ్యాయము - 12

# రెండు రాజ్యములు

ఇది రెండు రాజ్యముల కథ. ఒకటి ప్రపంచ రాజ్యము, రెండవది దేవుని కుమారుని రాజ్యము. పూర్తిగా ఇవి భిన్నమైనవి. సమాధానపరచుటకును సాధ్యముకాదు. ఒకటి నైతికముగాను, ఆత్మీయముగాను చీకటి సంబంధమైనది. మరొకటి వెలుగు సంబంధమైనది. వాటిమధ్య గొప్ప ఆగాధమున్నది.

**ప్రపంచము:** లోకమును గూర్చి ఈ భావముతో మాటలాడినప్పుడు భూమి అనే గ్రహానికి సంబంధించినది కాదు, ప్రకృతి సంబంధమైన సౌందర్యము కాదు, నశించిపోయిన మానవజాతికూడా కాదు. అది అన్యనాగరికతతో ప్రారంభమై దేవునిపై ఆధారపడకుండా నిర్మించబడిన ఒక విధానము. అది దేవుని వదిలివేసిన మానవ సమాజము. దేవుడు లేకుండా తనకై తానే సంతోషముగా జీవించవలెనని మనుష్యుడు చేసికొను కార్యములు, సమస్త ప్రయత్నాలు అందులో ఇమిడి ఉన్నవి. దానికి అబద్ధ సూత్రములు, అబద్ధపు విలువలు, అబద్ధ దేవతలు ఉన్నారు. దానిగుణము మానవుని నీచకోర్కెలు, అహంకారము స్వప్రయోజనము. దేవునికి వ్యతిరేకముగా మానవుడు తనకు తానే సంగతులను క్రమపరచుకొనుట, ప్రభువుని తృణీకరించుటయే కాక, విడిచిపెట్టిరి. ఆయనకు (దేవునికి) తీవ్రమైన వ్యతిరేకముగా ఉన్నది. ఇది దూరముగా లేక వేరుగా నుండుటయేకాక అది ఒక యుద్ధముగా నున్నది.

**ప్రభువు రాజ్యము:** దేవుని కుమారుని రాజ్యమును గురించి మనం మాట్లాడునపుడు దాని భావమేమనగా యేసుక్రీస్తును రక్షకుడుగాను, ప్రభువునుగాను అంగీకరించిన ప్రజల సమాజము ఆచరణలో దీనిని క్రైస్తవ గుంపు అని చెప్పవచ్చు (రాజ్యమునకు, సంఘమునకు సాంకేతిక బేధమున్నను ప్రస్తుతానికి వాటిని ఒకటిగానే ఎంచుచున్నాము)

**సాతాను మరియు క్రీస్తు:** సాతాను ప్రపంచపాలకుడు. వాడు ప్రాముఖ్యతలను, పద్ధతులను జరిగించుటకు ఆజ్ఞాపించువాడు, వానికి లోకాధికారి అని పేరున్నది. (యోహా 12:31, 14:30 16:11) యుగసంబంధమైన దేవత అనియు (2కొరింథీ 4:4) దుష్టుడు అనియు (1యోహా 5:19) చెప్పబడెను. వాడు అబద్ధికుడును, మోసకారి అని యోహా 8:44లో చెప్పబడినది. వాని ఉద్దేశము దొంగిలించుట, హత్యచేయుట మరియు నాశనము చేయుట (యోహా 10:10)

ప్రభువైన యేసుక్రీస్తు వేరొక రాజ్యమునకు పాలకుడు. సమృద్ధియైన జీవమునిచ్చుటయే ఆయన యొక్క లక్ష్యం (యోహా 10:10) అనేకులు పాలకులు అని పిలువబడినను మనకైతే ప్రభువు ఒక్కడే. ఆయన యేసుక్రీస్తు. ఆయన ద్వారా సమస్తమును కలిగెను. మనము ఆయన ద్వారా కలిగిన వారము (1కొరింథీ 8:6)

**ఎవరు ఎవరికి సంబంధించినవారు?**

మారుమనస్సుపొందని ప్రజలందరూ ప్రపంచరాజ్యములో సభ్యులు (1యోహా 5:19) సహజమైన జన్మద్వారా వారు సభ్యులగుచున్నారు. వారు భూలోక నివాసులు అనగా లోకములో వారికి సంతోషమున్నది. ఇబ్బందిలేదు. వీరిని గూర్చి కీర్తనకారుడు ఇలాగు చెప్పెను. ఈ జీవితకాలములోనే తమ పాలుపొందినవారు (కీర్త 17:14) వారు లోకమును ప్రేమింతురు. లోకము వారిని ప్రేమించును. (యోహా 15:19)

ఒకవ్యక్తి మరల జన్మించినపుడు అతడు మొదటి రాజ్యములోనుండి రెండవరాజ్యములోనికి దాటుచున్నాడు. ఈ మార్పును నీటి బాప్తీస్మము సూచించుచున్నది అతడు ఇంకను లోకములో ఉండిననూ అతడు ఈలోకవిధానములో ఉండడు (యోహా 14:18, 17:11) అతడు యాత్రికుడు, పరదేశి (1పేతు 2:11) ఈ లోక లక్షణము ఏదియూ తీసికొనకుండ తమ పరలోక గృహమునకు అతడు లోకములో ప్రయాణముచేయుచున్నాడు. అతడు లోకమును ప్రేమించడు. ఏలయనగా అతడు లోకమును ప్రేమించిన యెడల దేవునికి శత్రువగునని అతనికి తెలుసు. అందువలనే అతడు లోకముచేత ద్వేషింపబడుటకు ఇష్టపడుచున్నాడు. (యోహా 15:18, 19, 17:14, 1 యోహా 3:13) వాస్తవమునకు లోక సారూప్యమొందుటకు ఇష్టపడని వాడు (రోమా 12:2) అతడు లోకమునకు విరోధిగా కొనసాగును. దానితో కలిసి జీవించడు.

లోకముతో అతని కున్న సంబంధము దెబ్బతిన్నది. అతడు దానికి విరోధముగా దాని కార్యములుచెడ్డవని సాక్ష్యమిచ్చును. (యోహా 7:7) అయితే సువార్తను అతడు దానితో పంచుకొనును. “లోకబానిసత్వమునుండి మనుష్యులు విడిపింపబడి నిజమైన స్వాతంత్ర్యమును క్రీస్తునందు ఎలా కనుగొనగలరో. (1కొరింది 5:18 –21) అని”

లోకము ఆకర్షణీయముగాను, ఊరించేదిగా లోబరచుకొనేదిగా ఉండును. కొందరు క్రైస్తవులకు అది ఆకర్షణీయముగా వుండును. దానితో సంబంధము పూర్తిగా తెంచుకుంటే నష్టపోదుమని తలంచుదురు. అందువలన వారినడకలో అస్పష్టత కనబడును. రెండు రాజ్యములలో నున్న శ్రేష్ఠమైన వాటిని కోరుకొందురు. ఈ కారణము చేతనే లోకమునకు, సంఘమునకు బేధమును స్పష్టముగా చూడలేక పోవుచున్నారు. ఒక వ్యక్తి ఇలాగు చెప్పెను. “నేను సంఘము కొరకు చూచితిని అది లోకములో నున్నది. నేను లోకము కొరకు చూచితిని అది సంఘములో నున్నది.” వడ్స్‌వర్త్ అను కవి లోకము మనలో అమితముగా నున్నది. ఆలస్యముగానైనా త్వరగానైనా ప్రవేశించి కాలము గడుపుచున్నది. మన శక్తులన్నియు వృధాగా పడియున్నవి.

దేవుని బిడ్డ లోకముతో సఖ్యత కోరుకుంటే దేవుడు దానిని అనుమతించును. అయితే లోకములో ఏమియూ లేదని తెలుసుకొని చివరికి దుఃఖించును. అది లోకమునకు గృహద్వారము. దానియొక్క సౌఖ్యములు వట్టివి, క్షణికమైయున్నవి. శాశ్వతమైన తృప్తిని ఇవ్వలేదు. చూచుటకు ఆశాజనకముగానున్నను అది అనుభవములో చేదుగా ఉండును.

ప్రభువా నేను పగిలిన తొట్లతో ప్రయత్నించాను.
అయితే నీరు నిలువలేదు
త్రాగుటకు వంగితిని గాని అవి పరుగెత్తిపోయెను.
విలపించగా అవి నన్ను హేళన చేసినవి.

**లోకములో ఏమున్నది?** లోకములో ఉన్నదంతయు నేత్రాశ, శరీరాశ, జీవపుడంబము అని అపొస్తలుడైన యోహాను చెప్పుచున్నాడు (1యోహా 2:16) అనగా లోకము వ్యభిచారమును, ఉద్రేకమును, హింసను, యుద్ధమును, ఆస్థిని, సామాజిక హోదా, దాని శక్తిని, అధికముగా ప్రేమించును. లోకప్రజలు ప్రస్తుతకాలమునకే గాని నిత్యత్వమునకు జీవించరు. ప్రజలకొరకు గాని దేవునికొరకు గాని జీవించరు. గతించే వస్తువులపైనను, స్వార్ధముపైనను మనస్సు నిలుపుదురు. వారి ప్రణాళికలన్నియు సమాధితో

సమాప్తమగును. క్రైస్తవుని యొక్క విలువలు, ప్రాధాన్యతలు వేరుగా ఉన్నవి. అతడు శరీరేచ్ఛతో, ఉద్రేకము పోరాటముతో కాక, ప్రేమతోను పవిత్రతతోను, ఐకమత్యముతోను గుర్తింపునొందును. అతడు నీతికి, సమాధానమునకు, పరిశుద్ధాత్మయందలి ఆనందమునకు ప్రాధాన్యత నిచ్చును (రోమా 14:15) నేత్రాశకు బదులుగా విశ్వాస సంబంధమైన కోర్కెలు కలిగివుండును. శరీరాశకు బదులుగా పరిశుద్ధాత్ముని కోర్కెలను ఆశించును. జీవపుడంబమునకు బదులుగా దేవుని మహిమను కోరుకొనును.

**లోకసంబంధమైనవి అనగా ఏవి?:** గతంలో లోకపద్ధతికి అనగా పొగత్రాగుట, సారా త్రాగుట, నాట్యమాడుట, జూదమాడుట, చలనచిత్రములు చూచుట, మొదలగువాటిపై నిషేధముండెను. ఇప్పుడైతే లోకము వేరొక ప్రక్కకు పోయినది. నేను త్రాగను, పొగత్రాగను, ఆకు నమలను, బాలికలతో పోను అను గలగలమను శబ్ధములతో ఈ నిషేధములు హేళనకు గురియగుచున్నవి. ఇవి లోకసంబంధమైనవి కాదు అని మనలను నమ్మించుచున్నారు. మనము చెడ్డ వైఖరినుండి, ఉద్దేశ్యములనుండి, ఆలోచనావిధానము నుండి తొలగిపోవలెను. ఈ కారణము చేతనే ఎర్విన్ లుట్‌జర్ ఇలాగు చెప్పుచున్నాడు. అనేకమంది క్రైస్తవులు ఆ పాపముల జాబితాకు అభ్యంతరము చెప్పుదురు. వారు క్రైస్తవశీలమును క్రొత్త నిబంధనలో చెప్పు ఉన్నత స్థాయికి ఎదగవలెనని కోరుటకాదు గానీ వారి వ్యక్తిగత ప్రమాణములను దిగజార్చుకొనుటకే కోరుచున్నారు. కొన్ని సుఖములను అద్భుతమైన వాటిని పోగొట్టుకొందుమని అనుమానించుదురు. అందువల్ల గతములో నిషేధములను తప్పుడు కారణముల చేత విమర్శింతురు. వారి నైతిక ప్రమాణములను గురించి తాము ఒప్పుకొనిన వాటిని తరచుగా మార్చుకొందురు.

**ఏలోకము?:** ప్రపంచము అనేక రూపములు కలిగియున్నది. రాజకీయ ప్రపంచమున్నది. దాని స్వభావమే అవినీతి. వర్తక ప్రపంచమున్నది. అది అనైతిక ఆచారములతో నిండియున్నది. మత ప్రపంచమున్నది. దాని చేతులకు యేసు రక్తపుమరకలున్నవి. కళ, సంగీతము, సంస్కృతి అనే లోకమున్నది. అక్కడ యేసు నామము తొలగించబడినది. ఏలయనగా అది వారికి ఇబ్బందికరం. వినోద ప్రపంచముకూడా వున్నది. అందులో అపవిత్రత లైంగిక వ్యంగ్యములు, ద్వంద్వార్ధములతో నిండియున్నది. హాలీవుడ్, టి.వి. ఈ ప్రపంచ వర్ణపటములు.

లోకములో నున్న నానా రకములైన సంగతులకు విశ్వాసి ఎట్లు స్పందించవలెను. రాజకీయలోకములో క్రీస్తుగానీ, అపొస్తలులు గానీ జోక్యముచేసికొనలేదని

విశ్వాసిగుర్తుంచు కొనవలెను. "నా రాజ్యము ఈలోకసంబంధమైనదికాదు" అని ప్రభువు చెప్పలేదా? (యోహా 18:36) మన పౌరత్వము పరలోకములో నున్నదని పౌలు మనకు జ్ఞాపకము చేయలేదా. (ఫిలిప్పీ 3:20) మానవుని సమస్యలకు పరిష్కారము రాజకీయములోకాదు. అయితే కృపద్వారా విమోచించు సువార్తయందే పరిష్కారమగును.

వ్యాపారలోకముతో దేవుని పిల్లలు పూర్తిగా సంబంధములేకుండ జీవించలేరు. పౌలు తెలివైన సలహా ఇచ్చెను "ఈలోకమును అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టు ఉండవలెను" (1కొరింథీ 7:31). పనిలోనున్న సైనికులు దానిలో చిక్కుకొనరు (2తిమో 2:4) మతలోకమును గూర్చి మనం తలంచునప్పుడు బైబిలులో చెప్పబడిన క్రీస్తు లేని మతంను లోకమతముగా ఎంచుచున్నాము. క్రైస్తవుడు ఆయన యొద్దకు పోవలెనని ఆజ్ఞ ఇవ్వబడినది. మతమను గవిని వెలుపలికి క్రీస్తునిందను భరించుచూ వెళ్ళిపోవలెను. (హెబ్రీ 13:11-14)

సంస్కృతి, కళ, సంగీత లోకములో మొదటి ప్రాముఖ్యత దేనికి ఇవ్వవలెను. నాగకరికతకు కేంద్రమైన ఏథెన్సుకి పౌలు వెళ్ళినప్పుడు పౌలు కళారూపమును చూచి రేపబడలేదు. కానీ విగ్రహారాధనను చూచి దుఃఖించెను. అతడు "అరేయోపగు" మధ్య నిలిచి రక్షణసువార్తను ప్రకటించెను. (అపొస్త 17 అధ్యా)

వినోదలోకమును గూర్చి ఏమిటి? ప్రజల వినోదము పాతాళమునకు పోవు మార్గములోనున్నది. జీవితమంటే ఇంతేనా, హాలివుడ్ హానికరముకాదా? టి.వి పవిత్రతను ప్రోత్సహించునా? నాటకరంగము వలన ఆత్మీయముగా అభివృద్ధిచెందవచ్చునా? దీనికి ఖచ్చితమైన జవాబు ఏమనగా ఈ తరహా మురికిని, చెత్తను అనుభవించువాడు దేవుని కొరకు పనిచేయలేడు. అట్టివానిని దేవుడు వాడుకొనడు. శిష్యుడు ఇప్పుడున్న క్రమములకు, పద్ధతులకు వెలుపటనే ఉండవలెను. పైన పేర్కొనిన వాటితో సంబంధము పెట్టుకొనకూడదు. లోకమునకు వెలుపల ఉపస్తంభము లేక ఆలంబము తనకు దొరికిన యెడల లోకమును కదిలించగలనని ఆర్కిమెడిస్ అను శాస్త్రవేత్త చెప్పెను. క్రైస్తవ విషయములోనూ అంతే. అతడు దానినుండి వేరుకానిదే ప్రపంచమును కదలించలేడు.

**రెండురకముల జ్ఞానము**: దేవుని జ్ఞానమునకు విరోధమైన లోకజ్ఞానమును తెలిసికొందము. ఈ క్రింది పట్టికలో నున్న ఉదాహరణలను బట్టి వ్యత్యాసము తెలిసికొనవచ్చును.

| లోక జ్ఞానము | దేవుని జ్ఞానము |
|---|---|
| 1. చూచుట వలన, ముట్టుటవలన, చేతితో పట్టుకొనుట వలన నిజాయితీని కనుగొందుము | ఆత్మీయ విలువలే ముఖ్యము మిగిలిన దంతయూ తాత్కాలికం (2 కొరింథీ 4:18) |
| 2. మానవుని మనస్సులోను, మేధస్సులోను తెలివిని కనుగొందురు | యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలము (కీర్త 111:10) |
| 3. యజమానిగాను, ప్రభువుగాను ఉండుట చేయించుకొనుట గొప్పతనముగా ఎంచబడును. | దీనస్థితిని అంగీకరించి పరిచర్య చేయటమే గొప్పతనము అనబడును. (లూకా 22:26,27) |
| 4. సాంస్కృతికముగా ఆ కాలములో అందరూ అంగీకరించునది సత్యమనబడును. | దేని విషయమైనను దేవుడు చెప్పినదే అది మారనిది సత్యము (యోహా17:17) |
| 5. గురి ఎక్కువ సంఖ్య పెద్దదిగాను గొప్పది గాను ఉండుట పెద్దదిగా ఉండుటయే అందముగా ఎంచబడును | తక్కువ సంఖ్య. శేషము, గుణముగల కొద్దిమంది(గిద్యోనుసేన)(న్యాయ 7:1,7) |
| 6. స్వార్ధముకోసం జీవించి ప్రాణమును కాపాడుకొనును. స్వార్ధమును నమ్ముకొని ప్రథమ స్థానమిచ్చుట | క్రీస్తు కొరకు, సువార్తకొరకు ప్రాణమును పోగొట్టుకొనుట.(మార్కు 8:35) తనకంటే ఇతరులను ఘనముగా ఎంచుట. ఇతరులకోసం బ్రతుకుట (ఫిలి 2:3). |
| 7. నెట్టుకొనిపైకి పోవుట, ప్రాముఖ్యత, పేరు హోదా, ఘనత వీటిని విజయమందురు. | స్వార్ధమును ఖాళీచేసుకొని క్రిందికి తగ్గిపోవు మార్గమును శిష్యరిక మందురు. (ఫిలిప్పి 2:7) |
| 8. ఆస్థిని కూడబెట్టుకొని ధనవంతులగుట | ఆత్మ అభివృద్ధి నిజమైన ఆస్తి, విశ్వాసి పరలోకములో ధనము కూర్చుకొనును. (మత్త 6:20) పదార్ధసమృద్ధిలో కాక ఆత్మీయ ధనము కలిగిఉండును. ఆశలు |

| | |
|---|---|
| | పరిమితముగా ఉండును. అన్నిటిని వదిలివేయుట వలన అన్నింటిని పొందును |
| 9. చూచుటవలన నమ్మకము కలుగును. మనుష్యుడు వెలిచూపువలన నడుచును. | నమ్ముట వలన చూచును. దేవుని బిడ్డ, వెలిచూపును బట్టి కాక విశ్వాసమును బట్టి నడుచును (2కొరిం 5:7) |
| 10. గమ్యంచేరుటవలన మార్గము సరియైనదే నని చెప్పును. ఎలాగైననూ సాధించుటయేగానీ అవలంభించిన మార్గము పట్టించుకొనరు. | సరియైనది మాత్రమే చేయవలెను. దేవుని వాక్యమునకు లోబడును. ఫలితములు ఆయనకు వదిలివేయును (అపొ 5:29) |

దేవుని జ్ఞానమునకు లోకజ్ఞానమునకు వ్యత్యాసమును సూచించుచూ పౌలు ఇలాగు వ్రాసెను. దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. ఆయన యూదులకు ఆటంకముగాను అన్యజనులకు వెఱ్ఱితనముగాను ఉన్నాడు. గాని యూదులకేమి, అన్యజనులకు పిలువబడిన వారికే క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునైయున్నాడు. (1కొరింథీ 1:21, 23,24, 25) దేవుని వెఱ్ఱితనము మనుష్యజ్ఞానము కంటె జ్ఞానముగలది. దేవుని బలహీనత మనుష్యుల బలముకంటే బలమైనది.

**రెండురాజ్యముల విధానములు:**

రెండు రాజ్యముల జ్ఞానములు భిన్నమైనవిగా ఉన్నప్పుడు తప్పనిసరిగా వాటి పద్ధతులు, పన్నాగములు కూడా భిన్నముగా ఉండును. తారతమ్యములు ఈ విధముగా నున్నవి.

| **లోకపద్ధతులు** | **క్రీస్తు పద్ధతులు** |
|---|---|
| 1. సహాయము చేయు వారికి సహాయము చేయుము | 1. తిరిగి చెల్లించలేని వానికి సహాయము చేయును (లూకా 14:12-14) |
| 2. దెబ్బకు దెబ్బ | 2. కీడు చేసిన వానికి మేలు చేయును |

| | |
|---|---|
| | (రోమా 12:20) (1థెస్స 5:15) |
| 3. అవసరమైతే బలాత్కారము చేయవలెను | 3. రెండవచెంపచూపును (లూకా 6:27,29) |
| 4. పేరాశ ప్రకారము పంచుకొనవలెను | 4. అవసరమును బట్టి పంచుకొనవలెను (మత్తయి 20:1-16) |
| 5. లంచము, అవినీతి ద్వారా ఆటంక ములను అధిగమించును. | 5. ఎల్లప్పుడూ మంచినే చేయుము. అబద్ధ పుమాటలు, రాజీపడుటకు నిరాక రించును (1యోహా 2:1) |
| 6. ఇక్కడ పోటీ అను ఆటవున్నది. | 6. ఏ సూత్రమును విడిచి పెట్టక సహకార వ ఖ , సహాయ బుద్ధితో వెళ్ళవలెను. మనము పోవుటకు మార్గము అదియే(1కొరి12:25) |
| 7. సాధ్యమైనంత తక్కువపనిచేయుము అలాగే ఎక్కువ లాభము సంపాదించుకొనుము. | 7. క్రీస్తునకు చేసినట్లుగా సాధ్యమైన చేయుము, మంచి సాక్ష్యము నిలుపుకొనునట్లు జాగ్రత్తగా నుండుము (కొలస్స 3:22-24) |
| 8. పై రూపమును బట్టి తీర్పు తీర్చును | 8. న్యాయముగా తీర్పు తీర్చును. (యోహా 7:24) |

**ఏ రకపు ఆయుధములు?**

లోకములో ఆయుధములనగా తుపాకులు, యుద్ధాయుధములు మాత్రమే కాక డబ్బు, ప్రోపగాండ, ప్రచారము, మానవుల మానసిక స్థితిపై ఒత్తిడి, అన్యాయమైన ఆచారములు మొదలగునవి. విశ్వాసి యొక్క ఆయుధములు ఏవనగా దేవుని వాక్యము, ప్రార్థన, విశ్వాసము మరియు ప్రేమ ఇవి దుర్గములను పడద్రోయ చాలినంత బలముగలవై యున్నవి. (2కొరింథీ 10:4)

**పురస్కారములు (ఘనతలు):** లోకములో పురస్కారముల గురించి ఆలోచించినప్పుడు అవి ప్రజలను ఎట్లు పురిగొల్పుచున్నవి. దాని కొరకు రిబ్బన్లు, ఫలకాలు, డిప్లమోలు, మెడల్సు, ట్రోఫీలు ఒకేరకమైన వస్త్రములు, మరియు బిరుదులు మొదలగువాటిని

వినియోగించుచున్నారు. ఒకసారి నెపోలియన్ రంగు రిబ్బను చిన్న ముక్కను పట్టుకొని ఇలాగు చెప్పెను. “ఇలాంటి రిబ్బన్లతో రాజ్యమును నిర్మించగలము” ఇది ఎంతయో వింతగానున్నది. స్థానిక షాపులోనుండి కొంతడబ్బుకే రిబ్బన్లన్నీ కొనగలవు. పురుషులు స్త్రీలు ఆకుల కిరీటము కోసం 26 మైళ్ళు పరుగెత్తుటకు ఇష్టపడుచున్నారు. అదియు ఎండిపోయే దండ. ఇవి లోకము యొక్క పురస్కారములు (లేక) బహుమతులు

పౌలు వాటిని గూర్చి క్షయమగు కిరీటములని పేర్కొనెను. అయితే క్రైస్తవులు అక్షయమైన కిరీటము కోసం పరుగెత్తవలెనని హెచ్చరించెను (1కొరింథీ 9:25) నీతి కిరీటముకొరకు, జీవకిరీటము కొరకు, ఆనందకిరీటము కొరకు, మహిమాకిరీటము కొరకు విశ్వాసులు పోరాడవలెనని దేవుని వాక్యము పురిగొల్పుచున్నది. మనుష్యుల ఎదుట క్రీస్తును ఒప్పుకొను వారిని తండ్రియైన దేవుని ఎదుటను, పరిశుద్ధులైన దూతలందరి ఎదుటను ప్రభువు వారిని ఒప్పుకొనును (మత్త 10:32), (లూకా 12:8) “భళా నమ్మకమైన మంచి దాసుడా” అని రక్షకుని మెప్పు వాటికంటె ఎంతో గొప్పదిగదా! (మత్త 25:21-23) విశ్వాసమును బట్టి విశ్వాసి ఇలాగు చెప్పగలడు.

లోకసంబంధమైన ఆడంబరము, మహిమ ఎంతగా విస్తరించిననూ వ్యర్థమే. మధురమైన కథను నేను విన్నాను. అందులో నిజమైన లాభమున్నదని నేను కనుగొంటిని అక్కడ క్రీస్తు స్థలము సిద్ధపరచుచున్నాడు. అక్కడ నాకు నివాసమున్నది. అక్కడ ప్రభువును చూచెదను. అక్కడ దేవునితో నివాసము చేతును. హన్నా. కె. బర్లింగ్‌హామ్

**ఆదర్శవంతమైన పౌరుడు:**

లోకముయొక్క ఆదర్శపౌరుడు ఎవరనగా ధనవంతుడు, అహంకారి, గొప్పవాడనని చెప్పుకొనుచు ఎవరికీ లోబడనివాడుగా నుండును. అయితే క్రీస్తురాజ్యములో ఆదర్శపౌరుడెవరనగా ఆత్మీయ విషయములో దీనుడైనవాడు, దుఃఖపడువాడు, సాత్వికుడు, నీతికోసము ఆకలి దప్పులుగలవాడు, దయగలవాడు, హృదయ శుద్ధిగలవాడు, సమాధాన పరచువాడు, నీతినిమిత్తము హింసింపబడువాడు, (మత్త 5:3-12) యేసు చివరి వారి యెడల, చిన్నవారి యెడల, అట్టడుగున నున్నవారి యెడల, పేదల యెడల, అణగద్రొక్కబడిన వారి యెడల, స్వాస్థ్యము కోల్పోయినవారియెడల ప్రత్యేక శ్రద్ధ చూపించును (1కొరింథీ 1:27 - 29) (యాకో 2:5)

**ముగింపు:** ప్రస్తుత దుష్టయుగమునుండి మనలను విడిపించుటకు క్రీస్తు చనిపోయెను.

(గలతీ 1:4) మనము లోకమునకు సిలువవేయబడి యున్నాము. లోకము మనకు సిలువవేయబడి యున్నది (గల 6:14). సిలువయే మన మహిమ. లోకము మన రక్షకునికి సిలువను, సమాధిని ఇచ్చినది. అట్టి లోకములో మనము సంతోషముగా ఉండ కుందుముగాక.

మేమిక్కడ పరదేశులం నీకు సమాధిని ఇచ్చిన ఈ లోకంలో మేము నివాసము కోరము. నీ సిలువ మమ్ములను ఇక్కడ కట్టివేసే బంధకములను త్రెంచి వేసెను. తేజో లోకంలో నీవే మా నిధి. జేమ్స్. జి. డెక్

లోకము దేవుని శిక్షావిధికి గురికానున్నది. లోకము దాని నటనయు గతించిపోవునని అపొస్తలుడైన యోహాను చెప్పెను. డోనాల్డ్ గ్రే బర్న్‌హౌస్ అను ఆయన జ్ఞాన యుక్తముగా ఇలాగు చెప్పెను." లోకముపై ఆసక్తి ఉండకూడదు, ఎందుకనగా అది నశించిన నాగరికత మరియు అది సిలువ వేసిన ప్రభువు చేత నాశనము చేయబడట ానికి ఎదురు చూచుచున్నది. మన నియమాలు, ఆచారాలు, పద్ధతులు, జీవన శైలి లోకములోని వాటితో కలిపి కలుషితం కాకూడదు, కల్తీ కాకూడదు.

లోకము దాని ఆశ గతించిపోవుచున్నది. అయితే దేవుని చిత్తము జరిగించువాడు నిరంతరము నిలిచియుండును. (1యోహా 2:17)

పరలోకపు పౌరులవలె మనం జీవించుట అవసరము, లోకములో ఉండిననూ దాని సంబంధులము కాము. మరొక అంశము మనము ప్రక్కన పెట్టరాదు. అదేమనగా పాపస్వభావవము మరియు నిజమైన పశ్చాత్తాపము. ఇప్పుడు మనము పౌరశాస్త్రమునుండి శరీరశాస్త్రమునకు వెళ్ళుదము. ●

## అధ్యాయము - 13

# పాప విభజన(ఛేదన) మరియు పశ్చాత్తాపము

**పాపమనగా ఏమి?**

దేవుని పరిపూర్ణతకు సరిపోని చర్య, మాట, ఆలోచన, ఉద్దేశమే పాపము (రోమా 3:23) దేవుని చిత్తమును ఉల్లంఘించుటయే లేక తిరుగుబాటు చేయుటయే. అది తప్పుచేయుటమాత్రమేకాదు మంచి చేయవలెనని ఎరిగి చేయకపోవుట కూడా పాపమే. యాకో 4:17. మనకు నిజమైన అనుమానము కలిగియున్నదానిని చేయుట కూడా పాపమే. రోమా 14:23. ఆజ్ఞాతిక్రమము, దేవుని చిత్తమునకు విరోధముగా మానవ చిత్తము నిలుచుట (1యోహా 3:4)

పాపము సార్వత్రికమైనది "పాపముచేయకమేలుచేయుచుండు నీతిమంతుడు భూమిమీద ఒకడైననూలేడు" (ప్రసంగి 7:20)

పాపము స్వాభావ సిద్ధమైనది. అది అంతరంగములో నున్నది. ప్రతివాడు పాపములో పుట్టినవాడు. పాపములోనే వాని తల్లి వానిని గర్భమున ధరించెను (కీర్తన 51:5). పాపము అంతటను వ్యాపించియున్నది. మానవుడు పూర్తిగా పతనమైనవాడు. పాపము అతని అన్ని భాగములను పాడుచేసెను (రోమా 3:12-18) పుస్తకములో వున్న ప్రతిపాపమును అతడు చేయకపోయిననూ అతడు ఆ పాపము చేయుటకు సామర్థ్యము కలిగియున్నాడు.

పాపము మనస్సులో ప్రారంభమగును (యాకో 1:13-15) ఆలోచనలో ఏమానవుని కంటికి కనబడని చెడుతనములో అతడు తిరుగగలడు. పాపమును గూర్చి ఆలోచించుకొలది, ఒక తియ్యటి ముద్దను నోటిలో పెట్టుకున్నరీతిగా హృదయములో దొర్లుచుండును. అట్లు ప్రేరేపించబడి పాపము చేయుటకు ప్రారంభించును. పాపము ప్రమాదకరము మరియు తీవ్రమైనది. ఏలయనగా అది దేవునికి విరోధము (కీర్తన 51:4) దాని తీవ్రతను మానవుని యొక్క బాధలలో చూడగలము. మన పాపములకొరకు

ప్రభువు శ్రమలు పొందెను. ఆ శ్రమలో పాపతీవ్రతను చూడగలము. రక్షించబడని వాని శ్రమలు పాతాళములో భయంకరము. పాపము బానిసలుగా చేయును (రోమా 6:15, 16 ఎ) అది దురాశల చేతను శరీర ఇచ్ఛలచేతను అన్ని రకముల దురలవాట్లచేతను వ్యక్తిని బంధించి చెరపట్టును.

పాపము మోసకరమైనది. అది సుఖాన్ని చూపించును గాని శాశ్వత సంతృప్తి నివ్వజాలదు. శిక్షనుండి బయటపడవలెనని ప్రయత్నించిననూ విడిపించువాడుండడు. అది రమ్యమైన ఊహయేగాని దాని వెనుక అసహ్యమైన దుస్థితి యున్నది.

పాపము గ్రుడ్డివానిగా చేయును. మనలో దానిని గుర్తించలేము కాని ఇతరులలో దానిని సులభముగా చూడగలము. మనలో అయితే అది మర్యాదగా కనబడును. ఇతరుల విషయములో అసహ్యము పుట్టించును. మనకంటె చెడ్డవానిని చూచి మనము సాకులు చెప్పి సమర్థించుకొందుము. ఇది పతనమైన మనహృదయానికి నెమ్మది నిచ్చును.

పాపము కఠినపరచును. మనము మొదట పాపము చేసినపుడు మన మనసాక్షి వ్యతిరేకించును. మనము అలాగే కొనసాగితే మన మనసాక్షి మౌనము వహించును. కాలము గడుచుకొద్దీ మనము సులభముగా పాపమును చేయగలుగుదుము. అది హాని అనిపించదు, గాయపరచదు. అది గతానుభవంగా భావింతుము.

పాపము ఇతరులమీద నిందవేయును. ఆదాము పడిపోయినపుడు అతడు దేవునిని, తన భార్యను నిందించెను. "నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే" (ఆది 3:12) హవ్వకూడా అపవాదిని నిందించెను "సర్పము నన్ను మోసపుచ్చినందున తింటిననెను" (ఆది 3:13) నేడు వారి సంతానము వాతావరణమును, వారి తల్లిదండ్రులను వారి తోటిమనుష్యులను నిందిచుచున్నది. ఇన్సూరెన్సు కంపెనీలకు వచ్చిన కారు ప్రమాద కేసులలో కొన్ని వివరములను ఉదహరించుచున్నాము. 1. పాదచారి ఎటుపోవలెనో తెలియక నిలుచున్నందు వలన నా కారు అతనిమీదకు పోయినది 2. ఆ వ్యక్తి రోడ్డంతా నడుస్తున్నాడు. నా కారు అతనికి తగలక ముందు అనేక పర్యాయములు అటు ఇటు కారు త్రిప్పితిని. 3.రోడ్డు ప్రక్కనుండి నేను దూరముగా లాగివేసితిని. మా అత్త వైపుకు చూచితిని, వెళ్ళి కట్టకు ఢీకొన్నాను. 4. టెలిఫోను స్తంభము వద్దకు వేగముగా పోవుచున్నాను దానిని తప్పించుకొనుటకు ప్రయత్నించాను. అది నా కారుముందు భాగానికి తగిలింది.

పాపము మరుగుగా ఉండలేదు. హెబ్రీ 4:13. భూమిమీదనున్న రహస్యపాపం పరలోకములో బహిరంగ నేరము.

పాపము ఆలాగే ఆగిపోదు. అది పులుపువలె పనిచేయును. ఒక అబద్ధము అనేక అబద్ధాలతో కప్పబడును. ఒకడు ఒక అపవిత్రమైన కార్యము చేసినపుడు, ఇప్పటికే అంతవరకు వెళ్ళాను కాబట్టి ఆ బాటలో పూర్తిగా పోయెదనని చెప్పును. ప్రజలు వారిపాపములను వారే క్షమించుకొందురు. ఆ పాపము ఎక్కువమంది చేసినపుడు దానినంతగా తప్పుపట్టరు. దానిని అందరూ ఆమోదింతురు. ఆరీతిగా పాపము తీపివస్తువువలె నుండును.

పాపము అమాయకులను బాధించును. రాబోవు తరములకు కూడా శ్రమ కలిగించును. త్రాగుబోతు వాని పిల్లలు వాని వలన కలిగిన నష్టాన్ని భరింతురు. రక్త మార్పిడివలన అమాయకులకు ఎయిడ్స్ జబ్బు వచ్చును. మత్తు మందులకు బానిస అయినవాడు పుట్టని బిడ్డకు హానికలిగించును. ఎవడునూ ఒంటరిగా ఉండజాలడు అతనిక్రియలు మంచివైననూ చెడ్డవైనను ఇతరులను తాకును. (లేక) ఇతరులపై ప్రభావము చూపును. పాపము అనునది ఈ జీవితములోనే కాక రాబోవు జీవితములోను వారిపై ప్రభావము చూపును. ఈ జీవితములో వ్యక్తియొక్క ఆత్మ, ప్రాణము, మనస్సు, దేహములపై నష్టము కలిగించును. భవిష్యత్తులో నిత్యమరణమునకు, పాతాళమునకు నడిపించును ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి రక్షింపబడితే తప్ప పాపఫలితములనుండి తప్పించుకొనుట అసాధ్యము.

ఇశ్రాయేలురాజైన దావీదు అనుభవములో పాపము ఎలాగు పనిచేసెనో గమనించుట మనకు మేలు.

దావీదునకు అన్నియూ నున్నవి - అందము, ఐశ్వర్యము, పేరు, స్థితి హోదా, కుటుంబము, స్నేహితులు అతడు మరుగున పడియుండగా దేవుడు సింహాసనముపై కూర్చుండబెట్టెను. అతడు దేవుని అనుగ్రహమును అనుభవించెను. భవిష్యత్తు వాగ్దానముతో నిండియున్నది. ప్రపంచము అతని అధికారమందున్నది.

అయితే అతడు నిర్లక్ష్యమునకు, సోమరితనమునకు తావిచ్చి దిగజారిపోయెను. ఆ సమయములో యుద్ధమునకు వెళ్ళవలసి యుండెను. దావీదు ఇంటియొద్దనే వుండి సుఖభోగమునందు నిమగ్నమాయెను. అతడు తన పనిలో (యుద్ధము) ఉండి ఉంటే

అతనికొరకు పొంచియున్న పాపములో అతను పడియుండెడి వాడు కాదు. కాని తన దేహమును క్రమశిక్షణలో ఉంచుకొననందువలన అతడు అపవాదికి అవకాశమిచ్చెను.

శోధన జాగ్రత్తలేని సమయములో రాజనగరు మిద్దెమీద తిరుగులాడుచు అతడు పైనుండి మిక్కిలి సౌందర్యముగల స్త్రీని చూచెను. అప్పుడామె స్నానముచేయుచుండెను.

అతని మనస్సు పరుగెత్తుటకు ప్రారంభించెను. ఊహ వెంట ఊహ అతని ఎదుట మెరిసెను. అతడామెను కోరుకొనెను. తప్పనిసరిగా ఆమె తనదికావలెను. ఆమెను ఎందుకు కలిగియుండకూడదు? సంతోషముగా నుండ తలంచెను. అలాగు లేడా? జీవితమంతయూ ఇలాంటిదే కదా!

అయితే ఎర్రని దీపములు చుట్టూమెరియుచున్నవి. తన మనస్సాక్షి అరుచుచున్నది. వద్దు, వద్దు, వద్దు నీవు దానిని చేయకూడదు. అది పాపము. అది వ్యభిచారము. ఆగు, ఆమెను తెచ్చుటకు పంపిన సేవకులలో ఒకడు ఆమె నమ్మకమైన సైనికాధికారి యొక్క భార్యయని సమాచారము ఇచ్చాడు కూడా.

అక్కడ గలిబిలి యుద్ధం ప్రారంభమైనది. మంచి చెడు అను ప్రస్తావనలేదు. తెలివైన హేతుబద్ధమైన అర్థవంతమైన పని ఏమనగా వెనుతిరుగుటయే, మనస్సాక్షి చెప్పుమాటకు లోబడుటయేకాని అన్నింటికి మించిన ఆ స్త్రీని పొందవలెనెనె ఆశ అతడు కలిగియుండెను. పూటకూటికొరకు జేష్టత్వమును అమ్ముకొని అయిననూ సరే అతను కోరుకొనునదియే అతనికి కావలెను. ఆ క్షణికావేశములో ఏదియూ అతనికి ముఖ్యముగా కనబడలేదు తన సంతోషాన్ని తన కుటుంబమును, తన పేరును తాత్కాలిక తృప్తికోసం బలిచేయుటకు ఇష్టపడెను.

**పిచ్చి తనముతో మునుగుట:**

అలాగు అతడు పిచ్చి తనముతో మునిగిపోయెను. కామోద్రేకము పవిత్రత యొక్క స్వరమును ముంచి వేసెను. సహేతుకమైన వాదనల కంటె శరీర ఇచ్ఛే అతనిలో ఎక్కువగా పనిచేసెను. పరలోక నిరీక్షణ పాతాళభయము, దూరమైనట్టుగా నుండెను. ఆ ఉద్రేకముకొరకు దేవుని ఘనతను, అతని సొంత సాక్ష్యమును, కుటుంబ మర్యాదను, స్నేహితుల గౌరవమునూ, అతని మంచి అయిన గుణమును వదిలివేసెను.

అలెగ్జాండర్ మెక్‌లారెన్ ఇలాగు చెప్పెను. "నీతికొరకు అతనికున్న ఆశను, దేవుని సహవాసమువలన సంతోషము మరచి పోయినవాడై తన జీవితమును చీకటిలో పెట్టి తన ఐశ్వర్యమును పాడుచేసికొనుటకు రాబోవుకాలమంతటిలో తన తలదించుకొనుటకు అనేక ప్రమాదములకు గురియగుటకు, అతని పేరు, విశ్వాసమును రాబోవు తరములోని అపహాసకులు హేళన చేయుటకును కారకుడాయెను. మానవునిగాను, రాజుగాను, సైనికునిగాను అతడు త్రాసులో తక్కువ పడెను. తన జేష్ఠత్వమును పూటకూటికోసం అమ్మివేసిన ఏశావు వలె.

పాపము అందముగాను, ఆశాజనకముగా నుండును. ఇప్పుడది దుఃఖకరముగా మారెను. అతడు మురికిలోపడెను. దానినెంత సమర్థించుకొనుటకు ప్రయత్నించిననూ నేరమతనిని కృంగజేయుచున్నది. అతనిని పాపము చేదు అనుభవములోనికి నెట్టివేసినది. అతడు ఇతరులు నమ్మునట్లుగా పూతవేయవచ్చును. అతడు నమ్మకమైన సైనికాధికారిని యుద్ధము తీవ్రముగానున్నచోట నిలిపెను. అక్కడ చంపబడుట ఖాయమే. పుట్టని బిడ్డ సైనికాధికారికుమారుడు అని తలంతురు. ఆ తర్వాత ఆ విధవరాలిని వివాహము చేసికొనుటకు స్వేచ్ఛ కలిగియుండును. ఈ సంగతి ఎవరికినీ తెలియదని రాజు తలంచెను. అయితే దేవునికి తెలుసును. దేవుడతనిపై కోపముగానుండెను. ఆయన దావీదును ప్రేమించుటవల్ల కొంతకాలము ఆలాగే ముందుకుసాగెను. సుమారు సంవత్సరము తర్వాత అతని వ్యభిచార పాపము, హత్యాపాపము ప్రభువుగుర్తుచేసెను. దావీదు దానిని ఎదిరించెను. అవమానము, సిగ్గు అతనిని దహించెను కాని అతని హృదయము పగులలేదు. మారుమనస్సుపొందుటకు ఒప్పుకొనుటకు తిరస్కరించెను. అది అహంకారమా? పాపయుక్తమైన మొండితనమా? లేక రెండూనా?

చివరిగా యెహోవా నాతాను అను ప్రవక్తను పంపెను. అతడొక ఉపమానము చెప్పెను. ధనవంతుడైనవాడు పేదవాని ఒకే ఒక గొఱ్ఱెపిల్లను దోచుకొనెను. దావీదు కోపగించి ఆ నేరము చేసిన వానికి మరణము విధించెను.

అదొక వల. రాజు అందులో పడెను. అతడు నేరస్తుడు. ఎదుటివాని పాపము చూడగలిగెను. తనలో నున్న పాపమును చూడలేకపోయెను. ఆ ధనవంతునికి శిక్షవిధించుట వలన తనకు తానే శిక్ష విధించుకొనెను. ఇప్పుడతడు మాట్లాడలేక పోయెను. నిస్సహాయకునిగా నిలిచెను.

**నిజమైన పశ్చాత్తాపం:**

తుదకు అతని హృదయము పగిలెను. పగిలిన హృదయమునుండి ఊటలు పెల్లుబికెను. అతడు తన పాపమును ఒప్పుకొనెను దేవుని ఎదుట మారుమనస్సుపొందెను. ఆ సంగతి కీర్తన 51 అధ్యాయములో నున్నది. దానిని ఇలాగు వివరించుటకు ఇష్టపడుచున్నాను.

దయగల ప్రభువా నీదయకొరకు వేడుకొనుచున్నాను. నేను శిక్షకుప్రాతుడనే. నీవు ఎడతెగని ప్రేమగల దేవుడవు. దానిని బట్టి నాకు తగిన శిక్ష విధించవద్దని వేడుకొనుచున్నాను. నీ దయ అపారమైనది. అందును బట్టి నీ పరిశుద్ధచట్టమునకు విరోధముగా చేసినపాపమును తుడిచివేయుము. నీ తిన్నని మార్గమున తొలగిపోయిన నన్ను ప్రతిదోషమును కడుగుము. నేను గురి తప్పిన వాడనై భయంకరమార్గములో పడితిని. నన్ను పవిత్రపరచుము.

ఓ నాదేవా, నేను నీ చట్టమును ఉల్లంఘించితినని బహిరంగముగా ఒప్పు కొనుచున్నాను. నా పాపము బహిరంగమైనది. నేను బహిరంగముగా పశ్చాత్తాప పడుచున్నాను. ఈ పాప నేరము రాత్రింబవళ్ళు నన్ను వెంటాడుచున్నది. నేను ఎంతమాత్రమును నిలువలేను.

నేను చేసిన పాపము కేవలము నీకే విరోధముగా ఉన్నది. బత్షెబకు విరోధముగా ఆమె నమ్మకమైన భర్త ఊరియాకు విరోధముగాను నేను పాపము చేసితినని ఒప్పుకొనుచున్నాను. పరాక్రమశాలియైన సైనికాధికారికి నమ్మక ద్రోహము చేసితిని. దేవా నన్ను క్షమించుము. పాపమంతయు మొదటిగా నీకును, నీకే విరోధమని ఎంచితిని. నీ చట్టము ఉల్లంఘించితిని, నీ చిత్తము తృణీకరింపబడినది. నీ నామము అవమానపరచబడినది. నన్ను నేను తృణీకరించుకొని నీ పక్షము చేరియున్నాను. నీ తీర్పు సంపూర్ణముగా న్యాయమైనది. నీ తీర్మానమును ఎవడును తప్పుపట్టజాలడు.

ప్రభువా నేను మంచివాడను కాను. నేను పాపములో పుట్టితిని. ఇంకా లోతుగా వెళ్ళినయెడల పాపములోనే నా తల్లి గర్భము ధరించినది. ఇట్లు చెప్పుటవలన నా తల్లిని అవమానపరచుటకాదు. నేరమును సమర్ధించుకొనుట కాదు. నా ఉద్దేశమేమనగా నేను పాపము చేయుట మాత్రమే కాక నా స్వభావములోనే నేను పాపిని.

అయితే నీవు పాపమును ద్వేషించుదువు. మనష్యుని అంతరంగములోనీవు

నమ్మకత్వమును ప్రేమించుచున్నావు. నేనిప్పుడు నీ యొద్దకు వచ్చుచున్నాను. నా హృదయములో చొచ్చునట్లు జ్ఞానమును నాకు బోధించుము.

కుష్ఠరోగి బాగుపడినప్పుడు అతనిని హిస్సోపుతోను, పారుచున్న నీళ్ళతోను కడుగవలెనని నీవు ఆజ్ఞాపించితివి (లేవి 14:1-8) ప్రభువా నేను నైతికముగా కుష్ఠరోగిని "నేను పవిత్రుడనగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము హిమముకంటెను నేను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము (కీర్తన 51:7)

నేను పాపము చేసినపుడు నా పాటను పోగొట్టుకొంటిని. నిజమైన సంతోష, ఆనందములు ఎరిగి చాలా దినములైనది.మరొకసారి సంతోషగానము వినునట్లుచేయుము. నా వెనుక బడిన స్థితిలో నీవు నా యెముకలను విరుగగొట్టినట్లుగా వికలాంగునిగా చేసినట్టుగా నాకు కనబడుచున్నది. నీ పరిశుద్ధ పండుగలకు జరుపుటకు నీ యెదుటికి రాలేకపోతిని. నా విరిగిన ఎముకలను కలిపి నీ ప్రజలతో స్తుతించుచూ నాట్యమాడునట్లుగా నన్ను బాగుచేయుము.

ఓ నాదేవా, నీవు నా పాపములను చూచి శిక్షింపకుండునట్లును తీర్పు నివ్వకుండునట్లును నీ ముఖమును త్రిప్పుకొనుము. నా భయంకర పాపములన్నిటిని తుడిచివేయుము. వాటిని గూర్చి తలంచినపుడు అవి నన్నుగాయపరచుచున్నవి.

నా జీవితములో వెనక్కువెళ్ళి చూస్తే సమస్య నా మనస్సులో ప్రారంభమైనదని గుర్తించాను. నా ఆలోచనా జీవితం అపవిత్రమైనది. దుష్ఠ ఆలోచనలకు తావిచ్చి తుదకు పాపము చేసితిని, నాలో శుద్ధమనస్సు కలిగించుమని ఇప్పుడు వేడుకొనుచున్నాను. ఊట పవిత్రముగా ఉండినప్పుడు దానిలోనుండి ప్రవహించు నీరు అంతయు పవిత్రమగును. ప్రభువా నా అంతరంగ జీవితము యావత్తును నూతన పరచుము. అప్పుడు రాబోవు పాపమునుండి వచ్చుప్రమాదములనుండి తప్పించుకొందును.

ప్రభువా, నన్ను వదిలిపెట్టకుము. నీ సన్నిధిలోనుండి నెట్టివేయకుము. నీకు వేరుగా నుండుటగాని, నీ ఆత్మను నానుండి దూరపరచుట అనే ఆలోచనను నేను సహించను. నేను జీవించుచున్న ఈ యుగములో నీకు అవిధేయులుగానున్న వారిలోనుండి నీ ఆత్మను తీసివేయుదువు. సౌలు విషయములో నీవు అలాగు చేసితివి (1సమూ 16:14) అట్టి ఫలితమును గూర్చి ఆలోచించుటకు భయముతో కంపించుచున్నాను. ప్రభువా అట్టి

గతినుండి తప్పించుము._

నేను ఇంతకు ముందు చెప్పిన రీతిగా నా పాటను పోగొట్టుకొంటిని. నా ప్రాణము కాదు, నా పాటను, నీ రక్షణకాదు. నీరక్షణానందమును కోల్పోతిని. ఇప్పుడు మారుమనస్సుతోను ఒప్పుకోలుతోను పాపమును వదిలివేసి నీ యొద్దకు వచ్చియున్నాను. నాకు రక్షణానందము మరల పుట్టించుము. సమ్మతిగల మనస్సు, దయచేయుము. నీకు విధేయుడనైన మనస్సును అన్ని విషయములలో నిన్ను సంతోషపరచు జీవితము నాకు దయచేయుము. అప్పుడే నీ నీతి మార్గములలో నేను నిలువగలను.

నీవు నన్ను, క్షమించినందువలన అక్రమ కారులకు క్షమాపణ, సమాధాన మార్గములను తెలియజేతును. నీవు నాకు ఇలాగు చేసితివని వారు వినినప్పుడు వారుకూడా నీ వైపు తిరుగుదురు.

రక్తాపరాధమునుండి నన్ను విడిపించినప్పుడు ప్రభువా నాకు కలిగిన విడుదలను గూర్చిలోకమంతయు విందురు. ఊరియా రక్తాపరాధము నా మీద భారముగా నున్నది. నా రక్షణ కర్తవైన దేవా నన్ను పవిత్రపరచుము. నిన్ను నిత్యము స్తుతింతును.

పాపమునుబట్టి నాపెదవులు మూతవేయబడినవి. నీ క్షమాపణద్వారా నా పెదవులను తెరువుము. నా నోటితో స్తుతిగీతము పాడుచూ నన్ను నేను అప్పగించుకొని నీ పక్షమున మాటలాడుదును.

ప్రభువా క్షమాపణకొరకు బలులు, అర్పణలపై నేను ఆధారపడుటలేదు. అవన్నియూ మతాచారములే. వాటిని నీవు కోరవు. నీవు జంతుబలిని కోరినయెడల నేను తెచ్చియుందును. దహనబలులు నీకు సంతోషము నివ్వవు. బలులు, అర్పణలు నీవు స్థాపించినవే అయిననూ నీ అసలు సంకల్పము అవి నెరవేర్చలేవు. కాబట్టి విరిగిన హృదయముతో నీ యొద్దకు వచ్చియున్నాను. విరిగినలిగిన మనస్సే నీకిష్టమైన బలి, పగిలిన హృదయాన్ని నీవు త్రోసివేయవు.

ప్రభువా, ఇప్పుడు నీకిష్టమైన ప్రజలకొరకు, నాకొరకు నేను ప్రార్థించుచున్నాను. మేలుతో నీ దయను క్రుమ్మరించుము. యెరూషలేము గోడలను తిరిగికట్టుము. నీ పనికి నా పాపము ఆటంకముగా నుండెను. నేను నీ నామానికి నింద కలిగించితిని. ఇప్పుడు ఆటంకము లేకుండా నీ పని ముందుకు సాగునుగాక.

నీ సహవాసములో మేమందరము నడిచినపుడు మా పాపములు ఒప్పుకొనుచూ,

విడిచిపెట్టినపుడు, నీతియుక్తమైన బలులయందు నీవు సంతోషింతువు, సంపూర్ణ సమర్పణతో కూడిన బలులు నీకు సంతోషము కలుగజేయును. నీ బలిపీఠము నొద్ద కోడెలను అర్పించుచున్నాము. పాపమును క్షమించి దోషములను పరిహరించు దేవుడవైయున్న నీకు స్తుతులు చెల్లించుచున్నాము.

ఈ సందర్భము (లేక) సన్నివేశము లైంగిక పాపములు అను అంశమును గూర్చి పరిశీలించుటకు దారితీయుచున్నది. ఇందులో స్వలింగ వ్యభిచారము అనే అంశమునూ కలిసియున్నది. మన సమాజము వ్యభిచారముచేత ముట్టడి చేయబడుచున్నది గనుక ఈ అంశమును ఎదుర్కొనుట తప్పనిసరియై యున్నది. ●

## అధ్యాయము - 14

# నైతిక పవిత్రత - దాని విస్తీర్ణము

సాతాను తాను గొప్పగా చెప్పుకొనే విజయాలను గెలిచిన యుద్ధభూమి ఏది? బైబిలు మరియు చరిత్ర చెప్పు జవాబు ఏమనగా వాని విజయము లైంగిక సంబంధమైన వాటిలోనే . వాని ఆయుధములలో గొప్పది, లైంగిక అపవిత్రత. సంసోను, దావీదు, సొలొమోను వారి కామోద్రేకములను అణుచుకొనలేక పోయినవారికి ఉదాహరణలుగా ఉన్నారు. అప్పటినుండి క్రైస్తవ నాయకులు అనేకులు ఆశానిగ్రహము లేనివారై అక్రమ సంబంధములు కలిగియుండి ఓడబ్రద్దలైనట్టుగానున్నారు. పరిశుద్ధ రాజమార్గము దేవుని సేవకు సంబంధించి నంతమట్టుకు అనేకులు వెలివేయబడి శవములవలె అయిన వారితో నిండినది. ఈ కారణముచేతనే ఈ అంశముపై బైబిలు చెప్పునది మనకు ప్రాముఖ్యమైయున్నది.

దేవుడు మనలో కొన్ని ప్రేరణలు, అభిరుచులు ఉంచియున్నాడు. అందులో ఒకటి లైంగిక ప్రేరణ. ఈ ప్రేరణలన్నియు దేవుని వరములే. కాబట్టి ఇతర వరములవలె దీనిని ఒప్పుకొనవలెను.

దేవుని వరములను ప్రయోజనకరముగా వాడవచ్చును. అయితే కొన్నిసార్లు దుర్వినియోగపరచబడును. అగ్ని, నీరు బహుప్రయోజనకరము అయితే అదుపు తప్పినపుడు అవి ఎంతో వినాశనము కలిగించును.

లైంగిక సంయోగము సరిగా వినియోగించు విధము వివాహ బంధములో మాత్రమే. మానవజీవిత వలయములో దేవుడు దీనిని మార్చజాలని చట్టముగా అల్లియున్నాడు. ఇది దయతో కూడిన చట్టము. మానవుని ఆత్మీయ, భౌతిక, మానసిక క్షేమముకోసం రూపొందించబడినది.

దేవుడే వివాహవ్యవస్థను స్థాపించెను (ఆది 2:18) పాపము లోకములో

ప్రవేశించకముందే దేవుడు దీనిని చేసెను. వివాహకార్యము పరిశుద్ధతకంటే తక్కువది యని భావించుట (లేక) చెప్పుట ఒక అబద్ధము. అన్ని విషయములలో వివాహము ఘనమైనదిగాను, పానుపు నిష్కళంకమైనదిగాను ఉండవలెను. (హెబ్రీ 13:4)

సాధారణముగా మానవజాతికి వివాహ ఏర్పాటు దేవునిచిత్తమై యున్నది. దేవుని చిత్తప్రకారం ఒక పురుషుడు, ఒక స్త్రీ వివాహము చేసికొనవలెను. (ఆది 2:24, మత్త 19:5,6, ఎఫెసీ 5:22-33) ఇరువురూ బ్రతికినంతమట్టుకు కలిసియుండవలెను. ఇది అందరి క్షేమము కొరకు ఏర్పాటు చేయబడినది. విశ్వాసులకు మాత్రమే కాదు. క్రైస్తవ వ్యవస్థకు మాత్రమే ఇది పరిమితము కాదు. కానా విందులో ప్రభువైన యేసు వివాహాన్ని పవిత్రపరచెను. ఘనపరచెను (యోహా 2:1-11) వివాహము క్రీస్తునకు సంఘమునకు మధ్య నున్న సంబంధమునకు పటముగా నున్నదని పౌలు బోధించెను. (ఎఫె 5:22-33)

బ్రహ్మచర్య జీవితమునకు కొందరు పిలువబడుట నిజమే. అయితే అది మినహాయింపే కానీ సాధారణ చట్టముకాదు.

**సరియైన లైంగిక వినియోగము:**

వివాహ సంబంధములోనే ఇది క్షేమము. దాంపత్య జీవితము సౌఖ్యమును, ఆశయ నెరవేర్పును కలుగును. వివాహేతర సంబంధము స్వనాశనమే “మనుష్యుడు చేయు ప్రతిపాపమునూ దేహమునకు వెలుపల నున్నది గానీ జారత్వము చేయువాడు తన స్వంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు” (1 కొరింథీ 6:18) కొందరి సలహా ఏమనగా వివాహమునకు ఆచారముకానీ ఒప్పందముకానీ అక్కరలేదని చెప్పుచున్నారు. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకొని వారు కలిసి జీవించునపుడు దేవుడు వారిని వివాహమైనట్లుగానే ఎంచును. వారు చెప్పునదేమనగా వివాహాలు పరలోకములో చేయబడుచున్నవి.

అయితే బైబిలు అలాగు చెప్పుట లేదు. ఖచ్చితమైన ఆచారము ఒప్పందము ఉన్నట్లుగా ఇస్సాకు రిబ్కా వివాహములో ఋజువుగుచున్నది. (ఆది 24:53-58) ఈ మనుష్యునితోకూడా వెళ్ళెదవా? అని అడిగినపుడు వెళ్ళెదనని రిబ్కా జవాబిచ్చెను. ఈ ఆచారములో వెండి బంగారు వస్తువులు బట్టలు ఇమిడి ఉన్నవి. దేవుడు ఇశ్రాయేలీయులను వివాహముచేసుకొనునట్లును, అందులో ఒప్పందమున్నట్లునూ దేవుడుచెప్పెను (యెహెజ్కే 16:8), (మలాకీ 2:14)

కానా వివాహములో ఖచ్చితమైన ఆచారమున్నట్లు తెలియుచున్నది. వివాహములలో

విందులు జరుగును (మత్త 22:1-14, లూకా 14:8) ఈ విందులు ఏడు దినముల నుండి పదునాలుగు దినములవరకు జరుగును. అతిథులకు అంగీలు (లేక) పై వస్త్రములు ఇచ్చెదరు (మత్త 22:12) యజమానుడు వివాహము తర్వాత తిరిగి వచ్చినట్లు లూకా 12:36లో చదువుచున్నాము. ఒక పురుషుడు ఒక స్త్రీ చేసుకొను వివాహమే దేవుని చిత్తమై యున్నది. (ఆది 22:24) ప్రజలకందరకు దేవుని చిత్తమిదే. బహుభార్యాత్వమును ఇతర అక్రమ సంబంధములను గూర్చి లేఖనములో వ్రాయబడినది. కానీ దేవుడు వాటిని ఆమోదించలేదు. పాపముగా కనబడు ప్రతిదాని నుండి తన ప్రజలు దూరముగా నుండవలెనని దేవుని చిత్తము (1 థెస్స 5:22)

**బాధ్యతను ఇతరులపైకి నెట్టుట:**

మానవులు తమ అవిధేయతను హేతుబద్ధము చేయుటకు ఇంకనూ ప్రయత్నము చేయుచున్నారు. వివాహము కాకుండగనే కలిసిజీవించుట, ఉచిత ప్రేమ పేర్లతో లేఖనమును త్రిప్పివేసి సమర్ధించుకొనుచున్నారు. చుక్ స్విండోల్ అను రచయిత అట్టివారు చెప్పుచున్న సాకుల జాబితాను లేక సర్దుబాటు వేదాంతమును వివరించెను.

1. నేను సంతోషముగా ఉండవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆమెను చేసుకొని సంతోషముగా ఉండలేక పోవుచున్నాను, కాబట్టి వదిలిపెట్టుచున్నాను. ఆయన అర్థంచేసుకొనునని నేను భావిస్తున్నాను 2. అది పాపమని ఎంచిన కాలమున్నది అయితే అది నేడు కాదు. దేవుడు నాకు ఈ కోర్కె ఇచ్చెను. సంతోషించుమని ఆయన కోరుచున్నాడు. 3. ఆలోచించండి పరిపూర్ణుడెవడునూ లేడు, నేను అనుకున్న దానికంటే కొంచెం లోతుగా వెళ్ళితిని. అది ఇప్పుడు కొంచెము తప్పుగనే యున్నది. ఎట్లైయితేనేమి దేవుని కృప. 4. నేనా, ఆయన క్షమాపణకోరవలెనా, ఎంత ఎగతాళి. దేవునితో నా సంబంధము ఎంతో లోతైనది పైపై తంత్రముల వంటిదికాదు 5. ఓహో బాగుందని అనుకుంటావా నీకు బాగనిపించిందా తీసుకో, మనము ధర్మశాస్త్రము క్రిందలేము, నీకు తెలుసుగా 6. అది రహస్యప్రవర్తన అయితే తమాషా కోసం కొద్దిసేపు ఆడుకొనవచ్చును. మసాలా, తెగింపులేని జీవితం ఏపాటిది. చేయకూడదు అని చెప్పు ఆంక్షలన్నీ, అబద్ధాలే. 7. ఫరవాలేదు. ప్రేమతో చేసినంతకాలం ఫరవాలేదు 8. మనమిప్పుడు వెలుగులో నున్నాము (లేక) తెలివిగలిగి ఉన్నాము. మధ్యకాలపు చట్టములు, నిషేధాలు మనకు అక్కరలేదు. 9. నా మనస్సాక్షి నిర్ణయం చేయుటకు నేను ఎందుకు అనుమతించకూడదు

10. ప్రతివాడు చేయుచున్నాడు, నేనెందుకు చేయకూడదు.

ఇలాంటి సర్దుబాటులెన్ని ఉన్ననూ, జారత్వము పాపమేయని నిషేధింపబడినది (1థెస్స 4:3). ఇది కొనసాగుచునేయున్నది. మనము ఏమి విత్తుదుమో దానినే కోయుదుమను సత్యము ఇంకనూ నిజమే (గలతీ 6:7) విశ్వాసఘాతకుల మార్గము కష్టము (సామె 13:15బి). జారులకు, వ్యభిచారులకు దేవుడు తీర్పుతీర్చుట నిజమే (హెబ్రీ 13:4). వ్యభిచారులు పరలోకమందు ప్రవేశించరను మాటకూడా సత్యమే (1 కొరింథీ 6:9,10). వారు అగ్నిగంధకముల గుండములో పాలుపొందుదురు (ప్రక 21:8) ఇదియు నిజమే.

వారు ఎన్ని ఆక్షేపణలు చెప్పిననూ మనుష్యులు అపవిత్రత నుండియు నేరారోపణనుండియు తప్పించుకొనలేరు. వారు భౌతిక, మానసిక నష్టమునుండి తప్పించుకొనలేరు (రోమా 1:27, 1 కొరింథీ 6:18) సుఖవ్యాధులు వారిపై దాడి చేయుచున్నవి. వైద్యశాస్త్రము అభివృద్ధి అయిననూ ప్రయోజనములేకపోయినది.

అయితే కథ అంతటితో అంతముకావలసిన అక్కరలేదు. మానవుడు ఓడ పోయినంత మాత్రాన దేవుడు వానిని విడిచిపెట్టుటలేదు. అతడు రక్షింపబడనియెడల తన పాపమును గూర్చి పశ్చాత్తాపపడి యేసు క్రీస్తును ప్రభువుగాను రక్షకునిగాను నమ్మవలెను. అప్పుడు దేవుడు అతని పాపమును, ఇతర పాపములన్నింటిని ఆయన తన వీపువెనుక వేసినట్లు తెలిసికొనగలడు. దేవుడు క్షమించి మరచిపోయెను. అంతటితో ఆ సమస్య పరిష్కారమగుచున్నది. ఒకడు రక్షింపబడితే పాపములు ఒప్పుకొని విడిచిపెట్టగలడు. తాను క్షమించబడినట్లు సంపూర్ణ నిశ్చయత కలిగిఉండవచ్చును. దేవుడు నమ్మకమైనవాడును, నీతమంతుడునై యున్నాడు. ఆయన తన వాగ్దానమును నమ్మకముగా నెరవేర్చును, రక్షకుడు క్రయము చెల్లించుట వలన దేవుడు నీతియుక్తముగా క్షమించగలడు. ఆ రక్షకుడు ఇలాగు చెప్పుచున్నాడు "ఆ బాకీ నా లెక్కలో వేయుము."

**విడాకులా?**

ఉద్రేకములు వివాహము దాటిపోతే ఏమి జరుగును? క్రైస్తవుడు సంతోషములేకుండా జీవించాలని దేవుడు కోరుకొనుటలేదు. వారి విసుగునకు, అయిష్టతకు సులభమైన జవాబు విడాకులేయని కొందరు వాదించుచున్నారు. వారి ఇష్టమొచ్చిన విధముగా మనుష్యులు వాదించిననూ, దేవుని వాక్యప్రకారము వారికి తప్పించుకొను మార్గము

లేదు. ఒక పురుషుడు, ఒక స్త్రీ కలిసియుండుట దేవుని చిత్తము (Monogamy). మరణము వేరు చేయువరకు వివాహము కొనసాగవలెను. ప్రతి క్రైస్తవుడు దేవుని చిత్తమునకు లోబడవలసినదే. వెలుపటి పురుషుడు గానీ, స్త్రీగానీ ఎంత ఆకర్షణీయముగా ఉండిననూ కుటుంబ సమస్యలు ఘోరమైనవైననూ విడాకులు తీసుకొనవచ్చునను ఆలోచన మంచిదికాదు. సమాజపు అలవాట్లకు వంతపాడకూడదు. ఈ మధ్య కాలములో ప్రాముఖ్యమైన అమెరికా సంఘ నాయకులు వ్యభిచార పాపములో పడినట్లు తెలిసికొను చున్నాము. ఒక ప్రసిద్ధిచెందిన టి.వి. సువార్తికుడు పదకొండు సంవత్సరాలకు పూర్వం వ్యభిచారసంబంధము కలిగివున్నట్లు ప్రచురమైనది. ప్రవచన అంశములను వ్రాయు ఒకడు వేరొక స్త్రీ కోసము తన భార్యను వదిలివేసెను. ప్రసిద్ధి చెందిన రచయిత్రి కుటుంబ సమస్యలను పరిష్కరించెదనని చెప్పుచూ తన భర్తకు విడాకులు ఇచ్చి వేరొకనిని వివాహము చేసికొనెను. విద్యార్థి సంస్థకు నాయకుడు అతని అక్రమ సంబంధమును బట్టి పదవి నుండి వైదొలగెను. దుఃఖాన్ని కలిగించు ఇటువంటి జాబితాలు పెరుగుచునే యున్నవి.

ఇట్టి అవమానకరమైన చర్యల విషయములో క్రైస్తవులు దయ అనే ముసుకు వేసెదరు. దీనిని అర్థము చేసుకొనవచ్చును. వారిని గూర్చి ఏది మాటలాడిననూ గుసగుస ముచ్చట్లుగా కొందరు ఎంచుచున్నారు. ఇది కూడా మనం అర్థము చేసుకొనవచ్చును. అయితే ఈ సమస్యకు మరొక పార్శ్వమున్నది. ఇట్టి అక్రమ కార్యములను ఎల్లప్పుడూ దాచిపెట్టుచున్న యెడల సంఘమునకు కీడు చేసిన వారమగుదుము. పేరులు చెప్పకపోయిననూ ఇలాంటి భయంకర సంఘటనలు అందరికీ తెలియబడినట్లయితే అట్టి శోధనలు ఎదుర్కొనుచున్న ఇతరులకు ఇవి హెచ్చరికగా ఉండును. ఇతరుల లోపములను ఎత్తిచూపుటవలన అట్టి సమస్యలకు దూరముగా నుండవలెనని బైబిలు చెప్పుచున్నది.

పరిశుద్ధ రాజమార్గములో ప్రయాణించువారు పడిపోవుట మనము గమనించుచున్నాము. ఎందుకు కొందరు పడిపోవుచున్నారు? కొందరు నిలిచియున్నారు అనే ప్రశ్న మనకు రాకమానదు. పడిపోకుండ కొనసాగువారు దేవుని కృపయే తప్ప మరి యేకారణములేదని వారు ఒప్పుకొనుచున్నారు. వారు తమ స్వశక్తితో శోధనను ఎదిరించలేమని తమ యొక్క అసమర్థతను ఒప్పుకొందురు.

కొందరు ఇతరులకంటె గొప్పశోధనలకు గురియగుచున్నారని ఒప్పుకొందురు.

ఆత్మీయ యుద్ధములో సాతాను దాడిచేయుటకు మొదటివరుసలోనున్న వారిపై ప్రత్యేక గురిపెట్టియున్నాడు. అందముగానున్నవారు, వరముగలవారు, ప్రేమచూపువారు, శక్తివంతమైన వ్యక్తులు, ఇతరులకు తెలియని దాడులను, శోధనలను ఎదుర్కొందురు.

క్రైస్తవులు ఒకరికొరకు ఒకరు ప్రార్థించుకొందురు. అది ఒక ఆత్మీయ దీవెన. అయితే కొంతమంది ఇట్టి దీవెన కలిగియుండరు. అనగా వారి కోసము ప్రార్ధించువారు ఉండరు.

అయితే ప్రతి క్రైస్తవుడు ఆపదలను ఎదుర్కొనును. కొందరికి అధికము, కొందరికి పరిమితము, వీటిని గూర్చి నిరంతరము జ్ఞాపకము చేసికొందము.

**ప్రార్ధనలేమి:**

మనలను బలపరచుటకు ప్రభువు యొక్క శక్తి మనకు ఎల్లప్పుడూ అవసరము ఈ సంగతిని మరచిపోవుట ఎప్పుడూ ప్రమాదమే. పాపమునకు లొంగిపోయే వారమని గ్రహించి ప్రభువును హత్తుకొనియుండుట అవసరమని గ్రహించవలెను. ఇది ఆరోగ్యకరమైన ఆలోచన. క్షణక్షణము ఈ ఆలోచన మనకు అవసరము.

**వాక్యమును అలక్ష్యము చేయుట:**

బైబిలును మూసివేసిన (లేక) చదవని యెడల హెచ్చరిక, ప్రోత్సాహము మనకుండవు. దీనికి భిన్నంగా వాక్యము చదివినట్లయితే జారిపోవుటకు శోధింపబడినప్పుడు, లేఖనములు గట్టిగా, తగురీతిగా మనతో మాటలాడును.

**సంఘసహవాసమునకు దూరమగుట:**

ఒంటరిగా నున్న గొర్రె తోడేలు వశమగుట సులభమే. మండుచున్న పొయ్యిలోనుండి నిప్పును వేరుగా ఉంచినట్లైతే అది చల్లబడి ఆరిపోవును.

**అదుపులేని ఆలోచనా జీవితం:**

పాపము మనస్సులో ప్రారంభమగును (యాకోబు 1:14,15) లైంగిక తలంపులతో నున్న వారు వారి ఆలోచనలను క్రియారూపముగా మార్చుదురు. అందుకు యేసు వ్యభిచార చూపును గూర్చి హెచ్చరించెను. (మత్త 5:28) వ్యభిచారమును గూర్చి ఎన్నడూ, ఆలోచించనివాడు ఆ పాపము ఎన్నడూ చేయలేదు

**దీర్ఘకాల ఎడబాటు:** 1 కొరింథీ 7:5 లో వివాహమైన జంటలకు వారు ఎడముగా ఉండరాదని హెచ్చరించెను. ఇద్దరి సమ్మతి తోను ఉపవాసము, ప్రార్ధన చేసికొనుటకును

తాత్కాలికముగా దూరముగా ఉండవచ్చును. ఈ ఏడబాటు ఎక్కువకాలముండినచో ఆశానిగ్రహములేని కారణముచేత సాతాను శోధనకు గురియగుదురు.

**ఒంటరి తనము:** ఒంటరితనము తెలివితక్కువగాను, నిరాశగాను ప్రవర్తించుటకు దారి తీయును. దీనికి విరుగుడు ఏమనగా ప్రభువుకొరకు వ్కలేకుండపనిచేయుటయే. తన్ను తాను మరచిపోయి ఇతరులకు సహాయపడుట.

**తగని పరిచయములు:** "నీ చేయి నిన్ను అభ్యంతరపరచిన యెడల, నీ చేయి పాపము చేయుటకు కారణమైన ఎడల దానిని నరికివేయుము" అని యేసు చెప్పెను (మార్కు 9:43) ఒక సెమినరీ ప్రారంభములో ప్రసంగికుడు ఇలాగు చెప్పెను. "స్త్రీని ముట్టకుము, డబ్బును ముట్టకుము, మహిమను ముట్టకుము" (Don't touch the woman. Don't touch the money. Don't touch the glory.) హానికరముగా కనబడని బుజ్జగింపు, ముద్దు, మెల్లగా తట్టుట ఎక్కువ పరిచయమునకు దారితీయును. ఎక్కువగా ప్రేమింపబడే రేడియో బోధకుడు తన చేతులను స్త్రీలపై నుండి తీయలేకుండెను. తత్ఫలితముగా ఆత్మీయ సైబీరియాలోనికి బహిష్కరింపబడెను.

**రాజీపడు పరిస్థితులకు దూరముగా నుండవలెను:** ఆఫీసు సమయము తరువాత ఒంట రిగా కార్యదర్శితో వుండుట ప్రమాదము. సలహా దారునితో కూడా ఒంటరిగానుండి పరస్పర వ్యామోహమునకు కూడా గురి కాకూడదు. పరపురుషుని భార్యతో ఒంటరిగా విమానములోగానీ కారులో గానీ ప్రయాణముచేయరాదు. అమాయకంగా పరిస్థితులు ప్రారంభమై, పూర్తిగా ఏకమగుటకు దారితీయవచ్చును – మార్గ్రెట్హెస్

స్త్రీ పురుషసంబంధములలో నీవు సరిహద్దులు వేసినకొనవలెను. మానసిక రోగనిపుణుడు చివరిగా స్త్రీరోగికి చికిత్స చేయననిచెప్పెను. ఒకసేవకుడు సలహాపొందుటకు వచ్చిన ఒక స్త్రీ మేజా(బల్ల) అవతల నుండి తెరలు తీసివుంచవలెను. వైద్యుడు స్త్రీరోగిని పరీక్షించునప్పుడు నర్సును లోపలికి పిలువలెను. కంపెని బాసు (యజమాని), సెక్రటరీ ఇద్దరుగాని హోటలునకు భోజనముచేయుటకు వెళ్లరాదు. రాత్రివేళలో ఆలస్యముగా ఉండి ఒంటరిగా పనిచేయరాదు. భర్త యింటిలో లేనప్పుడు పొరుగువాడు ఆ యింటిలోనికి వచ్చినప్పుడు శోధనకు గురి కారాదు. చురుకైన స్త్రీ తన భర్తను వదలి మూడుమాసములు ఇంటిలో కాలముగడపదు. వేసవి సెలవులకు ఊరికిపోగా, ఒంటరిగా నున్న పరాయి భర్త యొద్దకు ఆమె పోకూడదు. వ్యాపారముమీద భర్త వెలుపటికి పోగా అవసరములేని

సానుభూతి ఆమెపై చూపరాదు. తన భర్త మాత్రమే పూడ్చగల అ అంతరమును (గ్యాప్) భ్యార యెరిగియుండవలెను.

**సోమరితనము:** పనిచేయుటకు ఇష్టపడకపోవుటయే ప్రమాదకరమైనజబ్బు. దినమును నిర్మాణాత్మమైన కార్యక్రమముతో నింపలేక పోవుటయే తీవ్రమయిన జబ్బు. శోధనలో పడకుండునట్లు మనము తగిన పని చేయవలెను. అయితే అమితమైన పనిపెట్టుకొని దేవుని సహవాసము పోగొట్టుకొనకూడదు.

**గర్వము:** ఇతర క్రైస్తవులు ఒకవ్యక్తిని ప్రశంసించుట, మెచ్చుకొనుట ద్వారా ఆ వ్యక్తి గర్వమునకు గురికావచ్చును. అతడు నిజముగా ఒక గొప్ప శక్తినని తలంచుటకు ప్రారంభించును. ప్రపంచమే అభివృద్ధి క్షేత్రమనియు అతను పడిపోనని, తప్పులులేవని భావించును. అతని ప్రమాదము గొప్పది "నాశనమునకు ముందు గర్వమునడుచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడుచును" (సామె 16:18)

**ప్రచారము:** ప్రచారముకొరకు ప్రాకులాడువాడు నలుగగొట్టుబడుటకు పరుగెత్తే వాడుగా నుండును. సామాన్యముగా అందరికి తెలియబడుటలో ప్రమాదమున్నది. క్రైస్తవజీవితమునకు, సేవకు అది తగదు. సి.ఎ. కోట్స్ ఈలాగుచెప్పుచున్నాడు.

ప్రచారముచేసికొనవలెననుకోరిక సేవా ధర్మమునకు పొసగదు. ప్రభువు ప్రచారమునకు దూరముగా నుండెను. అదెంతో ఆశ్చర్యము. అది మన సహజ స్వభావమునకు విరుద్ధమే. అయితే మార్కు సువార్తలో ఐదు లేక ఆరు సందర్భములలో స్వస్థత పొందిన వారికి ఎవరు బాగుచేశారో చెప్పవద్దని ఆజ్ఞాపించెను. సొంతముకొరకు ప్రచారము మంచిదికాదు. ఒకవేళ ప్రభువు ఆ స్థితి కలిగించినను, కృప అవసరమైయున్నది. కొందరికి ఆ స్థితి కలుగ చేయుట దైవకృపయే.

**టెలివిజను:** ఎడతెగనిలైంగిక విషయములు, కామోద్రేకములను రేపుచున్న సన్నివేశములు, చిందరవందర సంగతులు చూచుటవలన పాపముయొక్క తీవ్రతనుగూర్చి పట్టించుకొనరు. పైగా దిగజారిపోయిన స్వభావమును మండించును. పరిచయము అసభ్యకరమైన సన్నివేశముల వలన అపవిత్ర ప్రవర్తన అధికమగును. లైంగిక మాగజైనులు, పిల్ములు, పుస్తకములు, వీడియోక్యాసెట్టులు మొదలగువాటితో సమానముగా టి.వి. (T.V) సిగ్గుకలిగించును.

**వలపన్నుట:** క్రైస్తవపనివారు ఇతరుల వలలో పడిపోకుండ జాగ్రత్తపడవలెను. ఒక మిషనరీని ఒక గ్రామమువారు తీవ్రముగా వ్యతిరేకించేవారు. ఒక స్త్రీ తనకు ఆత్మీయ విషయములో సహాయముకావలెనని మిషనరీకి ఫోను చేసినది. ఆమె ప్రధాన పోస్టాఫీసు వద్దవున్నది. అతడు వచ్చి ఆమెతో మాట్లాడెను. అతడు తన భార్యనువెంటపెట్టుకొని పోలేదు. పోస్టాఫీసువద్ద ఆమెను కలిసికొన్నప్పుడు, పోలీసులు వెంటనే వచ్చి అతడు వేశ్యతో మాట్లాడుచున్నాడని నేరమువేసిరి. ప్రభుత్వము అతనిని బహిష్కరించినది. ఈ విషయములో అవినీతి లేకపోయినను, అయితే అతడు నేరము అను వలలో పడిపోయెను.

ఈ అధ్యాయములో సంగతులు విచారకరమైనవే. ఆలాంటిసమస్యలు రాకుంటే బాగుగానేయుండును. అయితే సత్యమేమనగా క్రొత్త నిబంధనలో చెప్పబడిన యే పాపములోనైనను పడిపోవుటకు వీలున్నది గనుక వ్రాయవలసివచ్చినది. వాటిలో అనైతికత పాపము ఒకటి. మనము దానివైపు చూడకపోతే, సమస్య ఉండనే వుండదు. సమస్యను ఎదుర్కొని నైతిక ఓటమికి గురికాకుండ దినదినము రక్షకుని సహవాసములో ఉండి, జీవించుదము. ●

## అధ్యాయము- 15

# స్వలింగ సంపర్కము పాపమని దేవుడు చెప్పుచున్నాడు

స్వలింగ సంపర్కము ప్రత్యామ్నాయజీవిత విధానముగా అంగీకరింపవచ్చునని అనేకులు చెప్పుచున్నారు. స్వలింగసంపర్కులు బహిరంగముగా వచ్చి సమాన హక్కులు కోసము ఆశించుచున్నారు. అయితే విశ్వాసులు, ప్రజలు చెప్పుచున్నదాని ప్రకారముగాని, ప్రస్తుతము మన సంస్కృతిలో ఆచరించుచున్న దాని ప్రకారముగాని నడిపింపబడకూడదు. ప్రతివాడు చేయుచున్నాడు గదా యని అందులో కొట్టుకొనిపోకూడదు. గొప్ప పరీక్షయేమనగా "బైబిలు ఏమిచెప్పుచున్నది?" కాబట్టి పరిశుద్ధ లేఖనములను పరిశీలన చేయుదము.

**స్వలింగ సంపర్కమును గూర్చి లేఖనములలో ముఖ్య భాగములుగలవు.**

ఆదికాండము 1,2 అధ్యాయములు దేవుడు మానవజాతిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించి వివాహసంబంధము తన ప్రజలకు దేవుని చిత్తమని తెలిపెను. ఈ రీతిగా స్వలింగ సంపర్కము దేవుని ప్రణాళికకు వక్రీకరణ అగుచున్నది. ఇది ప్రకృతికి వ్యతిరేక నేరము.ఆది 19:1-26 సొదొమ మనుష్యులు స్వలింగసంపర్కమునకు పేరుమోసిన వారు. సొదొమ అనగా స్వలింగ సంపర్కము. ఆ పట్టణ పేరును బట్టియే ఆ పదము వచ్చినది. లోతు యొద్దకువచ్చిన ఇద్దరు పురుష అతిథులపై అత్యాచారము చేయుటకు సొదొమ ప్రజలు గుమికూడిరి. అప్పుడు దేవుడు వారిని వెలిపటికి పంపించి, పట్టణమును అగ్నిగంధకములతో నాశనముచేసెను.

లేవీయ 18:22, 20:13 మోషే ధర్మశాస్త్రము ప్రకారము స్వలింగసంపర్కము హేయము, దానికి మరణ శిక్షవిధింపవలెను. (దీనిని బట్టి ఇదొక రోగము అని బోధ చేయుట అబద్ధమని తెలియుచున్నది. రోగులుగానున్నవారికి దేవుడు మరణ శిక్ష

విధింపడు)

రోమా 1:18-32 ప్రాచీన మానవులు నిజదేవుని గూర్చిన జ్ఞానము కొంతమట్టుకు కలిగియుండిరి. అయితే ఆ జ్ఞానమును వారు తృణీకరించి విగ్రహారాధికులై కొయ్యతోను రాతితో చేసిన ప్రతిమలను పూజించుచుండిరి. దైవజ్ఞానమును వదలివేసిన కారణము చేత దేవుడు వారిని వదలి వేసెను. ఆ కారణము చేతవారు అన్ని రకముల నీచపాపములు స్వలింగ సంపర్కము చేయుటకు ప్రారంభించిరి. ఈ పాపములు చేయువారు మరణమునకు పాత్రులని పౌలు ఖచ్చితముగా చెప్పెను. (1 కొరింథీ 6:9వ) పురుషసంయోగులు లేదా పురుషవేశ్యలు దేవుని రాజ్యములో చేరరని స్పష్టముగా చెప్పుచున్నది.

1తిమోతి 1:10 పురుషసంయోగము, హత్య, వ్యభిచారము, మనుష్య చోరత్వము మొదలగు పాపములజాబిత చెప్పబడినది. ఇవన్నియు దేవుని చట్టమునకు అతిక్రమణ లే. దైవచట్టము అతిక్రమించినందుకు శిక్ష మరణము.

బైబిలు బోధించునదేమనగా దేవుడు తన జీవులకు ఇచ్చిన తన చిత్తమును వక్రీకరించి స్వలింగ సంపర్కము చేయుచున్నారు. లేఖనములను ఏరీతిగా వక్రీకరించినను ఆ పాపమును సమర్థించుటకు వీలుకాదు. ప్రపంచనైతిక తీర్పులను క్రైస్తవులు ఒప్పుకొనక దేవుని వాక్యము చేత నడిపింపబడవలెను.

పురుషసంయోగులు రక్షింపబడగలరా? - అవును అని జవాబుచెప్పవలెను. అతడు తనపాపవిషయమై పశ్చాత్తపడి యేసుప్రభువును తన ప్రభువుగాను రక్షకునిగాను అంగీకరింపవలెను. (యోహా 1:12, రోమా 10:13)

క్రైస్తవుడు ఈ పాపములో పడిపోగలడా? విశ్వాసి బలహీనసమయములో ఈ పాపములో పడిపోవుట సాధ్యమే. అప్పుడు తన పాపము ఒప్పుకొని విడిచిపెట్టుటద్వారా అతడు క్షమాపణ పొందగలడు (1యోహా 1:9) అయితే ఎవడైనను పురుషసంయోగిగా కొనసాగిన యెడల వాడు తిరిగి జన్మించలేదని రుజువగుచున్నది. ఏలయనగా "కాబట్టి మీరు వారిఫలములవలన వారిని తెలిసికొందురు" (మత్త 7:20) అని ప్రభువు చెప్పెను.

**అవగాహన - అనుసరణ :**

పురుషసంయోగ భావనకు మరియు దాని ఆచరణకు బేధమున్నదా? ముఖ్యమైన బేధమున్నది. ఈ పాపము చేయుభావము అనేకులకున్నను ఈ పాపము ఎన్నడు చేసి యుండకపోవచ్చును. స్వలింగవ్యక్తులకు ఆకర్షింపబడినట్లు అనేకులు వేదనపడుచున్నారు.

అయితే ఆ శోధనను ఎదిరించినవారై పవిత్రులుగానే జీవించుచున్నారు.

"ఒకసారి పురుషసంయోగియైనయెడల, అతడు ఎల్లప్పుడు ఆలాగే ఉండును అని చెప్పుట నిజమేనా? ఈ మాట పూర్తిగా అబద్ధము. అనేకమంది స్వలింగసంపర్కులు క్రీస్తువైపు తిరిగి పాతజీవితము పద్ధతిని వదలివేసిరి. పరిశుద్ధాత్మ ఆలాగుండుటకు తగిన శక్తినిచ్చుచున్నాడు. హేయమైన ఈ పాపములో నున్న కొందరు కొరింథీయులు క్రీస్తునందు విశ్వాసముంచి విడుదలపొందిరి (1కొరింథీ 6:9-11) ఈ పాపముయొక్క వైఖరికి సంబంధించి మిగిలిన జీవితములో విశ్వాసి దానితో పోరాటము చేయవలసియున్నది. రాజైన యేసు ప్రభువు సేవలో విరామము లేకుండ కొనసాగుటవలన అతడు విజయము పొందగలడు. అతడు శక్తులన్నిటిని సేవకే వినియోగించుటవలన పాపముపై విజయము పొందగలడు.

పురుషసంయోగునిగా జన్మించిన వానిని దేవుడేలాగు నిందింపగలడు? దేవుడెవనిని ఆలాగు చేయలేదు. దేవుని హస్తముద్వారాచేయబడినప్పుడు, అతడు నిర్దోషి, అపవిత్రత లేనివాడు. అయితే ఆదాము పాపము చేసెను అందువలన అతని సంతతియైన మానవజాతి యావత్తు యేసు తప్ప అవినీతిపరులుగాను, పాపులుగాను జన్మించిరి. నేరము మానవునిపైనే యున్నది. దేవుడు నిషేధించినదానిని చేసి దేవునిపై నిందవేయుట తప్పు. మరియు మానవుడు తాను చేసిన పాపకార్యములకు తాను బాధ్యుడనుకానని ప్రయత్నము చేయుటయేయగును.

స్వలింగసంపర్కము జన్మతో వచ్చిన స్వభావమాలేక మధ్యలో నేర్చుకున్నదా? వాస్తవమునకు ఏదైనను కావచ్చును. ఈ తప్పు స్వభావసిద్ధముగా వచ్చినప్పుడు ఆశ్చర్యపడనక్కరలేదు. ప్రకృతిసంబంధి పూర్తిగా పతనమైనవాడే. అతడే పాపము చేయుటకైనను సామర్థ్యము కలిగియుండును. కొందరు ఒక విషయములో ఒక బలహీనత కలిగియుందురు. మరొకరు మరొక విషయములో బలహీనులుగా నుందురు. స్వలింగసంపర్క స్వభావముతో పుట్టినందుకు అతని నెవరు శిక్షింపరు. అయితే ఆ పాపమును ఆచరణలోపెట్టినప్పుడు శిక్షకు పాత్రుడగుచున్నాడు. అయితే ఈ పాపము ఇతరులద్వారా నేర్చుకొన్నదియై కూడా యుండవచ్చును. పురుషుడు ఒకడు బాలుని ఈ తరహా జీవితములోనికి ఆకర్షింపవచ్చును. ఇట్టి పాపమును గూర్చి ప్రభువీలాగు చెప్పెను. "వాడీచిన్నవారిలో ఒకనికి అభ్యంతరము కలుగజేయుటకంటె వానిమెడకు తిరుగటిరాయి కట్టబడి సముద్రములో పడద్రోయబడుట వానికిమేలు" (లూకా 17:2).

**పాపిమార్గము:**

స్వలింగసంపర్కులు పురుషులైనను, స్త్రీలైనను వారి నీచమైన జీవిత విధానమును బట్టి గొప్పక్రయము కట్టుదురు "తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలమును పొందుచు ఒకరియెడల ఒకరు కామతప్తులైరి" (రోమా 1:27) అని పౌలు చెప్పెను. దీనిఫలితముగా సుఖవ్యాధులు, న్యూమోసిస్టిస్ (ఊపిరితిత్తులకు సంబంధించిన ఒకరకపు జబ్బు) కపోసి సర్కోమా యను (క్యాన్సరు,) ఎయిడ్సు రోగములు వచ్చుచున్నవి. వెంటాడుచున్న నేరము, మానసిక ఉద్రేకపూరితమైన అవకతవకలు, వ్యక్తిత్వములో విపరీత మార్పులు కలుగుచున్నవి.

ఆస్కార్ విల్డే ఆనే రచయిత 19వ శతాబ్దములో జీవించెను. అతడు స్వలింగ సంపర్కియని బయట పడినతర్వాత అతడీలాగు వ్రాసెను.

"దేవుళ్లు (gods) అనబడినవారు దాదాపుగా ప్రతిది నాకిచ్చియున్నారు. అయితే శరీరేచ్ఛలకు గురియై అర్ధరహితమైన భ్రమలోనికి పోవుటకు అవకాశమిచ్చితిని. ఉన్నతస్థితిలో విసిగి, నూతన భావోద్వేగముకొరకు బుద్ధిపూర్వకముగా లోతులువెదకితిని. అప్పుడు నా ఆలోచనారంగములో విరుద్ధమైన స్థితిలో పడితిని. నా భావముతో వక్రీకరణ వచ్చినది ఇతరుల జీవితమును గూర్చి నాకు చింతలేదు. నాకు సంతోషము కలిగించు దానిని గైకొంటిని. దినచర్యలో ప్రతిచిన్నపని శీలమును నిర్మించును లేక పతనముచేయునని నేను మరచిపోతిని. రహస్యగదిలో జరిగినది ఒకదినమున మిద్దెమీద ప్రకటింపబడునని మరచిపోతిని. నాపై నాకు ఆధిపత్యములేకపోయెను. నా జీవితమునకు నేను కర్తగా లేకపోతిని. ఆ సంగతినాకు తెలియకపోయెను. సుఖమునన్నేలెను. భయంకరమైన అవమానముతో నా జీవితము ముగిసిపోయెను."

స్వలింగసంపర్కము నుండి విడుదల పొందుటకు మార్గమున్నది. ఇది ఇతర పాపములవంటిదే. అయితే బైబిలు ననుసరించిన వాక్య సలహా వారికియ్యుము. వారియెడల మనవైఖరి యెట్లుండెవలెను? వారి జీవనశైలిని ఒప్పుకొనక పోయినను వారు కూడ వ్యక్తులే గనుక క్రైస్తవులమైన మనము వారిని వ్యక్తులుగా అంగీకరించవలెను. వారు రక్షింపబడునట్లు క్రీస్తు వారికొరకు చనిపోయెను. పవిత్రమార్గములోనికి వారిని మళ్ళించుటకు ప్రతి ప్రయత్నము చేయవలెను. దీనమనస్సుతో వారిని సంప్రదింపవలెను. మనము ఆ శోధనలో పాపములో పడకుండునట్లు జాగ్రత్త తీసికొనవలెను. వారు వాక్యము తిరస్కరించి దూషించినప్పుడు సువార్త వారికి బలవంతముగా చెప్పనక్కరలేదు. ●

## అధ్యాయము - 16

# మనస్సాక్షి - అంతరంగ తీర్పరి

క్రియలు, ఉద్దేశములు, ఆలోచనల విస్తీర్ణములో మంచి చెడుల మధ్య భేదమును సూచించు అంతరంగ తీర్పరిని మనస్సాక్షి అందుము. (రోమా 2:15) ఒక బాలుడు బిస్కెట్లున్నజాడీలో చేయిముంచినప్పుడు వాడు తన కన్నులతో గదిని సూక్ష్మముగా పరిశీలించినట్లుగా మనస్సాక్షి చేయును. వేగముగా పోవువాడు తన వెనుక అద్దము గుండ పోలీసు కారు వచ్చుచున్నట్లు కనుగొని, వేగమును ఆపినట్లుగానుండును. ఎవరు తరుమక పోయినను మోసకారిని పరుగెత్తునట్లు చేయును. అది మనందరిని పిరికివారినిగా చేయునని షేక్స్‌పియర్ చెప్పెను.

ఆదాయపన్ను విషయములో, న్యాయస్థానములోను, తరగతి గదియందు పరీక్ష సమయములోను, అది పైనుండి కనిపెట్టును. అది యెహోవాపెట్టిన దీపమని బైబిలు చెప్పుటలో ఆశ్చర్యములేదు. అది అంతరంగ జీవితమును పరిశోధించును (సామె 20:27)

ప్రతివాడు మనస్సాక్షి కలిగిపుట్టుచున్నాడు. అబద్ధము, దొంగతనము, హత్య అనునవి తప్పుయని సహజముగానే మానవునికి తెలియును. ఇతరులు తనకు కీడు చేయుట తప్పు అని అతనికి తెలియును. కనుక ఆలాగే తాను గూడ ఇతరులకు కీడు చేయుట తప్పు అని తెలియును.

**మనస్సాక్షి పొరపాటు లేని మార్గదర్శికాదు :**

అయితే మనస్సాక్షి తప్పు చేయలేనిదికాదు. మన విషయములన్నిటివలెనే మనస్సాక్షికూడా పతనమువలన దెబ్బతిన్నది. మనము నేర్చుకొన్న సూత్రములచే అది ప్రభావితముకాగలదు. అందువలన నీ మనస్సాక్షి నడిపించునట్లుగా నడుచుకొమ్మని చెప్పు పాత సామెత సరిపోదు.

పరిశుద్ధాత్మ వెలిగించిన రీతిగా దేవుని వాక్యము చేత మనస్సాక్షి బోధింపబడుట అవసరము. “మనస్సాక్షి మేలుకొల్పబడి, దేవుని వాక్యముచేత బోధింపబడి, వాక్యమును అనుసరించి మార్పు పొందవలెను” (బార్నహౌస్)

నిజమైన పశ్చాత్తాపములో మనస్సాక్షి కూడా పాలుపొందును.

జాన్ న్యూటన్  ఈలాగు వ్రాసెను.

నా మనస్సాక్షి నేరము చేసినట్లు భావించెను, ఒప్పుకొనెను.

నిరుత్సాహములో నన్ను ముంచివేసెను.

తార్సు వాడైన సౌలు తన మనస్సాక్షిచేత పొడువబడి మునికోలలకు యెదురు తన్ను చున్నట్లుగ కనుగొనెను (అ.కా 9:5) పరలోకపు వెలుగుతో ఉచిత కృప రాబర్ట్ ముర్రె మెక్ చెనె అనువానిని మేల్కొలిపెను. అప్పుడు చట్టభయముచేత అతడు వణికెను. అతడు చనిపోవుటకు భయకంపితుడాయెను.

కడుగబడిన మనసాక్షి అనగా క్రీస్తు రక్తముచేత కడుగబడిన మనస్సాక్షి (హెబ్రీ 9:14). అది మన ప్రవర్తనను ఇంకను అదుపుచేసినను నిత్యతీర్పును గూర్చిన భయములేదు, ఏలాయనగా విశ్వాసికి బదులుగా క్రీస్తు దానిని భరించెను.

ఇప్పుడు మనస్సాక్షి యెంత మాత్రమును దోషారోపణచేయదు.

ఏలయనగా అమూల్యమైన ఆయన సొంత రక్తము

ఒక్కసారే కడిగి నన్ను శుద్ధీకరించెను.

దేవుని దృష్టిలో నన్ను పరిశుద్ధపరచెను.

బలహీనమైన మనస్సాక్షి తప్పులేనివాటివిషయములో అమితముగా నిష్ఠను పాటించును (1 కొరింథీ 8:7,8) ఆహారపానీయ విషయములలో అమిత నిష్ఠగల మనస్సు.

మనస్సాక్షి చెప్పిన దానిని వ్యక్తి వినకపోవుట వలన అది చురుకతనమును కోల్పోవును. నేను కారులో కూర్చున్నప్పుడు, నా సీటు బెల్టు గట్టిగా పెట్టుకొనవలెనని గలగల మనుశబ్దము నాకు గుర్తుచేసినను, పట్టించుకొనకుండ ఆలాగు పోవుటకు అలవాటుపడినప్పుడు, దానిని యిక వినను. ఎప్పటివరకు? సీటుబెల్ట్ తప్పనిసరిగా

ధరించవలెనని చట్టము వచ్చేంతవరకు.

మానవుడు మనస్సాక్షిని పట్టించుకొనక తిరుగుబాటు చేయు కొలది దాని స్వరము బలహీనమగుచుండును. సాగెడు గుణమును కోల్పోయిన రబ్బరువలెనుండును. శరీర భాగముకాల్చబడినప్పుడు స్పర్శపొగొట్టుకొన్న రీతిగా నుండును. దీనిని వాతవేయబడిన మనస్సాక్షి అందురు.(1తిమో 4:2) మానవుడు పాపము చేయగలడు. అట్టి గత అనుభవము అతడు కలిగియుండవచ్చును. (ఎఫెసీ 4:9). అతడెంతో పాపముచేసి తన మూతి తుడుచుకొని “నేను ఏదోషమును ఎరుగనను” (సామె 30:20)

పాపమునకు విరోధముగా మనకున్నగొప్ప భద్రతావలయము మనస్సాక్షి దిగ్భ్రాంతికి గురిఅయినది అని చెప్పబడింది.

దుష్కార్యములు చేయుటవలన మనసాక్షి అపవిత్రమగు చున్నది (తీతు 1:15) అతని జీవితము చెడ్డదైతే, మనస్సాక్షి వేరుగా నుండలేదు. (హెబ్రీ 10:22)

మనమెల్లప్పుడు మంచి మనస్సాక్షిని కలిగియుండవలెను (1 పేతురు 3:16) దేవునియెడలను మనుష్యుల యెడలను నిర్దోషముగా నుండవలెను. (అ.కా. 24:16)

## అధ్యాయము - 17

# మానవుడు ఆలోచించిన రీతిగానే

ఆలోచనాజీవితమును అదుపుచేసికొనుట క్రైస్తవుని ముఖ్య బాధ్యతలలో ఒకటి. తన మనస్సును ఏలాగు వినియోగించునో ఆ దిక్కునకు జీవితగమనము పోయి, తన శీలమును ప్రభావితముచేయును (ఫిలిప్పీ 4:8). అపవిత్రమైన మనస్సు తప్పనిసరిగా అక్రమ నడివడికి దారితీయును. మంచి ఆలోచనలు మంచి ఫలితమిచ్చును.

ఈ కారణముచేతనే బైబిలు ఈలాగుచెప్పుచున్నది. అతడేమైయున్నాడో ఆలాగే అతడు ఆలోచించును" (సామె 23:7) లేక అతడేమి ఆలోచించునో అతడు అదేయై యుండును. ఆంగ్లములో ఈ భావము వచ్చును. ఆల్‌ఫ్రెడ్ పి.గిబ్స్ ఈలాగు చెప్పుచున్నాడు. "నీవు ఏమై యున్నావని తలంచుచున్నావో ఆ వ్యక్తివి నీవుకావు. నీవేమి తలంచుచున్నావో అదే నీవు. మానవుని మనస్సులోని ఉద్దేశములు అతని గుణమునకు సూచన.

గొప్పజ్ఞాని చెప్పినమాటలు "నీహృదయములోనుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నింటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము (సామె 4:23) మనస్సుకంటె హృదయమునకు యెక్కువ భావముకలిగినను, హృదయమునకు బదులుగా మనస్సు అను పదము వాడినను భావము సరిపోవును. నీ మనస్సును భద్రముగా ఉంచుకొనుము. దానిలోనుండి జీవధారలు ప్రవహించును. మనస్సు ఊటలాంటిది. దానినుండి ప్రవర్తన ప్రవహించును.

**పదవ ఆజ్ఞ:**

పది ఆజ్ఞలలో ఒక ఆజ్ఞ ఆలోచన జీవితమును గూర్చి తెలియుజేయుట ముఖ్యమైన సంగతి. "నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు

అనిచెప్పెను.” (నిర్గమ 20:17)

ఆశించుట మనస్సుయొక్క కార్యము. దేవునిచిత్తముకానిదానిని కలిగియుండవలెనని కోరుకొనుట. “ఆశింపకూడదు” అని దేవుడు చెప్పుచున్నాడు.

ఈ ఆజ్ఞయే తార్సువాడైన సౌలు హృదయములో ఒప్పుకోలునకు నడిపించెను. బాహ్యరీతిగా గౌరవప్రదముగా జీవించుచున్నానని అతడెల్లప్పుడు గర్వించేవాడు. అతడెన్నడును నీచమైన పాపములు చేయలేదు. అయితే 10వ ఆజ్ఞయొక్క అర్థము గ్రహించిన తరువాత దుర్మార్గకార్యములు మాత్రమేకాక దుష్టతలంపులు కూడ పాపములేయని అతడు గ్రహించెను. అతడు తన ఆలోచన జీవితమును గూర్చి ఆలోచించినప్పుడు, తాను పాపినని ఒప్పింపబడెను.

“కాబట్టి యేమందుము? ధర్మశాస్త్రము పాపమాయెనా? అట్లనరాదు. ధర్మశాస్త్రమువలననేగాని పాపమనగా యెట్టిదోనాకు తెలియక పోవును. అయితే పాపము ఆజ్ఞనుహేతువుచేసికొని, సకలవిధములైన దురాశలను నాయందు పుట్టించెను. ధర్మశాస్త్రములేనప్పుడు పాపము మృతము. ఒకప్పుడు నేను ధర్మశాస్త్రములేకుండ జీవించుచుంటిని గాని, ఆజ్ఞవచ్చినప్పుడు పాపమునకు మరల జీవము వచ్చెను. నేనైతే చనిపోతిని అప్పుడు జీవార్థమైన ఆజ్ఞ నాకు మరణార్థమైనట్టు కనబడెను. ఏలయనగా పాపము ఆజ్ఞను హేతువు చేసికొని నన్ను మోసపుచ్చి దాని చేత నన్ను చంపెను” (రోమా 7:7-11)

**అది ఎట్లు పనిచేయును?**

పాప తత్వములోనికి లోతుగా వెళ్లి పరిశీలించి యాకోబు ఈలాగు చెప్పెను.

“దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు. ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు నేను దేవుని చేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడు తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును” (యాకోబు 1:13-15)

ఇక్కడ పాపము మానవ జీవిత చక్రమునకు పోల్చబడినది. మొదట గర్భధారణ జరుగును. అప్పుడు శిశువు జన్మించును. వాడు వయస్సులో ఎదిగి పరిపక్వదశకు

చేరును. ఆ తరువాత వాడు చనిపోవును. పాప విషయమును ఈలాగే యుండును. మానవహృదయములో అది మొదట ప్రారంభమగును. అప్పుడు పాపము జరుగును. పాపముచేయుటకు అలవాటుపడును. తుదకది మరణమునకు దారితీయును. మనము ఒక పాపమును దీర్ఘకాలము ఆలోచించినప్పుడు వెంటనే కాకపోయినను ఆలస్యముగా నైనను ఆ పాపము చేయుదుము. ఒకపాతకాలపు సామెత ఈలాగున్నది.

ఆలోచనను విత్తితే దాని కార్యమును కోయుదువు
కార్యమును విత్తితే, అలవాటును కోయుదువు
అలవాటును విత్తితే గుణమును కోయుదువు
గుణమును విత్తితే గమ్యమును కోయుదువు.

యేసుప్రభువు తన బోధనాపరిచర్యలో ఆలోచనా జీవితమునుగూర్చి నొక్కి చెప్పెను. ఒకదినమున ఆయన యూదా ప్రజలను పిలిచి ఈ విషయమును బోధించెను. వారు బాహ్యాచారములను ఖచ్చితముగా ఆచరించుచు అంతరంగ విషయములను పట్టించుకొనరు. మోషే ధర్మ శాస్త్రము ప్రకారము పందిమాసము, రొయ్య, కుందేలు, ఎండ్రకాయ మొదలగు వాటి మాంసమును తినినయెడల వారు అపవిత్రులగుదురు. మత పరముగా ఆహారపదార్ధములవలన అపవిత్రులగుట ధర్మశాస్త్ర యుగములోని బోధ. అయితే యేసు ప్రభువు ఆ యుగముయొక్క ముగింపును గూర్చి ప్రకటించెను. ఆహార పదార్థములు అపవిత్రపరచవనియు చెడ్డ ఆలోచనలే అపవిత్రపరచునని ఆయన చెప్పెను.

“అప్పుడాయన జనసమూహమును మరల తన యొద్దకు పిలిచి మీరందరు నామాట విని గ్రహించుడి. వెలుపలినుండి లోపలికి పోయి మనుష్యుని అపవిత్రుని చేయగలుగునది ఏదియులేదుగాని, లోపలినుండి బయలువెళ్లునవే మనుష్యుని అపవిత్రునిగా చేయుననెను. ఆయన జన సమూహమును విడిచి యింటిలోనికి వచ్చినప్పుడు, ఆయన శిష్యులు ఈ ఉపమానమును ఆయన నడుగగా, ఆయన వారితో ఇట్లనెను, మీరును ఇంత అవివేకులై యున్నారా? వెలుపలినుండి మనుష్యుని లోపలికి పోవునదేదియు వాని నపవిత్రునిగా చేయజాలదని మీరు గ్రహింపకున్నారా? అది వాని హృదయములో ప్రవేశింపక కడుపులోనే ప్రవేశించి బహిర్భూమిలో విడువబడును. ఇట్లు అది భోజనపదార్ధములన్నిటిని పవిత్రపరచును. మనుష్యుని లోపలినుండి

బయలువెళ్ళునది మనుష్యుని అపవిత్రపరచును. లోపలినుండి అనగా మనుష్యుల హృదయములోనుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును కామవికారమును మత్సరమును దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలువెళ్ళి మనుష్యుని అపవిత్రపరచునని ఆయన చెప్పెను. (మార్కు 7:14-23)

పాపపు ఆలోచనలకు సాకులుగా భక్తిపూరిత వివరణలు ప్రజలు చెప్పుట మీరు వింటున్నారు. అవేవనగా "పక్షులను నీ తల మీద వాలకుండ చేయలేవు. అయితే అవి అక్కడ గూడు కట్టుకొనకుండ ఆపగలవు." దీని భావమేమనగా అనుకోకుండగా వచ్చుచున్న శరీర శోధనలలో పాపములేదని వారి వుద్దేశము. ఆహ్వానించి దానికి అనుకూలముగా స్పందించుట పాపముఅని. అయితే ప్రశ్నయేమనగా అవి పాపయుక్తములుకానిచో, అవి పవిత్రమైనవా?' ఏలాంటి చెడ్డ శరీరేచ్ఛాయుతమైన ఆలోచన ఆహ్వానించినను, ఆహ్వానించకపోయినను అపవిత్రమైనదే. అందువలన అది తీర్పు పొంది క్రీస్తు రక్తముచేత కడుగబడవలసినదే. పాపమును ప్రేరేపించు ప్రకటనలు, రంగులు పూసిన సంభాషణలు, కోరుకొనని ఇతర అపవిత్రతలు మనుస్సుపై పడుచున్నవి. వీటివలన అపవిత్రులము కాకుండలోకములో జీవించుట అసాధ్యము. అయితే దానికి విరుగుడు (మందు) ఏమనగా వెంటనే ఆలోచన అపవిత్రమైనదని ఒప్పుకొని అప్పటికప్పుడే విడిచిపెట్టి కోరనిదానిగా బహిష్కరించవలెను.

**దానినిగూర్చి ఆలోచించవద్దు:**

కొండమీద ప్రసంగములో చెడ్డ ఆలోచనయొక్క ప్రమాదమునుగూర్చి యేసునొక్కి చెప్పెను.

నరహత్య చేయవద్దు. నరహత్య చేయువాడు విమర్శకులోనగునని పూర్వీకులతో చెప్పబడిన మాటవిన్నారుగదా! నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకులోనగును. తన సహోదరుని చూచి, వ్యర్థుడా, అని చెప్పువాడు మహాసభకు లోనగును. ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును (మత్త 5:21,22)

వ్యభిచారముచేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా! నేను మీతో చెప్పునదేమనగా ఒక స్త్రీని మోహపుచూపుతో చూచుప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారముచేసిన వాడగును. (మత్త 5:27-28)

నరహత్య చేయవద్దు అని ధర్మశాస్త్రము చెప్పుచున్నది. అయితే నరహత్యనుగూర్చి ఆలోచించవద్దు అని యేసు చెప్పెను. ఎందుకు? ఏలయనగా దానిని ఆలోచించకపోతే, దానిని నీవు చేయవు. వ్యభిచారము చేయవద్దు అని ధర్మశాస్త్రము చెప్పుచున్నది. అయితే స్త్రీని మోహపుచూపుతో చూడవద్దని యేసు ప్రభువు చెప్పెను. ఆయన ఎందుకీలాగు చెప్పెను? ఏలయనగా కార్యమునుగూర్చి ముందుగా ఆలోచన చేయును. నీ మోహపు వాంఛను చంపివేస్తే, ఆ కార్యమునుగూర్చి నీవెన్నడును పశ్చాత్తాపపడవు.

అపొస్తులుడైన యోహాను గూడ తన మొదటి పత్రికలో ఇదే సూత్రమును చెప్పెను "తన సహోదరునిద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకునియందును నిత్యజీవముండదని మీరెరుగుదురు." (1యోహాను 3:15)

ద్వేషమును నరహత్యయని చెప్పుట విపరీతముగా కనబడవచ్చును. అయితే అవి రెండును కలిసియున్నవని మనము గుర్తుచేసికొనవలెను. కోరిక - నెరవేర్పు కారణము - ఫలితము. ద్వేషము అనునది పిండముగానున్న నరహత్య. ద్వేషము, కోపము లేకపోతే హత్యయేవుండదు.

మానవ మనస్సు వర్ణింపనలవికాని మర్మముగాను, చెప్పశక్యముకానిది, ఆశ్చర్యకరమైనదిగా ఉన్నది. సైన్యములో ఆజ్ఞలు పంపించే కేంద్రకార్యాలయమువంటిది. కలము తీసివ్రాయుమని చేతికి చెప్పునది మనస్సే. ఏమి వ్రాయబడవలెనో తీర్మానించునది. అదోక విస్తారమైన వార్తా ప్రసారవిధానమువంటిది. అదెల్లప్పుడు తలంపులను పంపుచునే యుండును.

**అయినను అదెట్లు జరుగుచున్నది? ఆలోచన అనగా యేమి?**

ఇలా చెప్పబడింది, ఒక వేళ మానవుని మెదడు చేయుపనులకు ప్రతిగా ఒక కంప్యూటర్ నిర్మించినట్లయితే అది న్యూయార్కులోని ఎంపైర్ స్టేట్ బిల్డింగు (60 అంతస్తులకంటే పెద్ద భవనం) అంత ఉండును. అయినప్పటికి మానవ మెదడుకు సాటిరాదు.

మనలో అనేకులు మన మనస్సునుగూర్చి ఆలోచించరు. అయితే బైబిలు చెప్పునదేమనగా అది దేవుడు మనకిచ్చిన ఉపదేశిని. దేవుడు దానికి మనలను బాధ్యులుగా చేసెను. మనలో ప్రతివాడు ఒక విశాలమైన అంతర్లీనమైన రాజ్యమును పాలించు రాజును పోలియున్నాడు. అది మనస్సు అనే రాజ్యము (మానసిక రాజ్యము). మనలో ప్రతివాడు తానేమి తలంచునో ఎట్లు తలంచునో అందుకు బాధ్యుడైయున్నాడు. మనము దానిని మంచికిగాని, చెడునకుగాని వినియోగింపగలము. తగినదా, తగనిదా పరిశీలించవలెను. మన ఆలోచనను మనము అదుపుచేయగలము.

**మనస్సు యొక్క మంచి పార్శ్వము (side) :**

మనస్సునకు మంచిచేయగల సామర్ధ్యమును గురించి తలంచుచున్నాను. హ్యాండెల్ అనువాని ఒక ఉదాహరణగా తలంచుచున్నాను. అతడు కూర్చోని మెస్సీయను సంగీతరూపకము సంకలనముచేసి సంగీతము సమకూర్చెను. పదములకు తగినట్లుగా సంగీతమును కూర్చెను. సంగీత వాద్యములేకుండ వినకుండ, దానిని లేఖనములలో చదువలేము. ఆ కార్యామంతయు ఆత్మీయమైనది. ఈలాగే సంగీతములో కూర్చబడిన కథ పరలోకములో ఉండునేమోయని తలంచుచున్నాను.

ఐజక్ వాట్ అను ఆయన ఒక గొప్పపాట వ్రాసెను. “ఆశ్చర్యకరమైన సిలువను నేను కొలిచినప్పుడు” అనుపాట అతడు తన మనస్సును ప్రభువునకు సమర్పించెను. ఈ పాట క్రైస్తవలోకమునకు అతడిచ్చిన కానుకలలో ఒకటి. అయితే నాలో నేను ఇట్లనుకొనుచున్నాను ఇటువంటి ఒక్కపాట జీవితమంతటిలో ఒక్కటి వ్రాస్తేచాలు. అట్టిజీవితము ధన్యమే....”

క్రమశిక్షణగల మనస్సు కలిగిన మిల్టను కవి జ్ఞాపకమునకు వచ్చుచున్నాడు గంటలకొలది శ్రమపడి ఆ తర్వాత పూర్తిచేసిన “పరదైసు పోయినది” అను శ్రేష్టమైన గ్రంథమును వ్రాసెను. ఎన్నిపుటల సాహిత్యము అతని మనస్సు ద్వారా నింపబడినదో!

అలాగే మైకలేంజిలో అతని చిత్రలేఖనము అతని శిల్పములు కూడ అట్టివే. ఆ కళయొక్క విస్తీర్ణత, సౌందర్యము వర్ణనాతీతము.

ఈ విశ్వానికి సంబంధించి అతనికొక మనసుంది. అదృష్టవశాత్తు మనకు అతని ఆలోచనలు చిత్రలేఖనములోను, చలవరాళ్లలోను పదిలపరచబడినవి.

తరువాత ప్రసంగీకులకు ప్రిన్స్ అని పేరుపొందిన సి.హెచ్. స్పర్జను గూర్చి తలంచుచున్నాను. ఎ.టి. పియర్సన్ స్పర్జన్ గారిని గూర్చి ఈలాగు చెప్పెను. “అతనికున్న మనస్సంతటిని, దేవుడు తనికిచ్చిన అవకాశములన్నిటిని శ్రేష్ఠమైన వాటికి ఉపయోగించెను “ఆయన ప్రసంగములను, ఫలభరితమైన అతని జీవితమునుగూర్చి చదివినప్పుడు నిజమేనని నమ్ముచున్నాను.

మన దినములలో కూడా ఉదాహరణలు చూడవచ్చును. చంద్రమండలమునకు పోవుటకు తీర్మానము చేసికొనినవారి మనస్సు సమర్పణతోకూడుకొన్నవే. ప్రణాళిక సిద్ధము చేసికొని నిర్వహణలో విజయవంతమైన వారిమేథస్సు మెచ్చదగినదే. ఎంతో దర్శనము, ఎంతో నేర్పు, ఎక్కడను వ్యత్యాసములేని ఖచ్చిమైన స్థితి – ఆశ్చర్యకరములే.

**కీడుచేయుటకు సామర్థ్యముకలదు:**

అయితే ఇప్పుడు మనస్సునకు కీడు చేయుటకుగల సామర్థ్యమును గురించిన ఆ సంగతి పరిశీలించుదము. హృదయములేని నియంతలు, వారి చిత్రహింస స్థావరములు, రాజకీయ ఖైదీలను ఒక చోట వుంచి బాధించుట, గ్యాస్‌గదులలో నుంచుట, పొయ్యిలోనుంచుట ఈ పశుత్వము లక్షలాదిమంది అమాయకులను నాశనము చేసెను.

మరికొందరైతే ఇతరుల విశ్వాసమును నాశనము చేయుటకు తమ మనస్సును వినియోగించిరి. వాల్‌టెర్, టామ్ పెయినె మరియు రాబర్ట్ ఇంగర్‌సోల్ మొదలగువారు ఈ కోవకు చెందినవారు, దేవుడు వారికి చురుకైన మనస్సును వరముగా నిచ్చెను. దేవుని తెలిసికొనుట అసాధ్యమనియు, అపనమ్మకత్వమును వారు ప్రచారముచేసి వారి మనస్సులను అపవిత్రపరచుకొన్నారు.

ఈనాడు మరికొందరు బూతుసాహిత్యమునకు ప్రణాళికవేసి, ముద్రించి ప్రచురముచేయుచున్నారు.వారు మనస్సును ఎలావాడుతున్నారో గదా! మురికిని అమ్ముకొనువారు నైతిక వాతావరణమును కలుషితము చేయువారు, అపవిత్రతను, వక్రబుద్ధిని అభివృద్ధి పరచువారు సమాజములో నిండియున్నారు.

కీడునుగూర్చి ఆలోచించు సామర్థ్యము మనస్సునకున్నది. వారములో కలిగిన బహునీచ తలంపును బహిరంగముగా వ్రాసికొని ఒక గంటకూడ వీధిలో నడువలేము. మనస్సు మనలను మానవుడు చూడని పాపపు చీకటి సందులోనికి తీసికొని పోగలదు. ఊహించగలిగిన సుఖములను కోరుకొనుచు నిషిద్ధ సంబంధములలోనికి మనస్సు

ప్రయాణము చేయగలదు. ఒక మిత్రుడు ఈలాంటి పరిస్థితిలో పట్టబడినప్పుడు నీతియుక్తమైన కోపము అతని తృణీకరించును. అయితే మనము ఒంటరిగా నున్నప్పుడు, ఒకవేళ చీకటిలో కావచ్చును, అదే తరహా నీచమైన అసహ్యకరమైన పాపములోనికి మనస్సు పోగలదు. అప్పుడు మన స్పందన వేరుగా నుండును. కాలము, స్థలముచేత ఆటంకపరచబడని స్థితిలోకి మనస్సు ప్రయాణము చేయగలదు. ఏ వ్యక్తితోనైనను, కోరుకొన్న వారితోను ఏ కార్యముచేయుటకైనను హృదయ వాంఛలు తీర్చుకొనుట కైనను మనస్సు తీసికొనిపోవును. విశ్వాసియొక్క ఆలోచనా జీవితములో ప్రవేశించు కీడు సాధ్యతను తలంచినప్పుడు భయము గొల్పుచున్నది. సాధ్యమయ్యే పనులకు మనము అలవాటుపడితే ఫలితము ప్రమాదకరమేయగును. 1988లో టి.వి. సువార్తికుడు లక్షల ప్రజలకు సువార్త ప్రపంచవ్యాప్తముగా బోధించినవాడు వ్యభిచారములో పట్టుబడెను. బాల్యమునుండి ఆశ్లీలసాహిత్యముచేత ప్రభావితుడనైతిని అని అతడు ఒప్పుకొనెను.

సులువుగా చిక్కులుపెట్టు పాపములకు బానిసలైన వారి మొరవినబడు చున్నది. అట్టివారు అనేకులు నేటి దినములలో వారు విడుదలకోరుచున్నారుగాని వారి ఆలోచన సరళి అదుపు చేసికొనుటకు ఇష్టపడుటలేదు. ఈ మధ్యనే ఒక క్రైస్తవునకు తన విమాన ప్రయాణములో ఒక యవ్వనసైనికుని ప్రక్కనే సీటు దొరికినది. శుభములు చెప్పుకొనిన తర్వాత ఆ సైనికుడు ఒక మాసపత్రికను క్రైస్తవునికి యిచ్చెను. అది చూడగా హేయమైన సంగతులు అందులోనున్నవి. మర్యాదపూర్వకముగా అతనికి తిరిగియిచ్చెను. క్రైస్తవుడు ఒక ఎర్రని బైబిలు యిచ్చెను. పూర్తిగా నిశ్శబ్దముగా నుండిరి. అప్పుడు సైనికుడు క్రైస్తవునితో నీవు సహాయముచేసెదవా అని అడిగెను. అతడు తన ఘోరమైన పాపమును సిగ్గుతో చెప్పుకొని సహాయముచేయుమని బ్రతిమాలెను. లైంగికపాపమునుండి విడుదల కోరుకొనెను. అయితే అతడు అశ్లీలసాహిత్యముతో కూడిన పుస్తకములు చదువుచుండెను.

ఆలోచనలను అదుపు చేసికొనవచ్చునని జార్జిగుడ్‌మన్ మనకు జ్ఞాపకము చేయుచున్నాడు. “చెడ్డ ఆలోచన పెట్రోలులో ముంచిన మురికి గుడ్డలవలెనున్నవి. శోధనయను రవ్వ రాగానే అవి మంటలు మండును. నీ చెడ్డ ఆలోచనను ఆపివేయవచ్చును. ఆలోచనను నియంత్రించే కళ ఇంతకముందే నేర్చుకొనకపోతే, నీవు తప్పకనేర్చుకొనవలెను. శరీరేచ్ఛలతో మనస్సు రహస్యముగా జోక్యము చేసికొనుటకు సాకు చెప్పుటచాలదు. ఆత్మద్వారా ప్రతి ఆలోచనను క్రీస్తునకు చెరపట్టవచ్చును. ప్రతి ఆలోచనను ఆత్మచేత చంపివేయవలెను.”

**తీవ్రమైన చర్య:**

అసలు క్లిష్టాంశమేదనగా గొడ్డలి చెట్లవేరు యొద్ద ఉండవలెను. ఆలోచన సరళిని తీర్మానముద్వారా పరిష్కరించుకొనుటకు ఇష్టము చూపవలెను.

రక్షింపబడని వారైతే మొదటిగా అతడు మారుమనస్సు పొందవలెను. యేసు ప్రభువునందు విశ్వాసముద్వారా అతడు తిరిగి జన్మింపవలెను. అప్పుడు మాత్రమే లోపల నివసించు పరిశుద్ధాత్మశక్తినిబట్టి చెడ్డఆలోచనలకు వ్యతిరేకముగా తీర్మానించి, చర్యతీసుకొనగలవు.

**క్రైస్తవునికి అనేక అడుగులు సూచించవచ్చును:**

మొదటిగా సంగతి అంతయు ప్రభువునకు చెప్పి ప్రార్థించుము. దావీదు మాటలు మనలో ప్రతివానికి సరిపోయిన మనవి. "దేవా, నాయందు శుద్ధహృదయమును కలుగజేయుము. నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము" (కీర్త 51:10) వ్యభిచారము, నరహత్య అను రెండు పాపములు చేసిన తర్వాత దావీదు పాపపు ఒప్పుకోలులో పలికినమాటలివి. అతని అదుపులేని ఆలోచనాలోకమునుండి వచ్చిన పాపము అతడు ఒప్పుకొనుచున్నాడు.

రెండవదిగా నీ మనస్సులోనికి వచ్చిన ప్రతి పాపపు ఆలోచనను క్రీస్తుసన్నిధిలో పెట్టి విమర్శించుకొనుము. నిజమైన పరీక్షయేదనగా నీ ఆలోచనలు, క్రియలు ప్రభువు సన్నిధిలో ఎట్లు కనబడుచున్నవి. 2 కొరింథీ 10:5లో ఈలాగు చెప్పబడెను.

"దేవుని జ్ఞానమును అడ్డగించు ప్రతిగర్వమును, వితర్కములను నాశనము చేయుచున్నాము. ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టుచున్నాము" (ఆర్‌యస్‌వి)

మనము ప్రతి ఆలోచనను బంధింపబడిన బానిసను ఈడ్చుకొనిపోయిన రీతిగా క్రీస్తు న్యాయతీర్పునకు లోపరచవలెను.

ప్రతి ఆలోచన ఆయన సమ్మతించని ప్రతిదానిని మనము పాపముగాను అపవిత్రతగా ఒప్పుకొనవలెను. వీధిలో నడుచునప్పుడుగాని, కారు నడుపునప్పుడుగాని, మనమెక్కడవున్నను, చెడు ఆలోచనను ఒప్పుకొనవలెను. "ప్రభువా ఇది పాపము. నా మనస్సు అపవిత్రమైనది. క్షమించుము, పవిత్రపరచుము. గొర్రెపిల్ల రక్తపుశక్తిని

నమ్ముకొనుచున్నాను.”

మన మనస్సులలో నుండి ఆలోచనను నెట్టి వేయవలయును. పాపములు ఒప్పుకొనినప్పుడు కనికరము పొందరు గాని ఒప్పుకొని విడిచిపెట్టినప్పుడు కనికరము పొందుదురు.

పాపములు ఒప్పుకొనని వాడు వర్ధిల్లడు అయితే ఒప్పుకొని, విడిచిపెట్టినవాడు కనికరము పొందును. (సామె 28:13)

ఆచరణలో వారమునకు వెయ్యిసార్లు ‘కాదు’ అని చెప్పుటకు నేర్చుకొనవలెను. వ్యతిరేకముగా ఆలోచించుటకు శోధింపబడినప్పుడు మనమిట్లు చెప్పవలెను. “కాదు, నేను అట్టి ఆలోచనకు తావీయను. దానిని తృణీకరించి యేసు ప్రభువునామమున నెట్టివేయుచున్నాను”

**అనుకూలమైన ఆలోచన:**

అనుకూలముగా ఆలోచించుట నేర్చుకొనవలెనని పౌలు ఫిలిప్పీ 4:8లో చెప్పుచున్నాడు.

“మెట్టుకు సహోదరులారా యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో ఏవి రమ్యమైనవో ఏవి ఖ్యాతిగలవో, వాటి మీద ధ్యానముంచుకొనుడి”

గమనించవలసినదేమనగా వీటిమీద మనస్సుపెట్టినయెడల అదే సమయములో పాపమునుగూర్చి ఆలోచించము. క్రీస్తు ఆయన పవిత్రతతో మనస్సును నింపును. అప్పుడు పాపము, అక్రమము వెళ్ళిపోవును. “నూతన మమకారపు నెట్టివేయుశక్తి. “అని కొందరు చెప్పుదురు. నీవు ఏమని పిలిచినను సరే తప్పనిసరిగ చేయవలయును. క్రీస్తుతో మన మనస్సును నింపుకొన్నప్పుడు ఆయన పోలికలోనికి మార్చబడుదుము(2కొరింధి 3:18)

సామాన్యముగా మనము తెలిసికొనునదేమనగా మన ఆలోచనజీవితముపై విజయము పొందగోరిన యెడల, మనము చదువుదానిపై, చూచుదానిపై, మనస్నేహముపై మనము క్రమశిక్షణ పాటింపవలెను. చెడ్డపుస్తకములు, మ్యాగ్జైనులు, హాలివుడ్ సినిమాలు, సగటు టివిలు అపవిత్రతను చూపి కలుషితముచేయును. మనము

చూచుచున్న పరికరములన్నియు వాంఛను రెచ్చగొట్టును. ఒక మంచిమాట తగురీతిగా సహాయపడును.

చివరిగా ప్రభువు కొరకు మనము తీరక లేకుండ పనిచేయుచుండవలెను. సోమరితనము వలన గొప్ప ప్రమాదములు కలుగును. దేహమునకు సమృద్ధి ఆహారము, మంచి విశ్రాంతి ఉన్నప్పుడు పాపము జరుగును. క్రీస్తు కొరకు అలసిపోకుండ జీవితమును గడిపినప్పుడు గొప్ప భద్రత కాపుదల ఉండును. సమయమును సద్వినియోగము చేయువానికి చెడ్డతలంపులకు తావుండదు. సామెత 16:3లో ఈ ఆలోచనకు సూచన యున్నది.

“నీ పనుల భారము యెహోవామీద నుంచుము.

అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును”

## అధ్యాయము - 18

# ధ్యానము - సరియైన పద్ధతి

లేఖనముల ధ్యానములో సమయము గడపని పరిశుద్ధుని నేనెన్నడు ఎరుగను. ధ్యానములో సమయము గడుపుటకు వ్యక్తియొక్క భక్తిజీవితమునకు ప్రత్యక్ష సంబంధమున్నది.

ధ్యానమును గూర్చి మాట్లాడినప్పుడు దేవుని ఘనపరచు అంశములు, క్షేమాభివృద్ధి కలిగించు ఆలోచనలవైపు దృష్టి ఉద్దేశపూర్వకముగా దృష్టి మళ్లించుటయని మా భావము. క్రైస్తవుని ధ్యానము అనగా మానసిక క్రమశిక్షణ. తద్వారా ప్రభువు మీదను, దేవుని వాక్యముమీదను, ప్రభువు సంగతులమీదను ఆలోచనలను కేంద్రీకరించుట. అల్పమైన సంగతులపై గురిలేకుండ మన మనస్సులను తిరుగులాడనీయక ప్రయోజనకరమైన అంశములమీద ఆలోచనలను నిలుపుటకు తర్ఫీదునీయవలయును. తటస్థముగా నుండి సోమరితనముగా కాలము వృధాచేయక మన మానసిక శక్తులను కృపయందు జ్ఞానమందును వినియోగించుట శ్రేయస్కరము. ధ్యానము క్రైస్తవుని ఆలోచనా తటాకము.

నెమరువేయు గోవును గమనించుము. అది అంతకు ముందే ఆహారమును తినెను. అయితే అది తన మొదటి కడుపులోనుండి ఆహారమును వెనుకకుతెచ్చుకొని మరల నములును. గోవు ముఖములో తృప్తిని గమనించుము. ఆలాగే విశ్వాసి దేవుని వాక్యమును చదివి తాను చదివిన దానిని నెమరువేసికొనుచు కాలమును గడుపవలెను. ఇది మనజీవితమునకు పరిశుద్ధత, సంతృప్తినిచ్చును.

**తప్పు పద్ధతి:**

తూర్పు దేశ మతములలో భావాతీత ధ్యానము, ఇతర రకములైన ధ్యాన రూపములు లేఖనానుసారమైన ధ్యానమునకు భిన్నమైనవి. మత సంబంధమైన ధ్యానము చెప్పునదేమనగా దేవుడు వ్యక్తిలో ఉన్నాడనియు, ధ్యానముద్వారా దైవశక్తి పొందగలడనియు వారు తలంచుదురు. ఇతర రూపములు చెప్పునదేమనగా మనస్సును

శుద్ధిచేసికొని అభిప్రాయములకొరకు వేచియుండవలెను. మనస్సులను ఖాళీచేసి. సందేశములకొరకు ఎదురు చూడవలెననుట వలన దురాత్మల దాడికి వారు గురికాగలరు. దయ్యముపట్టిన వానిని గూర్చి యేసుచెప్పెను. అతడొక రకమైన దిద్దుబాటు చేసికొనెను. అపవిత్రాత్మ వెళ్లిపోయినది. అయితే ఇల్లు ఖాళీగానే యుండెను. అపవిత్రాత్మ తన కంటె మరి చెడ్డ ఆత్మలను తీసికొనివచ్చి అతని జీవితమును ఆక్రమించెను. (మత్తయి 12:43-45). క్రైస్తవధ్యానము మనస్సును దేవుని వాక్యముతోను, సత్యమైన వాటితోను మాన్యమైనవాటితోను, న్యాయమైనవాటితోను, పవిత్రమైనవాటితోను రమ్యమైనవాటితోను ఖ్యాతిగలవాటితోను నింపును (ఫిలిప్పీ 4:8).

ధ్యానమువలన ఆత్మీయ సమృద్ధి, విజయము కలుగును. “ఈ ధర్మశాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటినన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గము వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు “(యెహోషువా 1:8) ధ్యానముయొక్క గురి మారిన జీవితమును ఉత్పత్తి చేయుట” వ్రాయబడిన ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు”

ధ్యానము దేవునియందు మానవుని జీవితము లోతుగా వేరుపారునట్లు చేయును. అతని ఫలవంతునిగా చేయును. “అతడు నీటికాలువల యోరను నాటబడినదై ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయునదంతయు సఫలమగును” (కీర్త 1:3) ధ్యానము ఒకవ్యక్తిని పరలోక సమాచారము తెలుసుకొను మార్గములో ఉంచును. యెహోవా మర్మము ఆయన యందు భయభక్తులు వారికి తెలియజేయును. (కీర్తన 25:4ఎ) నడిపింపు విషయములో సందేశములు, ప్రోత్సాహము, హెచ్చరిక, దిద్దుబాటు సంగతులు బయలుపరచవచ్చును అయితే సిద్ధాంత సత్యము మాత్రముకాదు. బైబిలులోనున్న సత్యమునుమించి మరొకటి ఆయన బయలుపరచడు. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడినబోధ (విశ్వాసము)యని యూదా 3లో నున్నది.

అల్పమైన సంగతులను వెంటాడి సమయమును వృధాచేయకుండ ధ్యానము మానవునికాపాడును.

ధ్యానము దేవుని సంతోషపరచు మార్గము. ఈ రీతిగా కీర్తనకారుడు ప్రార్థించెను “యెహోవా, నా ఆశ్రయదుర్గమా, నావిమోచకుడా, నా నోటిమాటలను నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగునుగాక’. (కీర్తన 19:14) అది క్రీస్తు పోలి-

కను ఉత్పత్తిచేయును. ఆయనకు ఎంతయెక్కువగా లోబడుదుమో అంత యెక్కువగా క్రీస్తుపోలికను కలిగియుందుము (2కొరింథీ 3:18)

**ఎట్లు ధ్యానింపవలెను:**

ధ్యానించుపద్ధతి విషయములో అందరికి (ప్రతివానికి) సరిపోయే శ్రేష్ఠమైన మార్గమంటూ యేమియులేదు. తనకు, తన పరిస్థితులకు సరిపోయే అనుకూల పద్ధతిని ప్రతి విశ్వాసి సిద్ధముచేసికొనవలెను. మనము ఖచ్చితమైన సమయమును, ప్రశాంత స్థలమును, టెలిఫోనుగాని, రేడియోగాని, ప్రజల తాకిడిగాని, ఇతర ఆకర్షణ లుగాని లేనిరీతిగా, కాలమును ప్రత్యేకించుకొనవలెను. సాయంకాల సమయములో పొలములో ధ్యానముచేసికొనుటకు ప్రశాంత స్థలము ఇస్సాకు కనుగొనెను (ఆది 24:63) పగటిలోగాని రాత్రిలోగాని వత్తిడిలేని సమయమును మనము ధ్యానమునకు వినియోగింపవలెను. నిద్రపట్టనివేళలో దావీదు యెహోవాను జ్ఞాపకముచేసికొను అలవాటుకలిగి, ఆయనను ధ్యానముచేసెను (కీర్త 63:4)

అవసరములేకపోయినను గుర్తుకువచ్చే పనులు చెయ్యవలసిన ఫోను కాల్స్ మరియే యితరమైన ఆలోచనలు మనలో ప్రవేశించినప్పుడు ఒకచోట వ్రాసికొనుట మంచిది. ఆలాగు వ్రాసిన వెంటనే వాటిని మనస్సులోనుండి త్రోసివేసి, ధ్యానమువైపు మనస్సును మళ్లింపవలెను.

ధ్యానముచేయుటకు అంశములకొరతలేదు. రాత్రి జాములందు అమూల్యమైన దేవుని వాగ్దానములను కీర్తనకారుడు మనస్సునందుచుకొనెను (కీర్త 119:148) మొదటి కీర్తనలో ధన్యుడైన మానవుడు యెహోవా ధర్మశాస్త్రమందు ఆనందించెను. దివారాత్రులు ధర్మశాస్త్రమును ధ్యానించుచుండెను. (కీర్త 1:2, 119:78) ప్యూరిటనులు యెక్కువకాలము దేవుని లక్షణములను గూర్చి ఆలోచించిరి. వారి ఆత్మల విశాలతకు ఇదే కారణం. సృష్టిలో దేవుని అద్భుతకార్యములను గూర్చి ఆలోచించుట ద్వారా మనస్సుకు తరిగిపోని ఆహారము ఇచ్చును (కీర్త 143:5) విమోచనలోని అద్భుతములు ధ్యానమునకు అనంతమైన పదార్థము దొరకును. శక్తివంతమైన క్రైస్తవపరిచర్యకు సంబంధించిన సంగతులపై ధ్యానము నిలుపవలెనని తిమోతికి పౌలు చెప్పెను (1తిమో 4:15)

ప్రారంభములో లేఖనములో ఒక చిన్న భాగమును తీసికొనుట సహాయకరముగా

నుండును. కొద్దిపాటి పవిత్రమైన ఆలోచన, ప్రతిమాటపై మనస్సును కేంద్రీకరించుట క్షేమకరముగా నుండును. ఉదాహరణకు "దేవుని కుమారుడు నన్ను ప్రేమించి నా కొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (గలతీ 2:20బి).

**దేవుని కుమారుడు –** ఆలోచించుము. మానవుడు మాత్రమేకాదు దేవుడు శరీరమందు ప్రత్యక్షమయ్యెను. మహిమకు, జీవమునకు ప్రభువు. ఆయన సృష్టికర్త, విశ్వమును పోషించువాడు.

**ప్రేమించెను –** ఆయన ప్రేమను వివరించు విశేషణములను కూర్చుము. అది కొలువలేనిది. అర్హత లేకపోయినను కృప చూపునది త్యాగపూరితమైనది. పోల్చుటకు వీలుకానిది, నిష్పక్షపాతమైనది. 1 కొరింథీ 13:4–8 లో చెప్పబడిన దానిని సమీక్షించుము.

**నన్ను –** మన స్వాభావిక స్థితినిబట్టి బైబిలు ఏమని వర్ణించునో ఆలోచించుము, పాపులు, భక్తిహీనుడు, మృతుడు, దేవుని శత్రువులని, దేవుడు లేనివారమని, నిరీక్షణ లేనివారమని, బలము లేని వారమని బైబిలు మనలను వర్ణించెను.

**అప్పగించుకొనెను –** ప్రేమ ఎల్లప్పుడు ఇచ్చును. అయితే ఆయన ప్రేమ ఏమియిచ్చినది? – తన్నుతానే అప్పగించుకొనెను. ఆయన ధనము ఇవ్వలేదు. ఇతర పదార్థరూపమున ఇవ్వలేదు. తన్నుతానే అప్పగించుకొనెను. అనగా ఆయన రక్తము, ఆయన జీవము, ఆయన దంతయు ఇచ్చెను. మన విమోచన సంపాదనకొరకు గొప్పక్రయము చెల్లించెను.

**నాకొరకు –** ఆశ్చర్యముకలిగించుసంగతి ఎంతో అనర్హుడనైన నా కోసము అంతగొప్ప త్యాగమా! అట్టి ప్రేమకు నేనెట్లు స్పందింతును? ఐజక్ వాట్స్ వ్రాసిన పాటను నా సొంతముగా ఒప్పుకొనుచున్నాను.

నా సర్వస్వమును ఆయనకు అర్పించినను అది బహు అల్పమే.
ఎంతో ఆశ్చర్యకరమైనప్రేమ, దైవికమైన త్యాగము
నా ఆత్మను నా ప్రాణమును, నాయావత్తును కోరుచున్నది.

నూతన విశ్వాసి తన పరిమిత బైబిలు జ్ఞానముతో గ్రహించుటకు కష్టమైనట్లయితే అతడొక లేఖన భాగము తీసికొని పరిశీలించుట ద్వారా కొన్ని పాఠములు నేర్చుకొనవచ్చును. ఉదాహరణకు అతడు మత్తయి పిలుపును గూర్చి చదువచ్చును. (లూకా 5:27) ఈ చిత్రము ఊహించుము. అతడు పన్నులు (సుంకములు) వసూలు చేసేవాడు. అతడు

అనేకమందిని కలిసికొనేవాడు. అప్పుడు యేసు అతని యొద్దకువచ్చెను. మత్తయి ఆయనను యేలాగు కనుగొనెను? భిన్నమైన వ్యక్తిగానా? నన్ను వెంబడించుమని యేసు చెప్పెను. మత్తయి మనస్సులో ఏమని ఆలోచించియుండును? నేనైతే ఏమి ఆలోచించే వాడిని? ఆయనను వెంబడించుటకు అతడేమి వదిలివేసెను?అతడేమి పొందెను?

ఈలాగు సంగతులు గ్రహించుటకు అన్ని సాధ్యమే అనే ఆలోచనకు వ్యత్యాసమున్నది. ఈ రెండు ఒకటేయని భావించి గలిబిలిలో పడరాదు. కొందరు గురువులు రెండవ తరహా చిట్కాను ప్రయోగించి వారేమికావలెనని తలంచియున్నారో దాని దృశ్యమును ఊహించుట ద్వారా దానిని పొందగలరు అని బోధిస్తాను. అది ఆరోగ్యమా, ఐశ్వర్యమా పేరు ప్రతిష్ఠలా, హోదానా, సుఖభోగములా ఇట్టి వాటిని గూర్చి లేఖనాధారమేమిలేదు.

**డాక్టరు డబ్ల్యు.ఇ. సేంగ్‌స్టర్ ఈలాగు వ్రాసెను:**

భక్తిగల విద్యార్థి బైబిలునందే నివసించుట నేర్చుకొనును. దైవభక్తికలిగి తన ఆలోచనను వినియోగించును. పుస్తకములో వున్నవాటిలోనే నిలిచియుండు పద్ధతిని అలవరచుకొనును. ఆ సంగతులు తన సొంతజీవితములోనివిగా యెంచుకొనును. శ్రేష్టమైన ఆలోచన అనగా భవిష్యత్తు కొరకు ప్రణాళిక వేసికొనుటకాదు గాని కాలమనుపడవలో వెనుకకు పరుగెత్తి, ప్రభువుయొక్క జీవిత సంభవములను జ్ఞాపకముచేసికొని మన విమోచకుని చరిత్ర సంగతులలో మనమున్నట్లుగా యెంచుకొని పేతురు, యోహాను, యాకోబులతో కలిసి రక్షకుని చుట్టు వుండి, సమాధి నుండి బయటకువచ్చిన లాజరును చూచి, యేసు పాదములవద్ద మరియవలె కూర్చుండవలెను. సత్యమైన సంగతులను స్వీకరించి, మన జీవితములో వాటిని స్పష్టపరచుటద్వారా మన ఆలోచనను సద్వినియోగముచేసిన వారమగుదుము. బైబిలును లోపలినుండి బయటనుండి మనము చదువగలము. మనముదానితో సంబంధములేకుండనే ఎల్లప్పుడు బాహ్యముగానే యుండగలము లేక దైవవాక్యములోనికి ప్రవేశించి అందులోనే జీవించగలము.

**నిష్ఫలమైన వ్యకలేని జీవన శైలి :**

ధ్యానమునకు గొప్ప ఆటంకము వ్యక లేని జీవితం. పనివత్తిడి యెక్కువైనప్పుడు నిష్ఫల జీవితమును కలిగియుందుము. మనవృత్తులు మనలను తినివేయుచున్నవి. ఇంటికోర్కెలు, కుటుంబము మనలను వత్తిడి చేయుచున్నవి - ఇల్లుకొనుట, ఒకటిలేక రెండు కార్ల అజమాయిషి, ఆహారము, బట్టలు, జీవితభీమా, విద్యామొదలగునవన్నియు

జీవన సంబంధమైనవే. పూర్తికాలము సేవచేయుచున్నామని చెప్పుకొనువారుకూడ అత్యవసర నిరంకుశత్వమునకు గురియగుచున్నారని చార్లెస్ హుమ్మేల్ చెప్పుచున్నాడు. ప్రసంగాలసిద్ధపాటు, శిష్యరికపరిచర్య, సలహాలిచ్చుట, సహాయముకొరకు వందలకొలది పిలుపులు మొదలగు కార్యక్రమములవలన ధ్యానమునకు సమయము దొరకుటలేదు. ప్రభువుపాదములయొద్దకూర్చుండుటకు అవకాశములేకపోవుచున్నది.

మనము పనిమత్తులో పడిపోయాము. జపాను కారులపై ఒక వ్రాత వుండును. దానిని గూర్చివారు అతిశయించెదరు. అదేమనగా "మేము నడపబడుచున్నాము" ఇంటిని చక్కపెట్టుకొనుట, అవసరమైనవాటిని కొనుటకు షాపుకువెళ్ళుట మొదలగు దినచర్యలు మనకు సహజమే. అయితే పని తొందరవల్ల తరుమబడుచున్నామని సాకుచెప్పకూడదు. తీరకలేని ప్రజలు కూడా ధ్యానించవచ్చును. దీనిలో ముఖ్యమైనది సమయపాలన. గొప్ప ఆశయములు కలిగి సాధించిన గొప్పవ్యక్తులుగూడ సొంతసమయమును కలిగియున్నారు. ఖాళీసమయం సద్వినియోగము చేసికొనుటకు మనము క్రమశిక్షణను పాటించవలెను. ఇది చేయుటకు సమయముదొరకని యెడల మనము నిజముగా జీవనవ్యాపారములో మునిగియున్నట్లే యగును.

దేవుడు తొందరపడి దూకేవానికి తనను తాను బయలుపరచుకొనడు. మామూలుగా దృష్టించువానికి, యేదో తెలిసికుందామని ఆసక్తి చూపేవానికి దేవుడు యేమియు తెలుపడు. ఆత్మీయ పర్యాటకునికి ఆయన మహిమను తెలియజేయడు. అయితే తనతో పాటు పర్వతమునెక్కి వచ్చినవానికే బయలుపరచును. నలువది దినములు దేవునితో గడిపిన తర్వాత మోషే ముఖము ప్రకాశించెను. అది ఒక్క క్షణములో కాదు. ఎంతో సమయమును దేవుని యెదుట గడుపుటద్వారా ఫలము వచ్చెను.

**నేరుగా పరలోకమునుండి సంబంధము:**

ధ్యానము ప్రభువునుండి ప్రత్యేక సందేశమును స్వీకరించే స్థితిలోనుంచునని ఇంతకముందే మేము తెలియజేసితిమి. అయితే కొందరు భక్తిహీనులు, శరీర సంబంధులుకూడ "ప్రభువునాతో చెప్పెను" అని చెప్పుచున్నారు. వారి విషయమై జాగ్రత్త కలిగి యుండవలెను. ప్రభువు వారికేమియు చెప్పడని బైబిలు మరియు అనుభవములు తెలియజేయుచున్నవి. అయితే దేవునితో సన్నిహిత సంబంధము కలిగిన వ్యక్తులు దేవుని నుండి కొన్ని ప్రకటనలు పొందుదురు అనే వాస్తవాన్ని అది కాదనలేదు. మూడు ఉదాహరణలు తెలియజేసి ఈ అంశమును ముగించుదును.

శ్రీమతి షెఫ్పర్డ్ తన పెద్దకుటుంబములో పిల్లలందరు రక్షింపబడుదురని ప్రభువు నిశ్చయత యిచ్చినట్లు నమ్మినది. అయితే ఆమె ఆ సంగతి బోధకునితో చెప్పగా, అతడు తేలికగా తీసుకొనెను. రోగిగానున్న ఆమె సోదరునికి ఈ సంగతి తెలియదు. అయితే ఒకరాత్రి అతను యెషయా 49 అధ్యాయమును ధ్యానము చేయుచుండగా అతడు తన సోదరికి సందేశము పంపవలెనని తన భార్యతో చెప్పెను. ఆ సందేశమిదే “నీతో యుద్ధము చేయువారితో నేనే యుద్ధముచేసెదను, నీ పిల్లలను నేనే రక్షించెదను” (యెష 49:25బి) తర్వాత కాలములో ఆమె పిల్లలందరు రక్షింపబడిరి.

ఆల్‌ఫ్రెడ్, ప్రభువుతో బహుసమీపముగానుండి ఆనందించెను. అతనికి మంచిస్నేహితుడు అలెక్స్, అతడును సర్వోన్నతునితో సహవాసము చేయుచుండువాడు. అతడు వేలమైళ్లదూరములో నివసించుచుండెను. వృద్ధుడైన ఆల్‌ఫ్రెడ్ తన కుమార్తెతో ఈలాగు చెప్పెను “కృపాసింహాసనము నొద్ద అలెక్స్‌ను మూడునెలలుగా కలిసికొనలేదు.” కొద్దికాలములో అలెక్స్‌మూడునెలలక్రితము చనిపోయినట్లు వుత్తరము వచ్చినది.

అది శనివారము మధ్యాహ్న సమయము. ఒక యౌవన విశ్వాసి తన ఆఫీసులో దేవునితో హృదయ వేదనతో పోరాడుచుండెను. ప్రభువు అతనిని వదలివేశాడని తలంచెను. అప్పుడు ఒక ఫోను వచ్చినది. అల్లెన్ స్మిత్ అను వృద్ధుడు కీర్తనల గ్రంథమును బాగా ధ్యానము చేసినవాడు. ఆ ప్రకారము జీవించినవాడు. ఫోనులో అతడీలాగు చెప్పెను “ప్రభువు నీ విషయము ప్రార్థించవలెనని నా హృదయములో భారము పెట్టినాడు. నేను నీకొరకు ప్రార్థించుచున్నాను. ఈవిషయము నీవు తెలిసికొనవలెనని కోరుచున్నాను” ఆ యౌవనస్థుడు ఆశ్చర్యపోయెను. అల్లెన్ తనకు యెక్కువ పరిచయములేదు. మానవరీత్య ఆ యౌవనస్థుని సమస్య తెలిసికొనే అవకాశము ఆయనకు లేదు. శనివారము మధ్యాహ్నము యువకుడు ఆఫీసులో ఉండుటకాని, అతని ఆఫీసు నంబరుకు ఫోను చేయుటకు కాని అవకాశమే లేదు. ఇది నమ్ముటకు ఆశ్చర్యముగానే యున్నది.

విశ్వాసమును బట్టి ప్రభువుతో నడుచువారు తన మార్గములో ఆయన స్నేహితుడుగా వెంబడించునని యెరిగినవారు, ఆయన ప్రేమను, శ్రద్ధను గూర్చిన సమాచారము తెలిసికొనుటలో తప్పిపోరు. వారియెడల ఆయన మౌనముగా నుండడు. వారికి ఆయన క్రొత్తవాడుకాడు. లోతైన క్రైస్తవ అనుభవములో ఒక మర్మమున్నది. లోకమునకు గాని, జీవించుచున్నామని పేరు మాత్రమే గలవారికి గాని అది తెలియదు.

# అధ్యాయము - 19

# నాలుకను సాధుపరచుట

క్రైస్తవుని సంభాషణ అతనిగుణమునకు కొలమానమని చెప్పినప్పుడు యెవడును ఆశ్చర్యపోనక్కరలేదు. ఏలయనగా "హృదయము నిండినదానిని బట్టి నోరుమాట లాడునుగదా" (మత్త 12:34బి)" ఒక వ్యక్తి మాటలు వినుట ద్వారా అతడు ఆత్మీయముగా యెక్కడ ఉన్నాడో నీవు చెప్పగలవు.

అనుభవములో మనము ఇంతకుముందే నేర్చుకొనినదానిని గూర్చి యాకోబు గుర్తు చేయుచున్నాడు. నాలుక చిన్న అవయవమైనను అది గొప్ప మేలు కాని గొప్పకీడుకాని చేయగలదు. జీవరాసులన్నిటిని అడవిజంతువులను సహా మానవుడుసాధుపరచగలడు గాని, నాలుకను సాధుపరచుటకు మానవునికి సాధ్యపడుటలేదు. అది మరణకరమైన విషముతో నిండినది. అది నిరర్గళమైన దుష్టత్వమే. ప్రకృతిలోను ఇతరవస్తువులవలెకాక, నాలుక వ్యతిరేక సంగతులను ఉత్పత్తి చేయును. తీపిని చేదును, ఆశీర్వాదమును శాపమును ఉత్పత్తి చేయగలదు. (యాకోబు 3:1-12)

మన నాలుకను సాధుపరచలేకపోయినను, దేవుడు సాధుపరచగలడు కనుక ఆయనకు యెల్లప్పుడు కృతజ్ఞతలు చెల్లించవలెను. ఆత్మశక్తి ద్వారా ఆయన, పదునైన నాలుకను కృపగలదిగాను, ముచ్చట్లను క్షేమాభివృద్ధి కలుగజేయునట్లుగాను మార్చగలడు.

మనగుణలక్షణములను సూచించు భాష, దాని లక్షణములను కొన్నిటిని గమనించుదము.

**1. అది సత్యము చెప్పునదిగా నుండవలెను:**

"మనము ఒకరికొకరము అవయవములైయున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను "(ఎఫెసీ 4:25) దేవుడు అబద్ధమాడనేరడు. ఎవరు కూడా అబద్దమాడుటకు ఆయన అనుమతించడు. అందువలన బొంకుట, తెల్లఅబద్ధము, అతిశయోక్తులు, ఉబ్బించుమాటలు,

వాగ్దానములను భంగముచేయుట మొదలగునవన్నియు అబద్ధమను పాపపు కోవకు చెందినవే. క్రైస్తవసేవ ఫలితములు అధికము చేసి చెప్పకూడదు.

తన అధికారి లోపలిగదిలో నున్నప్పుడు లేడని సెక్రటరీ చెప్పకూడదు. ఆహ్వానించకుండనే వచ్చే అతిథికి అబద్ధము చెప్పమని పిల్లలను ప్రోత్సహించకూడదు.

ఒక వ్యక్తి నిజాయితీపరుడైతే అతనికి మంచి జ్ఞాపకశక్తి ఉండనక్కరలేదు. స్టాన్లీ జోన్స్ ఈలాగు చెప్పెను. "నీవు అబద్ధము చెప్పినచో, అబద్ధములు కప్పుకొనుటకు యెక్కువ జ్ఞాపకశక్తి అవసరమైయున్నది. అయితే ప్రతిసారి నిజమే చెప్పినయెడల మంచి జ్ఞాపకశక్తి అవసరములేదు. నీవు నిజమే చెప్పుము. అది సులభమే.

**అది ప్రయోజనకరముగా నుండవలెను:**

దుర్భాష యేదైనను మీ నోట రానియ్యకుడి (ఎఫెసీ 4:29బి). దుర్భాష అనగా తక్కువ రకమైన, ఉపయోగించుటకు వీలుకానిది, విలువలేనిది అని అర్థము. మొదటి సారిగా టేపురికార్డులు వచ్చినప్పుడు భోజన సమయములో బల్లవద్ద సంభాషణ రికార్డుచేసి తమాషా చేసేవారు. టేపును మరల వినిపించినప్పుడు మాట్లాడినవారు తమ వ్యర్థ సంభాషణను విని విసుగుచెందెడివారు. అందుకే ప్రభువు హెచ్చరించెను "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసియుండును" (మత్త 12:36) కాబట్టి వ్యర్థసంభాషణ పాపమని ఒప్పుకొని మనజీవితములలోనుండి దానిని తీసివేయవలెను.

**అది క్షేమాభివృద్ధి కలుగజేయవలెను:**

"అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి" (ఎఫెసి 4:29ఎ) దీని భావమేమనగా మనము చెప్పు మాటలద్వారా ఇతరులకు క్షేమము కలుగవలెను. హెచ్. ఎ. ఇరన్‌సైడ్ అనుభక్తుడు ఎల్లప్పుడు ఇతరులకు క్షేమాభివృద్ధి కలిగే అంశములవైపే సంభాషణ మళ్ళించుచుండెను. ఆయన తరచుగా అడిగేప్రశ్న "ఈవచనభావమేమని నీవు తలంచుచున్నావు?" తరువాత సమస్యను తెలియజేసే భాగముచూపేవాడు. అతనికి తెలియకపోతే ఆయన కృపాసహితముగా అడిగేవాడు. "దీనిభావమదేయని తలంచుచున్నవా?" ఆయన వివరణలు మరచిపోజాలనివి.

నా స్నేహితుడు మరొకవ్యక్తిని గూర్చి ప్రతికూలముగా చెప్పుటకు మొదలుపెట్టెను. అది ఇతరులను గురించిన ముచ్చట్లవలెకనిపించినది. అయితే అతడు మధ్యలోనే ఆ

వాక్యమును ఆపి ఈలాగు చెప్పెను. “కాదు, అది క్షేమాభివృద్ధి కలుగజేయుటలేదు.” అప్పటినుండి దాని తెలిసికొనవలెనని ఆసక్తి నాలో యెక్కువైంది. అయితే ఆ దినమున నేను నేర్చుకొనిన పాఠమేమనగా నాలుకను యెట్లు క్రమశిక్షణలోనికి తెచ్చుకొనవలెనో అర్థమైనది.

**అది అనుకూలముగా ఉండవలెను:**

“అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి” (ఎఫెసి 4:29) సరియైన సమయమునకు సరియైన మాట చెప్పగలుగుట ఒక గొప్పవరమే. చావునకు సిద్ధమైన ఒక పరిశుద్ధుని మంచమునొద్ద ఒక భక్తిగలపెద్ద పరమగీతము 8:5 యెత్తిచూపెను “తన ప్రియునిమీద ఆనుకొని అరణ్యమార్గమున వచ్చునది ఎవతె? లేక ప్రియమైన కాపరి ఇంటిలో చనిపోయిన వారిని గూర్చి దుఃఖించు కుటుంబమునకు చూపిన లేఖనము సామెతలు 30:5” “సాయంకాలమున ఏడ్పువచ్చి, రాత్రియుండినను ఉదయమున సంతోషముకలుగును”ఒక క్రైస్తవ స్త్రీ నిరుత్సాహపడిన బోధకునికి వ్రాసిన ఉత్తరము చివరభాగములో యెష 49:4 గుర్తుచేసినది. “అయినను వ్యర్థముగా నేను కష్టపడితిని. ఫలితమేమియు లేకుండ నా బలమును వృథాగా వ్యయపరచి యున్నాననుకొంటిని. నాకు న్యాయకర్తయెహోవాయే. నా బహుమానము నా దేవుని యొద్దనే యున్నది.” డాక్టరు అలెగ్జాండర్ వైటెలాయరు ఆఫీసులోనికి వచ్చినప్పుడు ఆయనకు ప్రశ్నవేయబడినది. “ముసలిపాపికి నీయొద్ద ఏదైనను సందేశమున్నదా?” ఆయన ధ్యానించుచుండిన లేఖనమును యెత్తి చూపెను. “ఆయన కనికరము చూపుటకు సంతోషించువాడు.” (మీకా 7:18) లాయరుకు ఆదరణ కలిగించుటకు తగిన మాట చెప్పినందుకు కృతజ్ఞత తెలిపెను. ఈమాటలు ఆ సమయాన ఉన్న అవసరతకు తగినవి. “సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్లవంటిది” (సామె 25:11) “సమయోచితమైన మాట యెంత మనోహరము”! (సామె 15:23)

**అది కృపాసహితముగా నుండవలెను:**

మన సంభాషణ అనుకూలమైనదియే కాక కృపాసహితముగా నుండవలెను. “మీ సంభాషణ ఉప్పువేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను కృపాసహితముగాను ఉండనియ్యుడి” మన ప్రభువు కృపగలవాడు. అందువల్లనే “ఆయన నోటినుండి వచ్చిన దయగల మాటల కాశ్చర్యపడిరి” (లూకా 4:22ఎ) తృణీకరింపబడిన సమరయ స్త్రీని

దాహమునకు నీళ్ళిమ్మని యూదుడు అడుగుట ఆయన కృప కాదా? (యోహాను 4:7) "నేనును నీకు శిక్ష విధింపను" అని యోహాను 8:11బిలో యేసు ప్రభువు పాపములో పట్టబడి వణుకుచున్న స్త్రీతో చెప్పుట కృపగాక మరేమిటి? కృపాసహితం యనగా మనం కఠినమైన, క్రూరమైన, నిర్ధయతో కూడిన వ్యంగము లేని మాటలుగల స్థితి. ఆస్టర్ అను దొరసాని "సర్ విన్‌స్టన్, నేను నీ భార్యనైయుంటే, నీ కాఫీలో విషముపెట్టి యుండెడ దానను' అని చెప్పినది. చర్చిల్ ఈలాగు జవాబు ఇచ్చెను "ఆస్టర్ దొరసానీ, నేను నీ భర్తనైయుంటే నేను దానిని త్రాగేవాడను." భయంకర పరిహాసమే కాని భయంకరమైన కృపకాదు! మనభాష కృపాసహితముగా నుండవలెను. అంతమాత్రమేకాక ఉప్పువేసినట్టు రుచికరముగా నుండవలెను. "మీ సంభాషణ ఉప్పువేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను ఉండనియ్యుడి" (కొలొస్స 4:6) "త్రాగుటకు నీళ్లనిమ్మనెను" మరియు అదే ప్రభువు వెళ్ళి నీ భర్తను పిలువుము అని చెప్పెను (యోహా 4:16) నేనును నీకు శిక్షంవిధింపను "అని చెప్పి" వెళ్లి ఇక పాపము చేయకుమని కూడ చెప్పెను. ఆ పదములలో పదునున్నను, అవి రుచిగా ఉండెను.

వాస్తవమునకు ఉప్పు నిలువచేసే గుణము కలిగియున్నది. చెడిపోకుండ కాపాడును. ఉప్పు దాహము పుట్టించును. మన సంభాషణ నైతిక విలువలను కాపాడునదిగా నుండి క్రీస్తు దయచేయు జీవజలముకొరకు దాహమును ప్రేరేపించునదిగా ఉండవలెను.

**అది పవిత్రమైనదిగా నుండవలెను:**

విశ్వాసి సంభాషణ పవిత్రమైనదిగా నుండవలెను. "మీలో జారత్వమేగాని యేవిధమైన అపవిత్రతయేగాని, లోభత్వమేగాని, వీటిపేరైనను ఎత్తకూడదు ఇదే పరిశుద్ధులకు తగినది. మరియు కృతజ్ఞతావచనమే మీరు ఉచ్చరింపవలెనుగాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు. ఇవి మీకు తగవు." (ఎఫెసి 5:3-4) పాపమును గూర్చి, వ్యభిచారమునుగూర్చి మనము యెక్కువస్వేచ్ఛగా మాట్లాడిన యెడల వాటిని గూర్చి తీవ్రమైన వ్యతిరేకత మనకు లేనట్లు కనిపించును. మనలను వినువారుకూడ అట్లే తేలికగా యెంచుదురు. వాటిపై మరణ కరమైన పరిచయమును కలిగి వాటి విషయమై భయపడే స్థితిని కోల్పోవుదుము. బైబిలు కొన్ని పర్యాయములు నీచమైన పాపములను ప్రస్తావించుచున్నది. అయితే వాటి యెడల అసహ్యముకలుగవలెననిమాత్రమే కాని, పాపమును ఆ రీతిగానే సమర్థించవలెనని, పాపమును చులకనచేయవలెనను ఉద్దేశము యెంతమాత్రమునుకాదు.

**అది ఒట్టుపెట్టుకొనదు:**

మన సంభాషణను స్థిరపరచుటకు ప్రమాణములు అక్కరలేదు. ఎంతమాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు. ఆకాశము తోడనవద్దు. భూమి తోడనవద్దు... నీ తలతోడని ఒట్టుపెట్టుకొనవద్దు... మీ మాట అవునంటే అవును కాదంటే కాదు అని యుండవలెను. వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది (మత్త 5:34-37)..."నా సహోదరులారా, ముఖ్యమైన సంగతి ఏదనగా ఆకాశము తోడనిగాని, భూమితోడని గాని మరి దేని తోడనిగాని ఒట్టుపెట్టుకొనక మీరు తీర్పుపాలు కాకుండునట్లు అవునంటే అవును కాదంటే కాదు అని ఉండవలెను (యాకోబు 5:12) క్రైస్తవుని సంభాషణ ఎల్లప్పుడు సత్యమైనదిగానుండవలెను. దానిని స్థిరపరచుటకు ఒట్టుపెట్టుకోనక్కరలేదు. ఒకాయన ఈలాగు చెప్పెను "ప్రమాణములు నిష్ప్రయోజనములు. ఒక మంచి వానికి అది అక్కరలేదు. చెడ్డవాడు ఒక్క దానిని కూడ లెక్క చేయడు"

ప్రభువునామమును వ్యర్థముగా ఉచ్చరించుట తప్పు. అది మనకందరికి తెలియును. అభ్యంతరకరమైన నాలుగు అక్షరములపదములు ప్రయోగింపకూడదు. అయితే సగము అర్ధమువచ్చు ప్రమాణములు, నిషిద్ధపదములకు బదులుగా మృదువైన మాటల సంగతి యేమిటి? ఉదాహరణకు దేవుడు అనుపదమునకు బదులుగా 'గోష్' మరియు 'గొల్లి'యను చెప్పుట, యేసు అను పదమునకు 'గీయని, గీజ్ అని చెప్పుట, యేసు క్రీస్తు అనుపదములకు 'జీపర్సు' మరియు 'క్రీపర్సు' అని చెప్పుట శిక్షకు 'డార్న్' అని చెప్పుట, 'హెల్'నకు 'హెక్' అని చెప్పుట ఇవన్నియు అసలు భావమును చులకన చేసి అన్యార్థమును ప్రయోగించుటయే యగును. ఈలాంటి పదములన్నియు లేఖనమును ధిక్కరించుటయే యగును.

సరే, న్యాయస్థానములో ప్రమాణముచేయుదురు గదా! దాని సంగతియేమి? మన ప్రభువును న్యాయవిమర్శచేయునప్పుడు, ప్రధానయాజకుడు ఆయనను చూచి నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగలదేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. ఆన బెట్టుట అనగా ప్రమాణముతో ఆజ్ఞాపించుట. ధర్మశాస్త్రానుసారముగా యూదుడుగా యేసు ఆ ప్రమాణమునకు జవాబు చెప్పవలసియున్నది (లేవీ 5:1) ఆయన ఆలాగే చేసెను. అనేక మంది క్రైస్తవులకు ఇది పరిష్కారమే. అయితే చట్టపరముగా ఒట్టుపెట్టుకొనుటకు కొందరి మనస్సాక్షి సమ్మతించకపోతే వారు దానిని ధృవీకరింపవచ్చును. దేవుని యెదుట ఒట్టుపెట్టుకొనకుండ

సాక్ష్యమును స్థిరపరచుట వలన ఈ సమస్య పరిష్కరింపబడును. లేక అడిగిన వాటికి సమాధానము చెప్పుట.

**అది సన్మానముతో కూడినదై యుండవలెను:**

పవిత్రమైన సంగతుల విషయములో మనము చులకనుగాను అమర్యాదగాను మాట్లడకూడదు. లేఖనములలో శ్లేష అనగా ద్వందార్ధపదములు ప్రయోగింపరాదు. అనగా లేఖనములను తమాషాకొరకు, సందర్భమునకు వేరుగా వ్యాఖ్యానింపకూడదు. దేవుని సంగతులలో మనము భయముకలిగి మాట్లాడవలెను.

స్వచ్ఛమైన హాస్యము కొంతమట్టుకు ఎవరికి అభ్యంతరముండదు. అయితే అతిగా చులకనచేసి మాట్లాడుటవలన ఆత్మీయశక్తిని పొగొట్టుదురు. సభలలో తమాషా కథలవలన పరిశుద్ధాత్మ ఆర్పివేయబడును. వేడుక కొరకు చేప్పేముచ్చట్లవలన సువార్తలో తీవ్రత తగ్గిపోవును.

క్రీస్తుసేవకులు ఎత్తిపొడుపు మాటలు, అనవసరమాటలు పలుకకూడదు. చమత్కారముగా, తెలివిగా మాట్లాడుటలో దురేచ్ఛప్రవేశించును. హాస్యములు చెప్పుచుండువానికి పేరు రావచ్చును. అది ఆత్మీయజీవితములో విలువలేకుండా చేయును. మరియు తేలిపోవునట్లు చేయును.

**అది క్లుప్తముగాను, తగినట్లుగాను ఉండవలెను:**

“విస్తారమైన మాటలలో దోషముండక మానదు. తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు” (సామె 10:19) అనగా ఎక్కువగా మాట్లాడుటవలన పాపములో పడుటకు యెక్కువ అవకాశము కలుగును. ఎల్లప్పుడూ మాట్లాడు ఆశనుండి మనము తొలగి పోవలెను. “నీవు దేవునిసన్నిధిలో అనాలోచనగా పలుకుటకు నీ హృదయమును త్వరపడనియ్యక నీ నోటిని కాచుకొమ్ము. దేవుడు ఆకాశమందున్నాడు, నీవు భూమి మీద ఉన్నావు. కావున నీ మాటలు కొద్దిగా ఉండవలెను. చెప్పబడినను, సాధారణ విషయములకును ఈ ఆలోచనమంచిదే.

బలవంతముగా మాట్లాడువాని మాటలు విసుగుపుట్టించును. గాలిలో చెప్పుమాట లు చెప్పుటకు అతడు రాడు. చివరిలో మాట్లాడుటకు ఎవరికి అవకాశముండదు. ప్రతి సంభాషణలో అతడే జోక్యము చేసికొనును. దురదృష్టవంతులైనవారు వినకతప్పదు.

ముగింపులో క్లుప్తసారాంశము గుర్తుచేసెదను. ఎవరు వ్రాశారో తెలియదు. అది మీకు చూపాలని కోరుచున్నాను.

‘క్రైస్తవుడు తన నాలుకతో ఏమి చేయవలెను? అతడు దానిని అదుపులో నుంచవలెను. సంభాషణలో అదెన్నడు ఆధిపత్యము కోరకూడదు. దాని శక్తికంటె కొంచెము తక్కువగానుండునట్లు తర్ఫీదు ఇయ్యవలెను. అబద్ధము చెప్పుటకు అతడు దానిని వినియోగింపకూడదు. సగము సత్యము, ద్వేషము, అన్యోపదేశము, వ్యంగ్యపదములు, అపవిత్రపు మాటలు, వ్యర్ధమైన మాటలు మొదలగువాటికి నాలుక దూరముగా నుండవలెను. పరిస్థితులు వీలు కల్పించినప్పుడు సాక్ష్యము చెప్పుటకు ఒప్పుకొనుటకు, ప్రోత్సాహకరమైనమాటలు చెప్పుటకు మాట్లాడుటకే నాలుకను వినియోగింపవలెను. అతడు ఒక వేళ “కృతజ్ఞతలు” చెప్పుటకు కష్టపడే ఒక వింతయైన మనుష్యులలో ఒకడైతే అతడు ఆ మాటలు “థ్యాంక్స్” అని పలుకుట నాలుకకు నేర్పించాలి. మరియు హృదయాంతరంగములో దాగిన గర్వమును కూడా తొలగించుకోవాలి”.

ఆలోచనకు ముందుకాదు, గాని నాలుక ఆలోచనను వెంబడింపవలెను. మౌనముగానున్నవారి కంటె మాట్లాడినవారు యెక్కువ పశ్చాత్తాపడుదురు. మాట్లాడువాడు విత్తుచున్నాడు. వినువాడు కోయుచున్నాడు. ●

# అధ్యాయము - 20

## మా ముచ్చట్లను క్షమించుము

కొన్ని సంవత్సరముల క్రితము అట్లాంట జర్నల్ అను పత్రికలో ఈ క్రింది భాగము ప్రచురమాయెను.

పొట్టిఫిరంగి కంటె నేను ప్రమాదకారిని. చంపకుండనే జయించగలను. ఇళ్ళుకూల్చుదును. హృదయాలను పగులగొట్టుదును. జీవితములను పాడుచేయగలను. గాలిరెక్కలపై ప్రయాణము చేయుదును. ఎంతమంచివారైనను నన్ను భయపెట్టలేరు. ఎంతపరిశుద్ధులైనను భయపెట్టలేరు. సత్యమును నేను లెక్కచేయను. న్యాయమును నేను సన్మానించను. దిక్కులేనివారిపై కనికరముచూపను. నా బారికి గురియైనవారు సముద్రపు ఇసుకరేణులలె నున్నారు. యెక్కువమంది అమాయకులే. ఎన్నడు మరచిపోను. క్షమించుట నాకుతెలియదు. నాపేరు 'ముచ్చట' (గాసిప్).

బహుశ యాకోబు ఈ ముచ్చటను గూర్చి ఆలోచించియే ఈలాగు వ్రాశాడు "అనేక విషయములలో మన మందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపములేనివాడై తన సర్వశరీరమును స్వాధీన మందుంచుకొనశక్తిగలవాడగును" (యాకోబు 3:2)

ముచ్చట్లు చెప్పుట సులభముగాను సహజముగాను ఉండును. కాని ఆ అలవాటు విసర్జించుట బహు కష్టము.

ముచ్చట అనగాయేమి? ఏమియులేదని చెప్పుచునే ఏదియువదలిపెట్టకుండ అంతయు చెప్పుపద్ధతిని ముచ్చట అనవచ్చును. అదొక కళయని విలియమ్ ఆర్. మార్షల్ చెప్పుచున్నాడు. సమస్యకు సంబంధములేని వానికి, పరిష్కారము చేయని వేరొకనితో సమాచారమును పంచుకొనుటయని బిల్ గోతార్డ్ చెప్పుచున్నాడు. ఈ నిర్వచనమును మరి వివరముగా చెప్పవచ్చును. అక్కడలేని వానిగూర్చి అవమానకరముగా మాట్లాడుటయని చెప్పవచ్చును. ముచ్చటకు గురియైనవానిని అనానుకూల పరిస్థితిలో నుంచును.

దయలేని, క్షేమాభివృద్ధి కలిగించని, అవసరములేని వాటిని గూర్చి అది మాట్లాడును. వ్యక్తిని ముఖాముఖిగా కలిసికొనకుండ వెనుకనుండి విమర్శించును. ఇదొకరకమైన శీలసంహార విధానము.

ఈ అభ్యాసమునుగూర్చి బైబిలు కఠినముగా చెప్పుచున్నది.

"నీ ప్రజలలో కొండెములాడుచు ఇంటింటికి తిరుగ కూడదు" (లేవీ 19:16ఎ)

"కొండెగాడై తిరుగులాడువాడు పరుల గుట్టు బయటపెట్టును. నమ్మకమైన స్వభావముగలవాడు సంగతిదాచును" (సామె 11:13, 20:19)

మూర్ఖుడు కలహము పుట్టించును. కొండెగాడు మిత్రభేదము చేయును. (సామె 16:28)

"కొండెగాని మాటలు రుచిగల భోజ్యములు. అవి కడుపులోనికి దిగిపోవును" (సామె 18:8)

"కట్టెలు లేనియెడల అగ్ని ఆరిపోవును. కొండెగాడు లేనియెడల జగడము చల్లారును" (సామె 26:20)

రోమా 1:30లో పౌలు కొండెగాండ్రను హంతకులు, వ్యభిచారులతో కలిపి హెచ్చరించుచున్నాడు.

**నేను చెప్పినట్టు ఎవరికి చెప్పవద్దు:**

కొన్నిసార్లు ప్రార్థన చేయుటకు ఈ సమాచారము తెలియజేయుచున్నామని నటించుచు మోసకరమైన ముచ్చట ముసుకు ధరించుకొందుము.

"దానిని గూర్చి ప్రార్థించుటకు మాత్రమే ఈ సంగతి ప్రస్తావించాను. నీకు తెలియునా? అభ్యంతరములను తీసివేయుటకు రహస్యముగా ఈసంగతి చెప్పుచున్నామని మనము అనుకొందుము. దానిఫలితము ఈ క్రింది విధముగా నుండును.

బ్రూక్‌లిన్‌లో ఇద్దరు స్త్రీలు మాట్లాడుకొనుచున్నారు.

ఆమెకు చెప్పవద్దని చెప్పిన రహస్యమును నీవామెకు చెప్పినట్లు టిల్లీ నాకు చెప్పింది.

"ఆమె వద్ద చెడ్డ సంగతివున్నది. నేను నీకు చెప్పవద్దని నేను టిల్లీకి చెప్పితిని"

"మంచిదే ఆమెనాతో చెప్పినట్లు చెప్పనని నేను టిల్లీకి చెప్పితిని. నేను చెప్పినట్లు మాత్రము చెప్పవద్దు"

సీజన్స్ ఆఫ్ లైఫ్ అనుపుస్తకములో చార్లెస్ స్విండోల్ అనురచయిత పుకార్లు పుట్టించువారికి ముచ్చట్లు (కొండెములు) అను మారుపేరు ఉన్నది.

ఆయన ఈలాగు చెప్పుచున్నాడు.

లేనివార్తలు పుట్టించువారు చిన్నవారును, అనుమానితులుగా నున్న వ్యక్తులునై యుందురు. వెలుతురు సరిగా లేని సందులలో వారి ఆలోచనలు బాంబులవలె వదలివేయగా ఇతరుల మనస్సులో అవి పేలవలెనని, పనిచేయవలెనని వారి ప్రయత్నము, అది జరిగితే వారికి తృప్తి. ఎన్నడును మూలమునకుపోక, ఆ స్పష్టమైన సమాచారము ఇతరులకందించి నెమ్మదిగా నుందురు. లేని వార్తలు పుట్టించి ప్రచారముచేయువారు ఈలాగు చెప్పుదురు. నీవు విన్నావుగా, లేక వారనుచున్నారు, ఇతరుల ద్వారా నాకర్థమైనది.

"హిస్టీరికల్ కాంక్రీట్ మెమోరియల్ చర్చి చీలిపోవుచున్నదని నీవు వింటివా?"

"పెర్డినాండ్ మరియు ఫో అనువారు విడాకులు తీసికొనుచున్నారని నాకు తెలిసినది. ఆమె అపనమ్మకస్థురాలని వారంటున్నారు"

"పాస్టరు ఎల్ఫిన్‌స్టోన్‌స్మైకి మొదటి సంఘమును విడిచి వెళ్ళవలెనని చెప్పిన సంగతి నీవు వింటివా?

వారి కుమారుడు మత్తుమందు తీసుకుంటున్నాడని విన్నాను. షాపులో దొంగతనం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారనికూడా.

"వారు పెండ్లిచేసికొనవలసి యున్నదని ఒకడు చెప్పెను"

"అతడు విపరీతమైన త్రాగుబోతు అని ఒకడు చెప్పెను"

"ఆమె నటన చేయునని విన్నాను. ఆమెను కనిపెట్టియుండుము"

"మాట బయటపడింది.... హెచ్చుస్థాయి పొయ్యేంతవరకు మోసముచేసేవాడు"

"అతడు నమ్మతగినవాడు కాడని అనేకమందికి చింతగావుంది"

ముచ్చట్లు కొండెములు ఒకరినుండి మరొకరికి చేరునప్పుడే జరిగే మార్పులు చేర్పులను గూర్చి మనందరికి తెలియును. ప్రతివాడు వ్యతిరేక భావమును కలుపుచూపోగా చివరకు అసలు సంగతికి యేమాత్రము పోలికయుండదు.

**పౌలు పేర్లు ప్రస్తావించెను - ఎందుకు?**

హుమెనైయును, అలెక్సంద్రును గూర్చి (1తిమో 1:19,20) పుగెల్లు హెర్మోగెనే అనువారిని గూర్చి (2 తిమో1:15) అలెక్సంద్రు అను కంచరివానిని గూర్చి (2 తిమో 4:14) పౌలు ప్రస్తావించెను. దియొ త్రెఫెను గూర్చి యెహోను ప్రస్తావించెను. (3 యోహాను 9,10) వారు చెప్పిన సంగతులు సత్యమైనవే. దీని వుద్దేశ్యమేమనగా వారి విషయమై విశ్వాసులు జాగ్రత్తగా నుండవలెనని హెచ్చరించెను. వారి ఉద్రేకములను రెచ్చగొట్టుటకు దాడి చేయవద్దని వ్రాయుచున్నాడు.

క్రమశిక్షణ దిద్దుబాటు అవసరమైనప్పుడు నాయకులు ఆ వ్యక్తులను గూర్చి మాట్లాడుకొనుట అవసరమే. అయితే దానివుద్దేశమేమనగా సంబంధిత వ్యక్తులకు సహాయము చేయుటకే గాని వారిని చీల్చివేయుటకు కాదు. ఇది ముచ్చట్లవంటిదికాదు.

కొన్ని అనుకూలపు అడుగులు ముచ్చట్లను పరిష్కరించుచున్ననప్పుడు మనము తీసికొనవలెను.

మొదటిగా మనమావ్యక్తిని ఆ సమాచారమునకు మూలమెవరో అడుగవలెను. పౌలు ఒక మాదిరి మనకు చూపుచున్నాడు (1కొరింథీ 1:11) “నా సహోదరులారా, మీలో కలహములు కలవని మిమ్మునుగూర్చి క్లోయె ఇంటివారి వలన నాకు తెలియవచ్చెను”

రెండవదిగా ముచ్చట్లు చెప్పువానితో అసలువ్యక్తితో మాట్లాడునప్పుడు నీ పేరు ప్రస్తావించుటకు మాకు అనుమతివ్వవలెనని చెప్పవలెను. “నీవు నాతో చెప్పిన సంగతిని అతనితో మాట్లాడుటకు నీకు అభ్యంతరమా?” ఓహో ప్రమాదము ఆ పని చేయవద్దు. అది మా స్నేహమునకు ముగింపగును.”

ముచ్చట్లు వినుటకు మనము తిరస్కరింపవచ్చును. ఆ సంగతిమనకెందుకని మర్యాద పూర్వకముగా అతనితో చెప్పవచ్చును లేక అంతకంటే క్షేమాభివృద్ధికలిగించే సంభాషణవైపు మనము దృష్టి మళ్ళించవచ్చును. “ముచ్చట్లు ఎవరును వినకపోతే ముచ్చట్లు చేప్పేవారేవుండరు. వినేవారిని చెవిటివారిని చేసినయెడల ముచ్చట్లు చెప్పువాడు మూగవాడగును” (విలియమ్ ఆర్. మార్షల్)

టర్కీదేశ సామెత ఈలాగున్నది. నీకు ముచ్చట్లు చెప్పువాడే నిన్ను గూర్చి ముచ్చట్లు చెప్పును.”

## అధ్యాయము - 21

# కోప స్వభావము పరీక్ష

అది సంఘకూడిక అతడు అనుకొన్నది జరుగలేదు. అతనిరంగుమారిపోయినది. తన చేతులు దండముతో కొట్టినట్లు అతని చెడ్డమాటలు ప్రవాహమువలె కుమ్మరించెను. కళ్లు ఉగ్రతను చూపుచున్నవి. దవడ ఎముకలు కదలుచున్నవి. చేతివేళ్లకణుపులు తెల్లబడినవి. చివరిగా నాట్యమాడినట్లుగా పెద్దగా అరిచెను, “నేను వెళ్తాను, ప్రభువుకూడ నాతోవస్తాడు’ అయితే అతడు పరిశుద్ధుడని ఎవరు నమ్మలేదు. అంతటి కోపము ఉద్రేకము తోనున్న వానితో ప్రభువు పోడని అతని యెడల శ్రద్ధ చూపడనియు ప్రతివ్యక్తికి తెలియును.

మరొక రంగమును చూడవచ్చును. అది ఆదివారము ఉదయము. కుటుంబము గుడికి సిద్ధపడుచున్నారు. పిల్లలు ఆడుకొనుచున్నారు. తండ్రి కేకలు వేయుచున్నాడు తల్లి వంట గదిలో ్వకలేని పని ఇల్లంతా గగ్గోలుగా వుంది. అయితే తొందర ఏమియులేదు. త్వరలోనే బూరిబుగ్గల నవ్వులతో అందరు వరుసలోనికి వచ్చిరి. చుట్టూ నిలువబడిరి.

ఇప్పుడు క్రిస్మస్ సమయము. ప్రతివ్యక్తి పిచ్చి పట్టినట్టుగా షాపులకు వెళ్ళి అవసరములేని వస్తువులు కొని, అన్ని వున్నవారికి ఈవులుగా యిచ్చుదురు. వత్తిడి యొక్కువయగును. తొందర యెక్కువ. ఉద్రేకము త్వరగా వచ్చును. నిర్దయతో కూడినమాట కోపమును రేపును. తగాదా ప్రారంభమగును. సాత్వికుడు, దీనుడైన యేసు జన్మదినమును ఈ రీతిగా ఆచరించుదురు.

జీవితమంతయు కోపోద్రేక పరీక్షలతో నిండియున్నది. తెలివిగా నిరుత్సాహములతో నిండియున్నది అంటారు. పార్కులోనీ క్రొత్త కారును ఎవరో గీచి యున్నాడు. నీ విమాన ప్రయాణము ఆలస్యమగుచున్నది. వేచియుండు వాడు విపరీతమైన మురికితోనున్నాడు. చారు నీ ఒడిలో దొర్లిపడినది. సమయము ఉదయము 3.30 గంటల సమయము “ఫోను మ్రోగింది క్షమించండి, పొరపాటున తప్పు నంబరు నొక్కితిని “మరల

అదే ఫోనునంబరు. అదే బుద్ధిలేనివాడు. చిన్నవాడు మంచి బహుమతివస్తువులపై రంగుపూసెను. సంవత్సరముల శ్రమ కుక్క నమిలివేసినది.

క్రైస్తవ విశ్వాసమును తక్కువ చేసిచూపించే వాటిలో కోపము ప్రదర్శించుట తర్వాతే ఏదయినా. శ్రమలు గల పరిస్థితులలో క్రీస్తు శక్తి చేత రూపాంతరము పొందిన వ్యక్తి మౌనముగా నుండి సమస్యను యెదుర్కొనుటయే గొప్ప సాక్ష్యము. వాక్యము చెప్పుచున్నమాటలు ఆశ్చర్యకరము.

"పరాక్రమశాలికంటె దీర్ఘశాంతముగలవాడు శ్రేష్ఠుడు

పట్టణము పట్టుకొనువానికంటె తన మనస్సును స్వాధీన పరచుకొనువాడు శ్రేష్ఠుడు"

(సామె 16:32)

**కోపపడుటకు సమయము:**

ఎఫెసీ 4:26లో కోపపడవచ్చునని వ్రాయబడియున్నది గదాయని కొందరు అభ్యంతరము చెప్పుదురు. "కోపపడుడిగాని పాపము చేయకుడి సూర్యుడస్తమించువరకు మీ కోపము నిలిచియుండకూడదు." అది సత్యమే. కోపపడుటకు సమయమున్నది. ప్రభువునకు అవమానము కలిగినప్పుడు మనము కోపపడవలెను. తన తండ్రి యింటిని దొంగల గుహగ మార్చినప్పుడు యేసు కోపపడెను (మత్తయి 21:13) ఇతరులు హీనముగా చూడబడినప్పుడు మనము కోపపడవలెను. ప్రభువు పక్షముగాను, ఇతరుల పక్షముగాను మనము కోపపడవచ్చును గాని మన పక్షముగా కోపపడకూడదు. దేవుని కారణమును బట్టి మనము సింహములవలెను మనసొంత విషయములలో గొర్రెపిల్లవలెనుండవలసియున్నది. అప్పుడు కూడా ఒక ప్రమాదమునున్నది. నీతి సంబంధమైన కోపము పాపపు కోపములో పడిపోవుటకు అవకాశమున్నది. కోపమునకు మూతతీసిన తర్వాత క్రోధము వచ్చును. అందువలన పౌలు చెప్పుచున్నాడు "కోపపడుడిగాని పాపము చేయకుడి సూర్యుడస్తమించువరకు మీకోపము నిలిచియుండకూడదు."

కోపపడుడి అను ఆజ్ఞకు వ్యతిరేకముగా దీర్ఘశాంతముగా నుండవలెననియు, కోపపడుటకు నిదానించవలెనని అనేక లేఖనములున్నవి.

"సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తు నందు

దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:31,32)

"ఆత్మఫలమేమనగా..... దీర్ఘశాంతము" (గలతీ 5:22)

"దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను సాత్వికముతోను ప్రేమతో ఒకనినొకడు సహించుచూ" (ఎఫెసీ 4:2)

"ఆనందముతోకూడిన పూర్ణమైన ఓర్పును, దీర్ఘశాంతమును కనపరుచునట్లు ఆయన మహిమాశక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు (కొలస్సీ 1:11)". "త్వరగా కోపపడువాడు మూఢత్వముచూపును" (సామె 14:17 ఎ)

"దీర్ఘశాంతముగలవాడు మహా వివేకి.

ముంగోపి మూఢత్వమును బహుమానముగా పొందును" (సామె 14:29)

"కోపోద్రేకియగువాడు కలహమురేపును.

దీర్ఘశాంతుడు వివాదము నణచివేయును" (సామె 15:18)

"బుద్ధిహీనుడు తన కోపమంత కనపరచును.

జ్ఞానముగలవాడు కోపముఅణచుకొని దానిని చూపకుండును" (సామె 29:11)

"కోపిష్టుడు కలహమురేపును.

ముంగోపి అధికమైన దుష్క్రియలు చేయును" (సామె 29:22)

నీవు కోపించుట న్యాయమా యని యెహోవా యోనాను ప్రశ్నించెను. ఇదే ప్రశ్న మరొకటి వస్తే దానిని మార్చివేయవలెనని శోధనకలుగును. కోపమునకు (anger) ప్రమాదమునకు (danger) నకు ఒక అక్షరమే భేదము. అప్పుడు జూలియస్ సీజర్ చేసినట్లు మనము చేయవలెను. అతనికి కోపమురేగినప్పుడు మాట్లాడకముందు అక్షరమాల యావత్తు తనకై తాను చెప్పుకొనేవాడు.

ఒకక్రైస్తవునితో అతని స్నేహితుడు నీ కోపము అదుపులేనిదని అది భయంకరమైనదని చెప్పెను. ఆ నేరస్తుడు ఈలాగు చెప్పెను. "ఓఅదా, నా కోపము మంచిది, ఎక్కువసేపు ఉండదు." అప్పుడు చెప్పినదేమనగా "ప్రియుడా, భూకంపము కూడా ఎక్కువసేపు ఉండదు. అయితే అది వచ్చినప్పుడు భయంకర నష్టముకలుగును"

●

# అధ్యాయము - 22

# నేనేమి ధరింపవలెను?

"ఏమి? మనము ధరించే వస్త్రములకు పరిశుద్ధతకు సంబంధమున్నదని దీని భావమా? ఏ విధముగా లేదు. అంతరంగము లెక్కించబడును. మనమేమైయున్నామో అది ముఖ్యముగాని మన వస్త్రములనుగూర్చి దేవుడు పట్టించుకొనడు.

ఈ వాదన బాగానే ఉన్నది. అయితే దేవుడు రెంటిని, అనగా అంతరంగమును బాహ్యదుస్తులనుగూర్చి పట్టించుకొనువాడు. అంతరంగములో మనమేమై యున్నామో అదే బయటకు కనిపించునని దేవునికి తెలియును. సీయోను కుమార్తెలను ఆయన యెట్లు ఖండించెనో అది మనకు ఉదాహరణగా నున్నది.

"ఆ దినమున యెహోవా గల్లుగల్లుమను వారి పాదభూషణములను సూర్యబింబ భూషణములను, చంద్ర వంకలను, భూషణములను, కర్ణభూషణములను, కడియములను, నాణ్యెమైన ముసుకులను, కుల్లాయీలను, కాళ్లగొలుసులను, వడ్డాణములను, పరిమళ ద్రవ్యపు భరిణెలను, రక్షరేకులను, ఉంగరములను, ముక్కుకమ్మలను, ఉత్సవ వస్త్రములను, ఉత్తరీయములను, పైటలను, సంచులను, చేతి అద్దములను, సన్నపునారతో చేసిన ముసుకులను, పాగాలను, శాలువాలను, తీసివేయును. అప్పుడు పరిమళ ద్రవ్యమునకు ప్రతిగా మురుగుడును, నడికట్టుకు ప్రతిగా త్రాడును, అల్లిన జడకు ప్రతిగా బోడితలయు, ప్రశస్తమైన పైవస్త్రమునకు ప్రతిగా గోనెపట్టయు, అందమునకు ప్రతిగా వాతయు ఉండును" (యెషయా 3:18-24)

దేవుడెందుకు పట్టించుకొనవలెను? 16 వచనములో జవాబున్నది "సీయోను కుమార్తెలు గర్విష్ఠురాండ్రై మెడచాచి నడుచుచు ఓర చూపులు చూచుచు, కులుకుతో నడచుచు, తమ కాళ్ళ గజ్జెలను మ్రోగించుచున్నారు"

ఖరీదైన ఆభరణములు, ప్రదర్శించుటకు ధరించే వస్త్రములు, వారి గర్వమునకు

వ్యర్థజీవితమునకు సూచన.

**వస్త్రముల బీరువాకు సూత్రము:**

క్రీస్తును మన వస్త్రశాలకు ప్రభువుగా ఉండుటకు వాక్యము చెప్పుచున్న సూత్రములను కొన్నిటిని పరిశీలించుదము.

మొదటిగా మన వస్త్రధారణలో అణుకువ, జాగ్రత్తను పాటింపవలెను.

"స్త్రీలు అణుకువయు స్వస్థబుద్ధియు గలవారైయుండి తగుమాత్రపు వస్త్రములచేతనే అలంకరించుకొనవలెను" (1తిమో 2:9) తగుమాత్రపు అను పదమునకు అనేక అర్థములున్నను. మర్యాద అనుభావము ముఖ్యమైనది. తగుమాత్రపు వస్త్రములు అనగా దేహములో యెక్కువ భాగము ప్రజలకు కనబడకుండ చేయుట. ఇతర విశ్వాసి క్రైస్తవునిగా జీవించుట కష్టతరముగా చేయకుండుట. మన వస్త్రములు ప్రజల గమనమును ఆకర్షించుటకు కాదు. లేక ప్రచారము కొరకుకాదు. మనము ప్రజలను ఆకర్షించుటకు కాదు గాని మన ఉద్దేశము క్రీస్తునకు మహిమ రావలెను (యోహాను 3:30, కొలొస్సి 1:8 బి) జె. రస్సెల్ హోడెన్ గారు ఈలాగు చెప్పెను". క్రైస్తవుని జీవిత కార్యకలాపముల ఉద్దేశము క్రీస్తును ఘనపరచుటయేగాని, అతని పర్స్ అతని దర్జీవానికి, తనకు, ఘనత తెచ్చుకొనుటకుకాదు.

రెండుప్రక్కల చివరి అంచుల వరకు మనము పోకూడదు. ఒకప్రక్కన క్రొత్తగా వచ్చిన విపరీత ప్యాషన్‌లను అనుకరించుటకు మనము పరుగెత్తకూడదు. రెండవదిగా పాత ప్యాషన్‌లు అనాగరికమైన దుస్తులు ధరించి మనలను మనం వింతగా చేసికొనకూడదు. హోడెన్ ఇలాగు చెప్పుచున్నాడు, అనాగరికతనుగాని, అశుభ్రతనుగాని కలిగియుండవలెనని దేవుడు ఆజ్ఞాపించడు, సిఫారసుచేయడు. మురికి దుస్తులువేసుకోవడం ఆత్మీయతకు గుర్తుకాదు. మన దేహము పరిశుద్ధాత్మకు దేవాలయమైనపుడు అందమైనవి, రమ్యమైనవి తగినవన్నియు వాటికే చెందును. పాత చట్టము ఇంకను అన్వయించవచ్చును. అదేమనగా "క్రొత్తవాటిని అనుకరించుటకు మొదటి వాడవుగా ఉండవద్దు. పాత వాటిని ప్రక్కన పెట్టుటకు చివరి వాడవుగా ఉండవద్దు

ఖచ్చితముగా తగుమాత్రము వస్త్రమునిల్వలు మాత్రమే మనము ఉంచుకొనవలెను. ఎన్నో అవసరతలు గల లోకములో క్రైస్తవులు అనేక వస్త్రములు కలిగియుండుట

మానవత్వమనబడదు. మన వస్త్రపు బీరువాలు ఒక చిన్న తరహా బట్టల కొట్టులా వుండకూడదు.

ఆ కారణమును బట్టియే విపరీతమైన ధరలు పెట్టి దుస్తులు కొనకూడదు. "తగుమాత్రపు వస్త్రముల చేతనే గాని జడలతోనైనను బంగారముతోనైనను, ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైననూ అలంకరించు కొనకూడదు." (1 తిమో 2:9) "జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయను వెలుపటి అలంకారములు అలంకారముగా ఉండకూడదు." (1పేతు 3:3) అయితే అతి చవక వాటిని కొనుక్కొనవలెనని దీని ఉద్దేశముకాదు. అది తప్పుడు ఆర్థిక విధానమగును. మనము ఖరీదును, నాణ్యతను గమనించవలెను. ఉదాహరణకు తక్కువరకపు చెప్పులను కొనుకొన్నచో మన పాదాలకు సంబంధించిన డాక్టరుకు డబ్బు కట్టవలసి వచ్చును. అయితే మంచి నాణ్యత గల పాదరక్షలు కొనుక్కొన్నచో ఖరీదు ఎక్కువైననూ క్షేమము కలుగును.

మనం ధరించుకొను వస్త్రములు కూడా శుభ్రముగాను, మురికి లేనివిగాను ఉండవలెను. మురికివి, చిరిగిపోయిన బట్టలు మన రక్షకునికి తగవు. ఆస్వాల్డ్ ఛాంబర్స్ "మురికి పరిశుద్ధాత్మకు అవమానము" అని చెప్పెను.

క్రైస్తవుని వస్త్రములు పురుషుడో, స్త్రీనో వ్యత్యాసము కనుపరచవలెను. దీనికి సంబంధించిన భాగం (ద్వితియో 22:5)లో ఉన్నది. "స్త్రీ పురుషవేషము వేసికొనకూడదు. పురుషుడు స్త్రీవేషము ధరింపకూడదు. అలాగు చేయువారందరు నీ దేవుడైన యెహోవాకు హేయులు" దీనిని వికట కవిత్వమందురు. ఇది స్త్రీలు, పురుషులు ఒకరివేషము ఒకరు వేసికొనుటకు మరియు వారివలె ప్రవర్తించుటకు సంబంధించినది. వెంట్రుకలు పెంచుటలోను, దుస్తులు ధరించుటలోను స్త్రీ పురుష వ్యత్యాసమును మరుగు చేయకూడదు. ఆడ, మగ తేడా లేకుండ చేయుట దేవునికి ఆసహ్యాము.

సాధారణముగా మనము ప్రభువు యొక్క రాయబారులముగా ఉండుటకు మన దుస్తులు ప్రభువుకు ప్రతినిధిగా ఉండాలి. మన నాగరికతలోను, చారిత్రక కాలములోను కొంత వ్యత్యాసము కనపరచవచ్చును. మనము కనబడు విధము మన సందేశమును రద్దుచేయునని మనము గుర్తుంచుకొనవలెను. కీర్క్‌గార్డ్ అను వాడు సర్కస్‌లో వున్న బఫూన్ గూర్చి ఇలా వివరించాడు. ఆ బఫూన్ అతని దుస్తులతోనే పట్టణమునకు వెళ్ళి

సర్కస్ టెంట్‌లో నుండి మంటలు వ్యాపిస్తున్నాయి అని హెచ్చరిక చేసెను. ఆ పట్టణ ప్రజలందరు కూడా అతని కేకలను నవ్వుతూ వినిరి. గట్టిగానమ్మారు. ఈ బఫూన్‌ల ద్వారా తమాషా తప్ప ఏమి ఎదురు చూడగలము. పట్టణమంతా కాలిపోయినది. ఏలయనగా అతను చెప్పిన సమాచారమును గూర్చి పట్టణస్థులు ఎవరూ పట్టించుకొనలేదు. కారణ ం అతని బఫూన్ వస్త్రధారణ.

**లోపల ఏమున్నది:** మన అంతరంగ స్వభావము గూర్చి బైబిలు చెప్పుచున్నది అయితే మన బాహ్యప్రదర్శన ముఖ్యముకాదు. కొలస్సి 3:12-14 గమనించవలెను, "కాగా దేవుని చేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘ శాంతమును ధరించుకొనుడి, ఎవడైనను తనకు హానిచేసెనని యొకడనుకొనిన యెడల ఒకని ఒకడు సహించుచూ ఒకని నొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించిన లాగున మీరును క్షమించుడి. వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొనుడి."

1తిమో 2:9,10 వచనాలలో స్త్రీలు సత్క్రియల చేత తమ్మునుతాము అలంకరించుకొనవలెను.

పరిశుద్ధాలంకారములతో ప్రభువును పూజించుడి
ఆయన ఎదుట సాగిల పడుడి ఆయనమహిమను ప్రచురించుడి
విధేయతా దుస్తులతో దీనత్వపు ధూపముతో
మోకరించి పూజించుడి ఆయన నామము యెహోవా. ●

## అధ్యాయము - 23

# సత్యము చెప్పుట

ఎప్పుడైననూ అబద్ధము చెప్పుట సరియైన పని అగునా? దానికి ఒకే జవాబు ఉన్నది. దేవుడు అబద్ధమాడనేరడు. ఆయన ఎవనికిని ఆ అధికారమును అప్పగించలేదు. అబద్ధ సాక్ష్యము చెప్పకూడదని తొమ్మిదవ ఆజ్ఞ చెప్పుచున్నది. క్రైస్తవులు అబద్ధమాడక వారి పొరుగువారితో సత్యమునే చెప్పవలెనని ఆజ్ఞాపింపబడిరి. (ఎఫెసీ 4:25) సాతాను అబద్ధమునకు జనకుడు (యోహా 8:44) మనము వాని నడవడిని అనుసరించకూడదు.

డెన్నిస్ జె.డిహాన్ మనకు గుర్తుచేయుచున్నాడు "అసత్యమునకు అనేక ముసుకులున్నవి. నెరవేర్చాలని ఉద్దేశ్యము లేకపోయినను అది వాగ్దానములను చేయును. కొన్నవాటికి తక్కువ వెల వచ్చిననూ అదేమీ చెప్పదు. పొరపాటున వచ్చిన వస్తువును తనదిగా ఉంచుకొనును (కపటము దొంగతనమును కనును). వ్యక్తిగత ప్రయోజనము కొరకు సత్యమునకు ముసుగువేయును. తప్పులు కప్పివేయుటకు అది అబద్ధములు చెప్పును"

అబద్ధములను గూర్చి బైబిలులో వ్రాయబడిన మాట నిజమే కాని అయితే బైబిలు వాటిని ఎన్నడూ ఆమోదించదు. శారా విషయములో అబ్రాహాము అబద్ధమాడెను (ఆది 12:10-20, 20:2) రిబ్కా విషయములో ఇస్సాకు కూడా అబద్ధమాడెను (ఆది 26:7) వారి సమర్పణ విషయములో అననీయ, సప్పీరాలు దేవుని ఎదుట అబద్దమాడిరి (అపో. కార్య 5:1-11) దేవుని ప్రజలు అబద్దము చెప్పకపోయిననూ సత్యమునూ పూర్తిగా చెప్పని కొన్ని సన్నివేశములు గలవు. హెబ్రీ మంత్రసానులు తాము వెళ్ళక మునుపే హెబ్రీ స్త్రీలు ప్రసవించిరి అని చెప్పిరి. (నిర్గమ 1:19) దేవుడు ఆ సత్యమును అంగీకరించెను. వచనము 20. అనగా వారు అబద్దము చెప్పలేదు. ఇశ్రాయేలీయులు మూడు దినములు ప్రయాణము చేసి అరణ్యములో బలి అర్పించవలెనని మోషే అనుమతి కోరెను. (నిర్గమ 5:3) ఫరో ఒక చిన్న మనవిని తిరస్కరించితే అతడు పెద్ద మనవి అనగా శాశ్వతముగా

వెళ్ళిపోవుటను అంగీకరించడు. ఈ సంగతి మోషేకు తెలియును. యెహూదు కూడా రాజైన ఎగ్లోనుకు రహస్య సమాచారము ఉన్నదని చెప్పెను. అతడు అది మరణ సమాచారమని చెప్పలేదు. (న్యాయా 3:12-30) దావీదును రాజుగా అభిషేకించుమని దేవుడు సమూయేలుతో చెప్పెను. రాజైన సౌలు ఈ విషయము ప్రశ్నిస్తే యెహోవాకు బలి ఇచ్చుటకే వచ్చియున్నానని తెలియజేయుమని దేవుడు చెప్పెను. (1 సమూ 16:1-3) అది సత్యమే. అతడు బలి అర్పించెను. తన పర్యటనకు అది మొత్తము కారణముకాదు. తనకు తెలిసినదంతయూ అతడు చెప్పనక్కరలేదు.

కొంతమంది అబద్దమాడుట వలన మంచి ఫలితము వచ్చినచో అబద్దమాడుటలో తప్పేమిలేదని చెప్పుదురు. కీడుచేయుట వలన మేలుకలుగునని చెప్పుట కపటమైన కారణమగును. దీనిని బైబిలు ఖండించుచున్నది. (రోమా 3:8) మనము సత్యము చెప్పినప్పుడు ఇతరులకు ప్రాణహాని జరిగినచో అది మనస్సాక్షికి సమస్యగుచున్నది, యూదులను హిట్లరు గ్రూపు నాజీవర్గము ద్వేషించి చంపిరి. ఆ సమయములో క్రైస్తవులు యూదులను దాచిపెట్టిరి. సైనికులు వారి యొద్దకు వచ్చి ఇక్కడ యూదులున్నారా అని అడిగిరి. లేరని చెప్పినచో ఖచ్చితముగా అబద్ధమగును. ఉన్నారని చెప్పినచో యూదులకు మరణము సంభవించును. ఏమి చేయవలెను?

సత్యము చెప్పి ఫలితాలను ప్రభువుకు వదిలివేయవలెనని కొందరు చెప్పుదురు. అలాగైతే వారికి మరణము ఖాయము. మరొక ఆలోచన ఏమనగా అసత్యము లేకుండా ఇతరులకు హానికలుగకుండా ఉండుటకు ఆ సమయమునకు దేవుడిచ్చు సమాధానముపై ఆధారపడవలెను. దేవుడు ఈ రీతిగా చేయగలడు. అయితే ఆయన ఎల్లప్పుడు అలాగు చేయడు.

మరికొందరు చెప్పునదేమనగా మనము దుష్టలోకములో వున్నాము కనుక తక్కువ కీడు కోరుకొనవలెను. అబద్ధము తప్పే అయిననూ అది అమాయకుల ప్రాణాలు పోవుట కంటే తక్కువకీడు కలిగించును. ఇతరుల ప్రాణమునకు హాని సంబంధించినప్పుడు ఈ విధానమునకు విలువున్నది.

కొందరైతే అపొస్తలుల కార్యము 5:29 ని చూపుచున్నారు. “మనుష్యులకు కాదు మేము దేవునికే లోబడవలెను కదా.” నిర్గమ 20:13లో నరహత్య చేయకూడదు అని దేవుడు చెప్పుచున్నాడు. ఆయన ఇంకనూ ఇలాగు చెప్పుచున్నాడు.

"చావునకై పట్టబడిన వారిని నీవు తప్పించుము.
నాశనమునందు పడుటకు జోగుచున్న వారిని నీవు రక్షింపవా?
ఈ సంగతి మాకు తెలియదని నీవనుకొనిన యెడల
హృదయములను శోధించువాడు నీ మాటను గ్రహించునుగదా
నిన్ను కనిపెట్టువాడు దాని నెరుగును గదా
నరులకు వారి వారి పనులను బట్టి ఆయన ప్రతికారము చేయును గదా (సామె 24:11,12)

చివరి ఆలోచన ఏమనగా కొన్ని కార్యములు మంచివి కాకపోయిననూ ఆ కార్యములు నిజమైన రక్షణను, విశ్వాసమును ప్రదర్శించేవిగా ఉన్నవి. ఇస్సాకును దహనబలి అర్పించుట అబ్రాహామునకు హత్యా నేరమగును. అయితే అబ్రాహాము విశ్వాసము నిజమైనదని ఋజువు చేయుటవలన దేవుడు దానిని అంగీకరించెను. మామూలుగా తలంచిన యెడల రాహాబు వేగులవారితో స్నేహము చేయుట దేశద్రోహమేయగును. అయితే ఆమె ప్రభువునందు నిజమైన విశ్వాసిగా ఋజువుచేసికొనుట వలన ఆమె నీతిమంతురాలుగా ఎంచబడెను. ఈ రెండు కార్యములలో విశ్వాసము లేనియెడల దుష్కార్యములే యగును.

ఇంతకుముందు చెప్పినరీతిగా సమస్యతెగేదికాదు. అదృష్టవశాత్తు ఇట్టి సమస్యను మనము ఎన్నడూ ఎదుర్కొనలేదు. మనము ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారమొక్కటే. సత్యమునే చెప్పుము. ఎన్నడూ అబద్ధమాడవద్దు. డెన్నిస్ డిహాన్ ఇలాగు చెప్పుచున్నాడు. "అబద్ధము నమ్మకమును చులకన చేయును, అనుమానము పుట్టించును. బంధుత్వములను పాడుచేయును. అన్నింటికంటె ఘోరమైనది ఏమనగా సత్యమంతటికీ మూలమైన దేవునికి అవమానము కలిగించును."

●

# అధ్యాయము - 24

# నైతిక సందిగ్ధములు

నైతిక శాస్త్రమును పరిశీలించకుండా క్రైస్తవ పరిశుద్ధత అను అంశము సంపూర్ణముకాజాలదు. నైతిక శాస్త్రము అనగా నైతికముగా మంచి చెడ్డలు, తప్పుఒప్పులను గూర్చిన అధ్యయనము. ప్రతి సమాజములోను మూలలు తెంచివేయుటకు, రాజీపడుటకు, మోసము చేయుటకు, లెక్కింపలేనన్ని, శోధనలు, ఒత్తిడులు వున్నవి. డబ్బు సమస్య వచ్చినప్పుడు శోధన ప్రత్యేకమైన రీతిగా వుండును. వాల్‌టేర్ అను అతడు, డబ్బు సంగతి వచ్చినప్పుడు మనుష్యులందరూ ఒకే మతమునకుచెందినవారు అని చెప్పెను. వాల్‌టేర్ చెప్పినది తప్పు అని ప్రతి క్రైస్తవుడు రుజువు చేయవలసివున్నది.

వ్యాపారము మడిచివేసే ఒక తెరలాంటిదనియు, అది వక్రమముగా నున్నప్పుడే నిలుచుననియు ఒక వ్యాపారి తన తత్వమును తెలియజేసెను, కొండమీద ప్రసంగము ప్రకారము వ్యాపారము నడుపుట అనగా పతనము చేసికొనుటయే అని కొందరు బహిరంగముగా చెప్పుచున్నారు. దీని అర్థమేమనగా వారు సక్రమముగా వుండిన యెడల వారు జీవించలేరు. సామాన్యముగా నేటి నైతిక లోపములను కొన్నింటిని పేర్కొనవచ్చును. అవేవనగా ఆదాయపు పన్నులు తప్పుగా చూపించుట, ఖర్చులు హెచ్చించి చూపుట, అసత్యమైన ప్రచారము, లంచములు పుచ్చుకొనుట, నాసిరకం వస్తువులను ఉత్పత్తి చేయుట, అప్పులు చెల్లించకపోవుట, తూనికలు కొలతలలో మోసము, వ్యాపారమును తక్కువగా చూపించుట, బ్యాంకులో డబ్బులేక పోయినా చెక్కులు వ్రాసి ఇవ్వడం, అప్పులను తప్పించుకొనుటకు దివాలా తీసినట్లు ప్రకటించుకొనుట మొదలగునవి. ఇతరుల ఆలోచనలు, తనవి అని చెప్పుకొనుట. గ్రంథచోరత్వము, ఉద్యోగములో పరికరములను సొంతమునకు వాడుకొనుట, గంట జీతమునకు అరవై నిమిషాల పని చేయకపోవడం, కంపెనీ సమయములో క్రీస్తుకొరకు సాక్షమిచ్చుట, ప్రభువు పనిలో వెనుక తీయుట, ట్రాఫిక్ నియమములను ఉల్లంఘించుట, నమ్మకత్వమును చెడగొట్టుట, చెప్పిన

సమయమును పాటించకపోవుట మొదలగునవన్నియు అనైతిక ఆచారములనవచ్చును.

ఒక నేరస్థుడు నిజముగా దోషి అని తెలిసినపుడు క్రైస్తవ వకీలు అతడు నేరస్థుడు కాదని వాదించవచ్చునా? విమాన ప్రయాణములో క్రైస్తవుడైన సహాయకుడు మద్యం పంచవచ్చునా? వ్యాపార లావాదేవీలలో ఈవులను (బహుమతులను) కృతజ్ఞతాపూర్వకముగా ఇచ్చేవస్తువులను అంగీకరింపవచ్చునా, విదేశ అధికారికి లంచమిచ్చి ఆలస్యము కాకుండా ఒక మిషనరీ తన పనిని ముందుగా చేయించుకొనవచ్చునా? ఒక విద్యార్థి ముందుగా ప్రశ్నా పత్రము తెలిసికొనవచ్చునా? కాన్సరునకు దారితీయు ఉత్పత్తులను ఒకడు అమ్మవచ్చునా? ఆర్థిక సమస్యలోవున్న క్రైస్తవ పాఠశాలకు సారాయి అమ్మువాడు లక్షపౌండ్లు దానముగా ఇచ్చినప్పుడు దానిని బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అందరూ అంగీకరింపవచ్చునా? ఒకరోగి జీవిత భీమాకు సంబంధించి అర్హత లేకపోయిననూ క్రైస్తవ డాక్టరు సంతకము చేయవచ్చునా? ఇండ్ల నిర్మాణమునకై సామాగ్రి తయారుచేయువారు స్థానిక అంచనాదారులుగా వుందురు. కాంట్రాక్టర్లు అతని యొద్ద సామాగ్రిని కొనినయెడల వారి ఆస్తిపై పన్ను, తగ్గింపుచేసికొనవచ్చును సరఫరా చేయువానియొద్దనుండి కొనవచ్చునా?

**యదార్థతకు, మోసమునకు చెల్లించవలసిన క్రయముగొప్పది:**

ఒక గ్రీకువాడు ఒక చిన్న రెస్టారెంటును నడుపుచున్నాడు. ఇనస్పెక్టరు వానిని పరీక్షించి దానికి అనేక మార్పులు చేయవలెనని చెప్పెను. పొయ్యికి క్రొత్త కప్పు వేయవలెనని, మాంసము నరుకుటకు క్రొత్త మొద్దుపెట్టవలెనని, క్రొత్త కౌంటర్లు, కూర్చోనడానికి కూర్చీలు మొదలగువాటిని మార్చుటకు వేలు ఖర్చగును. చివరిలో ఇనస్పెక్టరు అడిగెను. ఇరవై అయిదు పౌండ్లు లంచమిచ్చి ఖర్చు తప్పించుకొనవచ్చును కదా. యజమానుడు లంచమిచ్చుటకు ఒప్పుకొనక పోయినచో ఆ ఇనస్పెక్టరు ఇలాగు చెప్పును రెండు వారములలో పని పూర్తి చేయుము లేదా, రెస్టారెంటు తలుపులు మూసివేసుకొనవలెను.

టకోమా నారోస్ బ్రిడ్జి పూర్తి అయినప్పుడు ఇన్సూరెన్స్ ఏజెంటు దానికి పాలసీ వ్రాసెను. బ్రిడ్జి నాశనము కాదని చెప్పి వారిచ్చిన ప్రీమియములను తన జేబులో వేసికొనెను. ఒక దినమున బలమైన గాలి వచ్చినది. నిర్మాణమంతా కదిలి బ్రిడ్జి నీటిలో పడిపోయెను.

కష్టమైన నిర్ణయములు క్రైస్తవుడు ఎదుర్కొనును. అయితే తప్పునిర్ణయం ఎక్కువ కఠినముగా ఉండును. నష్టమెంత అయిననూ సరే తమకు సరియైనది (ఒప్పు అని) తెలిసినపుడు వాటిని చేయుటకు ధైర్యము కలిగిన వ్యక్తులు కొందరు వున్నారు.

ఆడమ్ క్లార్క్ ఒక బట్టలు షాపులో పనిచేసెను. అతని యజమానుడు సిల్కును కొలుచునప్పుడు సాగదీయవలెనని సలహా ఇచ్చెను. అందుకు ఆడమ్ ఇలాగు జవాబిచ్చెను. “అయ్యా నీ సిల్కుని సాగదీయవచ్చు, నా మనస్సాక్షిని సాగదీయలేను.” ఆ తరువాత దేవుడు ఆడమ్ క్లార్క్‌ను బైబిలు వ్యాఖ్యానము వ్రాయుటకు వాడుకొనెను. మరొక స్టోరులో వినియోగదారుడు వచ్చి అధిక డబ్బు లేకుండ ఎక్కువ వస్తువులిమ్మని గుమస్తాను అడిగెను. అతడింకనూ ఇలాగు చెప్పెను. నీ యజమానుడు చూడటంలేదు గనుక నేను చెప్పినట్లు చేయుమని చెప్పెను దానికి ఆ గుమాస్తా ఇచ్చిన జవాబు “నా యజమానుడు ఎల్లప్పుడూ చూచుచున్నాడు.”

డిక్ ఎఫ్ ... అను వానికి క్రొత్త ఉద్యోగము వచ్చినది. అతనికి తర్ఫీదు ఇచ్చుటకు ఒక ట్రైనర్‌ని నియమించెను. ఇతను అతనితో వారం రోజులు ప్రయాణము చేసెను. ప్రతిరోజు ముగింపులో అతడు ఏయే స్థలములో ఎంత సమయము వినియోగ దారులతో గడిపెనో వ్రాయవలసివున్నది. అది ఏడు గంటల సమయమునకు తక్కువైననూ ఎనిమిది గంటలుగా దానిని సవరించేవాడు. అలాగే చేయవలెనని డిక్ ఎఫ్...నకు కూడా సలహా ఇచ్చెను. అయితే డిక్ క్రైస్తవుడు కాబట్టి ఆలాగు చేయలేనని చెప్పెను. అతని ఉద్యోగము ఆ సమయము మీదనే ఆధారపడి వున్నది. అతనికి తర్ఫీదు నిచ్చువాడు డిక్ పై మండి పడెను. అయితే డిక్ అలాగే తన ఉద్యోగములో కొనసాగెను. కొంతకాలము తర్వాత అతడు ఈక్వెడారునకు మిషనరీగా వెళ్ళెను.

హెరాల్డ్...జీ అను వాడు ఆలుగడ్డ (బంగాళాదుంప) చిప్స్‌ను సూపర్ మార్కెట ్‌లో అందజేయుటకు నియమింపబడెను. అతనికి చెప్పిన సలహా ఏమనగా ఒక పదునైన పెన్సిలు తీసుకొని పోవలెనని దానితో పోటీ దారుల సంచులకు రంధ్రము చేయవలెనని చెప్పిరి. అలాగు రంధ్రము చేయుట వలన తేమలోపలికి వెళ్ళి వాటిని పాడుచేయును. లేక వాటిని మెత్తన చేయును. అయితే హెరాల్డ్ అట్లు చేయుటకు ఒప్పుకొనలేదు. ఎవరునూ అతని మీద కోపపడలేదు. కొన్ని సార్లు యజమానులు యదార్థమైన వారిని శ్రేష్ఠులని గుర్తించుదురు. మరియు పనిలో ఉంచుకొనెదరు.

బాబ్ బీ... అను వాడు పురుషుల బట్టల షాపులో పనిచేసెను. క్రైస్తవుడని చెప్పుకొను మేనేజరు పురుషుల దుస్తులన్నింటినీ తక్కువ వెలకు అమ్మబోవుచున్నట్లు తెలియజేసెను. బట్టలు మామూలు ధర 150 పౌండ్లు అయితే వాటిమీద 200 పౌండ్లు అని క్రొత్తధర నిర్ణయించి తరువాత దానిని 175 పౌండ్లకు తగ్గింపు చేయుమని చెప్పెను. బాబ్ బీ తన యజమానితో విభేదించి ఉద్యోగమును మానివేసెను. దేవుడు అతనిని సన్మానించి తన సేవలో నిలుపుకొనెను.

దేవుని వాగ్దానము నమ్మదగినది. "నన్ను ఘనపరచువానిని నేను ఘనపరచుదును." (1సమూ 2:30) కొద్ది కాలము నష్టము భరింపవచ్చును అయితే ప్రభువు నీతిగా ప్రవర్తించు వానిని ఎల్లప్పుడూ నిర్దోషులుగా కనపరచును.

## అధ్యాయము - 25

# ప్రభువా నన్ను నలుగ గొట్టుము

రువాండ అంతటిలో ఉజ్జీవ జ్వాలలు ప్రజ్వలించిన సమయమది. ఉజ్జీవ లక్షణములలో ప్రాముఖ్యమైనది ఒకటి విరిగి నలిగిన మనస్సు. దేశవిశ్వాసుల మీద దాని ప్రభావము చూపబడినది. కెవిన్ బేకర్ అనువానిని ఇంగ్లాండు దేశము నుండి వారి డినామినేషన్ తరుపున ఈ దేశములో కొందరికి తర్ఫీదు ఇచ్చుటకు పంపబడినాడు.

అతడు సెమినరీలో బోధించుచుండెను. అయితే అతడు చెప్పే బోధ ఉదారవాదమైయున్నది (Liberal theology). అతడు అనుమానములను వాక్య విషయములో తృణీకారము నాటుచేయుచుండెను. క్లాసులో “అబాలోకెల్లీ” అని పిలువబడే మనుష్యుల గుంపు ఉండెను. ఆ పదమునకు అర్థమేమనగా “తిరిగి పుట్టినవారు” వీరు ప్రతిరోజు ఉదయము నాలుగు గంటలకు ప్రార్థనకు కూడుకునేవారు. ఈ సంగతి కెవిన్‌కు తెలిసినది. వారు ఆయన కొరకు ప్రార్థించుచున్నట్లుగా తెలిసినది. ఇతడు సంఘానికి గురువు. వారు అమాయకులైన స్థానికులు

ఒక దినాన వారి నాయకుని పిలిపించి గద్దించెను. అతడు ఇతని గద్దింపునకు హేళనకు గురియైనను, మౌనముగా కూర్చుండెను, చివరిలో అతడు చెప్పినది ఏమనగా “నీకు ప్రార్థన సహాయము” అవసరము అని చెప్పెను. ఆ ప్రొఫెసరునకు (కెవిన్) మరి ఎక్కువగా కోపము వచ్చెను.

అయితే రక్షింపబడినవారు, ప్రార్థనలో కొనసాగిరి. దేవుడు రెవ. కెవిన్ జీవితములో పనిచేయప్రారంభించెను. క్రైస్తవ విశ్వాసమునుండి అతడు ఎంతగా తొలగిపోయెనో తెలిసికొనుటకు ప్రారంభించెను. తుదకు అతడు బిషప్ నొద్దకు వెళ్ళి తన బోధ సంఘమునకు అంగీకారమైననూ లేఖన సత్యములకు విరోధముగా నున్నదని తాను ఒప్పించబడి ఆ సంగతి బిషప్ ఎదుట ఒప్పుకొనెను. సువార్త విషయములో కెవిన్ యొక్క అవగాహనను బట్టి బిషప్ బహుగా నిరుత్సాహపడెను. అతడు తన ముఖమునకు

చేతులను అడ్డము పెట్టుకొని ఇలాగు చెప్పెను "ఓ కెవిన్ నీ వెన్నడునూ బిషప్ వి కాజాలవు." అందుకు కెవిన్ చెప్పిన జవాబు "ప్రభువునకు స్తోత్రము చెప్పుచున్నాను."

**విరిగిపోవుటకు ఒత్తిడి:**

పరిశుద్ధాత్మ ఇంకను అతనిని ఒప్పించుచుండగా తిరిగి జన్మించిన వారి నాయకుని యొద్దకు వెళ్ళి క్షమాపణ కోరుకొనవలెనని కెవిన్ తలంచెను. అదెంతో తగ్గింపు. అతడు ఆ మత శాఖకు గౌరవ ప్రదమైన గురువుగా వుండి ఒక నల్లని విద్యార్ధియొద్దకు వెళ్ళి క్షమాపణకోరుట ఆశ్చర్యమే. అతడు మొదట ఈ తలంపునకు వ్యతిరేకముగా పోరాడిననూ అతని ఆంతర్యములో ఒత్తిడి పెరిగెను. అతడు మునికోలలకు ఎదురు తన్నుచుండెను. అతడు వెళ్ళవలెనని తీర్మానము చేయునంతవరకు నెమ్మదిలేకయుండెను. పూర్తిగా నలిగిన వాడై తన కారు ఎక్కి బయలుదేరి క్షమాపణ ఎలా చెప్పవలెనో తలంచుచూ వెళ్ళెను.

అతడు వారి గదికి చేరిన వెంటనే తిరిగి జన్మించిన వారి నాయకుడు తలుపుతీసి హల్లెలూయా అని చెప్పెను. అతని ప్రార్థనలకు జవాబు వచ్చినట్లు అతడు తెలిసికొనెను. మొదటిసారిగా కెవిన్ ఒక నల్లటి వానిని కౌగలించుకొన్నది అప్పుడే. ఒక నల్లవానిని కౌగలించుకోవాలని అనుకున్నది కూడా అప్పుడే.

రక్షింపబడినవారు ఉదయం నాలుగుగంటల కూడికకు రమ్మని కెవిన్‌ను కోరిరి. ఇది మత గురువుగా అతని పరిధికి పూర్తిగా వెలుపటి కార్యము. అయితే అతడు కొన్ని సాకులు చెప్పెను. వారు ఓపికతో విని ఒక వారము ప్రయత్నించుమని అడిగిరి. అతడు కాదనలేక ఒప్పుకొనెను. ప్రార్థనలో ఇంతకు ముందు పొందని ఆత్మీయ సంతోషమును అతడు అనుభవించెను.

ఉపాధ్యాయుడు విద్యార్థులతో కలిసి ఉదయము నాలుగు గంటలకు ప్రార్థన చేయుచున్నాడని సెమినరీ నాయకులకు తెలిసినప్పుడు అది సెమినరీకి అవమానముగా తలంచిరి. అందువల్ల కెవిన్ బేకర్‌ను మరొక స్కూలుకు మార్చిరి. ఉదయము ఏడుగంట లలోపు ఆవరణలో ఏవిధమైన కూడికలు పెట్టకూడదని నిషేధించిరి.

రక్షించబడినవారు ఈ విషయము ప్రభువు ఎదుటవుంచి ప్రార్థించిరి. మనుష్యుల మాటకంటె దేవునికి లోబడవలెనని వారు నిశ్చయించుకొనిరి. వారు అలాగు ప్రార్థించు చుటకు నిర్ణయించుకొనగా సెమినరీ పరీక్ష వ్రాయుటకు వారిని అనుమతించలేదు. మరియు వారిని బహిష్కరించిరి. అప్పుడు వారు నలిగిపోయిరి.

అయిననూ నిరుత్సాహపడలేదు. దూషణమాటలు పలుకక ఓపికతో వారు ఓర్చుకొనిరి. బిషప్‌నకు వ్యతిరేకముగా సహోదరుడు కెవిన్ ద్వేషము కలిగియున్నట్లు వారు గ్రహించిరి. అప్పుడువారు వెళ్ళి తనకున్న కోపమును బిషప్ ఎదుట ఒప్పుకొనవలెనని కెవిన్‌కు సలహా ఇచ్చిరి. ఈ సారి ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా కెవిన్ వెంటనే వెళ్ళి బిషప్‌తో మాటలాడి తన్ను తాను సవరించుకొని అతని జీవితములో ఎడతెగని ఉజ్జీవమును అనుభవించెను.

**హృదయము మీద కొట్టుము:**

పరిశుద్ధతకు కావలసిన మూల సూత్రములన్నింటిలో ముఖ్యమైనది విరిగిన మనస్సు. ఈ మనస్సు అతనిని అన్ని విషయములలో ప్రభావితము చేయును. ఒకడు విరిగిన వాడు అని మనం చెప్పినప్పుడు దేవుని చిత్తమునకు లోబడే చిత్తముగలవాడు అని దాని అర్థం. అతడు వ్యతిరేక పరిస్థితులలోను, విసిగించే మనుష్యుల మధ్యను అతడు సాత్వికుడై మర్యాదగా ప్రవర్తించును. ఒక చెంపమీద కొట్టినప్పుడు మరొక చెంప చూపును. దీనిని గూర్చి ఇ.స్టాన్‌లీ జోన్స్ గారు ఇలాగు చెప్పెను.

“మరొక చెంపను చూపినపుడు శత్రువుని నిరాధునిగా చేయుచున్నావు. అతడు నీ చెంపమీద కొట్టినప్పుడు నీవు మరొక చెంపను చూపుటద్వారా నీ నైతిక ధైర్యము అతని హృదయము మీద కొట్టుచున్నది. అతని శత్రుత్వము కరిగిపోయెను. శత్రువు వెళ్ళిపోయెను. నీ శత్రుత్వమును విడిపించుకొనుట ద్వారా నీ శత్రువుకూడా విడిచి పోవుచున్నాడు. తిరిగి కొట్టుటకు శక్తిగలిగిన మానవుని పాదములయొద్ద లోకమున్నది అయితే తిరిగి కొట్టకుండుటకు శక్తి గలవాడు. ఇదే విజయమును సాధించు శక్తి.”

విరిగిపోవుటకు సిద్దపాటు అందమైన గుణము యొక్క లక్షణము. అది సహజ ఉద్రేకమును ఎదిరించును. అది తన్నుతాను కాపాడుకొనదు, ఫిర్యాదు చేయదు. దేవుడు పగిలిపోయిన పాత్రలకోసము చూచుచున్నాడు.

దేవుని దీపముల కొరకు కుండలు
కేకలు వేసి అన్ని ప్రాంతాలకు తెలపండి
వాటి సౌందర్యముకాదు
పగులుటకు సిద్దపాటు
ప్రభువు పాత్రలకు గురుతులివే.

ఒక దినమున తన సంఘ సభ్యుడు డాక్టరు అలెగ్జాండర్ వైటే ఆఫీసునకు వచ్చి ఒకవార్త తెలిపెను. ఒక దర్శించు బోధకుడు డాక్టరు వైటీ గారి సహచరులలో ఒకడు క్రైస్తవుడు కాడు అని బహిరంగముగా చెప్పెను.

డాక్టరు వైటే కోపముతో మండిపడెను. నమ్మకమైన ప్రభువుదాసునిపై మాటకు మాట అనాలి అనుకొన్నాడు. ఈ పాపము చేసినవానికి విరోధముగా ఆయన కొన్ని మాటలు పలికెను.

ఆ సభ్యుడు ఇలాగు చెప్పెను, అంతమాత్రమే కాదు "నీవు నిజమైన విశ్వాసివి కాదని కూడా అతను చెప్పెను" ఆ మాట అన్నప్పుడు డాక్టరు వైటీ ఇలాగు చెప్పెను. దయచేసి ఆఫీసు విడిచి వెళ్ళిపో, నేను ప్రభువు ఎదుట ఒంటరిగా వుండి నా హృదయాన్ని పరీక్షించుకొనెదను.

విరిగిపోవుట అను పాఠమును మనలో కొందరము సులభముగా నేర్చుకొనము. ఒక సాయంకాలమున గౌరవనీయులైన ఇద్దరు ప్రభువు సేవకులతో ఒక గృహమును దర్శించితిని. వారిరువురు బైబిలు స్కూలును విమర్శించుచుండిరి. నేను ఆ బైబిలు స్కూలునకు ప్రెసిడెంటుగా ఉన్నాను. వారు విమర్శింస్తుండగా నాకు కోపం వచ్చినది గానీమౌనముగా ఉన్నాను. తన బిడ్డ కురూపి అన్నప్పుడు తల్లికి ఎంత కోపం వస్తుందో అంత కోపం వచ్చింది. నాకు నయాగర జలపాతమంత ఉద్రేకము వచ్చింది. నా కోపానికి వారిద్దరూ గురయ్యారు. నన్ను నేను అభినందించుకొన్నాను.

కొన్ని నెలల తరువాత కూడికలకొరకు ఆయోవాకు ప్రయాణమై పోవుచున్నాను. పరిశుద్ధాత్మ నాతో ఇలాగు మాట్లాడుటకు ప్రారంభించెను "మెక్ డొనాల్డ్, నీవు క్రైస్తవ జీవితాన్ని గూర్చి ఇతరులకు బోధించుటకు వెళ్ళుచున్నావు. నా ఇద్దరు సేవకులతో నీవు ఎట్లు మాటలాడితివో గుర్తుచేసుకొనుము, నీవింకనూ దానిని సవరించుకొనలేదు." నేను వాక్యపరిచర్య చేయడానికి ముందుగా వారిరువురికి క్షమాపణ కోరుకుంటూ ఉత్తరం వ్రాశాను.

**నలిగిన మనస్సు సంబంధాలను బలపరచును:**

అది స్నేహమునకు ముగింపా? కాదు, ఇంతకు ముందటికంటె లోతైన స్నేహానికి అది ప్రారంభము. వారు నా కొక ఉత్తరం వ్రాసిరి నన్ను క్షమించినట్లు నా కొరకు ప్రార్థన

చేస్తున్నట్లు తెలిపిరి. అది దేవుని మార్గమే, ఉత్తమ మార్గము విరిగిన స్థితివల్ల సంబంధాలు స్థిరపడును అయితే గర్వము సంబంధాలను పాడుచేయును. అని ఆయనకు తెలుసు.

నేను పాఠము నేర్చుకొంటినని నీవు తలంచియుండవచ్చును. అయితే అదికాదు. ఒక ఉదయాన సమాధి కార్యక్రమమునకు సిద్ధపడుచుండగా ఫోన్ మ్రోగింది. ఇంగ్లాండు నుండి వచ్చిన ఒక బోధకుడు ఆ ప్రాంతము దర్శించుచుండెను. ప్రభువు రాకడ విషయములో అతని అభిప్రాయము వాక్య విరుద్దమని నాకు తెలియును. సంభాషణ ప్రవచనముల మీదకు వెళ్ళగా నేను వాడిగా, వేడిగా నా అభిప్రాయములను వెలిబుచ్చాను. ఫోను వైర్లుకూడా వేడెక్కినవనుకుంటా, ఈ స్థితిలో సమాధికార్యమునకు చాలా తక్కువ సిద్దపాటు. ఒకరిది ఒకరం ఒప్పుకొనకుండా ఎవరికి వారిదే సరయినది అని సంభాషణ ముగించాము.

కొన్ని సంవత్సరముల తరువాత లండనులో ఉంటిని. ప్రభువు నన్ను మరల దర్శించెను. ఆ బోధకుడు కూడా అదే వీధిలో ఉండెను. అప్పుడు నాకు ఫోన్‌లో నాతో మాటలాడినట్లుగా ఉన్నది. “నీవా సహోదరునితో మాట్లాడిన విధానమును బట్టి క్షమాపణ కోరుకొనుము”.

“ప్రభువా నేను చెప్పినది సరియే అని తలంచుచున్నాను. నీవు త్వరగావచ్చెదవని సత్యాన్ని నేను సమర్థించుచుంటిని”

సంగతి అదికాదు. నీవు చెప్పుచున్న సత్యమును గూర్చిన సంగతి అదికాదు కాని నీ వైఖరిని గూర్చి అభ్యంతరముగా నున్నది.

నేను గదికి వెళ్ళి ఆయనకు ఫోన్ చేశాను. నేనెందుకు ఫోను చేసితినో వివరించాను. అది నా గర్వమునకు ఒక దెబ్బ. ఆయన నన్ను క్షమించుటకు ఒప్పుకొనెను. మరుసటిరోజు ఒక రెస్టారెంటులో భోజనమునకు రమ్మనికూడా ఆహ్వానించాడు. తరువాత ఆయన సంఘములో బోధించుటకు ఆహ్వానింపబడితిని.

ఒక వ్యక్తి ఇలాగు అడుగవచ్చును “ఒక వేళ నేను విరువబడకపోతే దానిని గూర్చి నేనేమి చేయవలెను” నేను నాలుగు మెట్లతోకూడిన సలహా ఇచ్చుచున్నాను.

**విరుగుటకు మెట్లు:**

మొదటిగా ప్రభువా, నన్ను విరువుము అని ప్రార్థించవలెను. ఇతర క్రైస్తవులందరి వలెనే నీవు కూడా మార్పు చెందవలెనని గుర్తించుము. అప్పుడు ప్రార్థించగా నీ జీవితములో మార్పు ప్రభువు కల్పించును అయితే నష్టాన్ని లెక్కించుకొనవలెను. విరిగిపోవు విధానము బాధకరమైనదే.

రెండవదిగా నీ గతములో సరిచేసుకొనవలసిన పొరపాట్లన్నింటిని వెదకుము. కఠినమైన మాటలకు క్షమాపణకోరుకొనుము. నీవు ఆత్మానుసారముగా కాకుండ శరీరానుసారముగా ప్రవర్తించిన దానికి క్షమాపణకోరుకొనుము.

మూడవదిగా దేవుని ఎదుటను అభ్యంతరపడిన వ్యక్తుల ఎదుటను ఒప్పుకొనుము మనుష్యుల ఎదుటకంటే దేవుని ఎదుట ఒప్పుకొనుట సులభముగా వుండును. అయినా ఒప్పుకొనక తప్పదు. పరిశుద్ధాత్మను దుఃఖపరచకుండ నడుచుకొనుటకై అవసరమైన వన్నియు నీవు చేయవలెను.

చివరిగా నీ అనుభవాన్ని ఇతరులతో స్వేచ్ఛగా పంచుకొనును. అది నీ వ్యక్తిత్వానికి నష్టముకలిగించదు. పైగా విరిగిన మనస్సుగలవారికి నీ అనుభవము ప్రోత్సాహకరముగా ఉండును.

విరిగిన వస్తువులను, విరిగిన మనుష్యులను దేవుడు ప్రేమించును. వాన్స్ హవనెర్ ఇలాగు వ్రాసెను "పగిలిన నేల పంటను ఉత్పత్తిచేయును, పగిలిన మేఘములు వర్షము నిచ్చును, పగిలిన ధాన్యము బలమునిచ్చును. పగిలిన అత్తరు భరణి సువాసనలు వెదజల్లును. యెబ్బోకు వద్ద యాకోబు కుంటుటకు ప్రారంభించెను. అతడు దేవునితోను, మనుష్యులతోను పోరాడశక్తిగలిగినవాడు. ఏడ్చుచూ తిరిగి వచ్చిన పేతురు అంతకు ముందు కంటె ఎక్కువ శక్తిగలవాడై పని చేసెను."

●

## అధ్యాయము - 26

# మత్తుపదార్థములకు కాదు అని చెప్పుము

స్టీవ్ అనువాడు వివాహముచేసికొనిన యౌవ్వన వ్యాపారి. అతను సంతోషముగా కాలము గడుపుచుండెను. అతడొకసారి మిత్రులతో కలిసి విందుచేసికొనుచుండగా ఆ విందులో కోకైన్ అను మత్తుపదార్ధము మొదటిసారిగా తీసుకొనెను. అతడు త్వరలోనే ఈ మాదకద్రవ్యము ప్రభావము క్రిందకి వచ్చి తాత్కాలిక శక్తిని సుఖాన్ని అనుభవించేవాడు. అతడు దినమునకు అరవై పౌండ్లు ఈ అలవాటుకు ఖర్చుచేసేవాడు. అందువల్ల త్వరలోనే తన కుటుంబ జీవితము పాడైపోయెను. ఇతరుల వలె అతని కథ పోరాటముతోను, దివాలా తనముతోను, విడాకులతోను ముగిసెను, ఇంతకు ముందు అతనిని దానికి అలవాటుచేసిన మిత్రులుకూడా ఇప్పుడతని నుంచి దూరముగా వెళ్ళిపోవుచున్నారు.

మత్తుమందుల వాడకము వల్ల ఒక తరహా సుఖాన్ని అనుభవించుదురు. లోకము సుఖాల్ని ఇచ్చునని చెప్పుచున్నది. లేక లోకము సుఖాలను ఇవ్వగలదని బైబిలు చెప్పుచున్నది. వీటిని గూర్చి అల్పకాలపాప భోగములు అని బైబిలు చెప్పుచున్నది. (హెబ్రీ 11:25) ఈ భోగములు తాత్కాలికమైనవే శాశ్వతమైనవికావు. అందువలన పాలుపొందుట ద్వారా మానవుడు చెల్లించే వెల ఎంతో ఎక్కువ.

ఈ మత్తుకలిగించు మందుల విషయములో విశ్వాసుల వైఖరి ఎట్లుండవలెను. ఈ మత్తు మందులేవనగా ఎంఫెటామినెస్, బార్బిటురేట్స్, హిరొయిన్, కోకైన్, **పిసిపి**, గంజాయి, మరిజోనా, **ఎల్ఎస్డి**, పియోట్, గ్లూ, నైట్రస్ ఆక్సైడ్, డాక్టర్లు రోగులకు ఇచ్చు కోడైన్ డార్వొన్, పెర్కొడన్.

శరీరకార్యములను గూర్చి పౌలు గలతీ పత్రికలో వివరించెను గలతీ 5:19-21 వాటిలో "అభిచారము" అను మాట వచ్చినది. అనగా క్రొత్త నిబంధన మూలభాషలో ఈ పదమునకు ఫార్మాకేయా అని వున్నది. దీని భావమేమనగా మందులు వాడుట, మంత్రము

చేయుట, తాయత్తులు కట్టుట, మంత్రకళలలో మందులు వాడుట సహజము. దురాత్మల ప్రపంచములో వీటిని వాడుదురు. వైద్యుడు చెప్పిన మందులు వాడటం మంచిదే అయితే బైబిలు చెప్పే ఈ తరహా మందులు వేరు. ఇవి మంత్రగాండ్రును ఆత్మలతో మాట లాడువారును దురాత్మల సంబంధమైనవి. వీటిని బైబిలు నిషేధించుచున్నది.

**వినియోగదారులు నష్టపోవుదురు:**

మనస్సునకు మత్తు కలిగించు మందులు ఆ వ్యక్తిని మానవాతీతమైన లేక భావాతీతమైన స్థితిలోనికి నెట్టివేయును. అది దురాత్మల ప్రవేశమునకు జీవితమును తెరుచుటయే అగును. మాదక ద్రవ్యములకు గురియై మారుమనస్సు పొందినవారిలో కొందరు దురాత్మలచేత పట్టబడినవారు మాత్రమే వాటి గాలములో పడిపోవుదురు అని దురాత్మ లేకుండా కేవలం మత్తుమందుకి అలవాటుపడుట అసాధ్యం అనిచెప్పుచున్నారు.

దుష్టుని యొక్క గురి ఎల్లప్పుడు నాశనము చేయుటయే మార్కు 9:22, యోహాను 10:10 ఈ సూత్రమునకు మినహాయింపులేదు. వాడు మందులు వాడిన వారిని, లేక ఇతరులను కూడా నాశనము చేయుటకు వెదకుచున్నాడు. ఈ నాడు జరుగుచున్న ఘోరమైన నేరములకు కారణమిదే. మందులకు, దురాత్మలకు, నాశనమునకు సంబంధమున్నదని గుర్తించుట ముఖ్యము మరియు వాటి నుండి తొలగిపోవలెను.

విశ్వాసి హానికరమైన రసాయనిక పదార్ధములనుండి దూరముగా వుండుటకు ఇతర కారణములు కూడా వున్నవి. అవి ఒక అలవాటుగా మారి వ్యక్తులను బానిసలుగా చేయును. క్రైస్తవుడు ఏ అలవాటునకు బానిసకాకూడదు. (రోమా 6:16-23). వాటి ఖర్చు అమితము. అలవాటును కొనసాగించుటకు వ్యక్తులు దొంగతనమునకు, క్రూరత్వమునకు తరుమబడుదురు. స్త్రీలైతే కొన్ని సార్లు వేశ్యావృత్తికి తరుమబడుదురు, సూదుల ద్వారాను, శరీర అవయవములు నిస్సారముగాను, ప్రమాదకరమునకు లోనై నిరోధక శక్తిని కోల్పోవును. ఇవి మనస్సుమీద హానికరమైన మార్పులేని ప్రభావము చూపించును. ఈ అలవాటుకు బానిసలైన వారు అసహజమైన లక్షణములు కలిగి ఆత్మహత్యలు చేసికొందురు. వారు మంత్రములకు వశమగుదురు. ఈ మందులలో అనేకము నిషేధింపడినవి. వాటిని ఉపయోగించువారు అదుపులోనికి తీసుకొనబడుదురు. కోర్టుముందు హాజరగుదురు. అధికమొత్తములో కోర్టులో ఖర్చులగును. నేరము ఋజువైతే జైలు పాలగుదురు. కొంచెము అధిక డోసు తీసుకొనుటవల్ల వేగముగా ప్రయాణముచేసి

స్మశానమునకు పోవుదురు,

ప్రమాదకరమైన రసాయనికములను క్రైస్తవుడు ఎన్నడూ ఉపయోగించరాదు. ఏలయనగా అతని దేహము పరిశుద్ధాత్మకు దేవాలయముగా నున్నది (1కొరింథి 6:19). వాటితో వ్యాపారము చేయకూడదు. అవి ఇతరులకును హానికలిగించును, అది క్రైస్తవ సాక్ష్యమునకు భంగకరము, క్రీస్తుకొరకు మనుష్యులను సంపాదించుటయే మన గురి కాని మత్తుమందులకు బానిసలుగా చేయుటమాత్రము కాదు.

మందులకు, దురాత్మలకు సంబంధమున్నదని ఇంతకుముందే ప్రస్తావించితిమి. దురాత్మలకు సంబంధించిన మరికొన్ని సంగతులు కూడా కలవు. విశ్వాసి వాటి నుండి తొలగిపోవలెను. అవేవనగా టారోట్‌కార్డులు, జ్యోతిష్యశాస్త్రము, కీడు చేయుటకు మేలు చేయుటకు వాడబడే మంత్రములు, యోగా, అదృష్టము చెప్పుట, ఊయిజా బోర్డు, క్రిష్టల్ బాల్, క్లెయిర్ హోయాన్స్, హస్తసాముద్రికము, దురాత్మలతో మాటలాడుట, సోదె చెప్పుట మొదలగునవి. ద్వితీయో 18:9-14

**మద్యము :**

ఒక త్రాగుబోతు రక్షింపబడిన తర్వాత "యేసు నీటిని ద్రాక్షారసముగా మార్చెనని నమ్ముచున్నావా?" అని ప్రశ్నించితే అతడు ఇలాగు జావాబిచ్చెను "నిజమే విస్కీని వంట సరుకుగా ఆయనమార్చినట్లు చూశాను. జూదపు టిక్కెట్లు అమ్మేవాడు సామాగ్రిగా మారటం చూశాను. పగిలిపోయిన హృదయం గల భార్య సంతోషించు క్రైస్తవురాలిగా మారటం చూశాను. అందువల్ల ఆయన నీటిని ద్రాక్షరసముగ మార్చినది నమ్మడానికి నాకేమి కష్టముకాదు".

సామాన్యముగా మత్తు పదార్థ వినియోగం మద్యం రూపంలోనే వాస్తవలోకము నుండి తప్పించుకొనుటకు అదొక మార్గము. అది తాత్కాలిక ఔన్నత్యాన్ని గొప్పతనమును ఆ సమయపు సమస్యలను మర్చిపోవునట్లు చేసి ఒత్తిడిని తగ్గించును. ఇతర మత్తుపదార్థములవలె ఇది అనైతిక స్థితిని, అమానుషత్వమును, నాశనమును కలిగించును.

ఈ మద్యం అను అంశమును గూర్చి క్రైస్తవునికి బైబిలు చెప్పునదియేమో తెలిసి ఉండవలెను. ద్రాక్షరసమును పురుషులు స్త్రీలు మితముగా (కీర్త 104:15) తీసుకొనుటలో తప్పుకానరాదు అయితే అమితముగా వినియోగించుట వలన సరియైన

తీర్మానము చేసే సామర్థ్యమును కోల్పోదురని దేవుడు హెచ్చరించుచున్నాడు (సామె 31:4,5, హోషే 4:11) వీటివలన కడుపు జబ్బులు వచ్చినప్పుడు ద్రాక్షారసము త్రాగవచ్చునని అనుమతి ఇవ్వబడెను. (1 తిమో 5:23) చనిపోవుచున్నవానికి వైద్యకారణముచేత వినియోగించవచ్చును. అయితే ప్రమాదమేమనగా దేవుడు దయతో ఇచ్చిన ఈ అవకాశమును ప్రజలు దుర్వినియోగ పరచి త్రాగుబోతులగుచున్నారు. ఈ మత్తు పదార్థమును గూర్చి దేవుడు విశ్వాసులను హెచ్చరించుచున్నాడు (రోమా 13:13). త్రాగుబోతులు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని ఆయన స్పష్టముగా చెప్పుచున్నాడు. (1కొరింథీ 6:10) ఒకడు విశ్వాసి అని చెప్పుకొనినను వాడు త్రాగుబోతుగా కొనసాగినపుడు వాని ఒప్పుకోలు అబద్ధమే. "ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును. మద్యము అల్లరిపుట్టించును. దాని వశమైన వారందరు జ్ఞానములేని వారు" (సామె 20:1) త్రాగుటకు అనుమతించు సమాజములో ఇతరులు అభ్యంతర పడుదురు. అందువల్ల విశ్వాసులు పూర్తిగా దానికి దూరముగావుండవలెను. ద్రాక్షారసము త్రాగుట సహోదరునికి అభ్యంతరము కనుక దానిని మానివేయుట మంచిది (రోమా 14:21)

వాస్తవమునకు విశ్వాసులు ద్రాక్షారసమును ఒక చేతి కర్రవలె వినియోగించ నక్కరలేదు. పరిశుద్ధాత్మ చేత నింపబడవలెనని పౌలు చెప్పుచున్నాడు. మద్యముతో మత్తులగుట దేవుని బిడ్డకు సరియైన మార్గముకాదు. ఆ అలవాటు తగదు (ఎఫెసీ 5:18)

**రోగమా లేక పాపమా? -** మద్యముత్రాగుట పాపము కాదు అదొక జబ్బు అని చెప్పు మాయమాటలకు మోసపోవద్దు. అది పాపమని త్రాగుబోతు దేవునిరాజ్యములో చేరడని బైబిలు చెప్పుచున్నది. (1కొరింథీ 6:10) మానవుడు తన ప్రవర్తనకు నైతిక బాధ్యత కలిగి ఉన్నాడు. పాపమును రోగమని మారుపేరు చెప్పి అతడు తన బాధ్యతను తప్పించుకొనలేడు.

కొన్ని సంవత్సరముల క్రితము మత్తుపానీయము సేవించుట రోగమని నేషనల్ వాయిస్ అను మాస పత్రికలో ఇలాగు వ్రాయబడెను.

> చిత్తముతో ఒప్పందము చేసికొనిన రోగము అదిఒక్కటి మాత్రమే
> అది వ్యాపింప చేయుటకు అనుమతి పొందిన రోగము అది ఒక్కటే
> సీసాలో బిగించి అమ్మబడురోగము అది ఒక్కటే

వ్యాపింపచేయుటకు దుకాణములు గల రోగము అది ఒక్కటే
ప్రభుత్వమునకు ఆదాయము పెంచు రోగము అది ఒక్కటే
నేరమును అధికము చేయురోగము అది ఒక్కటే

అది అలవాటుగా మారు రోగము అది ఒకటే
ప్రచారము వల్ల వ్యాప్తిచెందే రోగము అది ఒకటే
హానికరమైన సూక్ష్మజీవులు లేని రోగము గనుక
బాగుచేయుటకు కూడా మందులేని రోగము అది ఒకటే
రోగిని పరలోకములోనికి ప్రవేశించకుండా అడ్డుకునే రోగము అదిఒక్కటే
క్రిస్మస్ కానుకగా ఇవ్వబడే రోగము అది ఒక్కటే

త్రాగుబోతు తనము బానిసత్వమునకు గురిచేయును. విశ్వాసి ప్రభువుకు తప్ప మరి ఎవనికిని, దేనికి బానిసగా ఉండకూడదు (1కొరింధి 9:26,27)

ఇది ఖర్చుతో కూడిన అలవాటు. కుటుంబానికి వ్యక్తిగత అవసరాలకు వినియోగించవలసిన డబ్బును ఈ వ్యసనమునకు వినియోగింతురు. ద్రాక్షారసమును అధికముగా పుచ్చుకొనువారు దరిద్రులయ్యెదరని సొలొమోను చెప్పెను. (సామె 21:17) ఈ వ్యసనమునకు బానిసలైనవారు బాలికను అమ్ముదురు అని యోవేలు వివరించెను (యోవేలు 3:3)

త్రాగుబోతు తనము వల్ల వ్యక్తి ఆరోగ్యము దెబ్బతినును. కాలేయమునకు సిరోసిస్ రోగము వచ్చును. మూత్రపిండముల సమస్యలు, గుండెజబ్బులు మెదడులో వున్న కణములకు హానికలుగును. అమెరికాలో త్రాగుబోతు యొక్క సగటు జీవితం 51 సంవత్సరములు. అది జాతీయ సగటుకంటే చాలా తక్కువ. గర్భవతులకు ప్రమాదము. పుట్టబోవు బిడ్డలకు హానికరము. ఒక వ్యక్తి ఇలాగు చెప్పెను. “దేవుడు మన పాపములను క్షమించును గానీ మన దేహములను కాదు.”

పని గంటలు నష్టమగుటయే కాక తరచుగా ఉద్యోగములను పోగొట్టుకొనుచున్నారు. కుటుంబ జీవితమునకు గొప్పనష్టము. త్రాగినడుపుచున్న డ్రైవరులు ఇతరుల మరణమునకు కారణమగుచున్నారు. ఆత్మహత్యలు చేసుకొనుచున్నారు. దాని ప్రభావము వల్ల హత్యలు చేయుచున్నారు. జైళ్ళలో ఉన్నవారు ఈ మత్తు మందు, పానీయప్రభావము వలననే నేరం చేసినవారు 80% కి పైగానే ఉన్నారు. ఇది అంతయు

దీనివలన కలుగు దుస్థితియే.

త్రాగుబోతు గూర్చిన వివరణ సొలొమోను సామెతలు 23:29 నుండి 35 వరకు వివరించెను.

"ఎవరికి శ్రమ? ఎవరికి దుఃఖము?
ఎవరికి జగడములు? ఎవరికి చింత?
ఎవరికి హేతువులేని గాయములు? ఎవరికి మంద దృష్టి?
ద్రాక్షారసముతో ప్రొద్దుపుచ్చువారికే గదా
కలిపిన ద్రాక్షారసము రుచిచూడ చేరువారికే గదా
ద్రాక్షారసము మిక్కిలి ఎఱ్ఱబడగను
గిన్నెలో తళతళలాడుచుండగను
త్రాగుటకు రుచిగా నుండగను దానివైపు చూడకుము.
పిమ్మట అది సర్పము వలె కరచును
కట్లపాముపలె కాటు వేయును.
విపరీతమైనవి నీ కన్నులకు కనబడును
నీవు వెఱ్ఱి మాటలు పలుకుదువు.
నీవు నడి సముద్రమున పండుకొను వానివలెనుందువు.
ఓడకొయ్య చివరను పండుకొనువానివలె నుందువు.
– నన్నుకొట్టినను నాకు నొప్పి కలుగలేదు.
నా మీద దెబ్బలు పడినను నాకు తెలియలేదు.
నేనెప్పుడు నిద్రమేల్కొందును?
మరల దాని వెదకుదును అని నీవనుకొందువు."

**క్షేమమైన పద్ధతి:**

మత్తుపానీయమునకు బానిస కాకుండటకు ఒకే ఒక మార్గము ఏదనగా దానికి పూర్తిగా దూరముగా వుండుటయే. అతని ప్రవర్తన ఎవరినీ తొట్రుపడనీయదు. అదియే ఖచ్చితమైన మార్గము. మనమందరము దీనిని గూర్చి ఆలోచించుట అవసరము. నీవు గానీ నేను గానీ త్రాగుచున్నప్పుడు అది మనకు మంచిదే గనుక అతనికి కూడా మంచిదేయని అతడు తలంచవచ్చును. అతడు మద్యానికి బానిసయై త్రాగుబోతుగానే తన జీవితమును ముగించవచ్చును. అటువంటప్పుడు నీవు, నేను నైతికముగా బాధ్యుల

మగుచున్నాము. ఏలయనగా మనమొక చెడ్డమాదిరిని చూపితిమి. అందుకే పౌలు ఇలాగు చెప్పుచున్నాడు. “మాంసము తినుటగాని, ద్రాక్షారసము త్రాగుటగాని, నీ సహోదరునికి అడ్డము కలుగజేయునది మరి యేదియుగాని మానివేయుట మంచిది’ (రోమా 14:21) అందువలనే ఆయన ఇంకనూ ఇలాగు చెప్పుచున్నాడు. “కాబట్టి భోజనపదార్థములవలన, నా సహోదరునికి అభ్యంతరము కలిగిన యెడల, నా సహోదరునికి అభ్యంతరము కలుగజేయకుండుటకై నేనెన్నటికిని మాంసము తినను.” (1కొరింథీ 8:13) నీవు ఇతరులను త్రాగుబోతులనుగా చేయుట మిక్కిలి చెడ్డకార్యమగుచున్నది. నీవు మద్యపానివగుట కూడా చెడ్డపనియే.

**విజయము పొందవచ్చును:** మెల్‌ట్రాటర్ అనువాడు త్రాగుబోతు సమస్యలను తప్పించుకొనుటకై అతడెల్లప్పుడూ త్రాగుచునేయుండెడివాడు. ఒక దినాన తన కుమారుడు చనిపోయెను. అతనికి త్రాగవలెనను ధ్యాసవుండుటవలన వాడువెళ్ళి సమాధిపెట్టెలో నుండి పిల్లవాని బూట్లు తీసుకొని అవి అమ్మి త్రాగెను. తన దుష్కార్యము గ్రహించి ఆత్మహత్య చేసికొనుటకు వెళ్ళుచుండెను. అతడు వెళ్ళుచుండగా పడిపోయిన వారిని కాపాడు ఒక గుంపును కలిసికొనెను. వారితో పాటు అతడు సువార్తకూడికకు హాజరయ్యెను. సువార్త విని ఆశ్చర్యరీతిగా అతడు రక్షింపబడెను. అతని జీవితము పూర్తిగా మారిపోయెను. అతడు ఏ మాత్రమును మద్యమునకు బానిసకాకుండ వీధిలో వచ్చి పోయే ప్రజలకు రక్షకుని గూర్చి చెప్పుచూ మిగిలిన జీవితాన్ని గడిపెను. పరిశుద్ధాత్ముని శక్తిద్వారా త్రాగుబోతుతనము నుండి బయట పడిన వ్యక్తికి అతడొక ఉదాహరణ. మద్యపానమునకు బానిసయైనవాడు ఆ శోధన నుండి పూర్తిగా స్వతంత్రుడుకాలేడని తలంచుట నిజముకాదని నిరూపించెను. అట్టి అభిప్రాయము విడిపించుటకు ఆత్మకు గల శక్తి విస్మరించును.

మరొక త్రాగుబోతు మారుమనస్సుపొందినప్పుడు అతడు బాప్తిస్మము పొందవలెనని చెప్పిరి. పాతజీవితమును పాతిపెట్టినట్లును క్రొత్తజీవితములో కొనసాగుటకు అతని తీర్మానమునకు బాప్తిస్మము సూచన. అతడు బాప్తిస్మము పొందిన తరువాత తొట్టిలోని నీటిని ఖాళీ చేయుచున్నప్పుడు అడుగున ఒక విస్కీబాటిల్ కనబడినది. పాతజీవితమునకు ముంగిపుగా బాప్తిస్మము పొందిన విశ్వాసి దానిని అక్కడ వదిలివేసెను.

మద్యము విషయములో సమస్యగా నున్న ఏ విశ్వాసి అయినా కొన్ని సామాన్య సూత్రములను పాటించవలెను.

1. నీ యొద్దనున్న లిక్కరు అంతయూ బయట పారవేయుము విడుదలపొందవలెనను కోర్కెలో ఉన్న నిజాయితీకి ఇది యొక ఋజువు.

2. దానినుండి దూరముగా నుండుటకు కావలసిన శక్తిని పొందుటకు దేవునికి ఎడతెగక మొఱ్ఱపెట్టుము. నన్ను శోధనలోనికి తేక కీడు నుండి తప్పించుమని ప్రార్థించుము.

3. త్రాగవలెనని శోధన వచ్చినపుడు దానిని ఎదిరించుము. అది కేవలము కొంచెము మద్యమే కావచ్చు సహాయముకొరకు ప్రభువును వేడుకొనుట ద్వారా శోధనను జయించగలుగుదువు. (సామె 18:10) ప్రతి విజయము మరొక శోధనను జయించుటకు సహాయపడును (1కొరింథీ 10:13)

4. నీ ప్రతి ఓటమిని గూర్చి ప్రభువు వద్ద వెంటనే ఒప్పుకొనుము. (1యోహా 1:9) ఆత్మీయులతో నీ లోపములను చెప్పుకొనుట నీకు ప్రయోజనకరము. అవగాహన గలిగిన క్రైస్తవుడు ఒక ప్రార్థన భాగస్వామిగా నీకు సహాయము చేయగలడు.

5. పాత శోధనలోనికి తీసుకొనిపోవు స్థలములకు, వ్యక్తులకు దూరముగా వుండుము (రోమా 13:14)

6. సాధ్యమైతే మరొకనికి జవాబుదారిగా ఉండుము. అనుభవముగల విశ్వాసి నీ కష్టసమయములలో నీతో ప్రార్థించువాడు నీకు ఎల్లప్పుడు స్నేహితుడుగా ఉండేవాడు. (సామె 17:17)

నీవు నిజముగా దానిని గూర్చి తీవ్రముగా బయట పడవలెనని ఆలోచన

## అధ్యాయము - 27

# జూదము, గొప్ప దొంగతనము (మోసము)

"నీవు ఇంతకు ముందే ఒక లక్ష డాలర్లు గెలిచియుండవచ్చును. నీ అదృష్ట సంఖ్యలను జతపరచడమైనది. నీ చందాతో వాటిని తిరిగి పంపవలెను. గెలిచిన వారి జాబితాలో చేరండి"

ఇలాంటి నిరంతరమైన ఆహ్వానాలతో ఏదో ఒక రకమైన జూదములో పాల్గొనాలని పిలుపులు వస్తుంటాయి. సూపర్ మార్కెట్టుకు వెళ్ళినా అక్కడ కూడా బింగో కార్డులు ఇస్తున్నారు. సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అందులో వెయ్యిడాలర్లు లాభం పొందడానికి మనం వెనుకాడము.

ఇంటికి వస్తే ఇంట్లో కూడా రెండున్నర లక్షలు పనివానికి లాటరీవచ్చినట్లు పేపర్లో చదువుతాము. కొద్దిమొత్తంతో అంత డబ్బు రావడం ఆశ్చర్యమే. రెండున్నర లక్షలతో నేను చేయలేనిది ఏమిటా అని ఆలోచిస్తాము.

ఇంట్లో బెల్ మ్రోగుతుంది! ఒక చిన్న పిల్ల ఆమె స్కూలులో జరగబోయే చీట్లువేసే ఫంక్షన్‌కు టిక్కెట్టు కొనమని అడుగుతుంది. ముచ్చటగొలిపే చిన్నారి మాటలు కాదనట ానికి వీలుకాదు. మంచి కారణమే కదా అని మనం సమర్థించుకుంటాము.

**త్వరగా ధనవంతులగుటకు ఆశ :**

మన సమాజము త్వరగా ధనవంతులు కావడానికి, అదృష్టవంతులు కావడానికి ఏదో ఒక తరహా అదృష్టాన్ని సూచించే ఆటలు అనేకరకాలుగా, మన యొద్దకు తీసుకొని వస్తున్నది. అందుకే గుఱ్ఱపు పందెములు, కుక్కల పందెములు మనం చూస్తున్నాము. వీటికోసం టిక్కెట్లు కొనుటకు బహు వేగముగా పరుగెత్తుదురు. దేశలాటరీలు, రాష్ట్ర లాటరీలు, ఐరిష్ లాటరీలు ఎక్కువగుచున్నవి. ఈ తరహా ఆటలన్నియు సంఘములో తప్ప మిగిలిన అన్ని విభాగాలు ప్రోత్సహించుచున్నవి ఫుట్‌బాల్ ఆటలు, బేస్ బాల్ ఆట

లు, కుస్తీల పోటీలలో పందెములు కట్టుచున్నారు. బ్లాక్‌జాక్, అయిదు కార్డుల ష్టడ్ మొదలగు సంఖ్యల ఆటలలో పోటీ పడుచున్నారు. ఇంకా ఎక్కువ తెలివిగలవారు స్టాక్ మార్కెట్టులో ధనాన్ని వెచ్చిస్తున్నారు. అయితే కొన్ని స్టాక్ మార్కెట్లు జూదంలాంటివి కావు. అవి క్షేమకరమైన పెట్టుబడులుగా వుండవచ్చును. స్టాక్ మార్కెట్టు స్వభావమును బట్టియు, కొనువారి ఉద్దేశమును బట్టియు అది ఆధారపడును.

జూదము యొక్క ఆకర్షణ కొద్ది డబ్బుతో ఎక్కువ డబ్బు పొందగలుగుట యే. 1975లో బ్రెజిల్ దేశీయుడు మిరాన్ డి సౌజా అనువాడు 30 పెన్నీలతో పుట ్బాల్ పోటీలో పందెము కట్టి 24,51,549 పౌండ్లు గెలుచుకున్నాడు. ప్రపంచములో అప్పటివరకు జూదములో గెలిచిన గరిష్ఠ (పెద్ద) మొత్తం అదే.

మరుసటి సంవత్సరం 26 సం॥ వయస్సుగల న్యూజెర్సీవాడు స్టేట్ లాటరీలో 1776 డాలర్లు పొందాడు. ఈ డబ్బు వారమునకు తన మిగిలిన జీవితములో పొందునది. అతడు 76 సం॥ బ్రతికనట్లైతే 46 లక్షల డాలర్లు పొందగలడు. ఈ లాటరీల గెలుపులు ఆకాశాన్ని అంటుచుండగా పైకి పోయేకొద్దీ ఎక్కువ మంది ఆకర్షితులగుచున్నారు.

**లేఖనాలనుండి ఆలోచనలు:**

దీని అంతటిని గూర్చి బైబిలు ఏమి చెప్పచున్నది? క్రైస్తవుడు అనువాడు జూదమాడుట చట్టసమ్మతమైన కార్యమా? బైబిలు బహిరంగముగా జూదమాడకూడదు అని చెప్పలేదు. అయితే పది ఆజ్ఞలు చెప్పుచున్న దేమనగా నీవు "ఆశించకూడదు" (నిర్గమ 20:17) జూదమాడుట "ఆశించుటకు" ధనాపేక్షకు మరొక రూపము. ధనము కావలెనని అమితమైన ఆశకు అది సూచన. దేవుడిచ్చిన దానితో తృప్తిపొందకపోవుట, సాధ్యమైతే ఇతరులకు నష్టము కలిగించి నామట్టుకు నేను ధనవంతుడను కావలెనను ఆశ అందులో నున్నది. నా పరలోకపు తండ్రిమీద కాక అదృష్టముపైన అవకాశముపైన మనస్సు యొక్క చూపు నిలుపుటయగును.

కాబట్టి ఆశించుటకు ఉన్న నిషేధములన్నియు జూదమునకు వర్తించును. లూకా 12:15లో ఇలాగు చదువుచున్నాము. "మరియు ఆయన వారితో మీరు ఏ విధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను." విశ్వాసిజీవిత విధానము ధనాపేక్షకు దూరముగా నుండవలెను.

ఉన్నదానితో తృప్తి పడవలెను. (హెబ్రీ 13:5) ధనాపేక్ష విగ్రహారాధనయే. (కొలొస్స 3:5) ఏలయనగా ఈ ఆశ హృదయములోనుండి దేవునిని నెట్టివేయును. దేవుని స్థానములో ధనాపేక్ష కూర్చుండును. వ్యభిచారము, త్రాగుబోతుతనము, దొంగతనము మొదలగు పాపములతో సమానమైనది ధనాపేక్ష. ఈ పాపములు జరిగించువ్యక్తి స్థానిక సంఘమునుండి వెలివేయబడవచ్చు (1కొరింథీ 5:11) ఇది దేవుని రాజ్యములో ప్రవేశించకుండా చేయునటువంటి గొప్ప పాపము (1 కొరింథీ 6:10). సామె 13:11లో ఇలాగు వ్రాయబడినది

"మోసము చేత సంపాదించిన ధనము క్షీణించి పోవును.
కష్టము చేసి కూర్చుకొనువాడు తన ఆస్తిని వృద్ధిచేసుకొనును"

గౌరవప్రదమైన పని అభివృద్ధికి కారణమగును. అయితే జూదము అలాంటిది కాదు. జూదములో ప్రవేశించువాడు దోచుకొనువాడే యగును.

బైబిలు చెప్పునదేమనగా,

"చెడు దృష్టిగలవాడు ఆస్తి సంపాదింప ఆతురపడును.
తనకు దరిద్రత వచ్చునని వానికి తెలియదు." (సామె 28:22)

జూదము యొక్క ఉద్దేశ్యము ధనాపేక్షయే. ధనాపేక్ష అపవిత్రమైనది. పాపముతో కూడినది. అది దేవుని శాపమును పొందును. ఈ విషయములో దేవుని శాపము దారిద్ర్యత.

బైబిలు చెప్పునదేమనగా "న్యాయ విరోధముగా ఆస్తి సంపాదించుకొనువాడు తాను పెట్టని గుడ్లను పొదుగు కౌజుపిట్టవలె నున్నాడు, సగము ప్రాయములోవాడు దానిని విడువవలసి వచ్చును, అట్టివాడు కడపట వాటిని విడుచుచు అవివేకిగా కనబడును" (యిర్మీయా 17:11) జూదము ద్వారా సంపాదించు ఆస్తి శాశ్వతమైన సంతృప్తినివ్వలేదు. పైగా గొప్పప్రమాదమును తెచ్చిపెట్టును.

విశ్వాసి అన్న వస్త్రములతో తృప్తి పడియుండవలెనని తిమోతికి జ్ఞాపకము చేసిన తర్వాత పౌలు ఇలాగు హెచ్చరించెను. ధనవంతులగుటకు ఆపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు.

అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును." (1తిమో 6:9)

జూదము ఎల్లప్పుడును కీడునకు సంబంధించినదే. రోమా సైనికులు రక్షకుని సిలువవేసినతరువాత అంగికొరకు చీట్లువేసికొని పంచుకొనిరని విశ్వాసులు జ్ఞాపకముంచుకొనవలెను. (యోహా 19:23,24)

**వ్యాపారము :**

ఒకనికి జూదములో జాక్‌ఫాట్ వచ్చినపుడు "గొప్ప అదృష్టమని" గొప్పగా ప్రచురము చేయుదురు. అయితే జూదమువలన కలుగు నష్టములను తేలికగా ఎంచుదురు. 1974లో ఇటలీ వ్యాపారి 19,20,000 నష్టపోయినట్లు అరుదుగా వినెదము అదే సంవత్సరములో అరబ్ యువరాజు ఒక మిలియన్ డాలర్లు ఒక్క పందెంలోనే లాస్ వేగాస్‌లో నష్టపోయినాడు. ప్రతి సంవత్సరము సగటు పౌరులు వారు శ్రమించి సంపాదించిన జీతములోనుండి కోట్లు నష్టపోవుచున్నారు. లెక్కల ప్రకారము వారు అందులో గెలుచుట సాధ్యపడదు. ప్రపంచములోని అతిపెద్ద స్లాట్ యంత్రంలో అత్యధికముగా 10పౌండ్లకు ఒక మిలియన్ పౌండ్లు గెలవ వచ్చును. అయితే ఆ గెలిచే అవకాశం 25 బిలియన్ దఫాలలో ఒక్కసారే వచ్చును. జూదము సులభముగా వ్యసనముగా మారిపోవును. జూదమాడు వారు గంట గంటకు డబ్బు పొందుదుమని ఆశగలిగియుందురు. వారు ఒకలాంటి మాయలో పడుదురు. దీర్ఘ కాలము అలాగు చేసినపుడు ధనాన్ని పొందే అవకాశము కలుగునని లేక కనీసము నష్టాన్ని, పూడ్చుకొందుమని ఆశించుదురు. అప్పుడప్పుడు కొద్దిపాటి లాభము పొంది మిగిలిన నష్టాన్ని, పూడ్చుకొనవచ్చునని ఆశించుదురు. ఏ విశ్వాసియూ జూదమునకు లోనుకాకూడదు. కొన్ని కార్యములు చట్టపరమైననూ మనం వాటికి బానిసలము కాకూడదు. జూదము చట్టసమ్మతముకాదు (1కొరింధి 6:12బి). దేని చేతను లోపరచబడకూడదని అపొస్తలుడైన పౌలు హెచ్చరించుచున్నాడు.

జూదమునకు బానిసలైనవారి దుఃఖమును, కుటుంబాలకు కలిగిన నష్టమును అంచనా వేయుట కష్టము. వారికుటుంబాలను బాగుచేయుట సాధ్యముకాదు. ఆహారకొరత, తీర్చలేని అప్పులు, వచ్చే ఆదాయమును వృధాచేయుట, ఒక రాత్రిలోనే పేదరికమును పోగొట్టుకొని ఆస్తికర్తలమగుటకు వారి వ్యర్ధ ప్రయత్నాలను వివరించుటకు వీలుకాదు.

నష్టాన్ని పూడ్చుకొనుటకు అనేకమైన నేరములను చేయుదురు, దొంగతనము, దోపిడీ, బెదిరింపులు మొదలగు తప్పులుచేసి మరి ఎక్కువగా చెడిపోవుదురు. సమాజములో ఆర్థికపరమైన గౌరవమర్యాదలను పొందుటకు నానా రీతులుగా ప్రయత్నించుదురు. జూదమునకు, చెడ్డ సంస్థలకు సంబంధమున్నది. సిండికేట్ మాఫియా అనునవి జూదమునకు ప్రసిద్ధి చెందినవి. నరకవాసన కలిగించువాటితో క్రైస్తవుడు పాల్గొనుట సమర్థనీయమా?

కొన్నిసార్లు ఈ శోధన మతపు ముసుగులోను కనబడును. ప్రభువు పనిలో ఆ డబ్బుతో నీవుఎంత చేయగలవో ఆలోచించు అనే వారున్నారు. మేలు జరుగుటకు చెడ్డపని చేయుట మంచిదే కదా అను సూత్రమును పాటించువారు కలరు. "ఒక భక్తిగల స్త్రీ సంతోషముతో ఒక బోధకుని పిలిచి రొట్టెను అతని చేత ముక్కలు చేయించినది. తాను కొనిన దేశీయలాటరీ టిక్కెట్టునకు లాటరీ ఆమెకు రావలెనని ప్రార్థించమని కోరెను. అతడు ప్రార్థించితే, ఆమెకు లాటరీ వస్తే సగం డబ్బు చర్చికి ఇచ్చెదనని వాగ్దానము చేసినది. ఆయన ఇలాగు జవాబిచ్చెను. సాధారణ మతవిషయములో ప్రత్యేకముగా క్రైస్తవ విశ్వాస విషయములోను నీకు క్రొత్త తలంపు రావాలని ప్రార్థించెదను అనెను." దేవుని పనికి జూదము ద్వారా వచ్చిన డబ్బు అక్కర లేదు. అది అపవిత్రమైన డబ్బు గనుక దేవుడు దానిని దీవించలేడు.

జూదమాడవలెనని శోధింపబడువారికి పౌలు చెప్పిన మాటలు ఇలాగున్నవి "సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభదాయకము" (1తిమో 6:6). నీవు దైవభక్తి కలిగి సంతృప్తి కలిగియున్నప్పుడు డబ్బు కొనలేని దానిని నీవు కలిగి యున్నావు. నీవు భక్తి కలిగియుంటే నీవు జూదమాడవలెనని కోరవు. సంతృప్తికలిగియుంటే కోరవలసిన అవసరము ఉండదు, కోరికా వుండదు.

జూదమునకు, జూదమాడుటకు శోధింపబడువారికి సామ్యేల్ జాన్సన్ మాటలు ఆలోచింపదగినవి. "బంగారుపై ఆశ కలిగి, విచారముకాని పశ్చాత్తాపముగాని లేకుండ

## అధ్యాయము - 28

# కుటుంబ నియంత్రణ అనుకూల-ప్రతికూల వాదనలు

కుటుంబ నియంత్రణకు క్రైస్తవ పరిశుద్ధతకు సంబంధమున్నదా? అది నైతిక సూత్రములకు సంబంధించినదని అనేకమంది విశ్వాసులు తలంచుటను బట్టి ఈ అధ్యాయము పుస్తకములో చేర్చడమైనది. ఇరుపక్షాల వాదోపవాదములున్నవి. కొందరు కుటుంబ నియంత్రణ దేవుని చిత్తమునకు విరోధమని నమ్ముచున్నారు. మరికొందరైతే అంత ఖచ్చితముగా చెప్పుట వీలుకాదు గాని ప్రతివిశ్వాసి తన మనస్సాక్షిని బట్టి కొనసాగవచ్చును అని చెప్పుచున్నారు. (రోమా 14:5)

**ప్రతికూలవాదన:**

ఈ విషయముపై అనుకూలురు, ప్రతికూలురు అనేక వాదములను చెప్పిరి, మొదటిగా కుటుంబ నియంత్రణకు వ్యతిరేక వాదనను పరిశీలన చేయుదము.

1. ఆది 1:28లో "దేవుడు మీరు ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి." అని చెప్పెను. ఈ ఆజ్ఞ కొట్టివేయబడలేదు. దీనికి జవాబుగా ప్రతికూలురు చెప్పునది ఏమనగా ఈ ఆజ్ఞ సృష్టి ఆరంభములో ఇవ్వబడినది. జలప్రళయము తరువాతను ఇవ్వబడినది. అయితే జనసంఖ్య అభివృద్ధి ఇప్పుడు అవసరములేదు.

2. పెద్దకుటుంబములు యెహోవా ఆశీర్వాదమునకు సూచనలుగా నున్నవి. "కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన ఇచ్చుబహుమానమే యౌవనకాలమందు పుట్టిన కుమారులు బలవంతుని చేతిలోని బాణములవంటివారు. వారితో తన అంబుల పొది నింపుకొనినవాడు ధన్యుడు.

అట్టివారు సిగ్గుపడక గుమ్మములో తమ విరోధులతో వాదించుదురు." (కీర్తన 127: 3-5) "నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లివలెనుండును, నీ భోజనపు బల్లచుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కలవలెనుందురు. యెహోవాయందు భయభక్తులు గలవాడు ఈలాగు ఆశీర్వదింపబడును" (కీర్తన 128:3,4)

3. పెద్దకుటుంబములో పిల్లల వ్యక్తిత్వములు అన్నికోణములలో అభివృద్ధియగును. దుడుకు తనము తీసివేయబడును, తోటివారిని గూర్చిన ఆలోచన నేర్చుకొందురు. చెడిపోవుటకు అవకాశము ఉండదు.

4. కుటుంబ నియంత్రణ పాటించిన ఓనాను అను వానిని గూర్చి లేఖనములో ఒక ఉదాహరణకలదు. వాడు దేవుని చేత శిక్షింపబడెను. (ఆది 38:1-11). అయితే అది నిజముకాదు. ఓనాను పాపమేమనగా స్వప్రయోజనముకొరకు తన సహోదరుని భార్యను వివాహముచేసికొనుటకు అతను ఇష్టపడలేదు. ఆ దినములలో బంధువు ధర్మము అతడు పాటించలేదు. అది అతని పాపము.

5. పౌలు కొరింథీయులకు ఇలాగు వ్రాసెను. "ప్రార్థన చేయుటకు మీకు సావకాశము కలుగునట్లు కొంతకాలము వరకు ఉభయుల సమ్మతి చొప్పుననే తప్ప, ఒకరినొకరు ఎడబాయకుడి, మీరు మనస్సు నిలుపలేకపోయినప్పుడు సాతాను మిమ్మును శోధింపకుండునట్లు తిరిగి కలుసుకొనుడి." (1కొరింథీ 7:5). అయితే ఇది వివాహచట్టమునకు సంబంధించిన అంశము. గర్భనిరోధక పరికరములు ఉన్నవో లేవో చెప్పబడలేదు.

6. స్త్రీ పిల్లలను కనుట ద్వారా ఆమె ముఖ్య ధర్మము నెరవేర్చును. ఈ రీతిగా సంఘములో ఆమె స్థితిని కాపాడుకొనును (1తిమో 2:15) దైవసంతానమును వర్ధిల్లజేయుట ముఖ్యము. స్త్రీ పిల్లలను కని వారిని దేవుని మహిమకోసం పెంచుట దేవుని కోరిక (1తిమో 3:15, 5:14, తీతు 2:4) ఇక్కడ ఒక ప్రశ్న వచ్చుచున్నది. ఎన్నడునూ పెండ్లిచేసికొనక పిల్లలను కనని స్త్రీల సంగతి ఏమి?

7. గర్భము తెరుచువాడును, మూసివేయువాడును దేవుడే (ఆది 20:18, 29:31, 1 సమూ 1:6) ఈ అధికారమును దేవుడు మానవులకు బదిలీ చేయలేదు. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సలహా లేఖనములలో వెదకిననూ దొరకదు. కుటుంబ నియంత్రణకు అనుకూలమైన వాదన ఒకటైనను లేఖనములలో

లేదు.

**అనుకూల వాదనలు:**

ఇప్పుడు కుటుంబనియంత్రణకు అనుకూల వాదనను గమనించుదము.

1. ఈ విషయములో బైబిలు ఖచ్చితమైన శాసనము ఇవ్వలేదు. వివాహమైన జతకు వారి జీవితాలకు సంబంధించిన ఖచ్చితమైన దేవుని చిత్తముకొరకు ఎదురుచూచే స్వాతంత్ర్యము వీరికి కలదు.

2. జనసంఖ్య అధికమగుటవలన కొంతమట్టుకు నియంత్రణ అవసరమే అనిపించును. అనేక మంది ప్రజలు ఆహారములేక, మరికొందరు పోషకాహారములేక ప్రతి దినము చనిపోవుచున్నారు. ఈ పద్దతిని అదుపుచేయకపోతే ప్రపంచ వ్యాప్తముగా విపత్తు కలుగును.

   ఇక్కడ సమస్య ఆహార సరఫరాకాదుగాని దురాశవలన పంపిణీ విధానము దారి తప్పుచున్నది. కొన్ని మతములు మాంసాహారమును ఇతర పోషక పద్ధతులను నిషేధించుచున్నవి. అది కూడా కారణమే.

3. తల్లిదండ్రుల ఆర్థిక స్తోమతను బట్టి కుటుంబములో పిల్లల సంఖ్యను నియంత్రించుకొందురు. అనేక మందిని కని వారి విషయము సరిగా శ్రద్ధచూపక లోకములోనికి వదిలివేయుట క్రీస్తునకు మహిమకాదు. అయితే ఈ వాదనకు జవాబు ఏమనగా పెద్దకుటుంబమునకు, చిన్నకుటుంబమునకు దేవుడు వనరులను సమకూర్చగలడు (మత్త 6:33, ఫిలిప్పి 4:19)

4. గ్రామీణ ప్రాంతములో పెద్దకుటుంబము కోరతగినదే. వారు పొలములో పనిచేయుటకు సహాయపడుదురు. నగర నివాసులకు చిన్న గృహాలను ఇరుకైన అపార్టుమెంటులోను నివసించుదురు వారికి పెద్ద కుటుంబాలు వీలుకాదు.

5. వివాహము యొక్క ఉద్దేశ్యము సంతానోత్పత్తి ఒకటి మాత్రమే కాదు తన ప్రజలు సహవాసమందు సుఖము సంతోషము పొందవలెనని, ఏకత్వము కలిగి ఉండవలెనని దేవుడు కోరుచున్నాడు.

6. తల్లి ఆరోగ్యమునకు ప్రమాదమైనప్పుడు కుటుంబ నియంత్రణ సక్రమమే. ఆ విషయములో కుటుంబ నియంత్రణ అంగీకరించిన యెడల ఇతర విషయములలో ఎందుకు అంగీకరించకూడదు?

7. పాపముతోను, హింసతోను, దారిద్ర్యముతోను నిండిన లోకములోనికి పిల్లలను కనుట కోరతగినదికాదు అని కొందరనుచున్నారు. దీనికి లేఖనములలో జవాబున్నది. “ఆయన నీతి (కృప) వారికి పిల్ల పిల్ల తరమున నిలుచును.” (కీర్తన 103:18)

8. ఈ వాదన నేర్చుకొనుటకే ఉద్దేశింపబడినది. ప్రతివ్యక్తి కుటుంబ నియంత్రణను ఏదో ఒకరకముగా పాటించుచున్నట్లే కనబడుచున్నది. ఇప్పుడు ఏ కుటుంబములోనైనా 17,18,19 సంఖ్య ఉండుటలేదు. దీనికి జవాబుగా ప్రతివాడు చేయుచున్నాడు గనుక అది సరియైనదేనని ఒప్పుకొనుటకు వీలుకాదు. అనేకులు ఆచరించుట వలన తప్పుఒప్పుకానేరదు.

7. చివరి వాదన కుటుంబ నియంత్రణకు బైబిలు బహిరంగముగా చెప్పక పోయిననూ ఆశానిగ్రహమును గూర్చి చెప్పుచున్నది. అది ఆత్మఫలములలో ఒక భాగము (గల 5:23)

ఈరీతిగా అనుకూల, ప్రతికూలవాదనలను పరిశీలించితిమి. చివరిజవాబు ఏమిటి? అదేమనగా వివాహమైనటువంటి జంట ఈ వాదనలను ప్రభువు సన్నిధిలో పెట్టి వారేమార్గమున పోవలెనో తెలియజేయుమని ప్రార్థించవలెను.

ఈ అంశముపై ఇరుపక్షాలవారు మంచివారును, ఆత్మీయక్రైస్తవులని ఒప్పుకొనుచున్నాము. ఇది నిజమైనప్పుడు మొండితనము తగదు. మన అభిప్రాయాల ద్వారా ఇతరులను బలవంతము చేయరాదు. ఇరు పక్షాలవారు ఆత్మీయులే గనుక వ్యతిరేకులైనను మనము వారిని ఒప్పుకొనవలెను. ప్రభువు దృష్టిలో మంచిదని తలంచి వారు ఆ పని చేయుచున్నారు.

# అధ్యాయము - 29

# రాజకీయములు

క్రైస్తవుడు రాజకీయములలో పాల్గొనవచ్చునా? ఈ ప్రశ్నకు ఔనని చెప్పువారు ఒక సూత్రమును చెప్పుదురు. మంచి వారు ఏమీ చేయనందువలననే చెడ్డవారు ప్రబలుచున్నారు. ఈ వాదనను బలపరచువారు యేసేపు, మోషే, దానియేలు అనువారిని ఉదాహరించి విశ్వాసులు కూడా రాజకీయములలో జోక్యము చేసికొనవచ్చునని చెప్పుచున్నారు.

ఈ సూత్రము బాగుగానే కనిపించినను, అది మానవజ్ఞానమేగాని దైవ ప్రత్యక్షత కాదు. లేఖనమునకు ఉన్న అధికారము మనము దానికి ఇవ్వలేము. యోసేపు గాని దానియేలు గాని పదవులకోసము పరుగెత్తలేదు అయితే ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసిరి. మోషే ప్రభుత్వమునకు జోరీగలాగ ఉండెను గాని అతడు ప్రభుత్వములో ఒక భాగముగా పనిచేయలేదు.

**బైబిలు జవాబు:**

జవాబు కొరకు బైబిలును వెదికితే మనకు దొరుకునదేమి?

ప్రభువైన యేసు రాజకీయరంగములో ప్రవేశింపలేదు. ఏదైనను ఉంటే ఆ విధానమునకు భిన్నముగా ఉండెను.

శిష్యులుగూడ రాజకీయముగా జోక్యము చేసికొనలేదు. సువార్తపనిలో ఉండుటవలన దేవుని శ్రేష్టమైన అవకాశమును వారు పోగొట్టుకొనిరా? అపొస్తులుడైన పౌలు కూడ రాజకీయములకు దూరముగా ఉండెను. తన పిలుపునకు నమ్మకముగా నుండి పరిసయ్యుల విధానమునకు వ్యతిరేకముగా నిలచెను. ఆయన రాజ్యము ఈలోకసంబంధమైనది కాదని యేసుబోధించెను (యోహా 18:36). అవిశ్వాసులైన తన సహోదరులతో – "లోకము మిమ్మును ద్వేషింపనేరదు గాని దాని క్రియలు చెడ్డవని నేను

దానిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను గనుక అది నన్ను ద్వేషించుచున్నది”

లోకమంతయు దుష్టునియందున్నదని అపొస్తులుడైన యోహాను గుర్తుచేసెను. రాజకీయములు లోకవిధానములో ఒక భాగము.

మనము లోకమునుండి వేరైనప్పుడే దానిపై మన ప్రభావము పడును. (2 కొరింథీ 6:17). ప్రపంచమునకు వెలుపట ఆలంబము (fulcrum) ఉండినట్లైతే, ప్రపంచమును కదిలించగలనని ఆర్కెమెడీస్ చెప్పెను. దేవుని పక్షముగా మనముండి, లోకమునకు వెలుపట నున్నప్పుడు దానిని దేవుని కొరకు కదిలించగలము.

సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు యీ జీవనవ్యాపారములో చిక్కుకొనడని పౌలు నొక్కి చెప్పెను (2తిమో 2:4). విశ్వాసులు అందరు చురుకైన పని కలిగి ఉన్నారు లేక ఉండవలెను. వారు తొలిగిపోకుండుటకు జాగ్రత్తకలిగి యుండవలెను.

రాజకీయము అవినీతితో కూడినది. అదొక రాజీపద్ధతి. ఏది ఒప్పుయనుదానికంటే ప్రజల ప్రయోజనములను బట్టి తీర్మానములు జరుగును. మానవసూత్రములేగాని దైవసూత్రములతో పని లేదు. దివంగత వాండెన్‌బర్గ్ అను మిచిగన్ సెనేటర్ ఈలాగు చెప్పెను. “రాజకీయము దాని స్వభావమును బట్టి అవినీతిమయము. మానవ కార్యక్రమములలో పాల్గొని సంఘము తన నిజమైన పనిని మరచిపోరాదు. ఆ పోటి సంఘమునకు తగదు. అందుపాల్గొనుట ద్వారా దాని ఉద్ధేశ్య పవిత్రతను కోల్పోవును”

**అరటి పండు పథకము:**

ప్రపంచ సమస్యలకు దేవుని పరిష్కారము రాజకీయములు కాదు గాని ఆత్మీయత. క్రొత్తగా ఎన్నికైన అధికారులు కాదు, నూతన జన్మ ఆయన జవాబు. క్యాన్సర్ పుండునకు పైకట్టు లాంటిది రాజకీయములు. మన ప్రయాణపు ఆజ్ఞలు యేమనగా “మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్ము, నీవు వెళ్ళి దేవుని రాజ్యమును ప్రకటించుము” (లూకా 9:60) అరటి తొక్కల కథ మనకు అవగాహన కలిగించును.

ముద్రణావ్యాపారములో ఒకనికి ముఖ్యమైన పని ఇవ్వబడినది. సాహిత్యములో అనేక వ్యాసభాగములను ముద్రించి, పంపిణీ చేయుటకు అతడు బాధ్యుడు. ఒక దినము తనపని మీద వెళ్ళుచు దారిలో ఒకమూలన అరటితొక్క పడియుండుటచూచాడు.

దానివలన ప్రమాదమున్నందున అతడు దానిని తీసి మురికికాలువలో పడవేసెను. ఎవరును జారిపడిపోకూడదని అతని వుద్దేశము. ఒకవేళ జారిపడిపోతే ఎముకలు విరిగి ఆసుపత్రిపాలు కావలసి వచ్చును. ఆ పట్టణములో అనేక బజారులున్నవి. ప్రతిచోట అరటి తొక్కలు పడియుండును. అయితే ఒక క్షణము ఆగుము. అతనికి తన సొంత బాధ్యతవున్నది. ప్రచురణలో అతడు ముఖ్యమైనవాడు. ముద్రణాయంత్రములు పనిచేయుచుండవలెను. ప్రపంచ నలుమూలలకు సందేశములు పంపవలెను. అతడు అయిష్టముగా తన అరటితొక్కపథకమును ప్రక్కన పెట్టి అతని పనిని అతడుచేయుటకు తీర్మానము చేసెను అరటితొక్కలను ఏరివేసే వారున్నారు. అది ఊడ్చువారిపని.

ఇప్పుడు దీనిని మనము అన్వయించుకొందుము. లోకములో క్రైస్తవునికి గొప్ప బాధ్యత ఉన్నది. అనగా ప్రభువైన యేసు క్రీస్తు యొక్క శుభవార్త ప్రకటించుట క్రైస్తవునికి ఇదొక గొప్ప వ్యాపారము. ఆ పని అతడు చేయకపోతే అది ఎన్నటికిని చేయబడదు. అందుకే ప్రభువు చెప్పెను “మొదట ఆయన రాజ్యమును ఆయన నీతిని వెదకవలెను” అనేకులు రాజకీయములో జోక్యము చేసికొనుచున్నారు. నశించుచున్న పురుషులకు స్త్రీలకు సువార్త అందించే పనిని దేవుడు మనకు అప్పగించెను. ఇతర పథకములు తగినవే కావచ్చును. అయితే  ఈ విషయములో మనము తప్పిపోతే, మనస్థానము ఎవ్వరు తీసికొనరు.

ఈ యుగములో ప్రపంచమును ఇంకను మంచిదిగా చేయుటదేవుని సంకల్పము కాదు. అన్యజనులలో నుండి దేవుడు తన నామముకొరకు ఒక జనమును ఏర్పరచుకొనుటయేయని గ్రహించవలెను (అపొ 15:14). జొవెట్ బాగుగా చెప్పెను. “ప్రపంచ విమోచనములో మనము దేవునితో భాగస్వాములము. రాజరికజీవితము జీవించుటకై ప్రభువు నామమున మనుష్యులను అభిషేకించుట, స్వార్థముపై సర్వాధికారము, లోకములో ఆయన సేవచేయుటకు సిద్ధముచేయుటయే మన కర్తవ్యము.” ఉన్నత పిలుపును గ్రహించలేక ఓడిపోయిన అనేకమంది క్రైస్తవులకొరకు ఆయన దుఃఖపడుచున్నాడు. వారు ఎగిరిపోవుటకు బదులుగా తక్కువవాటిని హత్తుకొని, ప్రాకుచు, రాజులవలె కాక బానిసలవలె ఉన్నారు.

క్రైస్తవుని ప్రాథమిక పౌరత్వము పరలోకములోనున్నది. అతడు ఈలోకములో

యాత్రికుడు, ప్రయాణికుడుగా నున్నాడు (1పేతు 2:11) ప్రభుత్వమునకు లోబడు బాధ్యత కలిగియుండి న్యాయమార్గమును వినియోగించుకొనగల అవకాశమున్నను ఈలోక విధానములో ఒక భాగముగా నుండవలసిన విధిలేదు..

నేను రాజకీయములలో పాల్గొనినయెడల నేను రాజకీయాలకు ఈ లోకము యొక్క సమస్యలన్నింటిని పరిష్కరించు సాధ్యమున్నదని ఒప్పుకొన్నవాడను అవుతాను. ఇన్ని శతాబ్దములుగా రాజకీయములు ఓడిపోవుటను బట్టి సమస్య పరిష్కారము కొరకు రాజకీయములను కోరుకొనుట వ్యర్థమేయగును.

పరిస్థితులు అభివృద్ధి చెందుటలేదని క్రొత్తనిబంధన లేఖనములు చెప్పుచున్నవి (1తిమో 4:1-3, 2 తిమో 3:1-5) దీనిని బట్టి ప్రభువు అప్పగించిన గొప్ప పనిని నెరవేర్చుట క్రైస్తవుని బాధ్యత మరియు అత్యవసరము.

విశ్వాసులు ఏమి చేయకుండ మౌనముగా ఉండవలెనా? కాదు ఓటుకంటె ప్రార్థన ద్వారా యెక్కువపని చేయగలము. ప్రార్థన ద్వారా అధికారమును సమతుల్యము చేయుదుము. దేశముల గమ్యములు ప్రార్థన ద్వారా మార్చివేయగలం. "మా ఆయుధములు శరీర సంబంధమైనవికావు. దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము కలవై యున్నవి (2 కొరింథీ 10:4)

క్రైస్తవులు పరిపాలించుటకు సమయము రాలేదు. (1కొరింథీ 4:8) పరిపాలించుటకు మనజీవితకాలము ఒక తర్ఫీదు వంటిది. విలియమ్ కెల్లి ఈలాగు చెప్పెను.

పరిపాలించబడుచున్న లోకములో దేవునికి అవమానము వారికి సిగ్గు కలిగినప్పుడు తప్ప క్రైస్తవులు ఎన్నడు పోరాడ లేదు. జోక్యము చేసికొనలేదు. వారిప్పుడు క్రీస్తుతో కూడా శ్రమపడుటకు వారు పిలువబడిరి. కాబట్టి ఆయనతో వారు పరిపాలింతురు. పరిపాలించుటకు ఆయన ఇంకను అధికారముతీసికొనలేదు. ఆయన తండ్రి సింహాసనముపై ఆసీనుడవుతాడు. లోకముచేత తృణీకరింపబడిన క్రీస్తు న్యాయవిమర్శ చేయుటకు ఆయన తన సొంత సింహాసనముపై కూర్చుండుటకు తండ్రి సెలవు కొరకు వేచియున్నాడు (ప్రక 3:21)

నేను ఇది వ్రాస్తూవుండగానే ఒక వార్త అందినది. అది కెల్లిగారి మాటకు సరిపోవుచున్నది.

వ్యాన్ డైక్ అనునతడు తిరిగి జన్మించిన క్రైస్తవుడే గాని సమస్యలకు కారకుడు. అతని రాజకీయ జీవితము మోసముతో నిండియున్నది. 1984లో అతడు తప్పుడు సమాచారము చెప్పినందుకు శాసన సభనుండి బహిష్కరింపబడెను. పబ్లిక్ డిస్‌క్లోజరు కమిషను అతనికి 500 డాలర్లుగా జరిమాన విధించిరి. అతడు క్షమాపణ కోరవలసి వచ్చినది. కెల్లీ మాటలు ఆలోచింపదగినవి "పరిపాలించబడుచున్నలోకముతో దేవునికి అవమానము, వారికి సిగ్గు కలిగినప్పుడు తప్ప క్రైస్తవులు పోరాడ లేదు, జోక్యము చేసికొన లేదు.

## అధ్యాయము - 30

# అంతా తానే, అంతరంగ ద్రోహి

పరిశుద్ధతను వెంటాడుటలో స్వార్ధముకంటె యెక్కువ బలహీనపరచు సంగతులు కొన్ని గలవు. విజయము కొరకు లోపల చూచుట కానిచోట చూచినట్లే. ఆలాగు చూచినవారు నిరుత్సాహమునకు, అధైర్యమునకు, ఓటమికి గురియగుచున్నారు.

మానవునిగూర్చి, వాని సామర్థ్యమును గూర్చి లోకము నొక్కి చెప్పుచున్నది. గుర్తింపు కొరకు, పేరు కొరకు, ఆమోదము కొరకు, దుఃఖకరమైన ఆశకలిగియున్నారు. సంఘములో అంతే. సంఘము లౌకిక మానవత్వమును, సౌవార్తికభాషను ప్రయోగించి, బోధించుచున్నది. స్వార్ధము పెంచు క్రొత్త పుస్తకములను మత సంబంధమైన ముద్రణ లు ముద్రించువారు (Publishers) మార్కెట్టులోనికి తెచ్చుచున్నారు. క్రైస్తవ పుస్తకశాలకు ఒక్కసారి వెళ్లగా ఈ దిగువ నివ్వబడిన పుస్తకములను చూచితిని.

నిన్ను నీవు ప్రేమించుకో

నిన్ను నీవు ప్రేమించుకొనే కళలను నేర్చుకో

సొంతమును ప్రేమించు, విజయమునకు శక్తి

నేను బాగే, నీవు కూడ బాగే

నేను బాగున్నాని ఎవరు చెప్పుచున్నారు?

నిన్ను గూర్చిన నిజమైన పరిశీలన

నీ నీడతో స్నేహితులను సంపాదించుకో

నిన్ను నీవు అర్థము చేసికొనే కళ

నీ గతమును అర్థము చేసికో, భవిష్యత్తుకది తాళపు చెవి.

నా అందమైన భావన

నిన్ను గూర్చి నీవు మంచివాడవనుకో

నీకు తక్కువ వత్తిడిగల 30 దినములు

నీవు ఒక ప్రత్యేకమైన వాడవు.

నన్ను నేను కలిగియుండవచ్చునా? (నీతోనే జీవించుట మరియు దాని కిష్టపడుట) అరలలో ఒకే ఒక్క చిన్న అసమ్మతి స్వరము వినబడినది. దానిపేరు :

నిన్ను నీవు ఒంటరిగా వదలివేసికొనుము.

ఆధునిక సలహా విధానములలో నీలో నున్నదానిని వెదకుము అని చెప్పుదురు. రోగి ఏలా పెంచబడెనో పరీక్షించుకోవాలందురు. (తల్లిదండ్రుల తప్పిదములు) అతని ఆలోచనలు, ఉద్దేశములు, భయములు వేటిపై ఆధారపడునో, అతను (ముఖ్యముగా లైంగిక విషయములలో) అణచిపెట్టుకొన్నవాటిపై ఆరా తీయుదురు. అతడు తన సమస్యలనుగూర్చి మాట్లాడుచుండగా, జవాబు దొరుకునని చెప్పుదురు.

**ప్రపంచము పిచ్చి వారికి ఒక ఆశ్రయము:**

నార్వే దేశీయుడు ఇబ్సెన్ అనువాడు నటుడు. అతడు ఒక కథ చెప్పెను. పీటర్‌గింట్ అనువాడు మానసిక ఆసుపత్రికి వెళ్ళెను. అతనికి ఆశ్చర్యము కలిగించినదేమనగా అందులోని ఏ ఒక్కరూ పిచ్చివానిగా కనిపించలేదు. వారందరూ అర్ధవంతముగానే మాటలాడిరి. వారి పథకములను గూర్చి మాటలాడిరి. అవన్నియు సక్రమముగనే కనబడుచున్నవి. వీరందరూ ఆరోగ్యవంతులేనని అతడు తలంచెను. అతడు వెళ్ళి డాక్టరుతో మాటలాడగా వారందరూ పిచ్చివారేనని ఆ వైద్యుడు చెప్పెను “వారు తెలివిగనే మాటలాడెదరని నేను ఒప్పుకొంటాను. అయితే ఇదంతా వారిని గూర్చి మాత్రమే చెప్పుకొనెదరు. నిజానికి వారు తమలోనే, తమను గూర్చే తలంపుకలిగివుందురు. అది స్వార్థము. ఉదయము, మధ్యాహ్నము, రాత్రి స్వార్థము అనేది లేకుండా ముందుకు పోవడానికి వీలుకాదు. మనం దానితో నడుస్తాము. మన కలలో కూడా అదే. ఓ యౌవనస్థుడా, నీవు తెలివిగనే మాటలాడుచున్నావు. అయితే మనకు కావలసినంత పిచ్చివుంది.” లోకము పీటర్ గింట్ చూసిన వైద్యశాలను పోలియున్నది. అదంతయు వారిగురించేయని మనం గ్రహించేంతవరకు అది మంచిగానే కనబడును. అది దాని ఆలోచనలను దాని రాజకీయములను, దాని పోరాటములను, దాని ఆర్థిక అంచనాలను, దాని డబ్బును గూర్చి మాత్రమే మాటలాడును. దాని ఉనికిలో దేవుని ప్రస్తావనే వుండదు.

ఆ జబ్బుగల ప్రజల లక్షణమదే. వారు మానసికముగాను, నరముల వ్యవస్థలోనూ, ఉద్రేకములోనూ క్రమము తప్పియుందురు. వారికి స్వార్ధమే కేంద్రము. వారి జీవితాల పరిధికూడా స్వార్ధమే. సలహా సంస్థలు వారి ఆంతర్యజీవితాన్ని, పరిశీలించుకోవాలని ప్రోత్సహించుదురు. అయితే అంతరంగ పరిశోధన ఎక్కువ దుస్థితిలోనికి నెట్టును. మీరు ఈ సామెతను వినియుందురు. "నాడీమండల రోగులు గాలిలో మేడలు కట్టుదురు, మానసికరోగులు అందులో నివసింతురు. మానసిక వైద్యులు అద్దె వసూలు చేసికొందురు."

**కీర్తన 77లో వ్యసనపరుడు:**

స్వార్ధమును, దాని చికిత్సను గూర్చి వివరించు రెండు భాగములు బైబిలులో వున్నవి. మొదటిది కీర్తన 77. బులింగర్ దానిని ఈ విధంగా విభజించెను.

అంతా తానే 1-6
దాని ఫలితము వ్యసనము 7-9
అంతా దేవుడే 10-12
దాని ఫలితము సంతోషము 13-20

మరొకరు వీటికి అనగా ఈ నాలుగు భాగములకు నాలుగుపేర్లు పెట్టిరి.

నిట్టూర్పు
మునిగిపోవుట
గానము చేయుట
ఆకాశములోనికి దూసుకొని పోవుట

ఈ కీర్తన మొదటి భాగములో ఆసాపు తన బాధను తెలియజేసెను. నేను అనే తలంపు విటమిన్ "నేను' (విటమిన్ - 'ఐ',) అతనికి అధికముగా వుండెను. ఇందులో నేను, నన్ను, నాకు అనే పదములు 22 సార్లు వచ్చెను అయితే దేవుడు అనుపదము 13 పర్యాయములు మాత్రమే వచ్చెను. కీర్తనాకారుడు తనను గూర్చి మాత్రమే చింతించుచుండెను. అందువల్ల సర్వోన్నతుని దయ, కృప, మంచితనమును ప్రశ్నించుచున్నాడు. రెండవ భాగములో ఆసాపు దృష్టి ప్రభువువైపు మళ్ళెను. అతడు దేవునిగూర్చి 24 పర్యాయములు, తనను గూర్చి 3 పర్యాయములు మాత్రమే

చెప్పెను. **రోమా 7లో చెప్పబడిన దౌర్భాగ్యుడు:**

బైబిలులో రెండవ భాగము రోమా 7:9-25. వ్యక్తిగత సర్వనామములు 40 సార్లు వాడిన తరువాత పౌలు "అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను." అని మూల్గెను. తనలో విజయములేదని అతడు కొనుగొనెను. అందువలననే తన శరీరమందు మంచిదేదియూ నివసింపదని తెలిసికొనెను. అయితే అధ్యాయము చివరిలో తననుండి దృష్టి మరల్చి ప్రభువైన యేసునందు విజయము (పొందెను) కనుగొనెను. తనలో విజయాన్ని పొందవలెనని చూచుట పడవలో లంగరు వేసినట్లుండును. అది ఆత్మీయముగా సుడి గుండములో పడుటయే.

ఇశ్రాయేలురాజు తనకంటే బలముగలవాడు తనకు అవసరమని గుర్తించి ఇలాగు ప్రార్థించెను. "నా ప్రాణము తల్లడిల్లగా భూదిగంతములనుండి నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నేను ఎక్కలేనంత యెత్తయిన కొండపైకి నన్ను ఎక్కించుము" (కీర్తన 61:2). దేవుడే ఆ కొండ

అంతా తానే అనుకొనిన వ్యక్తి ప్రభువు యొక్క దీవెనలు మరచిపోయి దేవుని యెడల కృతజ్ఞతలేనివాడుగా జీవించును. అది శక్తివంతమైన పనికి పక్షవాతము లాంటిది. అందువల్ల పని నాణ్యతలోను పనిచేయుటకు శక్తిలోను లోపము ఏర్పడును. ఇతరుల అక్కరల విషయమై ఏమాత్రము చింతించదు.

**స్వార్థముతో కూడిన బానిస:**

అంతటికీ తానే కేంద్రమనుకొన్న వ్యక్తి తన భావోద్రేకములకు బానిసయగును. ఇతరులకు సంబంధించినంతమట్టుకు అతడు వికర్షణ వ్యక్తిగా వుండును. అతడు తన దుఃఖములను అనేకమంది సలహాదారులకు, స్నేహితులకు చెప్పుకొనుచూ వెళ్ళును. వారు అతని మాటలు వినవలెనని కోరుకొనును. అయితే వారి సలహాను త్రోసిపుచ్చును. అతడు మారుటకు ఇష్టపడని దృఢమైన చిత్తము కలిగియుండును. దైవచిత్తమును నిరాకరించును, యెహెజ్కేలు 33:31, 32 వచనాలలో ప్రభువు వర్ణించిన ప్రజలవలె అతడుండును. "నా జనులు రాదగిన విధముగా వారు నీ యొద్దకు వచ్చి, నా జనులైనట్టుగా నీ యెదుట కూర్చుండి నీ మాటలు విందురుగాని వాటిని అనుసరించి ప్రవర్తింపరు, వారు నోటితో ఎంతో ప్రేమ కనుపరచుదురు గాని వారి హృదయము లాభమును అపేక్షించుచున్నది. నీవు వారికి వాద్యము బాగుగా వాయించుచు మంచి స్వరము గలిగిన గాయకుడవుగా

ఉన్నావు, వారు నీ మాటలు విందురుగాని వాటిని అనుసరించి నడుచుకొనరు.”

ఇది స్వార్థమను దానికి రోగలక్షణశాస్త్రము. దీనిని వ్యక్తి ఎలాగు జయించగలడు.

**విడుదలకు అయిదు మెట్లు:**

**మొదటిమెట్టు:**

అంతా తానే అను భావము నుండి అంతా క్రీస్తే అను భావములోనికి మరలవలెను. (2కొరింథీ 3:18) ఆయనను నిదానించి చూచుట ద్వారా ఆయన రూపములోనికి మనము మార్చబడగలము. తనను గూర్చి వెయ్యి సార్లు చెప్పుకొనుట కంటె క్రీస్తు యొక్క ఒక్క మాట గొప్పది. ఇంకొక విధముగా చెప్పినట్లయితే ఒకడు ఎంత పరిశుద్ధపరచబడిననూ, మహిమపరచబడిన క్రీస్తునకు సాటికాదు. ఎడతెగక అతడు ఇలాగు ప్రార్థన చేయవలెను.

ఓ ప్రియమైన ప్రభువా, నా (నేను) నుండి రక్షింపబడవలెను

ఓ ప్రభువా, నీలోనే నేను మరుగుకావలెను

ఓ ప్రభువా ఎంత మాత్రము నేను కాదు

నాలో నివసించు క్రీస్తే కనబడవలెను. **ఎ.బి. సిమ్సన్**

ఈ సూత్రమును అతడు గుర్తుంచుకొనవలెను. నిన్ను నీవే ఆక్రమించుకొంటే (స్వార్థము) దుఃఖము తెచ్చును. ఇతరుల తలంపులతో నింపుకొంటే నిరుత్సాహము తెచ్చును. నీ జీవితాన్ని యేసుప్రభువు ఆక్రమించితే అది నీకు సంతోషము తెచ్చును.

పాల్ వాన్ గోర్డర్ ఇలాగు వ్రాసెను.

మనకు అవసరమైన వైఖరిని ఈ కథలో చూడవచ్చును. బెతోవెన్ తొమ్మిదవ సింఫోని. నీ కార్యక్రమము తరువాత శ్రోతలు కార్యక్రమమునడిపిన ఆర్టురో, టొస్కానిని మరియు మిగిలిన గాయకులను ఎంతగానో అభినందించిరి. ఉద్రేకముతో నిండిన ట ొస్కానిని తన గాయక బృందమువైపు తిరిగి వారితో మెల్లగా చెప్పెను. “నేను వట్టివాడను, మీరునూ వట్టివారే, అయితే బెతోవెనే సర్వము. ఈ రీతిగా దీనికి కారకుడైన బెతోవెన్‌ను కచేరీ నాయకుడు అని పొగిడెను.

అయితే కొంత స్వపరీక్ష అవసరమని బైబిలులో కూడా చెప్పబడినదికదా అని

ఎవరైననూ అభ్యంతరము చెప్పవచ్చును. నిజమే అని ఒప్పుకొనుచున్నాను. అయితే మెక్ చెనె సూత్రాన్ని మనం పాటింపవలెను. అదేమనగా "నీవైపు నీవు చూసుకొను ప్రతిసారి క్రీస్తువైపు పదిసార్లు చూడవలెను" మరియొక పాత కీర్తన కారుడు "స్వార్ధమునుండి పారిపోయి క్రీస్తు నాశ్రయించుట ఎంతో మధురము"

**రెండవమెట్టు:**

ఒక వ్యక్తి బైబిలు ప్రకారముగా తాను ఎలాంటివాడో తెలిసికొనుట అవసరము. దీని భావము ఏమనగా దేవుని కృపచేత తాను రక్షింపబడితినని, క్షమించబడ తినని, నీతిమంతునిగా తీర్చబడితినని, పరలోకమునకు అర్హునిగా చేసెనని అతడు గ్రహించవలెను. దేవుని ప్రియకుమారుని బట్టి అతడు దేవుని ఎదుట నిలువగలిగెను. క్రీస్తునందు అతడు సంపూర్ణుడు, దేవుని స్వాస్థ్యమునకు వారసుడు. యేసుక్రీస్తుతో సహవారసుడు. అతడు దేవుని యొక్క ప్రత్యేకమైన సృష్టి. తన జీవితములో దేవుడు నియమించిన ప్రత్యేక కార్యమును నెరవేర్చవలసియున్నది. అతడు దేవుని ఎదుట గొప్ప విలువ గలవాడు. ఈ సత్యములన్నియు యేసుకొరకు తాను ఎంతగా జీవించవలెనో అను ఆశను రేపుచున్నవి.

మరొక విధముగా తనలో ఏమంచి తనము లేదనియూ, ఏమంచితనము రాదనియు అతడు ఒప్పుకొనుచున్నాడు (2 కొరి 12:11, గలతీ 6:3) అతడు ఒట్టివాడని, తనలో మంచితనము నివసింపదని ఒప్పుకొనుచున్నాడు. మంచికొరకు తనలో వెదకడు, అయినా అది దొరకనందుకు అతడెన్నడూ నిరుత్సాహపడడు.

**మూడవమెట్టు:**

స్వార్ధపరుడు ఇతరుల కొరకు తన సేవాజీవితాన్ని గడపవలెను. ఇతరులకు సహాయము చేయుటలో నిమగ్నమైన వాడికి తమను గూర్చి ఆలోచించుటకు సమయము దొరకదు. దీనిని ఆశయ నేరవేర్పు అందురు. అంతా తానే అను భావన కంటె తన్ను తాను తృణీకరించుకొనుట వలన ఆశయము నెరవేరును. యేసుప్రభువు ఈ సంగతినే ఇలాగు చెప్పెను. "తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును, ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవము కొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." (యోహాను 12:25) కారల్ మినింజర్ అను మానసికవైద్యునికి ఒక ప్రశ్నవేశారు "నీ నాడీమండలము పగిలిపోవునని తెలిసినట్లైన

నీవేమి చేయుదువు?" అతడిలాగు జవాబిచ్చెను. "నేను వెళ్ళి నాకంటె హీనస్థితిలోవున్న వానిని కనుగొని అతనికి సహాయము చేయడానికి ప్రయత్నము చేయుదును."

**నాల్గవమెట్టు:**

తానేదో గొప్పవాడననుకొని తలంచుచు అతడు సమయాన్ని వృధాచేయడు. రూపురేఖలు బాగులేకపోయినా, వికలత్వము కలిగివుండినను, సామర్థ్యమును పరిమితమైనను దేవుడు తనను అంగీకరించినట్లే అతడు తనను తానే అంగీకరించును, నేనేమైయున్నానో దేవుని కృపవలనే అయియున్నాను అని చెప్పును. (1కొరింథీ 15:10) జీవితములో మార్పుచేయడానికి వీలుకాని సంగతులున్న ఎడల అతడు వాటిని ఒప్పుకొని నెమ్మదిగా బ్రతుకును. సర్వాధికారముగల దేవుడు జీవితరంగమును స్థిరపరచెను. దాని గురించి ఫిర్యాదు చేయుట పాపమే. మరొక రీతిగా ఉండవలెనని కోరుకొనుట వ్యర్థమే.

**అయిదవ మెట్టు:**

చివరిగా తనలో ఏమున్నదో అని ఆలోచించుట మానివేయవలెను. తన్నుతాను ఘనపరచుకొను పుస్తకములు, ఈ విధంగా ఆలోచించుటద్వారా గొప్పవారమగుదుమనే ఉపన్యాసములు, తన ఆలోచనల ప్రకారముగా పోవలెనను సలహాలు మొదలగువాటి నుండి తొలగి పోవలెను. దేవుడు నడిపించు వాటివైపు మనస్సు త్రిప్పవలెను. తన్నుతాను మరచిపోయి ప్రభువు మీద మనస్సు కేంద్రీకరించవలెనని మనము కోరుకొందుము. ప్రభువు అన్నిటికి తగినవాడు.

## అధ్యాయము - 31

# పరిశుద్ధముగా నుండుటకు సమయమును వెచ్చించుము

విలియమ్ డి. లాంగ్‌స్టాఫ్ అనువాడు పరిశుద్ధ జీవితమునకు అవసరమైన ముఖ్య విషయములను నాలుగు వరుసలు గల ఒక పాటలో వివరించెను. అవి గమనించవలసిన పదములే. అనేకసార్లు మనము పాట పాడుదుము కాని దాని లోతైన భావమును గ్రహించము. క్రైస్తవ పరిశుద్ధతను గూర్చిన ధ్యానము ముగింపులో ప్రతి వరుసను పరిశీలించుదము. మనము ఇంతకు ముందు అధ్యాయాలలో చెప్పిన ముఖ్య విషయాలకు దీనికి సంబంధమున్నది.

**పరిశుద్ధముగా వుండుటకు సమయమును వెచ్చించుము:**

పరిశుద్ధజీవితము అలవాటు చేసికొనవలసియున్నది. అది ఒక్క క్షణములో ఉత్పత్తియగునది కాదు. ప్రతిది అప్పటికప్పుడు సిద్ధమయ్యే ఈ దినములలో ఒక సందిగ్ధానుభవము పరిశుద్ధతను అందుకోవడానికి గొప్ప అడుగు ఉత్పత్తిచేయునని మనము తలంచరాదు. అది ఆ విధంగా పనిచేయదు. మనలో నివసించుచున్న యేసు ప్రభువుతో క్షణక్షణము అనుభవము వలన నేర్చుకొందుము. వాన్స్ హవనర్ ఇలాగు చెప్పెను. "పరిశుద్ధులగుటకు సమయము కావలెను. అయితే మనకు సమయము లేదు. సంతోషమేమిటంటే సామాన్యమైన విశ్వాసము మనకు ఉంది. సామాన్యమైన విశ్వాసమనే నిప్పుతో మన ఆత్మను మండించుకొనుచుండవలెను. అభివృద్ధి యను ప్రగతిని సాధించవలెనను తలంపులను త్రోసి పుచ్చవలెను. పాత మార్గములను కనుగొని అంతరంగములో నెమ్మది కలిగివుండుటకు అన్వేషింపవలెను. అట్టివాడు ధన్యుడు"

**ప్రభువుతో తరచుగా మాటలాడుము:**

ప్రార్థనలేనిదే పరిశుద్ధత వుండదు. ప్రార్థన సంగతులను మాత్రమేగాక మనలను కూడా మార్చును. అప్పుడప్పుడు కాక తరచుగా ప్రార్థించవలెను. పట్టి పట్టనట్లు కాకుండ రక్తము కారునంతగా పోరాడవలెను. అది బలవంతముతో చేయునది కాకూడదు. ఆదిబలము గలదై ఉండాలి.

**ఆయనయందు ఎల్లప్పుడూ నిలిచియుండుము:**

నిలిచియుండుట అనగా కొనసాగుట, ప్రత్యేకముగా వాక్యమునకు విధేయత చూపు జీవితముతో ముందుకుసాగుట. అది రక్షకుని గూర్చినలోతైన జ్ఞానమును కలిగించును. ప్రభువును పోలివుండవలెనని ఎప్పుడూ వాంఛించును. యేసుప్రభువు ఇలాగు చెప్పెను "నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచి యున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలను గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు." (యోహాను 15:10)

**ఆయన వాక్యమును భుజించుము. (ధ్యానించుము):** మనము బైబిలును చదివి, పఠించి, కంఠస్తము చేసి, ధ్యానము చేసి, విధేయులము కావలెను. యిర్మీయా వాక్యమును భుజించెను. అది అతని హృదయమునకు సంతోషమును కలిగించెను. కీర్తన కారుడు దానిని భుజించెను. అది అతనిని పాపము చేయకుండ కాపాడెను. మనము కూడా దానిని తినవలెను. "అప్పుడు ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైనదిగా కనుగొందుము." (2 తిమో 3:17)

**దేవుని పిల్లలను స్నేహితులనుగా చేసికొనుము:** పరిశుద్ధుల సహవాసము మన జీవితములను పవిత్రపరచుటకు గొప్పశక్తిని చూపును, దుష్టసహవాసము మంచి నడవడిని చెరిపినట్లుగా, మంచి సహవాసము దైవభక్తి, దైవప్రవర్తనకు బలము నిచ్చును.

**బలహీనులకు సహాయము చేయుము:** ప్రభువు కొరకు, ఇతరుల కొరకు ఇట్టి సేవాజీవితము మనము కలిగియుండవలెను. సోమరితనము ఉరి వంటిది. మన రాజుయొక్క కార్యములు చురుకుగా చేయనప్పుడు శోధన బలముగా వచ్చును.

**ఆయన ఆశీర్వాదమును కోరుటకు మరువకుము:** క్రైస్తవ ప్రవర్తనకు ఒక పరీక్ష ఏమనగా "నేను తలవంచి దీవించవలెనని దాని కొరకు అడుగగలనా"? మన మేమి చేసిననూ ఆయన మహిమకోసమే. ఒకే గురితో పవిత్రమైన కోర్కెతో ఆయనను సంతోషపరచుచున్నాము. ఆయన పరిశుద్ధతకు పొసగిన వాటిని మాత్రమే ఆయన దీవించును.

**మనము పరిశుద్ధముగా వుండుటకు సమయమును వెచ్చించుట:** ప్రపంచము వేగముగా కదలుచున్నది. వర్డ్సవర్త్ అనుకవి చెప్పినది సరిగనేవున్నది. లోకము మనతో అధికముగా ప్రవర్తించుచున్నది. ఆలస్యముగానో త్వరితముగానో మనలో ప్రవేశించి మన శక్తులన్నియు వృధా చేయుచున్నది.

**ఎక్కువ సమయమును ప్రభువుతో రహస్యముగా గడుపుము:**

ఒంటరిగా గడుపుము, గ్రహం స్క్రోగీ ఇలాగు చెప్పెను "దీవెన పొందుటకు నిన్ను నీవు ప్రత్యేకించుకొనుము" వాక్యమును ధ్యానించువారే పరిశుద్ధప్రజలు. దేవుని యందు మనము వేరుపారని యెడల మనజీవితాలు పైపైన ఉండును లేక స్థిరతలేక యుండును.

**యేసును చూచుట ద్వారా నీవు ఆయనవలె నుందువు:** సుమారు 2000 సం॥ పూర్వము అపొస్తలుడైన పౌలు ఇలాగు వ్రాసెను. "మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము." (2కొరింథీ 3:18) ఆయనను చూచుట ద్వారా ఆయన పోలికలోనికి మనము మార్చబడుదుము.

**నీ స్నేహితులు నీ ప్రవర్తనలో ఆయన పోలికను చూతురు:** మోషే సీనాయి కొండనుండి దిగివచ్చినప్పుడు అతని ముఖము ప్రకాశించినది. ఆ ప్రకాశత (లేక) వెలుగు మోషేది కాదు. ఇశ్రాయేలు అధిపతులు పేతురు, యోహానుల యొక్క ధైర్యమును చూచి ఈ పామరులు యేసుతో నుండిన వారని గ్రహించిరి. రక్షకునితో దగ్గర సంబంధము కలిగి జీవించుచున్నప్పుడు మన చుట్టూనుండువారు ఆయన నైతిక పోలికను మనలో చూతురు.

**పరిశుద్ధముగా నుండుటకు సమయాన్ని వెచ్చించుము: ఆయన నీకు మార్గదర్శిగా ఉండనిమ్ము:** దీని అర్ధమేమనగా మన జీవితము మీద ప్రభువునకు సంపూర్ణాధికారము ఇవ్వవలెను. అనగా మన చిత్తమును ఆయనకు లోబరచవలెను. మన దృష్టియందుకాక ఆయన దృష్టియందే నమ్మిక యుంచవలెను.

**ఏమి సంభవించినా ఆయనకంటే ముందుగా పరుగెత్తవద్దు:** మనకు వెంటనే నడిపింపు దొరకనప్పుడు మనకు తోచినట్లు ప్రవర్తించుట సహజము. గుఱ్ఱము త్వరత్వరగా నమిలినట్లు పరిస్థితులను మన చేతిలోనికి తీసుకొంటాము. ఆలస్యమైతే సహించలేము. మనము ముందుగా వెళ్లవలెనని ప్రయత్నము చేయుదుము. దాని ఫలితముగా దుఃఖపడి కూర్చుందుము. (యెషయా 50:11)

**సంతోషములోనూ, దుఃఖములోనూ ప్రభువును ఇంకనూ వెంబడించుము:** భక్తి పరిస్థితులపై ఆధారపడివుండదు. ఎత్తుపల్లముల అనుభవమునకుపైగా నుండును. అందుకే జాన్‌వెస్లీ ఇలాగు ప్రార్థించెను “ప్రభువా నిలకడలేని నా భక్తి నుండి నన్ను బాగుచేయుము, సంపూర్ణ క్రైస్తవునిగా చేయుము.”

**యేసువైపు చూచుచూ ఆయన వాక్యమునందు ఇంకనూ నమ్మికయుంచుము:** కవి వాక్యము వైపు మరలా వచ్చుచున్నాడు. ఏలయనగా బైబిలు దేవుని సాధనమనియు అది తన ప్రజలను పవిత్రపరచుననియు అతడెరుగును. ఈయన 119 వ కీర్తన వ్రాసిన రచయిత ఉద్దేశముతో ఏకీభవించుచున్నాడు.

**పరిశుద్ధముగా వుండుటకు సమయాన్ని వెచ్చించుము, నీ ఆత్మలో నెమ్మదిగా వుండుము:** పరిశుద్ధజీవితము సమాధానముగల జీవితము, నిబ్బరము, శాంతము కలిగియుండుము, విశ్వాసము తొందరనుండి, విసుగు నుండి మనలను కాపాడును. మనము నిజముగా నమ్మికయుంచితే మనము చింతించము.

**ప్రతి ఆలోచన, ప్రతి ఉద్రేకము, ఆయన ఆధీనములోనే** : దావీదు ఇలాగు ప్రార్థించెను. “దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము.

నిత్యమార్గమున నన్ను నడిపింపుము.” (కీర్తన 139:23,24)

నా ఆలోచనలన్నిటిని రహస్య ఊటలను శోధించుము
వాటిని స్వాధీనపరచుకొను ఉద్దేశములను
కలుషితమైన సంగతులున్న గదులను
నా ప్రాణముపై నీ సామ్రాజ్యము స్థాపించుము ఎఫ్. బొట్టోమే

**ప్రేమ ఊటల యొద్దకు పరిశుద్ధాత్మ ఈ రీతిగా నడిపించెను,**

**పరలోక సేవకు నీవు వెంటనే తగిన వాడవగుదువు:** దీనిని మరొక విధముగా చెప్పవచ్చును. పరిశుద్ధముగా వుండుటకు మనము సమయాన్ని వెచ్చించినపుడు ఈ జీవితములో ఎల్లప్పుడూ దీవెనలను అనుభవించుదుము. మహిమకరమైన గృహములలో నిత్యమూ సేవచేయుటకు మనము సిద్ధపడుదుము. ఇదే సంగతిని తిమోతికి పౌలు బోధించెను. దైవభక్తి ఇప్పటి జీవము విషయములోను, రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదై యున్నది (1తిమో 4:8)

●

# అధ్యాయము - 32

# చివరి మాట

పరిశుద్ధులుగా వుండాలనే ఆజ్ఞ మరువబడినది. కాని అలా ఉండకూడదు. ప్రభువు ఆజ్ఞలలో అది గొప్పది. అది తప్పనిసరిగా నెరవేర్చవలసిన ఆజ్ఞయేగాని, అది సలహా, ఐచ్ఛికము కాదు. ఆయన ఇతర ఆజ్ఞలవలె అది మన క్షేమముకోసమే గాని ఆయన క్షేమము కోసము ఇవ్వబడలేదు.

యేసు ప్రభువు వలె వుండవలెనను ఆశయముకంటె మిన్నయైనది లేదు. వాస్తవయుగములో దేవుని గూర్చి చెప్పుటకు పరిశుద్ధజీవితమునకు మించినదిలేదు. అది క్రైస్తవ్యమును నమ్మతగినదిగా చేయును. అది దేవుని మహిమ పరచును. విశ్వాసికి ప్రయోజనకరముగానుండును. దీనిని మరొక విధముగా చెప్పవచ్చును. పాపము చేయుచున్న పరిశుద్ధుడు ప్రభువు నామమునకు అవమానము, అగౌరవము, నింద తెచ్చిపెట్టును. పరిశుద్ధముగా మనముండుటకు పురికొల్పునది క్రీస్తు ప్రేమయే. మన రక్షణ కొరకు ఆయన చెల్లించిన క్రయము గొప్పది. ఆయన మనపై కృపను కుమ్మరించెను. అయితే పాపము దేవునితో సహవాసమును తెంచివేసి ఇతరులను తొట్రిల్లునట్లు చేసి పెదవులను మూసివేయును. పరిశుద్ధత ఒక క్రమమైన విధానము. అది సాధించుటతో పూర్తి అయ్యేది కాదు. మనము రక్షకుని ముఖము చూచేంతవరకు మనమెన్నడును సంపూర్ణమగు పరిశుద్ధులముకాలేము. అయితే అప్పటి వరకు ఆయన పోలికయందు అభివృద్ధి చెందుచూ ఉండవలెను.

లోకమునకు, శరీరమునకు అపవాదికి విరోధముగా చేయు యుద్ధములో మనము క్రైస్తవసైనికుని కవచము ధరించుకొనుట అవసరము. ఆ కవచము నీతియుక్తమైన క్రైస్తవ గుణమే. దానిని మనము ధరించినంతకాలము గురిపెట్టి బాణమువేయుటకు శత్రువునకు అవకాశము ఉండదు.

దేవుడు మాత్రమే మనలను పరిశుద్ధులనుగా చేయగలడు అయితే మన

సహకారము లేకుండా ఆయన అలాగు చేయడు. మనలను నడిపించుటకు ఆయన కొన్ని సూత్రములను మనకిచ్చెను. మనము వాటికి లోబడినపుడు పరిశుద్ధాత్మ మహిమనుండి అధిక మహిమలోనికి రూపాంతరము కలుగజేయును, దానికి కొన్ని నియమములు అవసరము. ఒప్పుకోలు, తిరిగి చెల్లించుట,లొంగిపోవుట, బైబిలు పఠన, ప్రార్థన, ఇతరక్రైస్తవులతో సహవాసము, ప్రభువు కొరకు సేవచేయుట, శరీరమును, మనస్సును క్రమశిక్షణలో వుంచుకొనుట ఇవన్నియూ పరిశుద్ధతకు అవసరమైన నియమములు,

పరిశుద్ధతకు మన లైంగిక జీవితమునకు, మన సంభాషణకు, మన ఉద్రేకముకు, మన వస్త్రధారణకు సంబంధమున్నది. నిజమునకు జీవితములో పరిశుద్ధతకు సంబధములేనిది ఏమున్నది?

పరిశుద్ధత లేకుండ ఎవడునూ ప్రభువును చూడలేడు అని చదివినప్పుడు ప్రతి క్రైస్తవునికి దెబ్బతగిలినట్లుండును (హెబ్రీ 12:14). రక్షకునియందు విశ్వాసముంచినప్పుడు ఒక వ్యక్తి పరిశుద్ధ స్థితిని ఖచ్చితముగా పొందుచున్నాడు. అయితే ఇందులో ఆచరణ ాత్మకమైన పరిశుద్ధత ముడిపడియున్నది.  నిజముగా మారుమనస్సు పొందిన వాని జీవితములో తప్పని సరిగా ఈ ఫలితమును (పరిశుద్ధతను) చూడగలము. ●